# ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 3-8-2017 గురువారం సిటీ సంపుటి 43 . సంచిక 355

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi




# మూడేళ్లలో 30 వేల కోట్లు



రాజధాని ప్రాంతంలోని కొండవీటి వాగు సమీపంలో నిర్మించనున్న రహదారులు, పచ్చదనం నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిషనర్ శ్రీధర్, ఏడీసీ ఛైర్మన్ లక్ష్మీపార్థసారథి తదితరులు

## అమరావతిలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు అవసరం

- రూ.22,700 కోట్లకు ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు
- మిగిలిన రూ.7300 కోట్లను సమకూర్చుకుంటాం
- సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో సీఎంకు నివేదించిన అధికారులు
- వివిధ వర్గాల నివాసాల విస్తీర్ణంపై వివరణ

ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనుల కోసం రాబోయే మూడేళ్లలో రూ.30 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని సీఆర్‌డీఏ అంచనా వేసింది. ఆ మొత్తంలో రూ.22,700 కోట్లను సమకూర్చుకునేందుకు ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందాల అమలు వివిధ దశల్లో ఉందని, మరో రూ.7,300 కోట్లు సమకూర్చుకొనేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నామని ముఖ్యమంత్రికి నివేదించింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం సీఆర్‌డీఏ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు నిధులు సమకూర్చుకునేందుకు రూపొందించిన ప్రణాళికను సీఎంకు వివరించారు. అలాగే రాజధానిలో న్యాయమూర్తులు, శాసనసభ్యులు, మంత్రులు, అఖిల భారత సర్వీసు అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల కోసం నిర్మించనున్న నివాస సముదాయాలు; వాటి విస్తీర్ణాలకు సంబంధించిన ప్రతిపాదనలను సీఎంకు అందించారు. ఆ ప్రతిపాదనలపై సంబంధిత వర్గాలతో మాట్లాడి తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

అమరావతిలో మౌలిక (మిగతా 2లో)



# ఇంటికి, బండికి ఇంపైన కబురు

- రుణాల వడ్డీ రేట్లు తగ్గే అవకాశం
- ఆర్‌బీఐ కీలక రేట్ల కోత నేపథ్యం

పండుగలకు ముందే పండుగ వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాదాపు 10 నెలల తర్వాత కీలక రుణ రేట్లలో కోత విధించింది. రెపో రేటును పావు శాతం తగ్గించి ఆరున్నరేళ్ల కనిష్ఠ స్థాయి 6 శాతానికి పరిమితం చేసింది. బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని వినియోగదార్లకు బదిలీ చేస్తే గృహ, వాహన రుణాలు చౌకగా మారతాయి. పాత రుణ నెలవారీ వాయిదాల భారం కాస్త తగ్గవచ్చు. ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠ స్థాయిలకు చేరడంవల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బుధవారం ఆర్‌బీఐ తెలిపింది. మరో పక్క, కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్న రైతు రుణ మాఫీలవల్ల ఒత్తిడిలో ఉన్న రుణాల పరిమాణం పెరగవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. రేట్ల కోత స్థిరాస్తి రంగానికి ఊతమిస్తుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడగా.. మరో పావుశాతం కోత వేసి ఉండి ఉంటే బాగుండేదని పారిశ్రామిక సంఘాలు అంటున్నాయి.

- వివరాలు బిజినెస్ పేజీలో

‘పరిశ్రమలకు భూముల కొరత ఉంది. దానికి మూడు కారణాలు. అందులో ఒకటి జగన్మోహన్‌రెడ్డి అవినీతి. దానివల్ల లేపాక్షి, వాన్‌పిక్, యూనిటెక్ లాంటివి 80శాతం భూములు లాక్కెళ్లాయి. వాటిని ఇప్పుడు బయటకు తీసుకురావడం నాకు పెద్ద పనైపోయింది. కాంగ్రెస్ పెద్దలు ఇష్టానుసారం వారికి కావాల్సిన వారికి భూములిచ్చేశారు. వాళ్లు పెట్టుబడులు పెట్టకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారు. పరిస్థితిని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నాం. హెచ్‌సీఎల్, పై డాటా కేంద్రం లాంటి పెద్ద పెద్ద కంపెనీలు మన రాష్ట్రానికే ఎందుకొస్తున్నాయి అని ఆలోచిస్తే చాలు మన రాష్ట్రం ఐటీ రంగానికి ఎంత అనుకూలంగా ఉందో అర్థమవుతుంది. ఇంకా చాలా పెద్ద కంపెనీలు రాబోతున్నాయి. న్యూఏజ్ టెక్నాలజీ వైపు ఇతర రాష్ట్రాలు పెద్దగా దృష్టి పెట్టలేదు. అది మనకు అనుకూలంగా మారుతోంది. త్వరలోనే విశాఖలో డ్రోన్‌ల తయారీ కేంద్రం ప్రారంభం కానుంది.’

# పేదలకు ఇళ్ల పన్ను మినహాయింపు



- తాగునీటి సమస్య తీర్చేందుకు స్పెయిన్, దుబాయి తరహా సాంకేతికత
- తప్పుడు ఫిర్యాదులతో అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపా
- ‘ఈనాడు-ఈటీవీ’ ఇంటర్వ్యూలో మంత్రి లోకేశ్

గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం స్పెయిన్, దుబాయిలలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తున్నామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అక్కడ ‘వాటర్ వెయిన్’ టెక్నాలజీతో జలధారల లోతుపాతుల కచ్చితత్వం బయటపడిందన్నారు. ఇదే సాంకేతికతను రాష్ట్రంలోనూ ఉపయోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న వాటర్ గ్రిడ్ కోసం కాలువలు, చెరువుల వంటి నీటి వనరులు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆన్‌లైన్ మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. బుధవారం ఆయన ‘ఈనాడు-ఈటీవీ’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలను వెల్లడించారు.

- పూర్తి వివరాలు 2లో

# ఉత్తీర్ణత సాధిస్తేనే పైతరగతికి

- 8వ తరగతి వరకు అమలు
- మరోసారి పరీక్ష రాసేందుకు అవకాశం
- కొత్తగా 20 ప్రపంచ శ్రేణి విద్యాసంస్థలు
- ఎన్‌ఆర్‌ఐలకు కూడా ఓటు హక్కు
- కేంద్ర మంత్రిమండలి నిర్ణయాలు

దిల్లీ: ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా పైతరగతికి వెళ్లిపోయే (నో డిటెన్షన్) విధానాన్ని ఎనిమిదో తరగతి వరకు రద్దు చేయాలని కేంద్ర మండలి నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల్ని 5, 8 తరగతుల్లో నిలిపివేయడానికి రాష్ట్రాలకు వీలు కల్పించేందుకు వీలుగా ‘బాలల ఉచిత, నిర్బంధ విద్య హక్కు సవరణ బిల్లు’లో తగిన మార్పులు చేయనున్నారు. విద్యార్థుల్ని అదే తరగతిలో నిలిపివేయడానికి ముందు వారు (మిగతా 2లో)

# కర్ణాటక మంత్రిపై ఐటీ వల



- కీలక నేతల ఇళ్లలో సోదాలు
- రూ.10 కోట్లకు పైబడి నగదు, పత్రాలు స్వాధీనం
- ఇది రాజకీయ దాడి: కాంగ్రెస్

13లో

# అమెరికా కాదిక!



- ఉన్నతవిద్య కోసం అగ్రరాజ్యానికి వెళ్లే విద్యార్థుల్లో తగ్గుదల
- పిల్లల్ని పంపేందుకు ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- ధ్రువీకరిస్తున్న కన్సల్టెన్సీలు, ట్రావెల్ ఏజెన్సీలు
- ఆస్ట్రేలియా, కెనడాకు పెరుగుతున్న విద్యార్థులు


■ అమెరికాలో పరిస్థితులు బాగానే ఉన్నాయని, వదంతులు నమ్మొద్దని అక్కడ చదువుతున్న విద్యార్థులు చెబుతున్నా.. ఇక్కడి నుంచి వెళ్లాలనుకుంటున్న పిల్లల తల్లిదండ్రులు తమవారిని పంపించేందుకు పునరాలోచన చేస్తున్నారు. భద్రత విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, పరిస్థితులు అన్ని చక్కబడ్డాయని తాము చెబుతున్నా విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించలేకపోతున్నామని కన్సల్టెన్సీ నిర్వాహకులు వెల్లడిస్తున్నారు.

■ కొందరు విద్యార్థులు ఇప్పుడు ఆస్ట్రేలియా, కెనడా, యూరప్ వెళ్తున్నారు. గతంలో ఈ దేశాలకు వెళ్లే వారి సంఖ్య తక్కువగా ఉండగా ఈసారి కొంచెం పెరిగినట్లు విజయవాడ, గుంటూరుల్లోని ప్రముఖ ట్రావెల్స్ కంపెనీలు, కన్సల్టెన్సీలు పేర్కొంటున్నాయి.

■ స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ పేరిట అమెరికా అంతర్గత భద్రత విభాగంలోని ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు నివేదికలు వెలువరిస్తుంది. 2017 మే నివేదిక ప్రకారం.. అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థుల శాతం తగ్గుతోంది.

ఈనాడు - అమరావతి

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన పరిణామాలు చదువు కోసం అమెరికాకు వెళ్లాలనుకునే తెలుగు విద్యార్థులను గందరగోళంలో పడేస్తున్నాయి. కేన్సస్ కాల్పుల ఘటన.. ఓలెత్ నగరంలో చోటుచేసుకున్న కాల్పులు వీసాల జారీ కఠినతరమైందనే ప్రచారం.. విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. వెరసి అమెరికాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. విదేశీ విద్యకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు రోజుకు ఐదారుగురు వస్తే వారిలో ముగ్గురు, నలుగురు తమ నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారని కన్సల్టెన్సీలు పేర్కొంటున్నాయి. కచ్చితంగా అమెరికాలోనే చదవాలకున్నవారు ధైర్యంగా వెళ్లిపోతుండగా.. కొందరు ఈ ప్రచారం కారణంగా ముందుకురావడం లేదంటున్నాయి. గతంలో అమెరికాకు వెళ్లే విద్యార్థులు అత్యధికంగా ఉండగా.. ఈసారి కొంచెం తగ్గినప్పటికీ ఇతర దేశాలతో పోల్చితే అగ్రస్థానం భారతీయులదే. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం కేంద్రంగా ముఖ్యమైన కన్సల్టెన్సీలు దాదాపు 75వరకు ఉన్నాయి. ప్లస్‌టూ చదివిన వారు కొందరు గ్రాడ్యుయేషన్ చదివేందుకు విదేశాలకు వెళ్లడం ప్రారంభమైందని గుంటూరులోని కన్సల్టెన్సీలు పేర్కొంటున్నాయి. 2015 నవంబరు, 2016 నవంబరు మధ్య భారత్ (మిగతా 2లో)



# దిగువకు నీరేది?

- ఆలమట్టి, నారాయణపూర్‌ల్లోకి సామర్థ్యానికి మించి ప్రవాహం
- అయినా కిందకు వదలని కర్ణాటక
- రికార్డుల్లో చూపకుండా ఎక్కువగా వాడుకుంటున్న కర్ణాటక!

ఈనాడు, హైదరాబాద్: ఆలమట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల సామర్థ్యానికి మించి ప్రవాహం వచ్చినా దిగువకు మాత్రం నీరు రావడం లేదు. వచ్చే ప్రవాహానికి, బయటకు వదిలే నీటికి, రిజర్వాయర్లలోని మట్టాలకు పొంతన ఉండడం లేదు. రికార్డుల్లో చూపకుండా పలు ఎత్తిపోతల పథకాల ద్వారా కర్ణాటక నీటిని వాడుకొంటున్నట్లు (మిగతా 2లో)




# విజయవాడలో లైట్ మెట్రో

- మెట్రోతో పోలిస్తే నిర్మాణ వ్యయం 25శాతం తక్కువ
- సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశం

ఈనాడు, అమరావతి: విజయవాడ, రాజధాని ప్రాంతంలో లైట్ మెట్రో ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. లైట్‌మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదిక (డీపీఆర్)ను తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మెట్రో రైలు కంటే లైట్ మెట్రో తరహా ప్రజా రవాణా వ్యవస్థే విజయవాడ నగరానికి సరిపోతుందని జర్మనీ నిపుణులు స్పష్టం చేశారు. ఇది నిర్మాణపరంగా, నిర్వహణ పరంగా వ్యయం గణనీయంగా తగ్గుతుందని (మిగతా 2లో)

## ఇదీ సంగతి!




దిగ్విజయ్‌జీ, దానికి జీవం పోసి పెంచి పోషించు. మిగతా రాష్ట్రాల బాధ్యతలు ఇతరులకు ఇస్తున్నా!

# జలసిరి.. పట్టించుకునే వారేరి?

- నిధుల కొరతతో లక్ష్యానికి దూరం
- సౌర విద్యుత్తు ప్యానళ్లపై జీఎస్‌టీ ప్రభావం
- కనెక్షన్ల కోసం రైతుల ఎదురుచూపు

నిధుల కొరత, సౌర విద్యుత్తు ప్యానళ్ల ఏర్పాటులో జాప్యం, తదితర కారణాలతో రాష్ట్రంలో ఎన్టీఆర్ జలసిరి కార్యక్రమం ఆచరణలో ‘మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి’ అన్నట్లుగా తయారైంది. ఆర్థిక సంవత్సరంలో నాలుగు నెలలు పూర్తయినా ఇప్పటికీ లక్ష్యంలో సగం బోర్లు వేయించలేదు. అరకొరగా తవ్వించిన బోర్లకూ పూర్తిగా సౌరవిద్యుత్తు మోటార్లు, వీటికి కనెక్షన్లు ఇవ్వలేకపోయారు. వ్యవసాయ బోర్ల కోసం దరఖాస్తులు చేసే రైతులు ఎప్పుడు వేయిస్తారా? అని, బోర్లు తవ్వించుకున్న రైతులు సౌర విద్యుత్తు పంపుసెట్లు, కనెక్షన్లు ఎప్పుడిస్తారా? అంటూ ఎదురుచూస్తున్నారు. సాగులో రైతులకు తోడ్పడేలా రాయితీపై బోర్లు తీసి సౌర విద్యుత్తు పంపుసెట్లు ఏర్పాటుచేసేందుకు ఎన్టీఆర్ జలసిరి కార్యక్రమాన్ని ప్రభుత్వం గత ఏడాది ప్రారంభించింది. యూనిట్‌కు రూ.3లక్షలకుపైనే ఖర్చవుతున్నా.. ఎస్సీ, ఎస్టీలు రూ.6వేలు, ఇతరులు రూ.25వేలు చెల్లించేలా ఏర్పాట్లుచేసింది. మిగతా మొత్తాన్ని రాయితీ రూపేణా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి.

- ప్రత్యేక కథనం 2లో



విజయనగరం జిల్లా సాలూరు మండలం కూర్మరాజుపేటలో జలసిరి పథకంలో తీసి వదిలేసిన బోరు

పథకం : ఎన్టీఆర్ జలసిరి

| | |
|---|---|
| 2017-18లో వ్యవసాయ పంపుసెట్ల లక్ష్యం | 35,000 |
| ఇప్పటివరకు తీసిన బోర్లు | 17,161 |
| వాటా చెల్లించిన లబ్ధిదారులు | 5,911 |
| ట్రాన్స్‌కోకు చెల్లించిన మొత్తాలపై ఇవ్వాల్సిన సౌర విద్యుత్తు మోటార్ కనెక్షన్లు | 4,333 |
| ఇప్పటివరకు ఇచ్చిన కనెక్షన్లు | 1,475 |

# జలసిరి.. పట్టించుకునే వారేరి?

## కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు

ఈనాడు – అమరావతి


రాష్ట్రంలో ఈ ఏడాది ఎన్టీఆర్ జలసిరిలో 35వేల వ్యవసాయ బోర్లు తీయించి సౌరవిద్యుత్తు మోటార్లు ఏర్పాటుచేసి కనెక్షన్లు ఇవ్వాలన్నది లక్ష్యం. దీన్ని చేరుకోడానికి అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. ఇప్పటివరకు వేయించిన 17,161 బోర్ల కోసం అయ్యే ఖర్చును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో భర్తీచేశారు. బోర్లు తవ్వించేందుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు వినియోగించటంపై కేంద్రప్రభుత్వం అభ్యంతరం చెప్పడంతో రాష్ట్రప్రభుత్వం నిలిపివేసింది. మిగతా బోర్లకు అవసమయ్యే నిధుల కోసం నాబార్డు నుంచి రూ.114కోట్ల రుణం తీసుకోడానికి యత్నిస్తున్నారు. అప్పటివరకు కొత్తగా బోర్లు తీయొద్దన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాల్లో నిలిపివేశారు. దీంతో 17,839 మంది రైతులకు ఎదురుచూపులే మిగిలాయి. ఇప్పటికే వేయించిన 17,161 బోర్లపై ట్రాన్స్‌కో ఇంజినీర్లు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి 7,790 సౌర విద్యుత్తు మోటార్లకు కనెక్షన్లు ఇప్పించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు అధికారులు రైతుల వాటా డబ్బు వసూలుచేసి ప్రభుత్వ సాయం కలుపుకొని ట్రాన్స్‌కోకు చెల్లించగా 4నెలల్లో కేవలం 1,457 కనెక్షన్లు ఇచ్చారు.

### ప్యానళ్ల సరఫరాపై ఆచితూచి..

వస్తు రవాణా పన్ను(జీఎస్టీ) అమలులోకి వచ్చాక సౌర విద్యుత్తు ప్యానళ్ల ధరలు పెరగడంతో వీటి సరఫరాపై అనిశ్చితి నెలకొంది. అప్పటివరకు ప్యానళ్లు అందించిన నెడ్‌క్యాప్ వర్గాలు జీఎస్టీ వచ్చాక ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. వీటిని సరఫరా చేసే సంస్థలు పాత ధరకు అందించేందుకు వెనుకడుగు వేయడంతో బోర్లు వేయించిన 17,839 మంది రైతులు వీటి కోసం వేచిచూస్తున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా బోర్ల లక్ష్యం, ఇప్పటివరకు తీసినవి, అందించిన సౌర విద్యుత్తు కనెక్షన్ల వివరాలు.....**

| జిల్లా | బోర్ల లక్ష్యం | ఇప్పటివరకు తీసినవి | ఇచ్చిన విద్యుత్తు కనెక్షన్లు |
|---|---|---|---|
| చిత్తూరు | 1,049 | 980 | 404 |
| తూర్పు గోదావరి | 3,204 | 1461 | 329 |
| గుంటూరు | 3,000 | 1,070 | --- |
| కడప | 685 | 375 | --- |
| కృష్ణా | 2,500 | 349 | --- |
| కర్నూలు | 2500 | 539 | --- |
| ప్రకాశం | 7,500 | 6,300 | 1 |
| నెల్లూరు | 3,100 | 1,492 | --- |
| శ్రీకాకుళం | 3,000 | 351 | 1 |
| విశాఖపట్నం | 1,555 | 519 | --- |
| విజయనగరం | 4,371 | 3,360 | 576 |
| పశ్చిమ గోదావరి | 2,500 | 388 | 140 |



ప్రకాశం డ్వామా పథక సంచాలకుడి పేరుతో మార్చిలో రైతు సుబ్బారావు తీసిన డిమాండు డ్రాఫ్టు

■ ప్రకాశం జిల్లా ఎస్ఎన్‌పాడు మండలం ఎనికపాడు గ్రామానికి చెందిన ఎం.సుబ్బారావు మార్చి 17న తన వాటా కింద సౌర ప్యానళ్ల, పంపుసెట్ కోసం డ్వామా పథక సంచాలకుడి(పీడీ) పేరుతో రూ.25 వేల బ్యాంకు డిమాండ్ డ్రాఫ్టు(డీడీ) తీశారు. అప్పటి నుంచి పీడీ కార్యాలయం చుట్టూ తిరగడం తప్పితే పంపుసెట్, సౌరప్యానళ్లు ఏర్పాటుచేసింది లేదు. వాస్తవ పరిస్థితులేమిటో చెప్పకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు.


ప్రకాశం జిల్లా ఎనికపాడులో తీసిన బోరును చూపిస్తున్న రైతు సుబ్బారావు

■ విజయనగరం జిల్లా సాలూరు మండలం కూర్మరాజుపేటకు చెందిన పల్లి తిరుపతిరావుకు చెందిన వ్యవసాయ భూమిలో ఏడాదిన్నర క్రితం బోరు తవ్వారు. సౌర ప్యానళ్లు, పంపుసెట్ కోసం ఆయన రూ.25వేల డీడీ అందజేశారు. ఇప్పటికీ పని జరగకపోవడంతో కలెక్టర్‌ను కలిశారు. నేటికీ పరిస్థితిలో మార్పులేదు. గ్రామంలో ఆరుగురు రైతులు ఇదే పరిస్థితిలో ఉన్నారు.




ఆసుపత్రిలో బాబు వద్ద తండ్రి ఐటీడీఏ పీవో దినేష్‌కుమార్(నీలం రంగు చొక్కా), అధికారులు

# ఆ దంపతులు.. ఆదర్శాన్ని ఆచరించారు

- ప్రభుత్వాసుపత్రిలో బిడ్డకు జన్మనిచ్చిన ఐఏఎస్ అధికారిణి విజయకృష్ణన్
- అభినందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: వారిద్దరూ ప్రభుత్వ ఉన్నతాధికారులు...కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లగలిగే స్థోమత ఉన్నవారు కూడా.. అయినప్పటికీ ప్రసవానికి సర్కారు ఆసుపత్రి వైపే మొగ్గు చూపి పలువురిని ఆశ్చర్యచకితులను చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవాలని జిల్లాలోని మహిళలందరికీ చెప్పడమే కాదు.. తాము సైతం ఆచరించి చూపారు. వారే తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఐటీడీఏ పీవో ఏఎస్ దినేష్ కుమార్, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయకృష్ణన్ దంపతులు. వీరికి బుధవారం తెల్లవారుజామున స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో పండంటి మగబిడ్డ జన్మించాడు. ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ కార్తీక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త(డీసీహెచ్) రమేష్ కిషోర్ ఆధ్వర్యంలో గైనకాలజిస్టు వీరబ్బాయి.. నెలలు నిండిన విజయకృష్ణన్‌కు శస్త్రచికిత్స నిర్వహించి కాన్పు చేశారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసుపత్రికి వెళ్లి పీవో దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.


రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ విజయకృష్ణన్ (దాచిన చిత్రం)

## విజయవాడలో లైట్ మెట్రో

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి నివేదించారు. నగరంలో మెట్రో రైలు వ్యవస్థ నిర్మాణానికి కి.మీ.కి రూ.250 కోట్లు వ్యయం కానుండగా.. లైట్ మెట్రోకు రూ.170 కోట్లు నుంచి రూ.180 కోట్లు అవుతుందని అంచనా వేశారు. విజయవాడకు అనుకూలమయ్యే ప్రజా రవాణా వ్యవస్థపై జర్మనీకి చెందిన నిపుణుడు ఎడ్వర్డ్ డాట్సన్ బృందం రెండు వారాలపాటు అధ్యయనం చేసింది. బుధవారం ముఖ్యమంత్రి నిర్వహించిన సీఆర్‌డీఏ సమావేశంలో ఎడ్వర్డ్ తన నివేదికను సమర్పించారు. మెట్రోతో పోల్చి చూపిస్తూ 26.03 కి.మీ. దూరానికి రూ.4272.97 కోట్లతో లైట్ మెట్రోను నిర్మించవచ్చన్నారు. 26 కి.మీ.కు సంవత్సరానికి నిర్వహణ వ్యయం రూ.106 కోట్లు అవుతుందని చెబుతూ మెట్రోకయితే ఆ ఖర్చు రూ.160 కోట్లుగా ఉంటుందన్నారు. ఈ తరహా రవాణా వ్యవస్థ మన దేశంలో గుడ్‌గావ్‌లో ఉందనీ, అక్కడి ప్రతినిధులతోనూ చర్చించి వివరాలు తీసుకొన్నట్లు అమరావతి మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి తెలిపారు. పురపాలకశాఖ మంత్రి నారాయణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే 50సంవత్సరాల జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. విమానాశ్రయం, జక్కంపూడి కాలనీలను అనుసంధానించేలా మార్గంలో మార్పులు ప్రతిపాదించామన్నారు. మూడు మార్గాల్లో 40కి.మీ.మేర నిర్మించాల్సి ఉంటుందన్నారు.

ఎడ్వర్డ్ నివేదికలో పేర్కొన్న ముఖ్యాంశాలివీ... ★ ప్రధాన మార్గం-1.. నిడమానూరు నుంచి బస్‌స్టేషన్ వరకూ 13.27 కి.మీ., ప్రధానమార్గం-2: పెనమలూరు నుంచి బస్‌స్టేషన్ వరకూ 12.76 కి.మీ. ఉంటుంది. ప్రధానమార్గం-1కి రూ.2143.93 కోట్లు, 2కి రూ.2094.68కోట్లు ఖర్చవుతుంది. ఏలూరు, బందరు రోడ్డు కారిడార్లను ఇందుకు అనువుగా మలచుకోవాలి. మెట్రో రైల్ డిపో కోసం 60 ఎకరాలు అవసరమని ప్రతిపాదిస్తే లైట్ మెట్రోకి 35 ఎకరాలు సరిపోతుంది.

★ మూడు దశల్లో ప్రజారవాణాను లైట్‌మెట్రోకి అనుసంధానిస్తారు. ఈ రైల్ స్టేషన్లను ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా... ప్రజా రవాణా ఆగే ప్రాంతానికి 500మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేయాలి. రాజధాని అమరావతి ప్రాంతానికీ, విమానాశ్రయం మీదుగా గన్నవరం వరకూ పొడిగించవచ్చు.

★ లైట్ మెట్రో మూలంగా భూసేకరణపరంగా ఉన్న సమస్య పరిష్కారమవుతుంది. నిడమానూరు ప్రాంతంలో రూ.600 కోట్లతో 60 ఎకరాల భూసేకరణ అవసరమవుతుందని మెట్రో ప్రణాళికలో పేర్కొనగా.. లైట్‌మెట్రోతో ఆ సమస్య ఉండదు.

# పేదలకు ఇళ్ల పన్ను మినహాయింపు

- 'ఈనాడు-ఈటీవీ' ఇంటర్వ్యూలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి లోకేశ్

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో పేదలకు ఇళ్ల పన్నుల నుంచి మినహాయింపు ఇస్తున్నామని ఈ మేరకు త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందని మంత్రి లోకేశ్ ప్రకటించారు. గ్రామాల అభివృద్ధికి ఇళ్ల పన్నుల పెంపే ప్రధాన ఆదాయ వనరు కాదని, పన్నులు పెంచి ప్రజలపై భారం మోపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీ సర్పంచులు భారీగా పన్నులు పెంచి మంత్రి ఆదేశాలతో చేస్తున్నామని ప్రజలకు చెప్పి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, వీటిని ప్రజలెవరూ నమ్మొద్దని కోరారు. రాష్ట్రంలో అన్ని గ్రామాలకూ ఒకేసారి కుళాయి కనెక్షన్లు ఇచ్చే అవకాశం లేదని, రాబోయే రెండేళ్లలో ఐదారు జిల్లాల్లో పూర్తిగా ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. తాగునీటి కార్పొరేషన్ కోసం అన్ని ప్రభుత్వశాఖలను భాగస్వాములను చేస్తూ ఆరు నెలల్లో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఐదు వేల జనాభా కలిగిన గ్రామాల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ) పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, నిమ్మకూరులో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును నెలాఖరులోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. ఎన్టీఆర్ జలసిరి కార్యక్రమానికి నిధుల కొరత వాస్తవమేనని, ఇప్పటి వరకు తీసిన బోర్లకు మాత్రమే సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వాలని సూచించామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే కొత్త బోర్లు తీయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వివరించారు.

> **కలిసే ముందుకెళ్తాం**
>
> భాజపా, జనసేనతో కలిసే మేం ముందుకెళ్తాం. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఇన్నాళ్లూ రాష్ట్రాభివృద్ధికోసం మేం ఐక్యంగా కలిసి నడిచాం. ఇకముందు కూడా కలిసే వెళ్తాం. మామధ్య అభిప్రాయబేధాలు కూడా పెద్దగా ఏమీ లేవు.



> **నిరుద్యోగ భృతి ఇస్తాం**
>
> త్వరలోనే నిరుద్యోగ భృతి ఇస్తాం. దీన్ని ఎలా అమలు చేయాలనేదానిపైన కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే ప్రకటిస్తాం.

### స్థానిక సంస్థలకు అధికారాలిస్తాం...

స్థానిక సంస్థలకు ఇప్పటికే 18 అధికారాలు బదలాయించామని, మిగతా ఆరు అధికారాలు ఇచ్చే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారాలన్నీ కల్పించడంతో ప్రభుత్వాలకు చెడ్డ పేరు వచ్చిందని, అలాంటి పరిస్థితి రాకూడదనే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడే 14వ ఆర్థిక సంఘ నిధులను గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. గ్రామాలంటే తనకు ఎంతో ఇష్టమని, ప్రతి ఏటా సెలవుల్లో తాతగారింటికి వెళ్లేవాణ్నని ... అలా పల్లెలపై ఏర్పడ్డ ఇష్టం కారణంగానే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. పల్లెలకు సేవ చేయడమంటే పరమాత్మునికి సేవ చేయడమేనని గట్టిగా నమ్మే వ్యక్తుల్లో తానొకణ్నని లోకేశ్ అన్నారు.

> **జగన్... మీరు అసమర్థులా?**
>
> జగన్, వైకాపా నేతలు నాపైన అవినీతి ఆరోపణలు చేశారు. వాటిని నిరూపించమని నాలుగు సార్లు సవాల్ చేశాను. ఇప్పుడు మళ్లీ పిలుస్తున్నాను. జగన్... నువ్వు చేసిన ఆరోపణలు నిరూపించు, నేను తప్పుకొంటాను. ఎందుకు మీరు ముందుకు రావడం లేదు? అంటే మీరు అసమర్థులా? మీరు చేసిన అవినీతి అరోపణల్లో నిజం లేదనా?

### అభివృద్ధిని అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు...

వైకాపా ఎంపీల తప్పుడు ఫిర్యాదులతో రాష్ట్రానికి కేంద్రం నుంచి రావలసిన రూ.600 కోట్ల నిధులు నిలిచిపోయాయని మంత్రి తెలిపారు. ఉపాధి పనులతో ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో ఓర్వలేక వైకాపా తప్పుడు ఫిర్యాదులు చేస్తోందన్నారు. కార్యక్రమ అమలులో లోపాలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని లోకేశ్ హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన ఉపాధి నిధుల కోసం వారం రోజుల్లో మరోసారి దిల్లీ వెళ్లి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిని కలిసి విడుదలయ్యేలా చూస్తానన్నారు. అప్పటివరకు ఉపాధి శ్రామికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. "రూ.14 వేల కోట్ల ఉపాధి నిధుల ఖర్చులో రూ.23 కోట్లు దుర్వినియోగమైనట్లు నిఘా వర్గాలు గుర్తించడంతో ఇప్పటికే రూ.5 కోట్లు తిరిగి వసూలు చేసి తదుపరి చర్యలు తీసుకున్నాం" అని తెలిపారు. ఉపాధి పనులపై మూడు దశల్లో నాణ్యత పరిశీలన చేయిస్తున్నామని, ఎవరు అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఉపాధి హామీ పనులతో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని, గత మూడేళ్లలో 10,044 కిలో మీటర్ల రహదారులను నిర్మించామని వివరించారు.

> **పెట్టుబడులకు పెద్ద నగరాలు ఖరీదైపోయాయ్...**
>
> బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, నోయిడా లాటి మొదటి శ్రేణి నగరాల్లో పెట్టుబడులు ఖరీదైన వ్యవహారంగా మారుతోంది. దాంతో ఐటీ కంపెనీలు ద్వితీయ శ్రేణి నగరాలవైపు చూస్తున్నాయి. అది మనకు అనుకూలంగా ఉంది. ప్రస్తుతమున్న రూ.2వేల కోట్ల ఐటీ ఎగుమతులను రూ.20వేల కోట్లకు పెంచుతాం. ఐటీ కంపెనీలకు రాష్ట్రంలో కోటి చదరపు అడుగుల స్థలం కావాలి. అందుకే అద్దె హామీ విధానం ప్రకటించాం. లక్ష ఉద్యోగాలు కల్పించాలనేదే లక్ష్యం.

## ఉత్తీర్ణత సాధిస్తేనే పైతరగతికి

(మొదటి పేజీ తరువాయి)

మరోసారి పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పించనున్నారు. ఈ మేరకు బిల్లును ఆమోదం నిమిత్తం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులు ఆయా తరగతుల్లో ఉత్తీర్ణులు కాకపోయినా 8వ తరగతి వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పైతరగతికి వెళ్లగలుగుతున్నారు. 2010 ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చిన విద్యాహక్కు చట్టంలో ఇదొక కీలక నిబంధన.

★ ప్రవాస భారతీయులు కూడా భారత్‌లో ఓటు వేయడానికి వీలు కల్పించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని సవరించనున్నారు. ఎన్నారైలు ఏ నియోజకవర్గంలో తమ పేరు నమోదు చేయించుకుంటే అక్కడ ఓటు వేయడానికి వీలుంటుంది.

★ దేశంలో 20 చోట్ల ప్రభుత్వ రంగంలో ప్రపంచ శ్రేణి విద్యాసంస్థల్ని ఏర్పాటు చేయాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఒక్కో సంస్థకు రూ.500 కోట్లు చొప్పున నిధుల్ని కేటాయిస్తారు. ప్రైవేటు రంగంలోనూ 20 చోట్ల ఇలాంటివి రానున్నాయి. ఈ విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల కోసం రుసుముల్ని, విదేశీ బోధకుల జీతాల్ని సొంతంగా నిర్ణయించుకోవచ్చు. ప్రస్తుత విశ్వవిద్యాలయాలకు అలాంటి అవకాశం లేదు.

★ వ్యవసాయ పరిశోధన వేదికను నెలకొల్పడం కోసం భారత్- ఇతర బ్రిక్స్ దేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందానికి కేబినెట్ కార్యోత్తర ఆమోదం తెలిపింది.

# మూడేళ్లలో 30 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వసతులు, ఇతర అభివృద్ధి పనుల కోసం తొలి 11 ఏళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏటా రూ.1500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు అవసరమని సీఆర్‌డీఏ అధికారులు సీఎంకు వివరించారు. దీర్ఘకాలిక వాయిదా సౌకర్యం కల్పిస్తూ నిర్మాణ సమయంలో మారిటోరియానికి అంగీకరించే ఆర్థిక సంస్థలనే సంప్రదించాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. విద్యుత్తు, ఫైబర్, ఆప్టిక్ కేబుల్, పైపులైన్ల ద్వారా అందించే గ్యాస్ వంటి మౌలిక సదుపాయాలు ప్రాథమికంగా తమకు ఆర్థిక వనరులుగా ఉంటాయని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.

### ఏడు మార్గాల ద్వారా రూ.7300 కోట్లు...

- ప్రభుత్వ అధికారులకు చెల్లించే ఇంటి అద్దె భత్యం ద్వారా సమకూరే నిధులు ప్రాతిపదికగా తీసుకుని వారి నివాస సముదాయాల ప్రాజెక్టు చేపట్టడానికి తీసుకునే రుణం: **రూ.500 కోట్లు**
- ప్రభుత్వ కార్యాలయాల అద్దె చెల్లింపుల ద్వారా సమకూరే నిధులను ఉపయోగించి తీసుకొచ్చే స్ట్రక్చర్డ్ బాండ్ల ద్వారా: **రూ.1000 కోట్లు**
- పీపీపీ పద్ధతిలో సమకూర్చుకునేది: **రూ.1600 కోట్లు**
- ఏటా రాష్ట్ర ప్రభుత్వ అదనపు బడ్జెట్ కేటాయింపులు: **రూ.1500 కోట్లు**
- కలెక్టివ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీము కింద: **రూ.2000 కోట్లు**
- కన్వర్టబుల్ బాండ్ల జారీతో: **రూ.500 కోట్లు**
- మసాలా బాండ్ల ద్వారా: **1000 కోట్లు**

### ఎవరెవరికి ఎంతెంత విస్తీర్ణంలో (చదరపు అడుగులు) నివాసాలు..

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నివాసం: **8550**
- మంత్రుల నివాసాలు ఒక్కొక్కరికి: **6000**
- శాసనసభ్యుల కోసం బహుళ అంతస్తుల భవనాల్లో నివాసం. **ఒక్కొక్కరికి: 3500**
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నివాసం: **7500**
- డీజీపీ నివాసం: **5000 నుంచి 8000**
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శుల స్థాయి అధికారులకు: **4000**
- అఖిల భారత సర్వీసు అధికారులకు, నాన్ క్యాడర్ శాఖాధిపతులకు: **3500**
- టైప్-1 గెజిటెడ్ అధికారులకు: **1800**
- టైప్-2 గెజిటెడ్ అధికారులకు: **1500**
- నాన్ గెజిటెడ్ అధికారులకు: **1200**
- నాలుగో తరగతి ఉద్యోగులకు: **800**

# దిగువకు నీరేది?

(మొదటి పేజీ తరువాయి)

రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ వర్గాలు భావిస్తున్నాయి. జులై 31న ఉదయానికి ఆలమట్టి పూర్తి స్థాయిలో నిండడానికి కావల్సింది 2.98 టీఎంసీలు. ఆ సమయంలో వచ్చిన ప్రవాహం 48906 క్యూసెక్కులు కాగా బయటకు వదిలింది 11681 క్యూసెక్కులు. 37325 క్యూసెక్కులు ఆలమట్టిలోనే నిల్వ చేశారు. కానీ, ఆగస్టు 1న ఉదయానికి ఆలమట్టిలో ఇంకా 1.53 టీఎంసీల ఖాళీ ఉంది. ఒకటో తేదీ ఉదయానికి నారాయణపూర్‌లో 0.66 టీఎంసీ మాత్రమే ఖాళీ ఉంది. కానీ, 25301 క్యూసెక్కుల ప్రవాహం ఉంటే 18199 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదిలి 7202 క్యూసెక్కులను రిజర్వాయర్‌లోనే నిల్వ చేశారు. అయినా రెండో తేదీ ఉదయానికి 0.66 టీఎంసీల ఖాళీ అలాగే ఉంది. మరి రిజర్వాయర్లో నిల్వ చేసిన నీళ్లేమయ్యాయన్నది ప్రశ్న. నారాయణపూర్ నుంచి మంగళవారం ఉదయం ఏడువేల క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే, విద్యుదుత్పత్తి ద్వారా బయటకు వదిలారు. ఈ నీరు జూరాలకు రావల్సి ఉంది. బుధవారం ఉదయం కర్ణాటకలోని హూవెన్‌హెడ్గి వద్ద గల కేంద్ర జలసంఘం గేజ్ వద్ద 9412 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నట్లు నమోదైంది. ఇక్కడి నుంచి జూరాల 115 కి.మీ. దూరం. ఈ ప్రవాహం జూరాల వరకు రాకుండా మధ్యలోనే గూగూల్, గిరిజాపూర్‌ల వద్ద నిర్మించిన బ్యారేజీల నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని కర్ణాటకే వినియోగించుకొంటున్నట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి..** జూన్ 1 నాటికి 129.721 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఆలమట్టిలో 10.53 టీఎంసీలు నిల్వ ఉండగా.. గత రెండు నెలల్లో 143.22 టీఎంసీలు వచ్చాయి. జూన్ 1 నాటికి నారాయణపూర్‌లో 37.646 టీఎంసీలకు గాను 14.23 టీఎంసీలు ఉన్నాయి. ఈ రెండు రిజర్వాయర్లు పూర్తిగా నిండడానికి 142.6 టీఎంసీలు కావాల్సి ఉండగా.. అంతకు మించే వచ్చాయి. కానీ, దిగువకు మాత్రం చుక్క రాలేదు. ఆలమట్టి ఎత్తు ప్రస్తుతం 510.6 మీటర్లు కాగా బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 524.5 మీటర్లకు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఈ తీర్పు గెజిట్‌లో ప్రచురితమైతే ఆలమట్టిలో మరో 100 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చు. 130 టీఎంసీలు వినియోగించుకోవచ్చు. ఇది జరిగితే ఆగస్టులో కూడా దిగువకు ప్రవాహం రావడం కష్టమే అవుతుంది. మరోవైపు ఆలమట్టిలోకి ప్రవాహం తగ్గుతోంది. బుధవారం ఉదయం 20849 క్యూసెక్కులు ఉండగా, ఈ మొత్తం నీటిని నారాయణపూర్‌కు వదిలారు. ఇక్కడి నుంచి 18031 క్యూసెక్కుల నీటిని కాలువలకు, విద్యుదుత్పత్తి ద్వారా బయటకు వదిలారు. తుంగభద్రలోకి 11412 క్యూసెక్కులు, జూరాలలోకి 4574 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. శ్రీశైలంలోకి 80 క్యూసెక్కులు మాత్రమే ఉంది.

## గ్రహం అనుగ్రహం

**3-8-2017 గురువారం**

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; శుక్ల పక్షం
ఏకాదశి: సా. 4-25 తదుపరి ద్వాదశి
జ్యేష్ఠ నక్షత్రం: రా. 7-06 తదుపరి మూల
అమృతఘడియలు: ఉ. 9-14 నుంచి 10-59 వరకు
వర్జ్యం: తె. 3-49 నుంచి 5-36 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-59 నుంచి 10-50 వరకు
తిరిగి మ. 3-05 నుంచి 3-57 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5-42; సూర్యాస్తమయం: సా.6-30
తిరుమల శ్రీవారి పవిత్రోత్సవ ప్రారంభం

## వాతావరణం

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| తాడేపల్లిగూడెం | 24.0 | 31.0 |
| శ్రీకాకుళం | 24.0 | 36.5 |
| హైదరాబాద్ | 24.3 | 33.7 |
| విశాఖపట్నం | 24.8 | 35.4 |
| నెల్లూరు | 25.0 | 34.0 |
| అనంతపురం | 25.4 | 38.3 |
| కర్నూలు | 25.8 | 35.5 |
| గుంటూరు | 26.0 | 34.0 |
| ఒంగోలు | 26.2 | 35.5 |
| రాజమహేంద్రవరం | 27.0 | 30.5 |
| తిరుపతి | 27.0 | 38.0 |
| కడప | 27.0 | 38.0 |
| విజయవాడ | 28.0 | 34.0 |
| నరసాపురం | 28.1 | 30.5 |

**పాకిస్థాన్‌తో మనదేశ సరిహద్దుకు పూర్తి రక్షణ కల్పించడమే తమ తక్షణ ప్రాధాన్య అంశమని సరిహద్దు భద్రతాదళం(బీఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ కె.కె.శర్మ తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా జమ్ము సెక్టార్‌లో సరిహద్దు వెంబడి స్మార్ట్ సాంకేతికత సాయంతో దుర్భేద్యమైన కంచె ఏర్పాటుచేస్తామని వెల్లడించారు.**

# అమెరిక కాదిక!

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల సంఖ్య వృద్ధిరేటు 14.1శాతంగా నమోదైందని గత డిసెంబరులో విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఇతర దేశాలతో పోల్చుకుంటే ఇదే అత్యధికమని స్పష్టం చేసింది. తాజాగా 2016 మే, 2017 మే నెల మధ్య మాత్రం వృద్ధిరేటు 7శాతంగానే నమోదైంది. 2016 నవంబరు, 2017మే మధ్య కేవలం 116మంది విద్యార్థులే పెరిగారు. గతంతో పోల్చితే ఇది తక్కువే.

- అమెరికాలో చదువుకునేందుకు తమ ద్వారా ఏటా 30-50మంది వరకు వెళ్లేవారని, ఈసారి ఆగస్టు సెషన్(ఫాల్)కు కేవలం ఐదుగుర్ని మాత్రమే పంపించామని దేశవ్యాప్తంగా వీసాలు, ట్రావెల్ టిక్కెట్లు, విద్యా కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న రియా సంస్థకు చెందిన విజయవాడ రియా ఎడ్యుకేషన్ స్టడీ అబ్రాడ్ ప్రతినిధి స్వర్ణ పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంత ఆందోళన ఉందని, కొందరు వచ్చి వివరాలు అడిగిన తర్వాత వెళ్లడం మానుకుంటున్నారని తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడాలకు విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. తమ సంస్థ నుంచి ఈ ఏడాది 50మంది వరకు ఆస్ట్రేలియాకు వెళ్లారని, గతంలో ఇది 30వరకు ఉండేదని వివరించారు. ఈసారి తమ సంస్థ నుంచి కెనడాకు సుమారుగా 15 మంది వెళ్లారన్నారు. స్వీడన్‌కు 15మంది, జర్మనీకి 20మందిని పంపించినట్లు వెల్లడించారు. విదేశాల్లోనే చదవాలి అనుకునేవారు ఇతర దేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. అమెరికా వెళ్లే విద్యార్థుల సంఖ్య యథాస్థాయికి వచ్చేందుకు కొంచెం సమయం పడుతుందని వెల్లడించారు.
- తమ కన్సల్టెన్సీ తరఫున 150-200వరకు విద్యార్థులను అమెరికాకు పంపేవాళ్లమని ఈసారి దాదాపు 50-60శాతం తగ్గిందని విజయవాడలోని పెగాసిస్ కన్సల్టెన్సీ ప్రతినిధి మురళి తెలిపారు.
- విదేశీ విద్య కోసం టిక్కెట్ల బుకింగ్ వ్యాపారం సైతం తగ్గినట్లు దేశవ్యాప్తంగా బ్రాంచిలు కలిగి ఉన్న విజయవాడలోని అక్బర్‌ట్రావెల్స్ ప్రతినిధి నరేంద్ర వెల్లడించారు. ఫాల్ సెషన్ వెళ్లేవారితో బిజీబిజీగా ఉండాల్సి ఉండగా.. టిక్కెట్ బుకింగ్‌లు అనుకున్నంత స్థాయిలో లేవని పేర్కొన్నారు. ఆగస్టు సెషన్‌కు తమ వద్ద నుంచి అమెరికాకు 20వరకు టిక్కెట్లు బుక్కయ్యేవని, ప్రస్తుతం 12కి పడిపోయిందన్నారు. ఆస్ట్రేలియాకు 70వరకు టిక్కెట్లు బుక్కయ్యాయని తెలిపారు. ఇటీవల జరిగిన తమ ట్రావెల్స్ సమీక్షా సమావేశంలోనూ దేశ వ్యాప్తంగా తమ బ్రాంచిల్లో 30-40శాతం టిక్కెట్ల బుకింగ్ తగ్గడంపై చర్చకు వచ్చిందని, అమెరికా, ఇతర దేశాలకు చదువు కోసం వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గడమే దీనికి కారణమని వెల్లడైందని చెప్పారు.
- రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ బ్రాంచిలు కలిగిన అబ్రాడ్ కన్సల్టెన్సీ తరఫున రెండు సెషన్లకు కలిపి 445మంది పంపించేవాళ్లమని ఈసారి 400లోపే వెళ్లారని ఆ సంస్థ ప్రతినిధి పార్థసారథి తెలిపారు. ఇక్కడి నుంచి అమెరికాకు వెళ్లాలనుకుంటున్న విద్యార్థులకు నమ్మకం కలిగేందుకు కొంత సమయం పడుతుందన్నారు.
- ఇటలీ, జర్మనీలకు వెళ్లేవారు ఎక్కువగా మెకానికల్ ఇంజినీర్లు ఉంటున్నారని గుంటూరుకు చెందిన కన్సల్టెన్సీ ప్రతినిధి బిపిన్ పేర్కొన్నారు. అమెరికాకు వీసాల జారీ కొంచెం కఠినతరమైందని, సబ్జెక్టు ఉన్నవారికి తేలికగానే వస్తున్నాయని తెలిపారు.
- 90-95శాతం మార్కులు వచ్చిన విద్యార్థులకు యూరప్‌లోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో ఉచితంగా విద్యను అందిస్తుండడంతో గుంటూరులో జెమ్స్ అనే కన్సల్టెన్సీ ఈ దేశాలకు విద్యార్థులను పంపిస్తోంది.

# అగ్రరాజ్యాల మధ్య పెరుగుతున్న అగాధం?

- ప్రచ్ఛన్న యుద్ధం పరిస్థితుల దిశగా పరిణామాలు
- రష్యాపై ఆంక్షలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆమోదం

వాషింగ్టన్

చినికి చినికి గాలివానైనట్లు అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాల మధ్య తలెత్తిన విభేదాలు తీవ్రస్థాయికి వెళ్లాయి. మళ్లీ ప్రచ్ఛన్న యుద్ధం నాటి పరిస్థితులను ఇవి స్ఫురింపజేస్తున్నాయి. అమెరికా కాంగ్రెస్.. రష్యాపై సరికొత్త ఆంక్షలు విధించే బిల్లును ఆమోదించటం, ప్రతిగా పుతిన్ భారీ సంఖ్యలో అమెరికా దౌత్య సిబ్బందిని తమ దేశాన్ని వీడి వెళ్లాలని ఆదేశించటం ఆ రెండు దేశాల సంబంధాల్లో ఇప్పటికే నెలకొన్న అగాధాన్ని పెంచాయి. దీనికి మరింత ఆజ్యం పోస్తూ ఆంక్షల బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆమోద ముద్ర వేయటంతో ఈ పరిణామం ఎటు వైపు, ఎంతవరకు దారితీస్తుందన్నది అంతుచిక్కటం లేదు. అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి రెక్స్ టిల్లర్ మాటల్లోనైతే..."ఈ విభేదాలు మరింత తీవ్రమవుతాయా లేక ఏదోఒక చోట ఆగిపోతాయా వేచి చూడాల్సిందే" మరి. ప్రస్తుత విభేదాలు ప్రత్యక్ష ఘర్షణకు దారితీయకుండా నివారించే మార్గాన్వేషణ చేయాల్సి ఉందని టిల్లర్ సన్ పేర్కొనటం గమనార్హం. కాంగ్రెస్ సభ్యులు ఆమోదించిన ఆంక్షల బిల్లుపై ట్రంప్ అయిష్టంగానే సంతకం చేసినట్లు తెలిసింది. అధ్యక్షుడి వీటో అధికారాల తగ్గింపు సహా ఈ బిల్లులోని పలు నిబంధనలను ట్రంప్ వ్యతిరేకిస్తున్నారు. అయినా సరే ఆమోదించక తప్పలేదు. భవిష్యత్తులో ఈ ఆంక్షలను ఎత్తివేయాలని ట్రంప్ ప్రభుత్వం భావించినా కాంగ్రెస్ అనుమతి తీసుకోవటం తప్పనిసరి. ఉత్తరకొరియా, ఇరాన్‌లపై కూడా ఆంక్షలు విధించటానికి ఈ బిల్లు రూపొందించారు.

### ఎన్నికల్లో జోక్యం ఆరోపణలతో ఆరంభం..

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందనే ఆరోపణల నేపథ్యంలో 2016 డిసెంబరులో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా 35 మంది రష్యా దౌత్యవేత్తలను దేశం వీడి వెళ్లాలని ఆదేశించారు. రష్యా దౌత్యవేత్తల వినోద కేంద్రాలు రెండింటిని మూసివేయించారు. ఎన్నికల్లో తమ ప్రమేయం లేదని తోసిపుచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్... ఒబామా చర్యపై తీవ్ర అభ్యంతరం తెలిపినా ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చే ట్రంప్ దౌత్యవేత్తల వెలిని నిలిపివేస్తారని ఆశిస్తూ ప్రతీకార చర్యలకు దిగలేదు. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక దీనికి సంబంధించి రెండు దేశాల దౌత్యాధికారులు చర్చలు జరిపినా ఒక అంగీకారానికి రాలేకపోయారు. ఇవే ఆరోపణలపై ఇప్పుడు అమెరికా కాంగ్రెస్ కూడా తమ దేశానికి వ్యతిరేకంగా ఆంక్షలను విధించే బిల్లును భారీ ఆధిక్యంతో ఆమోదించటాన్ని పుతిన్ సహించలేకపోయారు. తమ దేశం నుంచి 755 మంది అమెరికా దౌత్య సిబ్బంది వెళ్లిపోవాలని ఆదేశించారు. అమెరికాలోనూ రష్యా తన దౌత్య సిబ్బంది సంఖ్యను సెప్టెంబరు ఒకటో తేదీకి 455కి తగ్గించుకోనుంది.

### సిరియాపై సహకారం

ఇటీవల జీ20 సదస్సు సమయంలో జర్మనీలో ట్రంప్-పుతిన్‌లు పలుమార్లు భేటీ అయ్యి వాయవ్య సిరియాలోని భద్రతా ప్రాంతంపై ఒక అవగాహనకు వచ్చారు. తమ మధ్య విభేదాలు ఎలాఉన్నప్పటికీ సిరియాపై కుదిరిన అవగాహన కొనసాగుతుందనే భావిస్తున్నట్లు పుతిన్ ప్రకటించటం గమనార్హం.

### ఉక్రెయిన్ సంక్షోభం

ఉక్రెయిన్‌లోని క్రిమియాను రష్యా తిరిగి స్వాధీనం చేసుకోవటంతో అమెరికా, మరికొన్ని పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించాయి. 2015లో శాంతి ఒప్పందంపై సంప్రదింపులు జరిపేందుకు అమెరికా దౌత్యాధికారిని నియమించటాన్ని పుతిన్ స్వాగతించినా ఉక్రెయిన్ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య ఘర్షణలు ఆ సానుకూల వాతావరణాన్ని చెరిపేశాయి. అయితే, ఉక్రెయిన్‌లో తిరుగుబాటుదారులకు రష్యా మద్దతివ్వటాన్ని వ్యతిరేకిస్తున్న అమెరికా కాంగ్రెస్ సభ్యులు తమ తాజా బిల్లులో ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు పంపించాలని పేర్కొనటం రష్యాకు ఆగ్రహం కలిగించే అంశమే.

### ఉత్తరకొరియా క్షిపణి పరీక్షలు

అమెరికా,రష్యాల మధ్య సంబంధాలు క్షీణించే కొద్దీ అణ్వాయుధాలు, క్షిపణుల కార్యక్రమాన్ని విరమించుకునేలా ఉత్తరకొరియాపై తీవ్ర ఒత్తిడి తెచ్చే అమెరికా ప్రయత్నాలకు సహకరించే విషయంలో రష్యా ఉదాసీనంగా ఉండే అవకాశం ఉంది. ఉత్తర కొరియా తాజా క్షిపణి పరీక్షలను రష్యా ఖండించినప్పటికీ ఆ దేశంపై ఆర్థిక ఆంక్షలను తీవ్రతరం చేసే అమెరికా యత్నాలపై తీవ్ర హెచ్చరికలే చేసింది.

### ఇంధన, అంతరిక్ష రంగాల్లో సహకారం

రష్యాలోని ఇంధన ప్రాజెక్టుల్లో అమెరికా కంపెనీలు భాగస్వాములుగా కొనసాగటాన్ని పుతిన్ ప్రస్తావిస్తూ ఇతర రంగాల్లోనూ 2 దేశాల పరస్పర సహకారం కొనసాగుతుందన్నారు. అంతరిక్ష పరిశోధనల్లోనూ రెండు దేశాలు చాలాసన్నిహితంగా సహకరించుకుంటున్నాయి. రష్యాలో ఇంధనాల వెలికితీతలో భాగంగా గొట్టపు మార్గాలను నిర్మిస్తున్న కంపెనీలపైనా, రష్యాలో ఆయుధాలు తయారు చేసి ఎగుమతి చేసే సంస్థలపైనా ఆంక్షలువిధించే అవకాశాన్ని నూతన బిల్లు కల్పిస్తుంది.

# చుక్కల భూములకు పరిష్కారం

- అభ్యంతరాల స్వీకరణకు విధివిధానాలు
- రైతుల్లో అవగాహనకు రెవెన్యూ ప్రచారం

ఈనాడు, అమరావతి: చుక్కల భూముల వివాదాలను పరిష్కరించి రైతుల సమస్యలకు తెర దించేందుకు తగిన ప్రచారం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చుక్కల భూములను అనుభవంలో ఉంచుకొన్న రైతులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటే తదుపరి ప్రక్రియను రెవెన్యూ శాఖ చేపడుతుంది. ఆ భూములపై యాజమాన్య హక్కులు పొందాలనుకొనేవాళ్లకు ఉండాల్సిన అర్హతలు, సమర్పించాల్సిన ఆధారాలు, హక్కులు దఖలుపరచే విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలు, బ్రోచర్లను బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ విడుదల చేశారు. రాష్ట్రంలో 24.25 లక్షల ఎకరాల మేర చుక్కల భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తేలింది. రైతాంగం చేతిలో ఉన్నది 3.41 లక్షల ఎకరాలేననీ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ సమస్యను తీర్చేందుకు చట్టంలో మార్పులు చేసి మార్గదర్శకాలు విడుదల చేసింది. ఏకబిగిన 12ఏళ్లపాటు తమ అనుభవంలోనే ఆ భూమి ఉందని రైతు అప్పీల్ చేసుకోవల్సి ఉంటుంది. రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడెక్కడ చుక్కలున్నాయో స్థానిక రెవెన్యూ యంత్రాగం వెల్లడిస్తుంది. వాటి ఆధారంగా రైతులు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే కమిటీ పేరిట దరఖాస్తు చేసుకోవాలి. వీటిని మీ సేవలో అందచేయవచ్చు. వీటిని పరిశీలించి కమిటీ విచారణ నిమిత్తం తహసీల్దార్‌కి ఇస్తుంది. ఈ విచారణ ప్రక్రియను ఆరు నెలల్లో పారదర్శకంగా పూర్తి చేసేందుకు, ప్రజల నుంచి అభ్యంతరాలుంటే స్వీకరించి పరిశీలన చేసేందుకు అవసరమైన విధివిధానాలను కూడా రూపొందించారు. రెవెన్యూ ఉన్నతాధికారులు మాట్లాడుతూ 'ఏళ్ల తరబడి ఉన్న సమస్య ఇది. 24.25లక్షల ఎకరాలు చుక్కల భూమిగా ఉన్నా అందులో ఎక్కువ భాగం ప్రభుత్వ అధీనంలో ఉంది. పలు సంస్థలకు, భూమి లేని నిరుపేదలకు ఇప్పటికే కేటాయింపులు జరిగాయి. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్నవాటికి తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకొన్న ఆరు నెలల్లోగా పరిష్కరించాలని నిబంధనల్లో స్పష్టం చేశాం"అన్నారు.

**అంకెల్లో...**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చుక్కల భూములు: 24,25,000 ఎకరాలు
ఇందులో వివిధ సంస్థలకు కేటాయించింది: 95 వేల ఎకరాలు
భూమిలేని నిరుపేదలకు ఇచ్చింది: 16.73 లక్షల ఎకరాలు
రైతుల అధీనంలో ఉన్నది: 3.41 లక్షల ఎకరాలు
యాజమాన్య హక్కులిస్తే లబ్ధి పొందే రైతులు: 1.85 లక్షల మంది
ఎవరూ క్లెయిమ్ చేయనిది: లక్ష ఎకరాలు
ప్రభుత్వం చేతిలో ఉన్నది: 2.16 లక్షల ఎకరాలు

## పచ్చని పొలాలు.. వడివడిగా జలాలు



పోలవరం కుడి కాలువ నుంచి వచ్చే గోదావరి జలాలు కృష్ణా జిల్లా మైలవరం నియోజకవర్గంలో ఇలా ప్రవహిస్తున్నాయి. కృష్ణమ్మలో కలవడానికి వడివడిగా అడుగులు వేస్తున్నాయి. ఇరువైపులా పచ్చని పంట పొలాలు, అక్కడక్కడ గృహాల సముదాయం.. ఆహ్లాదం పంచే కొండలతో విజయవాడ నగర సమీపంలోని కొండపల్లి ప్రాంతం సుందరంగా కనిపిస్తోంది. కొండపల్లి కోటపై నుంచి ఈ రమణీయమైన దృశ్యం కనిపించింది.

– ఈనాడు, విజయవాడ

## ఆ రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీ ముగిసింది: నిర్మలా సీతారామన్

ఈనాడు, దిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పారిశ్రామిక విధాన రూపకల్పన, ప్రోత్సాహక విభాగం(డీఐపీపీ) పథకాల ప్రత్యేక ప్యాకేజీ ఇటీవలే ముగిసిందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో వైకాపా సభ్యుడు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆర్థికాభివృద్ధి కోసం కేంద్రం పన్ను ప్రోత్సాహకాలతోపాటు ఆర్థిక వెసులుబాటు కల్పించాలని ఏపీ విభజన చట్టంలోని సెక్షన్ 94 స్పష్టం చేస్తోందన్నారు. ఈమేరకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెసిలిటేషన్ పథకం ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందన్నారు.

## మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలి

- జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలని 13 జిల్లాల వృత్తిదారుల సంఘం డిమాండు చేసింది. ఈ మేరకు మత్స్యకారుల నేత ఏఎల్ మల్లయ్య ఆధ్వర్యంలో వందల మంది బుధవారం జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మత్స్యకారులకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ధర్నాకు సంఘీభావం ప్రకటించిన మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ.. మత్స్యకారుల డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సముద్రంలో వేటకు వెళ్లి మృతిచెందినవారికి బీమా విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సముద్రంలో మృతిచెందిన వారి దేహాలు చాలావరకు దొరకవని దీంతో మరణ ధ్రువపత్రాలు లేక బీమా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారి కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని మోపిదేవి కోరారు. కర్రి పద్మశ్రీ, బి. గౌరేశ్వరి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ సమీక్షకు అధికారుల డుమ్మా

- ప్రధాన కార్యదర్శి ఆగ్రహం
- డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓలకు నోటీసులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సుకు అధికారులంతా తప్పకుండా హాజరు కావాల్సిందేనని ముందస్తు సమాచారం ఇచ్చినా కొంతమంది అధికారులు భేఖాతరు చేయడంపై ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి అధికారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో సమస్యలపై సమీక్ష నిర్వహించడానికి ప్రధాన కార్యదర్శి బుధవారం సచివాలయం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి అధికారులంతా హాజరు కావాలని ముందుగానే సమాచారం అందించారు. అయితే చాలా మంది డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓలు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరయ్యారు. దాంతో ఆ ప్రాంతంలో వైద్య, ఆరోగ్య పరిస్థితులపై ప్రధాన కార్యదర్శి అడిగిన ప్రశ్నలకు మిగిలిన అధికారులు సమాధానం ఇవ్వలేక, సంబంధిత అధికారి రాలేదని చెప్పారు. దాంతో ప్రధాన కార్యదర్శి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రంపచోడవరం డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓకు నోటీసు జారీ చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం అలక్ష్యం ప్రదర్శించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి తగు ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలని కోరారు. గురుకులాల్లో విద్యార్థుల చేరిక శాతం తక్కువగా ఉండటం పట్ల దినేష్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రతి నియోజకవర్గంలోనూ బీసీ వసతిగృహం

- మంత్రి అచ్చెన్నాయుడు

విద్యాధరపురం(విజయవాడ), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ బీసీ సంక్షేమ వసతిగృహాల ఏర్పాటు ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 13 జిల్లాల బీసీ సంక్షేమశాఖ అధికారుల సమావేశాన్ని వెనుకబడిన తరగతుల సమాఖ్యలు, కార్పొరేషన్ల ఛైర్మన్ల సమక్షంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు తెదేపా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు అందాలంటే దిగువ స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు అంతా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో బీసీలకు 34 రెసిడెన్షియల్ వసతిగృహాలు ఉన్నాయని, మరో 81 అందుబాటులోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనుమతి ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 4.30కోట్ల జనాభా ఉంటే అందులో 2.10 కోట్ల మంది బీసీలేనని, వారి సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.6వేల కోట్ల మేర నిధులు కేటాయించామన్నారు. వాటికి అదనంగా బీసీ ఉప ప్రణాళిక కింద మరో రూ.10వేల కోట్లు ఖర్చుచేస్తామని చెప్పారు. సంక్షేమ వసతిగృహాల్లో బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదవుతున్న 40శాతం హాజరును భవిష్యత్తులో వంద శాతం చేరేలా చూస్తామన్నారు. వసతిగృహాల మెస్ ఛార్జీలు త్వరలో పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, తద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతుందని చెప్పారు. విదేశీ విద్య, ఎన్టీఆర్ విద్యోన్నతి పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు అధికారులు కృషిచేయాలని సూచించారు. బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బి.ఉదయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి కార్యక్రమాల అమల్లో భాగంగా ఆగస్టు 1 నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రుణాల మంజూరులో బ్యాంకర్లు పెడుతున్న ఇబ్బందులను బీసీ కార్పొరేషను ఛైర్మన్ రంగనాయకులు, కాపు కార్పొరేషను ఛైర్మన్ రామానుజయ మంత్రి దృష్టికి తెచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ ఎండీ కృష్ణమోహన్, డైరెక్టర్ హర్షవర్ధన్, ఫెడరేషన్ల ఛైర్మన్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

## ఆస్తుల రిజిస్ట్రేషన్లకూ ఆధార్!

ఈనాడు, దిల్లీ: స్థిరాస్తుల క్రయవిక్రయాల్లో బినామీ లావాదేవీలను అరికట్టేందుకు గాను రిజిస్ట్రేషన్లకు ఆధార్‌ను తప్పనిసరి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇది అమల్లోకి వస్తే.. విక్రయ ఒప్పందపత్రం (సేల్ అగ్రిమెంట్), ప్రాతినిధ్య అధికార హక్కుపత్రం (పవర్ ఆఫ్ అటార్నీ) వంటి వాటికి ఆధార్ తప్పనిసరి అవుతుంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పత్రాలు సమర్పించే ప్రతిఒక్కరికీ ఆధార్ గుర్తింపు అవసరమవుతుంది. కొనుగోలుదారులకు తమ ఆస్తుల పత్రాల్లో ఎలాంటి అవకతవకలు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉంటుంది. అలాగే స్థిరాస్తి రంగంలో నల్లధనం వినియోగాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు వీలు పడుతుంది.




## పాదయాత్ర పేరుతో ముద్రగడ డ్రామా: చినరాజప్ప

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: పాదయాత్ర పేరుతో ముద్రగడ పద్మనాభం డ్రామా ఆడుతున్నారని ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని పాదయాత్ర చేయాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాపులకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు లేఖలు రాసి, సలహాలు ఇచ్చే అర్హత ముద్రగడకు లేదన్నారు.

## సీఐడీ పోలీసుస్టేషన్ అమరావతికి..

ఈనాడు, అమరావతి: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం (సీఐడీ) పోలీసుస్టేషన్ అమరావతికి తరలిరానుంది. ఇప్పటికే సీఐడీ ప్రధాన కార్యాలయాన్ని మార్చారు. సీఐడీ పోలీసుస్టేషన్‌ను కూడా ఇక్కడకు తరలించాలన్న డీజీపీ సాంబశివరావు ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి 1986లో రాష్ట్ర ప్రభుత్వం పోలీసుస్టేషన్ హోదా కల్పించింది. సీఐడీకి సంబంధించి రాష్ట్రం మొత్తం ఈ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది.

## ఎఫ్‌ఎంబీ డిజిటలైజేషన్‌పై కార్యశాల

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఎఫ్‌ఎంబీ(ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్) డిజిటలైజేషన్ ప్రక్రియపై సర్వేశాఖ ఏడీలకు గుంటూరు కలెక్టరేట్‌లో బుధవారం కార్యశాల నిర్వహించారు. సర్వేశాఖ, ఏపీ శాక్, ఎన్ఐసీ సంయుక్తంగా నిర్వహించిన కార్యశాలకు సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ విజయ్‌మోహన్ పాల్గొని ప్రసంగించారు. కొలంబోల్యాండ్ సాఫ్ట్‌వేర్‌లో ఎఫ్‌ఎంబీ డిజిటలైజేషన్ చేస్తున్న క్రమంలో ఎదురవుతున్న సందేహాలను నివృత్తి చేయటంతో పాటు, డిజిటలైజేషన్ విధానంపై పలు సూచనలను చేశారు. సమావేశంలో సర్వే శాఖ ప్రధాన కార్యాలయ డీడీ, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్లు, ఎన్ఐసీ డైరెక్టర్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఈనాడు

## ఉమ్మడి బాధ్యత విస్మరిస్తారా?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శాసనసభ స్థానాల పెంపుదలకు సంబంధించి భిన్న పార్టీల నాయకశ్రేణుల్లో పొంగుతున్న ఆశలపై కేంద్రం మళ్ళీ నీళ్లు జల్లింది. సుమారు రెండేళ్లక్రితం- ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 2026 సంవత్సరం వరకు అసెంబ్లీ సీట్ల పెంపు ఉండబోదని లోక్‌సభాముఖంగా కేంద్ర హోంశాఖ వివరణ ఇచ్చింది. తాజాగా రాజమహేంద్రవరం ఎంపీ మురళీమోహన్, మెదక్ ఎంపీ ప్రభాకరరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం- నూట డెబ్భయ్యో అధికరణను సవరిస్తేనే సీట్ల పెంపు సాధ్యపడుతుందని తేల్చిచెప్పింది! విభజన చట్టంలోని సెక్షన్ 26(1) ఆంధ్రప్రదేశ్‌లోని శాసనసభ స్థానాలను 175నుంచి 225కి, తెలంగాణలోని అసెంబ్లీ సీట్లను 119నుంచి 153కి పెంచుకోవడానికి వీలు కల్పిస్తోంది. ఆ దిశగా ముందడుగు వేయడంలోని సాధకబాధకాలపై న్యాయమంత్రిత్వశాఖ అటార్నీ జనరల్ అభిప్రాయం కోరిన సంగతీ గతంలోనే వెలుగుచూసింది. 170(3) రాజ్యాంగ అధికరణ ప్రకారం 2026 తరవాత తొలి జనాభా లెక్కలు ప్రచురించేంతవరకు విధాన సభల స్థానాల సర్దుబాటుకు వీల్లేదన్న అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని కేంద్ర హోంమంత్రిత్వశాఖ నేడు ఉటంకిస్తోంది. ఆ లెక్కన ఇప్పటినుంచి నాలుగేళ్ల తరవాత జరిగే 2021నాటి జనగణనను విస్మరించి, 2031లో సేకరించే జనాభా వివరాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. జనగణన సమాచార సేకరణ పూర్తయిన మూడేళ్లకుగాని లెక్కల ముద్రణ సాధ్యపడదు. అప్పుడు దేశవ్యాప్తంగా పునర్విభజన ప్రక్రియ ఆరంభిస్తే అది పూర్తయ్యేదెప్పుడు, సీట్ల పెంపు అమలుకు నోచుకునేదెన్నడు? 'ఆర్టికల్ 170కింద పొందుపరచిన నిబంధనలకు అనుగుణంగా' శాసనసభ స్థానాల పెంపుదల సాకారమయ్యేందుకు రాజ్యాంగ సవరణ అనివార్యమైనట్లయితే, సత్వరమే అందుకు మార్గం సుగమం చేయడం- సముచిత పరిష్కారంగా మన్ననలందుకుంటుంది!

ఇంచుమించు ఇప్పటి స్థాయిలోనే రమారమి ఒకటిన్నర దశాబ్దాల క్రితం లోక్‌సభ, విధానసభ నియోజకవర్గాల పునర్విభజనపై రాజకీయ కోలాహలం మిన్నంటినా- అప్పటి నేపథ్యం వేరు. ఏ రాష్ట్రంలోనైనా శాసనసభ స్థానాల సంఖ్య 60కి తక్కువ, 500కి ఎక్కువ కాకుండా ఉండాలని భారత రాజ్యాంగం నిర్దేశిస్తోంది. పదేళ్లకోసారి జనగణన చేపట్టినప్పుడల్లా జనసంఖ్యకు అనుగుణంగా చట్టసభల్లో ప్రాతినిధ్యం ఇనుమడింపజేసిన పక్షంలో- నిష్ఠగా కుటుంబ నియంత్రణ పథకాలు అమలుపరుస్తున్న రాష్ట్రాలు నష్టపోతాయి. అందుకనే 2001 దాకా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను వాయిదా వేస్తూ 1976లో రాజ్యాంగాన్ని సవరించారు. పురోగామి రాష్ట్రాలకు ఊరట కలిగించేందుకంటూ ఆ గడువును వాజ్‌పేయీ ప్రభుత్వం 2026 వరకు పొడిగించింది! అయినా, గతంలో ఉత్తరాఖండ్ పునర్విభజనకు కేంద్రం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా మార్గం సుగమం చేసిన దృష్ట్యా అదే పద్ధతిని ఇక్కడా అనుసరించవచ్చు కదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సూటిగా ప్రశ్నించినప్పుడు- ఎన్నికల సంఘం తనదైన శైలిలో స్పందించింది. ఆర్టికల్ 170 సవరణకు ముందే ఆ ఆర్డినెన్స్ జారీ చోటు చేసుకుందంటూ, ఇప్పుడా దారి మూసుకుపోయిందని చెప్పకనే చెప్పింది. ఒకవేళ తెలుగురాష్ట్రాల్లో పునర్విభజన చేపడితే ఇతర రాష్ట్రాల నుంచీ డిమాండ్లు పెరిగే అవకాశముందంటూ కేంద్రం మనసులోని మాట గ్రహించినట్లే ఎన్నికల సంఘం విశదీకరించింది. వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో మార్పులు చేర్పులకు మళ్ళీ రాజ్యాంగ సవరణ అన్నది అక్కర్లేదని, సెక్షన్ 26కి కొద్దిపాటి సవరణ చేస్తే సరిపోతుందన్న న్యాయనిపుణుల అభిప్రాయాలపై ఎన్నికల సంఘంగాని, కేంద్రంగాని స్పందించకుండా మిన్నకుండిపోయాయి. రాజ్యాంగ అధికరణ 170ని సవరిస్తేనే సీట్ల పెంపు సాధ్యపడుతుందన్న కేంద్రప్రభుత్వ తాజా స్పష్టీకరణ- నిబంధనల అన్వయంలో వైరుధ్యాలను ప్రస్ఫుటీకరిస్తోంది.

సునిశిత అంశం తాలూకు పూర్వాపరాల పట్ల సమగ్ర అవగాహనతో, తెలుగు రాష్ట్రాలకు చెందిన గౌరవ ఎంపీలు లేవనెత్తిన ప్రశ్నకు- ఏపీ విభజన చట్టం అసెంబ్లీ స్థానాల పెంపుదలకు వెసులుబాటు కల్పించిన మాట వాస్తవమేనని కేంద్రం బదులిచ్చింది. సీట్ల పెంపుకోసం రాజ్యాంగ సవరణ అనివార్యమంటూనే, అందుకు తీసుకుంటున్న చర్యలేమిటో చెప్పకుండా కేంద్రం సమాధానం దాటవేయడం- ఇరు రాష్ట్రాల పాలక పక్షాలకూ ఇబ్బందికరమైన పరిస్థితే. నిజానికి, శాసన సభ స్థానాల పెంపుదల కోసం ఉద్దేశించిన బిల్లు రేపోమాపో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారన్న కథనాలు రెండు వారాల క్రితం ఆశలు మోసులెత్తించాయి. ప్రధాన ప్రతిబంధకంగా భావిస్తున్న 170 (3) కింద పేర్కొన్న నిబంధనలు ఏపీ, తెలంగాణలకు వర్తించబోవంటూ రాజ్యాంగ సవరణ చేసేందుకు అవసరమైన దస్త్రాన్ని న్యాయశాఖ ఇప్పటికే సిద్ధపరచిందంటున్నారు. దేశంలో మొట్టమొదటి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆవిర్భవించిన రాష్ట్రాన్ని రెండుగా పునర్ వ్యవస్థీకరించే క్రతువు అన్ని పార్టీల అంగీకారంతోనే పట్టాలకు ఎక్కింది. విభజన చట్టం కల్పిస్తున్న వెసులుబాటు ప్రకారం ఏపీ, తెలంగాణల్లో ఇప్పుడున్న మొత్తం శాసనసభ స్థానాలను 378కి పెంచడమన్నది- నియోజకవర్గాల్లో సమాన జనాభా ఉండాలన్న 170 (2) అధికరణ స్ఫూర్తికి అనుగుణమైందే తప్ప అతిక్రమణ కాబోదు. స్వీయసమ్మతితో సాకారమైన పునర్వ్యవస్థీకరణ దరిమిలా, అందుకు వీలుకల్పించిన చట్టనిబంధనల్ని వమ్ము కానివ్వకుండా కాచుకోవాల్సిన నైతిక బాధ్యత పార్టీలన్నింటిపైనా ఉంది. సాంకేతికంగా రాజ్యాంగ సవరణ అత్యావశ్యకమైతే- కేంద్రమే చొరవచూపి సకల పక్షాల తోడ్పాటుతో, విభజన చట్టం ఇచ్చిన హామీల్ని అక్షరాలా నెరవేర్చాలి!

# దోమల దండు యాత్ర!




కొలంబో (శ్రీలంక)లో దోమలపై సైనిక యుద్ధం

'దోమలపై పరిశోధనకు అనువైన దేశం భారత్' అని సర్ రొనాల్డ్ రాస్ ప్రకటించి ఇప్పటికి నూట పాతికేళ్లు! మలేరియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమల గురించి శాస్త్రీయ పరిశోధన సాగించి, నోబెల్ పురస్కారం సాధించిన శాస్త్రవేత్త ఆయన. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో 'ఇండియన్ మెడికల్ సర్వీస్' ఉన్నతాధికారిగానూ పనిచేసిన రాస్ దృష్టిలో- దోమల నిర్మూలన అసాధ్యం కాదు. ప్రభుత్వం, పౌరసమాజం తమ వంతు బాధ్యతల్ని సమర్థంగా నిర్వహిస్తే; దోమల సంతును మట్టుపెట్టడం ద్వారా ఏ దేశమైనా వ్యాధి విముక్తం కావచ్చు. మనదేశంతోపాటు ప్రపంచంలోని 122 దేశాల్లో దాదాపు 362 కోట్లమందికి మలేరియాతోపాటు డెంగీ, స్వైన్‌ఫ్లూ వ్యాధుల పెనుముప్పు పొంచి ఉంది. వీటి వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా, ప్రభుత్వాలకు ఆర్థికంగా కలిగే కష్టనష్టాలు అపారం. పరిస్థితి తీవ్రతను బట్టి సకాల చర్యలు చేపట్టి, దోమల్ని నిర్మూలించిన దేశాలు మన పొరుగునే ఉన్నాయి. అదే ఇండియాలో- బహుకొద్ది ప్రాంతాలు తప్ప, దాదాపు అన్ని రాష్ట్రాల్నీ దోమకాటు పీడిస్తోంది. నీరు నిల్వ ఉండే చెరువులు, మురుగునీటి కాలువలు; వ్యర్థాలు, ఇతరత్రా చెత్తాచెదారం పోగుపడిన ప్రాంతాలన్నీ దోమలకు మూలకేంద్రాలు. వాటిని సంహరించాలంటే 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తిగా వైద్య ఆరోగ్య శాఖతో పాటు పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమం, గ్రామీణ నీటిపారుదల వంటి ఎనిమిది ప్రభుత్వ విభాగాలు యుద్ధప్రాతిపదికన పనిచేయాలి. ఊరూవాడా దోమల మందు చల్లే కార్యక్రమం వర్షకాలానికి ముందుగానే పూర్తికావాలి. జులై దాటినా ఎవరికీ ఏదీ పట్టడం లేదంటే, ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాక మరేమిటి?

### ముందస్తు చర్యలేవీ?

మూడు రకాల దోమల కారణంగా, మలేరియా సహా ఆరు ప్రాణాంతక వ్యాధులు దాపురిస్తున్నాయి. ఏడాది వ్యవధిలోనే ప్రపంచదేశాల్లో 4.3 లక్షలమంది; మనదేశంలో పాతికవేల మందికిపైగా మలేరియాతో ప్రాణాలు కోల్పోయారు. దేశదేశాల్లో గరిష్ఠంగా పది కోట్లమంది డెంగీతో తల్లడిల్లుతున్నారని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడించింది. భారత్‌కు సంబంధించి, డెంగీ వ్యాధి కేసులు ఏడేళ్లలో మూడు రెట్లు పెరిగాయని సాక్షాత్తు కేంద్ర ఆరోగ్య సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రకటించింది. దేశంలో ఏటా కనీసం లక్షమందిని బాధించే సాధారణ ఫ్లూతో పోల్చి చూసినప్పుడు, స్వైన్‌ఫ్లూ తాకిడి పదింతలు పైగా ఉంటుందని భారతీయ వైద్యమండలి నిర్ధారించింది. లిక్విడ్, కాయిల్స్ వంటి నివారణ సాధనాలకు దోమలు అంత తొందరగా లొంగవని వాషింగ్టన్ విశ్వవిద్యాలయం, కాలిఫోర్నియా సాంకేతిక విద్యాసంస్థ సంయుక్త పరిశోధనలో తేలింది. కేవలం డీడీటీ వంటి క్రిమిసంహారక మందులు చల్లడం, పొగమందు పిచికారీ (ఫాగింగ్)తోనే పరిస్థితి పూర్తిగా అదుపులోకి రాదనీ స్పష్టమైంది. హైదరాబాద్ వేదికగా గతంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు- దోమకాటుకు సంబంధించిన ప్లాస్మోడియా వైరస్ వ్యాప్తిపై చర్చించింది. దాన్ని అంతరింపజేసే మందును కనుగొనేంత వరకు, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వాలు ఇతర విధానాలు పాటించాలనీ సూచించింది. అటువంటి సలహాల్ని ఏళ్లతరబడి పెడచెవిన పెట్టిన ఫలితమే ఇదంతా! సాధారణ మందులకు లొంగని వైరస్- కాలం, ప్రాంతం, వాతావరణాలతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు వ్యాపిస్తోంది. వ్యాధినిరోధక శక్తి లేనివారిపై మళ్ళీమళ్ళీ విరుచుకుపడి చివరికి ఉసురుతీస్తోంది. డెంగీ సంపూర్ణ నివారణకు ఉపకరించే టీకా లేదా ఔషధం ఇప్పటి వరకు లేదు. ఈ పరిస్థితుల్లో ముందస్తు చర్యలపై దృష్టిపెట్టాలని, దేశంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం డెంగీ కేసుల వివరాలు నమోదుచేయాలని ఇది వరకే అన్ని రాష్ట్రాలనూ కేంద్రప్రభుత్వం ఆదేశించింది. అప్పట్లోనే స్పష్టమైన మార్గదర్శకాలు వెలువడినా, ఆ మేరకు పనులు ఇప్పటికీ కాకపోవడం పలు రాష్ట్రాల క్రియారాహిత్యానికి సూచిక.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో దాదాపు 2,500 ఉన్నప్పటికీ; నానా రకాల కొరతలు వాటి 'అస్వస్థత'కు కారణమవుతున్నాయి. అంటురోగాలతో ఊళ్లకు ఊళ్లే మంచంపట్టినా పట్టించుకొన్న నాథుడంటూ లేడు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసిబ్బంది కొరత, ఔషధాలకు కటకట, సంబంధిత శాఖల మధ్య సమన్వయ లేమి... ఇన్ని సమస్యల మధ్య ప్రజారోగ్య పరిరక్షణ ఇంకెక్కడ? అక్షరజ్ఞానంలో ముందుండే కేరళ ఆరోగ్య రంగంలో అట్టడుగుకు చేరింది. ఆ రాష్ట్రాన్ని డెంగీ పట్టిపీడించినా, మరికొన్ని వ్యాధులు-బాధలతో వేలాది ప్రజలు అల్లాడినా దిక్కూమొక్కూ లేకపోయింది. ఒడిశా, పశ్చిమ్ బంగ, కర్ణాటక, మహారాష్ట్ర, మరెన్నో రాష్ట్రాల్లో దోమల 'దండు యాత్రలు' అనేక కుటుంబాల్లో శోకాగ్నులు రగిలించాయి. నగరాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సరిగ్గా రెండేళ్ల క్రితం నిర్వహించిన సమగ్ర అధ్యయనం, దేశవ్యాప్తంగా 470పైగా నగరాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో వెల్లడించింది. పరిస్థితి అంత దుర్భరంగా ఉంటే, దోమల దండు ఊళ్లమీద పడక ఏం చేస్తాయి? వైరస్ పీడిత వ్యక్తి నుంచి శరవేగంతో ఇతరులకు వ్యాపించే స్వైన్‌ఫ్లూకు సంబంధించీ, వివిధ రాష్ట్రాల అధికార యంత్రాంగాల్లో




పడకేసిన ప్రజారోగ్యం

ఎటువంటి స్పందనా లేదు. ప్రచార పటాటోపమే కానీ, ప్రత్యేక వైద్యశిబిరాల ఏర్పాటు ఎక్కడా కనిపించలేదు. బాధితులకు ఉచితంగా అందాల్సిన ఔషధాలు కొన్ని బడా వైద్యశాలల పుణ్యమా అని రెక్కలొచ్చి ఎగిరిపోయాయి! ఇటువంటి వైఫల్యాల, లోటుపాట్ల తాకిడితో నిరంతరం సతమతమవుతున్న భారత్- సాటి దేశాల నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో ఉన్నాయి.

గతేడాది ప్రపంచ ఆరోగ్య నివేదిక ప్రకారం, పదిహేనేళ్లలో పదిహేడు దేశాలు మలేరియా నుంచి విముక్తమయ్యాయి. శ్రీలంక నిరుడే మలేరియా రహిత దేశంగా గుర్తింపు సాధించింది. అంతకుముందు సంవత్సరమే ఆ రికార్డును మాల్దీవులు సృష్టించింది. చైనా మరో మూడేళ్లకల్లా మలేరియాను పూర్తిగా తుడిచిపెడతానంటోంది. నేపాల్, భూటాన్ దేశాలూ ఆ బాటలోనే సాగుతామంటున్నాయి. ఇండియాతో పోలిస్తే, హంగరీ వంటి చిన్నదేశాలే ఎప్పుడో 45 ఏళ్ల క్రితమే మలేరియా కోరల నుంచి బయటపడ్డాయి. దోమల సంహారాన్ని ఓ ప్రజాఉద్యమంగా చేపట్టి ముందడుగు వేసింది క్యూబా. దోమలపై సమరం దరిమిలా మూడేళ్లుగా ఒక్క మలేరియా కేసైనా శ్రీలంకలో నమోదు కాలేదంటే, అక్కడి ప్రభుత్వం తీసుకున్న అనేక జాగ్రత్తలే కారణం. బాధితులకు మరెంతో ఉపకరించేలా విరివిగా ఆరోగ్య శిబిరాల్ని ఆ దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తాయి. ప్రధానంగా అందువల్లనే, 2000లో రెండు లక్షలకు పైగా ఉన్న మలేరియా కేసులు 12 ఏళ్ల తరవాత సున్నాకు చేరాయి. సంచార వైద్యకేంద్రాలు, సత్వర చికిత్సకు ఏర్పాట్లు, ఆరోగ్యవిద్యను విస్తరించే కృషి; వీటన్నింటికీ మించి ప్రభుత్వ నిబద్ధత, స్వచ్ఛంద సేవాసంస్థల సంపూర్ణ భాగస్వామ్యం శ్రీలంకను వ్యాధిరహితం చేశాయి. దోమల నిర్మూలనలో భాగంగా వినియోగించే డీడీటీ వంటి క్రిమిసంహారకాలు మనుషుల ఆరోగ్యంపై ప్రభావం కనబరుస్తున్నాయని ఆ దేశం నాలుగు దశాబ్దాలనాడే గ్రహించింది. ప్రత్యామ్నాయంగా మలాథియాన్ వంటి మందులపై చూపు సారించి అప్పట్లోనే సాంకేతిక విజ్ఞత చాటింది. శ్రీలంక 1990 ప్రాంతాల్లో ఒకేసారి రెండు భీకర యుద్ధాలు సాగించింది. రాజకీయంగా 'లిబరేషన్ టైగర్ల'తో ఒకవైపు, ఆరోగ్య రంగంలో దోమకాటుపై మరోవైపు పోరాడి నెగ్గింది. రసాయనిక పూత కలిగిన వలల్ని కార్యకర్తల ద్వారా ఇంటింటికీ అందజేశారు. ఇటువంటి వివిధ చర్యల ఫలితమే- ఆ దేశంలో దోమల నిర్మూలన!

### చిన్న దేశాల్ని చూసైనా...

ప్రసిద్ధ పర్యాటక ప్రదేశంగా పేరొందిన మాల్దీవులది అక్షరాలా మరో ఘనచరిత్ర! ఆదాయ మూలాల్ని దెబ్బతీసేలా, ప్రజారోగ్యాన్ని హరించేలా దాపురించిన దోమకాటును ఆ దేశం ఎంతో దీటుగా ఎదుర్కొంది. వేలాది సుశిక్షిత కార్యకర్తల్ని రంగంలోకి దించి, దోమల నిర్మూలన పనులు కొనసాగించి, అన్ని దేశాలకంటే ముందే వ్యాధి విముక్తమైంది. భూటాన్- ఇళ్ల వద్ద, పొలాల సమీపంలో, నీటి నిల్వ ప్రాంతాల చుట్టుపక్కల లార్వా నివారణ మందుల్ని అడుగడుగునా పిచికారి చేయించి దోమ సంతతిని అంతరింపజేస్తోంది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే ఈ తరుణంలో, మే మొదలు అక్టోబరు వరకు ఆరునెలలూ అక్కడ దోమల సంపూర్ణ నిర్మూలన కొనసాగుతుంది. దోమకాటు వ్యాధుల కారణంగా ప్రపంచ దేశాలు, ముఖ్యంగా భారత్‌పై పడుతున్న ఆర్థిక భారం ఇంతా అంతా కాదు. ఆ మొత్తం ఏటా మలేరియాకు సంబంధించి రూ.11,642 కోట్లు, డెంగీ విషయంలో అది రూ.6,020 కోట్లు.

తామరతంపరగా దోమలు పుట్టుకొచ్చే ప్రాంతాల్ని ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా కనిపెట్టాలన్న నిపుణుల ప్రతిపాదన నేటికీ ప్రభుత్వ దస్త్రాల్లో మగ్గుతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సేవల్ని వినియోగించుకోవడం ఇకనైనా సాకారం కావాలి. నిధులు గుమ్మరిస్తే తప్ప దోమల నిర్మూలన సాధ్యపడదన్నదీ సరైనది కాదు. ఇళ్ల లోపల, వెలుపల ప్రజలు తీసుకొనే జాగ్రత్తలే దోమల పనిపడతాయి. కొన్ని రకాల మొక్కల్ని పెంచితే, వాటి వాసనకు దోమలు ఆ పరిసరాలకైనా రావు. వేప, కొబ్బరి, నిమ్మ, యూకలిప్టస్ నూనెల వాడకం దోమల్ని దరి చేరనివ్వవని శాస్త్రపరిశోధనలు రుజువు చేస్తున్నాయి. చెరువుల్లోకి గంబూషియా చేపల్ని వదిలితే, లార్వా దశలోని దోమల్ని మటుమాయం చేస్తాయి. సెప్టిక్ ట్యాంకులకు గల పైపుల పైభాగంలో చిన్నపాటి వలలు బిగిస్తే, అంతకు మించిన దోమల విరుగుడు మరొకటి ఉండదు. కోడి ఈకలను రసాయనాలతో కలుపుతూ 'స్వీట్ కేకు'ను కర్ణాటకలోని మణిపాల్ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థులు ఈమధ్య రూపొందించారు. ఆ పదార్థం దోమల లార్వాను గణనీయంగా నియంత్రిస్తుందని చెబుతున్నారు. ఇలా అన్ని వైపులా, అనేక మార్గాల్లో ప్రభుత్వం, పౌరసమాజం జాగ్రత్తలు తీసుకుంటే; గట్టి చర్యలు చేపడితే దోమల నిర్మూలన కష్టతరమేమీ కాదు!


**– జంధ్యాల శరత్‌బాబు**

## మూఢ నమ్మకాలపై 'భార్గవాస్త్రం'

జీవి పుట్టుకనుంచి అంతమొందేవరకు వివిధ పరిణామ దశలను శాస్త్రీయంగా విడమరచగలిగిన శాస్త్రవేత్తలు సైతం సృష్టికర్త అజ్ఞాతంగా ఉన్నాడని విశ్వసిస్తున్నారు. పిండోత్పత్తి దశనుంచి మరణం దాకా మనిషి పుట్టుకను వివరించగలిగే డాక్టర్లు తమ హృదయాల్లో దేవుడి రూపాలను ప్రతిష్ఠించుకుని పనిచేస్తున్న వాతావరణం కనిపిస్తోంది. శాస్త్రవేత్తలు, వైద్యుల స్థాయిలోనే ఈ తరహా అహేతుకత రాజ్యమేలుతున్నప్పుడు- ఇక విజ్ఞాన శాస్త్రం అంటే సామాన్యులకు అంతుపట్టకపోవడంలో ఆశ్చర్యం లేదు. దీన్నిబట్టి శాస్త్ర పరిజ్ఞానం ఉన్నవారందరూ నిత్యజీవితంలో శాస్త్రీయంగా వ్యవహరించరని, మూఢ నమ్మకాలు వదులుకోరని బోధపడుతుంది. శాస్త్ర జ్ఞానం వేరు, అవగాహన వేరు! ఈ రెండూ ఉన్నవారికి శాస్త్రీయ స్ఫూర్తి ఉండితీరుతుందన్న హామీ ఏమీ లేదు. శాస్త్రీయ అవగాహన లేదా దృక్కోణం అన్న పదాలకు ప్రత్యామ్నాయంగా పండిత జవహర్‌లాల్ నెహ్రూ 'శాస్త్రీయ స్ఫూర్తి' అన్న మాటను వెలికితీసుకురావడంలో ఉద్దేశం ఇదే. శాస్త్రవిద్య అభ్యసిస్తే తప్ప శాస్త్రీయ అవగాహన పట్టుబడకపోవచ్చు. హేతుబద్ధంగా ఆలోచించగలిగినవారు శాస్త్రీయ స్ఫూర్తితో వ్యవహరించడం సాధ్యమే.

### తిరుగులేని నిబద్ధత

పుష్ప మిత్ర భార్గవ దాదాపు ఏడు దశాబ్దాలపాటు ప్రజల్లో శాస్త్రీయ స్ఫూర్తి రేకెత్తించడంకోసమే కోసమే గట్టి కృషి చేశారు. ఇందుకోసం ఆయన శాస్త్రవేత్తలు, నాయకులు, ప్రభుత్వాలతో నిరంతర పోరాటం కొనసాగించారు. శాస్త్రజ్ఞానం ఉన్నవారు శాస్త్రీయ స్ఫూర్తితో మెలగాల్సిన అవసరం ఏమిటో నొక్కిచెప్పడానికి శ్రమించారు. శాస్త్రజ్ఞానం ఉన్నంత మాత్రాన సరిపోదు- ఆ జ్ఞానానికి, ఆచరణకు మధ్య పొంతన ఉండాలి! రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో 1928 ఫిబ్రవరి 22న భార్గవ ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి వైద్యుడు. భార్గవకు తొమ్మిదేళ్లు ఉన్నప్పుడు ఆయన కుటుంబం వారణాసికి మకాం మార్చింది. అక్కడ పదేళ్ల వయసున్న భార్గవను మొట్టమొదటిసారి బిసెంట్ థియొసాఫికల్ పాఠశాలలో తొమ్మిదో తరగతిలో చేర్పించారు. క్వీన్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్య పూర్తిచేశారు. 16వ ఏట ఆయన పట్టభద్రుడయ్యారు. 1946లో ఎమ్మెస్సీ, 21వ ఏట పీహెచ్‌డీ పూర్తి చేశారు. పీహెచ్‌డీ పరిశోధనతోనే ఆయన శాస్త్ర పరిశోధన ప్రారంభమైంది. తరవాత 1950నుంచి 1953దాకా హైదరాబాద్‌లోని సెంట్రల్ 'లేబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్'లో పనిచేశారు. ఇప్పుడు ఆ సంస్థను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) అంటున్నారు. ఆ తరవాత కొంతకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పనిచేసి అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో క్యాన్సర్ వ్యాధిపై పరిశోధన చేశారు. ఆపై యూకేలోని జాతీయ వైద్య పరిశోధన మండలిలో చేరారు. అప్పుడే తన పరిశోధన రంగాన్ని రసాయన శాస్త్రంనుంచి జీవశాస్త్రానికి మార్చుకున్నారు. 1958లో హైదరాబాద్ తిరిగి వచ్చి, సెంట్రల్ లేబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లోనే మళ్ళీ చేరారు. అప్పటికే ఆ సంస్థను సీఎస్ఆర్ స్వాధీనం చేసుకుంది. అప్పుడు దాన్ని రీజనల్ రీసెర్చ్ లేబొరేటరీ అనేవారు. ఇప్పుడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ రీసెర్చ్ అంటున్నారు. ఆయన 50 దేశాల్లో పర్యటించారు. భారత్‌లో జీవశాస్త్ర; ముఖ్యంగా కణ సంబంధ, అణుసంబంధ జీవశాస్త్ర పరిశోధనలో అగ్రగామిగా నిలిచి ఆ రంగంలో శాస్త్ర పరిశోధనలకు అంతర్జాతీయ కీర్తి రావడానికి కారకులయ్యారు. 1977లో హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నెలకొల్పి దానికి వ్యవస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు.



పి.ఎం. భార్గవ (1928 - 2017)

శాస్త్ర పరిశోధన జన జీవితంతో ముడివడి ఉండాలన్నది భార్గవ దృక్పథం. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రభుత్వ విధానాలు లోపభూయిష్ఠమైనవని భావిస్తే వాటిని గట్టిగా వ్యతిరేకించడం భార్గవ తత్వం. జన్యుమార్పిడి వంగడాలపై నేటికీ సమగ్ర పరిశోధనలు పూర్తికాలేదు కాబట్టి ఆ పంటలను అనుమతించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే బయో టెక్నాలజీ అథారిటీ బిల్లునూ నిరసించారు. ఈ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమైందని, అనైతికమైందని, అశాస్త్రీయమైందని, పరస్పర విరుద్ధమైందని, ప్రజానుకూలమైంది కాదని వాదించారు. శాస్త్ర, పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్)లో అయ్యదురై అనే భారత సంతతికి చెందిన అమెరికా శాస్త్రవేత్త రూపొందించిన నివేదికను తిరస్కరించడమే కాకుండా ఆయనను ఉద్యోగం నుంచి తొలగించినప్పుడు- అండగా నిలిచిన ఏకైక శాస్త్రవేత్త భార్గవ. ఈ విషయంపై భార్గవ అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు లేఖ కూడా రాశారు. సీఎస్ఐఆర్ నిర్వహణలో బాధ్యత వహిస్తున్నవారిని విమర్శిస్తూ నివేదిక తయారు చేసినందుకే అయ్యదురైపై వేటు వేశారు.

జీవిత కాలమంతా భార్గవ విజ్ఞాన శాస్త్రాన్ని, హేతువాద దృక్పథాన్ని ప్రచారం చేయడానికి- వాటిని ప్రజలకు చేరువలోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేశారు. మూఢనమ్మకాలను శక్తిమేర వ్యతిరేకించారు. ఎవరూ అద్భుతాలు సృష్టించలేరని అనేక సందర్భాల్లో సశాస్త్రీయంగా నిరూపించారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పౌరుల ప్రాథమిక విధుల్లో 'శాస్త్రీయ స్ఫూర్తి'ని 51ఎ(హెచ్) అధికరణంలో చేర్పించడంలో భార్గవ కీలక పాత్ర పోషించారు. శాస్త్రీయ స్ఫూర్తి ప్రాధాన్యాన్ని తెలియజెప్పడానికి 1981లో ఉదారవాదులు, నిబద్ధతగల ప్రముఖులు కొంతమంది శాస్త్రీయ స్ఫూర్తిపై ప్రకటన విడుదల చేయడం వెనకా భార్గవ ప్రయత్నమే ప్రధానమైంది. ఆ ప్రకటనపై విస్తృత చర్చ జరగడమే కాక, శాస్త్రవేత్తలు సమర్పించే పత్రాల్లో పదేపదే అది ప్రస్తావనకు వస్తూ ఉంటుంది. సతీశ్ ధావన్, అబ్దుర్ రహమాన్ వంటివారితో కలిసి శాస్త్రీయ స్ఫూర్తిని పెంపొందించడం కోసం 1964లో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయడంలో కూడా భార్గవ కృషి ప్రధానమైంది.

### నిరంతర అధ్యయనశీలి

శాస్త్రవేత్తగా భార్గవ పరిశోధనలు ప్రారంభించిన తరుణంలోనే నెహ్రూ దేశ ప్రధానమంత్రి అయ్యారు. ఆ సమయంలో భార్గవ భారత శాస్త్ర రంగంలో పనిచేసేవారి సంఘం ఏర్పాటు చేశారు. ఇది కార్మిక సంఘంగా నమోదైంది. సాక్షాత్తు నెహ్రూ ఆ సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నారు. స్వయంగా దేశ ప్రధాని ఓ కార్మిక సంఘానికి అధ్యక్షుడిగా ఉండటం అదే మొదటిసారి, ఆఖరిసారి! ఉద్యోగ విరమణ తరవాత గడచిన రెండు దశాబ్దాలుగా భార్గవ క్రియాశీల పరిశోధనలేమీ చేయకపోయినా, విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన విధానాలన్నింటినీ పరిశీలిస్తూనే ఉండేవారు. అవసరమైనప్పుడు వ్యతిరేకించడానికి వెనకాడలేదు. నిర్హేతుకత, మూఢనమ్మకాలకు వ్యతిరేక పోరాటాన్ని ఆపకపోవడం వెనక ఆయన భవిష్యత్ దృష్టే ప్రధాన కారణం. 'మాలిక్యులర్ బయాలజీ'ని మన దేశానికి తీసుకొచ్చిందే ఆయన! 'జెనెటిక్ ఇంజినీరింగ్' అన్నమాటకు అస్తిత్వం కల్పించి 1973నుంచి దాన్ని ప్రచారంలో పెట్టారు. 2013నాటి అద్దె గర్భాల (నియంత్రణ) బిల్లు రూపొందించడానికి ఆయన 15 ఏళ్ల పాటు శ్రమించి ప్రజా ప్రతినిధులు, విధాన రూపకర్తల మద్దతు సమీకరించారు. అద్దె గర్భాల విధానాన్ని నిషేధించడాన్ని వ్యతిరేకించారు. అద్దెకు గర్భం దాల్చే తల్లులకు హక్కులు కల్పించాలని పోరాడారు. సామాజిక సమస్యలు, ప్రధానంగా సమాజంపై విజ్ఞానశాస్త్ర ప్రభావానికి సంబంధించిన సమస్యలు తలెత్తిన ప్రతిసారీ భార్గవ గొంతు విప్పేవారు. క్యాన్సర్ వ్యాధి చికిత్సకోసం 'ఫ్లూరొరాసిల్' ఔషధ ఆవిష్కరణలో భార్గవ పాత్ర కీలకమైంది. దీంతోపాటు జన్యువు, జన్యుశాస్త్రం, జీవ పరిణామం, కణ సంబంధ జీవశాస్త్ర పరిశోధనల్లో ఆయన అంతర్జాతీయ కీర్తినార్జించారు. కుహనా విజ్ఞానశాస్త్రవేత్తలతో ఆయన పోరాటం అనితర సాధ్యమైంది!

**– ఆర్వీ రామారావ్**

## ఉత్సాహం

ఉత్సాహమే మనిషికి మూలం. అదే అతడికి అసలైన బలం. ఉత్సాహం లేనప్పుడు ఏ పనులూ నెరవేరవు.

ఉత్సాహంతో చేసిన ఏ పనైనా తప్పకుండా ఫలవంతమవుతుంది. అందుకే ఉత్సాహవంతుడికి లోకంలో అసాధ్యమైనదేదీ ఉండదంటారు పెద్దలు.


ఎన్ని ప్రయాసలకైనా ఓర్చుకోవడం, తలపెట్టిన కార్యాన్ని ఉద్యమస్ఫూర్తితో సాధించేందుకు ప్రయత్నించడమే ఉత్సాహం. అది మనిషికి ధైర్యమిస్తుంది. నిరంతర ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఆలంబనగా నిలుస్తుంది.

ఉత్సాహాన్ని వీర రసానికి స్థాయీభావంగా చెబుతారు. వీరం అంటే, రణం లేదా యుద్ధం చేయడం కాదు. ఏ పనినైనా ఉత్సాహంతో చేస్తే, అది వీరత్వమే అనిపించుకుంటుంది. అందుకే వీర రసాన్ని దానవీరం, దయావీరం, ధర్మవీరం, యుద్ధవీరం అని నాలుగు విధాలుగా విభజించారు. దానవీరానికి కర్ణుడు, దయావీరానికి శిబి చక్రవర్తి, జీమూత వాహనుడు; ధర్మవీరానికి శ్రీరాముడు, ధర్మరాజు; యుద్ధవీరానికి అర్జునుడు, భీముడు ప్రతినిధులుగా నిలుస్తారు. 'రస గంగాధరం' కర్త జగన్నాథ పండితుడు సత్యవాక్కు పట్ల హరిశ్చంద్రుడు కనబరచిన ఉత్సాహాన్ని 'సత్యవీరం'గా వర్ణించాడు.

బుద్ధిమంతుడు సర్వకాల సర్వావస్థల్లోనూ ఉత్సాహశక్తి కలిగి ఉండాలని రామాయణం బోధిస్తుంది. సీతావియోగ భారంతో కుములుతున్న రాముడు- ఆమె జాడ తెలుసుకోవడం ఎలా అని విచారిస్తుంటాడు. అప్పుడు లక్ష్మణుడు 'ఉత్సాహవంతులు ఎన్నటికీ దీనస్థితి పొందరు, కుంగిపోరు. ఉత్సాహవంతుడే నిజమైన బలవంతుడు. ఉత్సాహాన్ని మించిన బలం మరేదీ లేదు. మనమూ అదే నిబ్బరంతో అన్వేషణ సాగిద్దాం' అని సోదరుణ్ని ఉత్సాహపరుస్తాడు.

నిరుత్సాహమే మనిషికి ప్రధాన శత్రువు. నిర్వేదం ఎంతటి వారినైనా లొంగదీసుకుంటుంది. అన్నివిధాలా కుంగదీస్తుంది. కార్యసిద్ధి కలగాలన్నా, సుఖంగా మనుగడ సాగించాలన్నా మనిషి ఎటువంటి నిరాశనూ మనసులోకి రానివ్వకూడదు.

ధీరోదాత్తుడైన హనుమంతుడు- ధర్మాన్ని అనుసరించే క్రమంలో ఏ సందర్భంలోనూ నిర్వేదానికి లోనుకాలేదు. ఉత్సాహమే అన్ని సంపదలకూ మూలమని ఆయన భావించాడు. మహోత్సాహం పరమ సుఖమని, అదే సర్వార్థ సాధకమని విశ్వసించి, చేపట్టిన ప్రతి పనినీ విజయవంతంగా పూర్తిచేశాడు.



అంతర్యామి

నిరుత్సాహం వల్ల ఎన్ని పనులైనా నీరుకారిపోతాయి. మరికొన్ని మధ్యలోనే ఆగిపోతాయి. అందుకే ఎవరైనా ఏ పనైనా ప్రారంభిస్తే, అవిశ్రాంతంగా శ్రమించాలి. కార్యసాధన కోసం పోరాడాలి. నిస్సత్తువ ప్రవేశించినా- తేరుకొని కార్యోన్ముఖం కావాలి.

విశ్వామిత్రుడు రాజర్షి నుంచి బ్రహ్మర్షి కావడానికి ఎన్నో ప్రయాసలకోర్చాడు. కఠోర తపస్సు చేశాడు. ఉత్సాహం, పట్టుదల వల్లనే అతడు కడకు బ్రహ్మర్షి కాగలిగాడు.

ఏ విజయానికైనా మూలం ఉత్సాహ బలం. ఆ శక్తి- ధైర్యం వల్ల కలుగుతుంది. ఆ ధైర్యం ధర్మాచరణ వల్లనే సిద్ధిస్తుంది. మనిషి ఉత్సాహాన్ని సత్కార్య సాధన కోసమే వినియోగించాలి. కౌరవులు రాజ్యకాంక్షతో అధర్మ మార్గాన్ని అవలంబించారు. చివరికి పతనమయ్యారు. పాండవులు ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా తట్టుకొని నిలిచారు. ధర్మోత్సాహం ప్రదర్శించి ఘనవిజయం సాధించారు.

చతుర్విధ పురుషార్థాల్లో మొదటిదైన ధర్మంపై, చివరిదైన మోక్షంపై మానవుడు దృష్టి నిలపాలని భారతీయ వేదాంతం బోధిస్తోంది. అర్థం, కామం మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోతాయి. ధర్మమే చివరివరకు ఉంటుంది. మనిషిని రక్షిస్తుంది. జీవితం సుఖమయంగా కొనసాగడానికి ధనార్జన అవసరం. అలా అని మితిమీరిన ఉత్సాహం చూపకూడదు. అధర్మ మార్గంలో ప్రయాణించకూడదు. ధనార్జన న్యాయమార్గంలోనే సాగాలి.

ప్రతి మనిషీ మానవతా విలువల్ని కాపాడుతూ, ధర్మోత్సాహంతో ముందడుగు వేయాలి. అప్పుడే సమాజానికి శ్రేయస్సు చేకూరుతుంది. ఉత్సాహ మార్గాన్ని అనుసరించినప్పుడే, మనిషికైనా జాతికైనా పురోగతి!

**– విశ్వనాథ రమ**

# ఊహాలకు రెక్కలు తొడిగి..!

- ఆక్టోకాప్టర్‌ను రూపొందించిన పాఠశాల విద్యార్థులు
- మనిషిని మోసుకెళ్లే డ్రోన్ సిద్ధం..!

మాదాపూర్ - న్యూస్‌టుడే

ఆ విద్యార్థులు ఊహలకు రెక్కలు తొడిగారు.. సృజనకు ప్రాణం పోశారు.. అద్భుతాన్ని సృష్టించారు. 10 నెలల శ్రమతో దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏకంగా 70 కిలోల మనిషిని మోసుకెళ్లే ఎగిరే డ్రోన్‌ను తయారు చేశారు. 8 భుజాలు కలిగిన ఈ డ్రోన్‌కు 'ఆక్టోకాప్టర్' అని పేరు పెట్టారు. బుధవారం సాయంత్రం ఈ ఆక్టోకాప్టర్‌పై 70 కేజీల బరువున్న మనిషి బొమ్మను ఉంచి విజయవంతంగా ఆకాశయానం చేయించారు. అద్భుతమైన ఈ ప్రయోగానికి కొండాపూర్‌లోని చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికైంది. ఇక్కడ 12వ తరగతి చదువుతున్న వినయ్ కనుమూరి, వినీత్ అలపర్తి, అమోగ్, ఆదిత్య మద్దుకూరి సంయుక్తంగా ఈ ఆక్టోకాప్టర్‌ను రూపొందించారు.

### గత అక్టోబరు నుంచి...

విద్యార్థులను ప్రయోగాలు, పరిశోధనల వైపు ప్రోత్సహించేందుకు పాఠశాలలో ఫిజిక్స్, ఇంజినీరింగ్ క్లబ్ ఏర్పాటుచేశారు. అందులో సభ్యులైన నలుగురు విద్యార్థులు తమ ఆలోచనలకు కార్యరూపమిచ్చి ఆక్టోకాప్టర్‌ను తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. పాఠశాల యాజమాన్యం అవసరమైన ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చింది. దీంతో ఉపాధ్యాయుల సహకారంతో గత ఏడాది అక్టోబర్‌లో ప్రయోగం మొదలు పెట్టారు. నగరంలోని బాలానగర్, రాణిగంజ్, బేగంబజార్, నాంపల్లి తదితర ప్రాంతాల్లో అవసరమైన పరికరాలు సేకరించారు. కీలకమైన పలు పరికరాల గురించి అంతర్జాలంలో శోధించి వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు.





గాలిలో ఎగురుతున్న 'ఆక్టోకాప్టర్' డ్రోన్ ★ మనిషిని మోసుకెళ్లే 'ఆక్టోకాప్టర్' డ్రోన్‌ను రూపొందించిన హైదరాబాద్‌లోని చిరెక్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు. చిత్రంలో ఉపాధ్యాయులు

### రూ. 8 లక్షల వ్యయంతో..

ఆక్టోకాప్టర్‌ను తయారు చేసేందుకు రూ.8 లక్షలు ఖర్చయ్యాయి. ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్లు, బ్యాటరీలు, డీసీ మోటార్లు, అత్యాధునిక రెక్కలను వాడారు. కీలకమైన బ్యాటరీలను హాంకాంగ్ నుంచి, ఫ్లైట్ కంట్రోలర్‌ను ఇంగ్లాండ్ నుంచి తెప్పించారు. మొత్తం 16 బ్యాటరీలు, అల్యూమినియం భుజాలు, పవర్ టూల్స్‌తో రూపొందించారు. వీరికి పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం ఏరోస్పేస్ ఇంజినీరింగ్ చదువుతున్న సహెవాన్ తనేజ, సూర్య తనేజ సహకారం అందించారు.

### బహుళ ప్రయోజనం...

బహుళ ప్రయోజనాలకు ఉపయోగించగలిగిన ఈ ఆక్టోకాప్టర్ 70 కిలోల బరువును మోస్తుంది. 50 నుంచి 100 అడుగుల ఎత్తున గాల్లోకి వెళ్లే సామర్థ్యముంది. వ్యవసాయ క్షేత్రంలో పంటలకు ఎరువులు, పురుగు మందులు వెదజల్లేందుకు ఉపయోగించవచ్చు. సినిమాల చిత్రీకరణకు ప్రస్తుతం డ్రోన్‌లపై చిన్న కెమెరాలు మాత్రమే ఏర్పాటు చేసే వీలుందనీ, ఆక్టోకాప్టర్‌తో 70 కిలోల బరువున్న కెమెరాలు అమర్చి చిత్రీకరించవచ్చని విద్యార్థులు పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా బాధితుల్ని రక్షించేందుకు, రక్షణ శాఖలో సైతం ఉపయోగించుకునే వీలుంటుందని చెప్పారు. చట్టపరమైన అనుమతులు వచ్చిన తర్వాత ఆక్టోకాప్టర్‌పై మనిషిని కూర్చోబెట్టి ప్రయోగించేందుకు అవకాశం ఉంటుందని చిరెక్ పాఠశాల వైస్ ప్రిన్సిపాల వెంకట్‌రమణ తెలిపారు. దీని డిజైన్‌కు సంబంధించిన పేటెంట్ హక్కులు సైతం పొందేందుకు యత్నిస్తున్నట్లు చెప్పారు.

### స్ఫూర్తిగా నిలవాలని..

11 తరగతి చదువుతున్నపుడే మేము ఈ ప్రయోగం ప్రారంభించాం. మా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందించిన సహకారంతో విజయం సాధించాం. పది నెలల్లో మాకు లభించిన ఖాళీ సమయాన్ని ఈ ప్రయోగానికి కేటాయించాం. మేము రూపొందించిన యంత్రాన్ని చూసి అందరూ అభినందిస్తుండడంతో గర్వంగా ఉంది. ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలనే ఆలోచనతో దీన్ని రూపొందించాం.

**- అమోగ్, 12వ తరగతి**

### కలిసి పనిచేశాం

నలుగురం కలిసి ఈ ప్రయోగం కోసం పనిచేశాం. దీంతో మాకు సైన్స్, ఇంజినీరింగ్ పట్ల మరింత ఆసక్తి పెరిగింది. అంకితభావంతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని ఈ ప్రయోగంతో మాకు అనుభవ పూర్వకంగా తెలిసింది.

**- ఆదిత్య, విద్యార్థి**

### ప్రోత్సాహం అందిస్తే..

విద్యార్థుల ఆసక్తిని గమనించి తగిన ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారు. అందుకు నిదర్శనం ఈ ఆక్టోకాప్టర్. నలుగురు విద్యార్థులు తమ ఆలోచనను మాతో పంచుకున్నప్పుడే ఎంతో అద్భుతంగా అనిపించింది. ఈ ప్రయోగ క్రమంలో విద్యార్థులు నిరుత్సాహమన్నదే ఎరుగక ముందుకు సాగారు. అందుకే వారి ఆలోచన కార్యరూపం దాల్చింది.

**- సుజాతరమేష్, భౌతికశాస్త్రం ఉపాధ్యాయురాలు**



## అరుదైన పాము

అరుదైన కాలర్ వుల్ఫ్ రకం పామును హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాలకు బుధవారం తరలించారు. రెండురోజుల కిందట జూపార్కు సమీపంలోని ఓ మసీదు ముందు కనిపించిన 40 సెంటీమీటర్లున్న ఈ పిల్ల పామును జంతు సంరక్షకులు ప్రభాకర్, సుభాష్, సిబ్బంది పట్టుకున్నారు. తల ప్రాంతంలో పసుపురంగు, మిగతా భాగం చాక్లెట్ రంగులో ఉన్న ఈ పాము కీటకాలను తినే విషరహిత సర్పమని జూ అధికారులు తెలిపారు. చిత్తూరు, కోయంబత్తూరు, కర్ణాటకలో వీటి ఉనికి ఉంది. 2007లో మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలోని సంగెపల్లి తండాలో ఈ పాము కనిపించిందని క్యూరేటరు శివానిడోగ్రా చెప్పారు.

**- న్యూస్‌టుడే, హైదరాబాద్**

# కొనసాగుతోన్న బదిలీల కౌన్సెలింగ్!

- షెడ్యూల్ ముగిసినా.. 4 జిల్లాల్లో పూర్తికాని ప్రక్రియ
- ఇప్పటివరకు బదిలీ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు 55,363 మందే
- రెమెడియల్ తరగతులపై ప్రభావం

**ఈనాడు, అమరావతి:** ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. షెడ్యూల్ ప్రకారం జులై 31తో ముగియాల్సి ఉండగా బుధవారం నాటికి ఏడు జిల్లాలోనే పూర్తయింది. గుంటూరు, కృష్ణా, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల్లో ఇంకా కొనసాగుతూనే ఉంది. శుక్రవారానికల్లా ఈ జిల్లాల్లో కౌన్సెలింగ్ పూర్తవుతుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో మంగళవారం నుంచి హేతుబద్ధీకరణ, బదిలీల ప్రక్రియ చేపట్టారు. నిబంధనల ప్రకారం ఆగస్టు ఒకటిన కొత్త పాఠశాలల్లో చేరాల్సి ఉండగా..ఇదెక్కడా జరగలేదు. రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరిగా బదిలీ కావాల్సినవారు 59,970 మంది ఉపాధ్యాయులుండగా.. ఇప్పటి వరకు 55,363 మందిని బదిలీ చేశారు. అధికారుల లెక్కల ప్రకారమే తప్పక బదిలీ కావాల్సిన 4,607 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 1,05,957 మంది దరఖాస్తు చేయగా ఇందులో 8,643 మంది గైర్హాజరయ్యారు. 13,461 మంది పాతపోస్టుల్లోనే కొనసాగించేందుకు అంగీకారం తెలిపారు.

| పోస్టులు | దరఖాస్తులు | తప్పనిసరి బదిలీ | వినతి | బదిలీ |
|---|---|---|---|---|
| ప్రధానోపాధ్యాయులు గ్రేడ్-2 | 1966 | 338 | 1628 | 1038 |
| పాఠశాల సహాయకులు(భాష) | 11925 | 7013 | 4912 | 7480 |
| పాఠశాల సహాయకులు | 29649 | 19192 | 10457 | 17829 |
| పీఎస్ హెచ్‌ఎంలు | 2157 | 313 | 1844 | 951 |
| పీఈటీలు | 2541 | 1876 | 665 | 955 |
| భాషాపండితులు | 7924 | 5142 | 2782 | 3869 |
| ఎస్జీటీలు | 49795 | 26096 | 23699 | 23241 |

**ప్రత్యేక తరగతుల్లో జాప్యం:** షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయుల బదిలీలు జరగకపోవడంతో పాఠశాలల్లో ప్రారంభం కావాల్సిన రెమెడియల్ తరగతులు వాయిదా పడుతున్నాయి. చదవడం, రాయడం, గణితంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలి. గణితంతో భాగహారాలు, గుణకారాలు, తెలుగు, ఆంగ్లం రాయడం, చదవడం వంటివి విద్యార్థులకు నేర్పించాలి. బదిలీలు పూర్తికాకపోవడంతో చాలామంది ఉపాధ్యాయులు కొత్త బడులకు వెళ్లలేదు. దీంతో ఈ కార్యక్రమం అమల్లో జాప్యం ఏర్పడింది.

# సూత్రధారీ.. పాత్రధారీ విక్రమ్ గౌడే!

- కాల్పులు వాస్తవం... హత్యాయత్నం నాటకం
- నియోజకవర్గ ప్రజల సానుభూతి కోసం హైడ్రామా
- తనపై తుపాకీతో కాల్చాలంటూ రూ.50 లక్షలకు ఒప్పందం
- ఆరుగురి అరెస్ట్

ఈనాడు - హైదరాబాద్


బాబూజాన్


గోవిందరెడ్డి


నందకుమార్


రయీస్‌ఖాన్


షేక్ అహ్మద్


విక్రమ్‌గౌడ్

మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్‌పై జరిగిన కాల్పుల మిస్టరీని పోలీసులు ఛేదించారు. విక్రమ్‌గౌడే నియోజకవర్గ ప్రజల సానుభూతి కోసం ఈ నాటకమాడాడని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు, అక్రమంగా ఆయుధాన్ని కలిగి, దాన్ని ఉపయోగించినందుకు విక్రమ్‌గౌడ్‌తో సహా ఆరుగురు నిందితులు ఎస్.నందకుమార్, షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్, కోకంటి బాబూజాన్ ఎ.గోవింద్‌రెడ్డిను అరెస్ట్‌చేశామని, ప్రస్తుతం విక్రమ్ గౌడ్ ఆసుపత్రిలో ఉన్నందున కోలుకున్నాక అతడిని అరెస్ట్ చేస్తామని వివరించారు. ఈ నేరంలో భాగస్వాములైన వెంకటరమణ అలియాస్ చిన్నా, గౌస్‌లు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీచేయాలన్న లక్ష్యంతో విక్రమ్‌గౌడ్ ఈ నాటకానికి శ్రీకారం చుట్టారని, నిందితులను అదుపులోకి తీసుకుని, విక్రమ్ ఆసుపత్రిలో చెప్పిన అంశాలను విశ్లేషించి, శాస్త్రీయంగా రుజువయ్యాకే కేసులు నమోదుచేశామన్నారు. విక్రమ్‌గౌడ్ అబద్ధం చెబుతున్నాడంటూ తమకు ముందుగా ఆయన భార్య షిపాలిరెడ్డి ఫిర్యాదు ద్వారా తెలిసిందని, ఇందుకు సంబంధించి సీసీకెమెరాల ఫుటేజీ లభించడంతో నాటకమంటూ నిర్ధరణ అయ్యిందన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.5.3 లక్షల నగదు, స్కార్పియో వాహనం, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

### 'క్లాప్‌బోర్డ్' నుంచి మొదలు

విక్రమ్‌గౌడ్ గతంలో నిర్మాతగా 'ఇష్క్,' 'గుండెజారి గల్లంతయ్యిందే' అన్న సినిమాలను నిర్మించాడు. ప్రస్తుతం 'క్లాప్‌బోర్డ్'పేరుతో ఉన్న కార్యాలయంలో కొత్తచిత్రాల రూపకల్పన చేస్తున్నాడు. ఇక్కడ పనిచేస్తున్న ప్రొద్దుటూరు వాసి ప్రసాద్ తన స్నేహితుడు, పులివెందుల వాసి ఎ.గోవిందరెడ్డికి సినిమాల్లో నటించాలన్న ఆసక్తి ఉందని ఐదునెలల క్రితం విక్రమ్ గౌడ్‌కు చెప్పడంతో, భవిష్యత్‌లో అవకాశాలిస్తానంటూ విక్రమ్ హామీ ఇచ్చారు. కొద్దిరోజుల అనంతరం విక్రమ్‌గౌడ్ ప్రసాద్‌కు ఇంటికి పిలిపించాడు. తనపై ప్రత్యర్థులు హత్యాయత్నానికి పాల్పడినట్టు నాటకమాడాలని, ఈ పనిచేస్తే రూ.50 లక్షలు ఇస్తానని, అడ్వాన్స్‌గా రూ.5 లక్షలిచ్చాడు. గోవిందరెడ్డి ఆ డబ్బు తీసుకుని అనంతపురం జిల్లా కదిరిలో ఉంటున్న డ్రైవర్ నందకుమార్‌కు విషయాన్ని వివరించాడు. అతడు ఒప్పుకోవడంతో హైదరాబాద్‌కు రమ్మన్నాడు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకి, నగదు, చరవాణులు

### రెండు నెలల క్రితం పథకం..

గోవిందరెడ్డి, నందకుమార్‌లు రెండునెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి విక్రమ్‌గౌడ్‌ను అతడి ఇంట్లో కలిశారు. తనపై హత్యాయత్నం పక్కాగా జరగాలని, రెండు భుజాలను కాల్చిన అనంతరం పొట్టకు సమీపంలో మరో రౌండ్ కాల్చి పారిపోవాలని, ఇలా చేస్తే జనంలో సానుభూతి పెరుగుతుందని, దీంతోపాటు తనకు అప్పులిచ్చినవారు కూడా భయపడతారంటూ వారిద్దరికీ వివరించాడు. తనకిచ్చిన రూ.ఐదు లక్షల్లో గోవిందరెడ్డి రూ.3.5 లక్షలు నందుకిచ్చాడు. నందు కదిరి వెళ్లి తన స్నేహితులైన కార్పెంటర్ షేక్ అహ్మద్, బాబూజాన్‌కు వివరించాడు. ఇందుకు తుపాకీ కొనాలని... ఇండోర్‌లో తనస్నేహితుడు రయీస్ ఉన్నాడని అహ్మద్ చెప్పడంతో తుపాకీ కోసం అతనికి రూ.1.9 లక్షలను నందు ఇచ్చాడు. అప్పటికే రంజాన్ మాసం మొదలవడంతో కొనుగోలును వాయిదా వేశారు. ఈలోపు విక్రమ్‌గౌడ్ నందుకు పలుమార్లు ఫోన్ చేయడంతో జులై 6న షేక్ అహ్మద్, బాబూజాన్‌తో పాటు వారి స్నేహితుడు వెంకటరమణ అలియాస్ చిన్నా కదిరి నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి విమానంలో ముంబయి మీదుగా ఇండోర్ వెళ్లారు. అక్కడ రయీస్ ఖాన్‌ను కలుసుకుని రూ.30వేలకు తుపాకీ, తూటాలు కొన్నారు. తుపాకీ తీసుకొని చిన్నా, రయీస్ బంధువు బస్సులో జులై8న బాలానగర్ చేరుకున్నారు. విక్రమ్‌గౌడ్ అక్కడికి వచ్చి తుపాకీ, తూటాలు ఇంటికి తీసుకెళ్లాడు. తుపాకీ విషయాన్ని విక్రమ్ తన భార్యకు కూడా చెప్పలేదు. రెండురోజుల తర్వాత నందుకు ఫోన్‌చేసి ఎప్పుడు కాల్చుతారంటూ ప్రశ్నించాడు. తన బంధువుకు బాగాలేదని, పుట్టపర్తిలో ఉన్నానని నందు చెప్పగా... విక్రమ్ రూ.1.5 లక్షలను తన డ్రైవర్‌కిచ్చి పుట్టపర్తికి పంపించాడు. డబ్బుతీసుకున్న నందు హైదరాబాద్‌కు రాకపోవడంతో విక్రమ్ అతడిని ఫోన్‌లో బూతులు తిట్టాడు. అసభ్యంగా సంక్షిప్తసందేశాలు పంపించాడు. స్పందించకపోవడంతో తానే స్వయంగా జులై17న పుట్టపర్తికి వెళ్లి రూ.50 లక్షలు కావాలంటే వెంటనే పనిచేయండంటూ హెచ్చరించాడు. దీంతో జులై 23న నందు, అహ్మద్, బాబూజాన్, చిన్నా, పులివెందుల నుంచి గోవిందరెడ్డి హైదరాబాద్ వచ్చారు. వీరందరినీ జూబ్లీహిల్స్‌ని తేజనివాస్ అతిథిగృహంలో విక్రమ్ ఉంచాడు. అదేరోజు రాత్రి విక్రమ్‌గౌడ్ సహా అందరూ సమావేశమై, ఒకటి,రెండురోజుల్లో పథకం అమలు చేయాలని నిర్ణయించుకున్నారు.

### కాల్చేందుకు వెనుకంజ... కదిరికి ప్రయాణం

సోఫాలో తాను కూర్చుని ఉండగా ఎక్కడ నిలబడి కాల్చాలి? ఎలా పారిపోవాలి? కాల్పుల శబ్దం విని భార్య వస్తే ఆమెను భయపెట్టేందుకు ఒకరౌండు కాల్చాలని, వాచ్‌మెన్ వస్తే అతడిపై ఒకరౌండు కాల్చాలని విక్రమ్ గౌడ్ వారికి వివరించాడు. కాల్చేందుకు ఒకరు ఇంట్లో, అతడితో కలిసి పారిపోయేందుకు ఇంటిబయట బైక్‌పై ఒకరుండాలని చెప్పాడు. గోవింద్‌రెడ్డి బైకును రూ.30వేలతో ప్రొద్దుటూరు నుంచి తెప్పించాడు. విషయం చాంద్రాయణగుట్టలోని గౌస్‌కు వివరించి, భాగస్వామిని చేసుకొని బైకు నంబరు, ఇంజిన్ మార్పించారు. జులై 26న పథకం అమలు చేయాలని విక్రమ్ నందును ఆదేశించాడు. అతిథిగృహంలో ఉన్న నందు, గోవిందరెడ్డి మాట్లాడుకుని తుపాకీతో కాల్చలేమని వెనుకంజవేశారు. ఈ క్రమంలోనే బైక్‌ను ఆలస్యంగా తీసుకురావాలంటూ గౌస్‌కు సూచించారు. జులై 26 తెల్లవారు జామున తన ఇంటికి విక్రమ్‌గౌడ్ రమ్మనడంతో నందు, గోవిందరెడ్డి, అహ్మద్ వచ్చారు. వారికి తుపాకీ ఇచ్చాడు. బైక్ రాకపోవడంతో గౌస్‌కు ఫోన్‌చేయగా స్పందించలేదు. దీంతో విక్రమ్‌గౌడ్ వారిని తీసుకుని కారులో చిల్కూరుకు వెళ్లి, అక్కడ తన అతిథిగృహంలో మరోమారు పథకం వివరించారు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చాక విక్రమ్‌కు సమాచారమివ్వకుండా నందు, గోవిందరెడ్డి, చిన్నా కదిరికి, బాబూజాన్ తన బంధువుల ఇంటికి వెళ్లారు. షేక్ అహ్మద్ సనత్‌నగర్‌లో బంధువుల వద్దకు వెళ్లిపోయాడు. తాను వెళ్తున్నానని నందు చెప్పడంతో విషయాన్ని ఓ సారి రయీస్‌కు చెబుదామని అహ్మద్ అన్నాడు. రయీస్ వచ్చాక తనకు సమాచారం ఇస్తే వస్తానని నందు వివరించాడు.

### రయీస్ రంగప్రవేశం...

కాల్పుల నాటకమాడితే రూ.లక్షల్లో డబ్బులొస్తాయని షేక్ అహ్మద్ ఇండోర్‌లో ఉన్న రయీస్‌కు ఫోన్‌చేయగా, అతడు ఒప్పుకొని జులై 27 మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. అహ్మద్ నందుకు ఫోన్‌చేయగా అతడు కదిరి నుంచి స్కార్పియోలో హైదరాబాద్‌కు వచ్చాడు. ముగ్గురూ అతిథిగృహానికి చేరుకున్నాక విక్రమ్‌కు సమాచారమిచ్చారు. ఈలోపు అహ్మద్, రయీస్‌లు బైక్‌ను విక్రమ్ ఇంట్లో ఉంచి వచ్చారు. అదేరోజు రాత్రి విక్రమ్,నందు, అహ్మద్, రయీస్‌లు అతిథిగృహంలో సమావేశమై, లోటుపాట్లు లేకుండా పథకం అమలు చేయాలని నిర్ణయించుకున్నారు. జులై 28 తెల్లవారుజామున 2.30గంటలకు విక్రమ్‌గౌడ్ ఇంటికి కారులో బయలుదేరారు. కాపలాదారు గుర్తిస్తే ప్రమాదమని గ్రహించి విక్రమ్ వారిని ఇంటి బయటే దింపాడు. తన స్నేహితులు వస్తున్నారని, గేటు తెరిచే ఉంచాలని కాపలాదారుడుని ఆదేశించాడు. కొద్దిసేపటికి నందు, అహ్మద్, రయీస్‌లు విక్రమ్ ఇంటికి వచ్చారు. దర్గాలో అన్నదానం చేద్దాం.. తయారుగా ఉండు అంటూ విక్రమ్ తన భార్యకు చెప్పాడు. తాను స్నానం చేసి కిందికి వచ్చాడు. వారితో మాట్లాడాక తనగదిలోకి వెళ్లి ఐదు తూటాలున్న తుపాకీ, రూ.8లక్షల నగదుతో వచ్చాడు. నందుకు రూ.4 లక్షలు, అహ్మద్‌కు రూ.2 లక్షలు, రయీస్‌కు రూ.2లక్షలు ఇచ్చాడు. రయీస్‌ను ఇంట్లో ఉండమని, బైక్ బయటకు తీసుకెళ్లి ఇంజిన్ ఆన్‌లో ఉంచాలని అహ్మద్‌కు చెప్పాడు. శిరస్త్రాణం కూడా విక్రమే ఇచ్చాడు. నందు తాను బయటకు వెళ్తానని చెప్పి వెళ్లిపోగా.. తెల్లవారు జామున 3.30 గంటలకు రయీస్ విక్రమ్‌గౌడ్‌పై రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. మూడోరౌండ్ కాల్చుతుండగా... విక్రమ్ సోఫాలో ఒరిగిపోవడంతో బయటకు వెళ్లివెళ్లగానే అహ్మద్ బైక్‌పై కూర్చుని ఇద్దరూ పారిపోయారు. హకీంపేట చెరువు సమీపంలో నీళ్లలో తుపాకీ పారేసి, బైకును అక్కడే వదిలేసి ఇద్దరూ చెరోదారిన వెళ్లిపోయారు. క్లిష్టమైన కేసులో వేగంగా దర్యాప్తు చేసిన డీసీపీలు ఎ.వెంకటేశ్వరరావు, లింబారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజావెంకటరెడ్డి, శ్రీనివాస్‌లను కొత్వాల్ మహేందర్‌రెడ్డి అభినందించారు.

### రూ.50 కోట్ల వరకూ అప్పులు?

గోషామహల్ నియోజకవర్గ ప్రజలు 'అయ్యో విక్రమ్ గౌడ్' అనుకునేలా తన క్రిమినల్ బ్రెయిన్‌ను ఉపయోగించాడు. తన తండ్రి ముఖేష్‌గౌడ్ మంత్రిగా ఉన్నప్పుడు యువనేతగా సెటిల్‌మెంట్లు చేసిన విక్రమ్‌గౌడ్ తన అనుచరులతో పలు దౌర్జన్యాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. బాలానగర్, మియాపూర్, అఫ్జల్‌గంజ్ పోలీస్ ఠాణాల్లో కేసులు నమోదైనా వాటి విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. చేస్తున్న వ్యాపారాల్లో రూ.కోట్లలో నష్టం రావడం... రుణదాతల నుంచి ఒత్తిడి అధికమవుతుండటంతో వీటన్నింటినీ అధిగమించి ప్రజానాయకుడిగా ఎదిగేందుకు స్వీయ హత్యాయత్న పథకం రచించాడని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం విక్రమ్ గౌడ్‌కు రూ.50 కోట్ల వరకూ అప్పులున్నాయని అతడి సన్నిహితులు విచారణ అధికారులు వివరించారు.

ఒడిశాలోని గనుల్లో పెట్టుబడులు పెట్టడంతో రూ.15 కోట్ల వరకూ నష్టపోయినట్టు తెలిసింది. దీంతో పాటు ఇతర సంస్థలు, వ్యాపారాల్లో రూ.కోట్లు పెట్టుబడులు పెట్టాడని, లాభాలు రాకపోవడంతో అవి అలాగే ఉండిపోయానని తెలిసింది. ఇక 2016లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో జాంబాగ్ నుంచి కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేసి రూ.4 కోట్ల వరకూ వ్యయం చేసినట్టు సమాచారం.

## మరణించిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు బీమా చెక్కుల పంపిణీ

**ఈనాడు, అమరావతి:** విధి నిర్వహణలో భాగంగా ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు హోంగార్డుల కుటుంబ సభ్యులకు బీమా సొమ్ముకు సంబంధించిన చెక్కులను డీజీపీ నండూరి సాంబశివరావు బుధవారం పంపిణీ చేశారు. విశాఖపట్నం జిల్లాలో హోంగార్డుగా పనిచేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు బలైన షేక్ దాదావలి, విజయనగరం జిల్లా హోంగార్డుగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఇందుకూరి ఆనంద్‌కుమార్ రాజు కుటుంబ సభ్యులకు చెరో రూ.5 లక్షలు చొప్పున చెక్కులు అందజేశారు. వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి హోంగార్డు ఉద్యోగం ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేశారు.

## 3న పోలవరం ప్రాజెక్టుకు జేపీ

**ఈనాడు, అమరావతి:** లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ ఈనెల 3, 4 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. 3న పోలవరం ప్రాజెక్టు పరిశీలిస్తారు. 4న భీమవరం ఎస్‌ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల, బీఎన్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటారని పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు.

## 10న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

**విజయవాడ, న్యూస్‌టుడే:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో విద్యార్థి నేతలు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యను ప్రభుత్వమే నట్టేట ముంచుతోందని ధ్వజమెత్తారు. వసతిగృహాల విద్యార్థులకు మెస్, కాస్మటిక్స్ ఛార్జీలు పెంచాలని మూడేళ్లుగా ఆందోళనలు నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని వ్యాపారంగా మారుస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేట్‌పరం చేసేందుకు సెల్ఫ్ ఫైనాన్స్ స్కూల్స్ ఇండిపెండెంట్ యాక్టు-2017ను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నూర్‌మహ్మద్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జె.విశ్వనాథ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రవిచంద్ర, రామకృష్ణ, పీడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి బాజీసైదాలు గోడపత్రికలు విడుదల చేశారు.

## నేడు మంత్రి మండలి సమావేశం

### ఉద్యోగులకు డీఏపై కీలక నిర్ణయం!

**ఈనాడు, అమరావతి:** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకురానున్నాయి. ఈ సమావేశంలోనూ ప్రభుత్వ ఉద్యోగులకు కరవుభత్యం చెల్లింపుపై ఒక కీలక ప్రకటన వెలువడే సూచనలున్నాయి. ఉదయం తెదేపా సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుంది.

## టెండర్ల పరిశీలన కమిటీ ఏర్పాటు

**ఈనాడు, అమరావతి:** జలవనరుల అభివృద్ధి సంస్థ(ఏపీఎస్‌ఐడీసీ)లో టెండర్ల పరిశీలనకు నలుగురు అధికారులతో కమిటీని నియమించారు. చిన్నతరహా నీటిపారుదల విభాగం చీఫ్ ఇంజినీరు, టెండర్ల కమిషనరేట్ సూపరింటిండెంట్ ఇంజినీరు, ఆర్థిక శాఖ నుంచీ ఉప ఆర్థిక సలహాదారు, ఏపీఎస్‌ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజినీరు ఇందులో సభ్యులుగా ఉంటారు. రూ.1.5 కోట్లకు మించిన టెండర్లను ఈ కమిటీ పరిశీలించి టెండరుదారుని ఎంపిక చేస్తుంది.

## పురపాలక ఉపాధ్యాయుల సమస్యలపై నేడు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

**ఈనాడు, అమరావతి:** పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు కొనసాగించాలనే డిమాండ్లతో గురువారం అన్ని పురపాలక, నగరపాలక సంస్థల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు బాబురెడ్డి, హృదయరాజు తెలిపారు. పురపాలక మంత్రి ఏకపక్ష నిర్ణయాల కారణంగా పురపాలక పాఠశాలల్లో తెలుగు మాధ్యమం రద్దయ్యిందని ఆరోపించారు. అప్‌గ్రేడ్ అయిన భాషపండితులు, పీఈటీల పోస్టులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

**పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లొద్దు.. ఎంటీఎఫ్:** పురపాలక పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం పెట్టొదని ఫ్యాప్టో ధర్నాలు చేయడాన్ని తాము ఖండిస్తున్నామని పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామకృష్ణ, ఎం.రవిసిద్ధార్థా ఓ ప్రకటనలో తెలిపారు. పేద, మురికివాడ పిల్లలకు ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో చదువులు చెప్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. తెలుగు మాధ్యమమే కావాలని చెప్పడం బాధకరమన్నారు.

# చంద్ర గ్రహణం రోజు శ్రీశైల ఆలయం మూసివేత

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఈ నెల 7వ తేదీన కర్నూలు జిల్లా శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఉభయ దేవాలయాల ద్వారాలను మూసివేయనున్నట్లు దేవస్థానం ఈవో భరత్‌గుప్తా బుధవారం తెలిపారు. ఆ రోజు తెల్లవారు జామున 2.30 గంటలకు సుప్రభాతసేవ, మంగళహారతి నిర్వహించిన అనంతరం 4.30 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 5.30 గంటలు, 9.30 గంటల సమయంలో అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి గ్రహణ కాలం మొదలు కావడంతో ఉభయదేవాలయాల ద్వారాలు మూసివేయనున్నట్లు చెప్పారు. తిరిగి మరుసటి రోజు 8వ తేదీ తెల్లవారుజాము 4 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ జరుపనున్నట్లు చెప్పారు.

# పైకప్పు సౌర విద్యుత్‌కు ప్రోత్సాహం!

- **లక్ష్యం 2వేల మెగావాట్లు**
- **సాధించింది 28 మెగావాట్లు**

**ఈనాడు, అమరావతి:** పరిశుభ్రమైన విద్యుత్ ప్రోత్సాహంలో భాగంగా 'యుఎస్ఎయిడ్' రాష్ట్రంలో పైకప్పు సౌరవిద్యుత్ అభివృద్ధికి సహకారాన్ని అందిస్తుంది. విధాన మద్దతు, స్థాపక సామర్థ్యం పెంపుదల ఆశయంతో అమెరికాకు చెందిన యుఎస్ఎయిడ్‌తో పాటు కేంద్ర విద్యుత్‌శాఖ, నూతన, పునరుద్ధరణీయ మంత్రిత్వశాఖ కూడా ఇందుకు తోడ్పాటునిస్తాయి. దీనిలో భాగంగానే బుధవారం విజయవాడలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. పైకప్పు సౌరవిద్యుత్ ద్వారా రాష్ట్రంలో 2వేల మెగావాట్ల మేర సౌరవిద్యుత్ సాధించాలన్నది ఆశయం. ఇందులో ఇప్పటి వరకూ 28 మెగావాట్లనే రాష్ట్రం సాధించగలిగింది. ఈ నేపథ్యంలోనే కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా 'యుఎస్ఎయిడ్' ఇక పోర్టల్‌ను రూపొందిస్తుంది. పైకప్పు సౌరవిద్యుత్‌కు దరఖాస్తు చేసే అంశం వద్ద నుంచి బ్యాంకు రుణం ఎలా పొందవచ్చనే వివరాలు ఇందులో ఉంటాయి. దీంతోపాటు ముగ్గురు ఇంజినీర్లను కూడా 'యుఎస్ఎయిడ్' సమకూరుస్తుంది. నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనవరుల అభివృద్ధి సంస్థ(నెడ్‌కాప్), తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్), దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్)కు వీరు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పరంగా ఒక సాంకేతిక కమిటీని వేశారు. ఇంధనశాఖ సలహాదారు కె.రంగనాథం సారథ్యంలో ఉండే కమిటీలో విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు హెచ్.వై.దొర, ఎం.ఎం.నాయక్, నెడ్‌కాప్ ఎండీ కమలాకరబాబు, జనరల్‌మేనేజర్ కె.శ్రీనివాస్ ఇందులో సభ్యులుగా ఉంటారు. సమావేశంలో ఈ విషయాలపై చర్చ జరిగింది. పైకప్పు సౌర విద్యుత్‌ను పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నది తమ సంకల్పమని 'యుఎస్ఎయిడ్' సీనియర్ క్లీన్ ఎనర్జీ నిపుణుడు అనురాగ్ మిశ్రా సమావేశంలో చెప్పారు. కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇంధన, మౌలికవసతులు, పెట్టుబడుల శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు.

# సర్వేలో నమోదుకాని వారికి ప్రత్యేక డ్రైవ్

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ వెల్లడి

**ఈనాడు–అమరావతి:** ప్రజాసాధికార సర్వేలో నమోదు కాని సుమారు 5.9లక్షల మంది కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ వెల్లడించారు. సెప్టెంబర్ 15వ తేదీ వరకు అన్ని జిల్లాల్లోని మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ఈ ప్రత్యేక కార్యక్రమం జరుపుతామని తెలిపారు. రాష్ట్రంలో నివసించే ప్రతి వ్యక్తి సర్వేలో నమోదయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం ఆయన సర్వే జరిగిన తీరును సమీక్షించారు. రాష్ట్ర జనాభా 4.94 కోట్లుండగా... సర్వేలో 4.34కోట్ల మంది నమోదయ్యారని వివరించారు. కొందరు ఇతర ప్రాంతాల్లో నివాసముండటం, చనిపోవటం, ఆధార్ సంఖ్య అందుబాటులో లేకపోవటం, సర్వేలో నమోదుకు ఆసక్తి చూపకపోవటం తదితర కారణాలతో సర్వేలో పాల్గొనేందుకు అవకాశం లేకపోయిందని వెల్లడించారు. చంద్రన్న బీమా కింద నమోదుకాని వారిని సైతం త్వరగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌ని వాడుకోవాలని సూచించారు. చుక్కల భూములను రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేసేందుకు మీ సేవ కేంద్రాల్ని వినియోగించుకోవాలని సూచించే గోడ పత్రికను ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆవిష్కరించారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

### స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, ఒంగోలు

లేఖ నెం. ఆర్.సి.బి./63/2017 — తేది.01.08.2017

### ప్రకాశం జిల్లా భూసేకరణ ప్రకటన

ఫారం నెం.VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్‌రూల్(1)ననుసరించి)

### రూఢి ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు క్రింద **E13** బ్రాంచి కాలువ నిర్మాణంలోని భాగముగా వరికుంటపాడు మండలము మహమ్మదాపురం గ్రామములోని కాలువ పోవుచున్నందున శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు భావించినందున, 2013 సంవత్సరము 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజాప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

### రూఢి ప్రకటన

శ్రీయుత స్పెషల్ డిప్యూటి కలెక్టరు (భూసేకరణ) ఆర్ అండ్ ఆర్ యూనిట్, మార్కాపురం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించిన ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనమునకై అనగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు క్రింద **E13** బ్రాంచి కాలువ నిర్మాణము కొరకు భూమి అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

### షెడ్యూలు

జిల్లా: నెల్లూరు — మండలము:వరికుంటపాడు — గ్రామమునెం:మహ్మదాపురం

| క్రమ సంఖ్య | సర్వే నెం. | పూర్తి విస్తీర్ణం యు.సెం. | తరగతి/ భూస్థితి | భూసేకరణ క్రింద విస్తీర్ణం | సంబంధిత ఆసామీ పేరు (పట్టాదారు) మరియు చిరునామా | సంబంధిత ఆసామీ పేరు (అనుభవదారు) మరియు చిరునామా | సరిహద్దులు ఉత్తర | దక్షిణ | తూర్పు | పడమర | చెట్లు మరియు కట్టడముల వివరాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1. | 52/2బి | 0.45 | సర్కారు పుంజ | 0.45 | షేక్ కాటగుళ్ళ హాజీగేస్ భర్త బడేల్‌తుం సాహెబ్ | షేక్ కాటగుళ్ళ హాజీగేస్ భర్త బడేల్‌తుం సాహెబ్ | 2ఎ | 53 | ఫారెస్టు | 2ఎ | బీడు |
| 2. | 52/3బి | 0.04 | అసైన్ మెంట్ | 0.04 | పగడాల మల్లీశ్వరి భర్త వెంకటరత్నం | పగడాల మల్లీశ్వరి భర్త వెంకటరత్నం | 3ఎ | ఫారెస్టు | 2బి | 2ఎ | బీడు |
| 3. | 55/5బి | 0.04 | అసైన్ మెంట్ | 0.04 | చల్లా గొలుసు సుబ్బయ్య తండ్రి నాగయ్య | చల్లా గొలుసు సుబ్బయ్య తండ్రి నాగయ్య | 55/5ఎ | 57 | 54 | 55/5ఎ | దుక్కి |
| 4. | 57/5 | 0.69 | అసైన్ మెంట్ | 0.69 | గోసు డ్రిల్లమ్మ భర్త మాలకొండయ్య | గోసు డ్రిల్లమ్మ భర్త మాలకొండయ్య | 55 | 57/7 | 57/6 | 57/1 | దుక్కి |
| 5. | | 1.93 | | 1.93 | కంచుగొంట్ల శ్రీనివాసులు తండ్రి చిన్ననాగయ్య | కంచుగొంట్ల శ్రీనివాసులు తండ్రి చిన్ననాగయ్య | 55 | 57/7 | 57/6 | 57/1 | దుక్కి |
| 6. | 63 | 2.46 | అసైన్ మెంట్ | 1.26 | సలకొలుసు ఆదిలక్ష్మమ్మ భర్త రామయ్య | సలకొలుసు ఆదిలక్ష్మమ్మ భర్త రామయ్య | 60 | 63/6 | 63/5 | 63/1 | దుక్కి |
| 7. | | | | 1.20 | గోసు పద్మ భర్త మాల్యాద్రి | గోసు పద్మ భర్త మాల్యాద్రి | 63/4 | 63/8 | 63/7 | 63/2 | దుక్కి |
| 8. | 76 | 3.22 | అసైన్ మెంట్ | 1.11 | సంద్ర గోవిందమ్మ భర్త మస్తాన్‌రావు | సంద్ర గోవిందమ్మ భర్త మస్తాన్‌రావు | 71 | 76/6 | 76/5 | 76/1 | దుక్కి |
| 9. | | | | 1.02 | శాఖమూరి లక్ష్మి భర్త వెంకటేశ్వర్లు | శాఖమూరి లక్ష్మి భర్త వెంకటేశ్వర్లు | 76/4 | 76/8 | 76/7 | 76/2 | దుక్కి |
| 10. | | | | 1.09. | శాఖమూరి హజరత్తయ్య తండ్రి శ్రీనివాసులు | శాఖమూరి హజరత్తయ్య తండ్రి శ్రీనివాసులు | 76/6 | 80 | 76/9 | 76/3 | దుక్కి |
| 11. | 82/2 | 2.68 | అసైన్ మెంట్ | 2.68 | మాలపాటి శాంతమ్మ భర్త నాగయ్య | మాలపాటి శాంతమ్మ భర్త నాగయ్య | 81 | 82/2బి | 82/3 | 82/1 | దుక్కి |
| 13. | 125/2 | 3.54 | సర్కారు పుంజ | 1.98 | గుంటుపల్లి తిరుపతమ్మ భర్త నాగభూషణం | గుంటుపల్లి తిరుపతమ్మ భర్త నాగభూషణం | 125/1 | 125/3 | 127 | గొల్ల పల్లి | దుక్కి |
| 14. | | | | 1.56 | గుంటుపల్లి తిరుపతమ్మ భర్త నాగభూషణం | తెల్లాకుల సుబ్బరాయుడు తండ్రి | 125/1 | 125/3 | 127 | గొల్ల పల్లి | దుక్కి |
| 15. | 126/2 | 0.16 | సర్కారు పుంజ | 0.16 | సంద్రా సరోజిని భర్త ఉమామహేశ్వర రావు | సంద్రా సరోజిని భర్త ఉమామహేశ్వర రావు | 141 | 127 | 128 | 126/1 | దుక్కి |
| 16. | 127/2 | 2.80 | సర్కారు పుంజ | 0.63 | సంద్రా గోవిందయ్య తండ్రి పాపయ్య | సంద్రా శ్రీనివాసులు తండ్రి గోవిందయ్య | 127/1 | 127/3 | 140 | 125 | దుక్కి |
| 17. | | | | 0.86 | సంద్రా గోవిందయ్య తండ్రి పాపయ్య | సంద్రా చెంచయ్య తండ్రి పాపయ్య | 127/1 | 127/3 | 140 | 125 | దుక్కి |
| 18. | | | | 1.31 | సంద్రా గోవిందయ్య తండ్రి పాపయ్య | సంద్రా సరోజిని భర్త ఉమామహేశ్వర రావు | 127/1 | 127/3 | 140 | 125 | దుక్కి |
| 21. | 140/2 | 2.47 | సర్కారు పుంజ | 1.32 | సంద్ర వెంకటస్వామి భార్య సుభద్రమ్మ వగైరాలు | సంద్ర వీరశేఖరం తండ్రి బ్రహ్మయ్య | 143 | 126 127 | 140/3 | 140/1 | దుక్కి |
| 22. | | | | 0.69 | సంద్ర వెంకటస్వామి భార్య సుభద్రమ్మ వగైరాలు | సంద్ర శ్రీనివాసులు తండ్రి గోవిందయ్య | 143 | 126 127 | 140/3 | 140/1 | దుక్కి |
| 23. | | | | 0.46 | సంద్ర వెంకటస్వామి భార్య సుభద్రమ్మ వగైరాలు | సంద్ర చెంచయ్య తండ్రి పాపయ్య | 143 | 126 127 | 140/3 | 140/1 | దుక్కి |
| 24. | 154/1బి | 5.20 | సర్కారు పుంజ | 5.20 | శెట్టిపల్లి సురేష్ తండ్రి | శెట్టిపల్లి సురేష్ తండ్రి | 154/1ఎ2 | 143 | 154/1బి3 | 154/1బి1 | వెదురు మొక్కలు 680, శ్రీగంధం -525 ఎర్రచందనం 795, సపోట-340, మామిడి -5, సన్ననిమ్మ 500, నేరేడు-10, టేకు 110, వెలగ-5, మారేడు -4, బోర్లు-4 |
| 25. | 154/1ఎ | 0.15 | అసైన్ మెంట్ | 0.15 | గొల్లపల్లి బాబు తండ్రి | గొల్లపల్లి బాబు తండ్రి | 154/8 | 154/1బి2 | 154/8 | 154/1ఎ1 | దుక్కి |
| 26. | 154/3ఎ | 0.30 | అసైన్ మెంట్ | 0.30 | గొల్లపల్లి బాబు తండ్రి | గొల్లపల్లి బాబు తండ్రి | 152 | 154/3బి | 154/3ఎ | 154/8 | దుక్కి |
| 27. | 154/3బి | 0.05 | సర్కారు పుంజ | 0.05 | శెట్టిపల్లి సురేష్ తండ్రి | శెట్టిపల్లి సురేష్ తండ్రి | 154/3ఎ | 154/3బి | 154/3బి | 154/8 | దుక్కి |
| | మొత్తం విస్తీర్ణము | | | | 26.18 | | | | | | |

సం/- డి.సుదర్శనం, ఎం.ఏ.,
ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు.

## భారత ప్రభుత్వం

### పర్యావరణం, అటవీ & వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ

ప్రాంతీయ కార్యాలయం (సౌత్ ఈస్టర్న్ జోన్)

1వ & 2వ అంతస్తు, HEPC భవనం, నెం. 34, క్యాథడ్రల్ గార్డన్ రోడ్, నుంగంబాక్కం, చెన్నై - 600034, టెలీ. నెం. 044-28222325, ఇ-మెయిల్ : roefccc@gmail.com

F.No. 4-APA013/2016-CHN/1479 — తేది : 20–7–2016

ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ వారికి
పర్యావరణం, అటవీ, సైన్స్ & టెక్నాలజి శాఖ,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం

**విషయము :** చీఫ్ ఇంజినీర్ ద.మ.రైల్వే, సికింద్రాబాద్ తరపున గుంటూరు, గిద్దలూరు మరియు నెల్లూరు అటవీ డివిజన్ల గుండా నడికుడి - శ్రీకాళహస్తి కొత్త బి.జి. రైల్వే లైన్ల నిర్మాణం కొరకు 118.725 హెక్టార్ల అటవీ భూమి మళ్లింపు - గురించి

**అయ్యా !**

పైన పేర్కొన్న ప్రాజెక్టు కొరకు అటవీ (కన్జర్వేషన్) చట్టం, 1980 యొక్క విభాగం '2'కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం కోరుతూ **రాష్ట్ర ప్రభుత్వ లెటర్ నెం. 3193/Sec-II/2014 తేది:13-06-2016ను** చూడండి.

రాష్ట్ర ప్రభుత్వం యొక్క ప్రతిపాదన యొక్క సరైన విచారణ అనంతరం, గిద్దలూరు మరియు నెల్లూరు అటవీ డివిజన్లలో అటవీ భూమి **118.725** హెక్టార్ల మళ్లింపు కొరకు అటవీ చట్టం (కన్జర్వేషన్), 1980 యొక్క విభాగం '2' క్రింద ఆమోదిత కేంద్ర ప్రభుత్వం ఇన్ - ప్రిన్సిపల్ (స్టేజ్-1)కు దిగువ నిబంధనలకు సంబంధించి చీఫ్ ఇంజినీర్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ పేరుతో నడికుడి - శ్రీకాళహస్తి స్టేషన్ల మధ్య కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణం కొరకు సూచనకై ఇందుమూలంగా దిగువ షరతులతో ఆదేశించడమైనది.

1. అటవీ భూమి యొక్క చట్టపరమైన స్థాయిలో మార్పు ఉండదు.
2. వినియోగ ఏజన్సీ యొక్క ఖర్చుపై 20 మీటర్లు విరామం వద్ద తగు విధంగా లెక్కించిన 4 అడుగుల ఎత్తు సిమెంట్ కాంక్రీట్ స్తంభాలు స్థాపన ద్వారా ప్రతిపాదిత అటవీ ప్రాంతం యొక్క పొలిమేర నిర్ణయించబడును.
3. వినియోగ ఏజన్సీ ఖర్చుపై కనిగిరి రేంజ్‌లో గల ఇనిమెర్ల PF/RF యొక్క Compt. 432 & 439 లో గుర్తించిన డిగ్రేడెడ్ అటవీ భూమి 139.69 హే.లకు మరియు కనిగిరి రేంజ్‌లో గల పునుగోడు RF యొక్క Compt. No. 452 లో గుర్తించిన డిగ్రేడెడ్ అటవీ భూమి 101.0415 హే.లకు పైగా రాష్ట్ర అటవీ శాఖ ద్వారా నిర్ణయించబడును. మరియు అడవుల పెంపకం నష్టపరిహారం (CA) పెంచబడును.
4. రిట్ పిటిషన్ (సివిల్) నెం. 202/1995లో సంబంధిత IA'sతో 566లో **IA No. 826**లో తేదీ: 28-03-2008 మరియు 09-05-2008 గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం యొక్క ఉత్తర్వుల వినియోగ ఏజెన్సీ నుండి 118.725 హే. విస్తీర్ణం గల మళ్లించిన అటవీ భూమి యొక్క నికర ప్రస్తుత విలువను రాష్ట్ర ప్రభుత్వం ఛార్జ్ చేయును.
5. ఏదైనా మళ్లించిన అటవీ భూమి యొక్క నికర ప్రస్తుత విలువ (NPV) అదనపు మొత్తం, భవిష్యత్తులో భారతదేశం గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ద్వారా ఇది మళ్లింపు అనంతరం రావలసినదిగా ఉండిపోగలదు. ఇది వినియోగ ఏజెన్సీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఛార్జ్ చేయబడును. దీన్నికై వినియోగ ఏజెన్సీ అండర్ టేకింగ్‌ను ఇవ్వవలసి ఉంటుంది.
6. ఈ ప్రాజెక్టు క్రింద నికర ప్రస్తుత విలువ మరియు కంపెన్సటరీ అఫ్ఫోరెస్టేషన్ నిమిత్తం వినియోగ ఏజన్సీ నుండి స్వీకరించిన నిధులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర CAMPA బ్యాంక్ ఎకౌంట్ నందు జమచేయవలెను. వినియోగ ఏజెన్సీ కంపెన్సటరి అఫ్ఫోరెస్టేషన్ మరియు ఇతర సుంకాలు తప్పనిసరిగా మంత్రిత్వశాఖ వెబ్సైట్ ద్వారా తీయబడిన చలానా ద్వారా మాత్రమే జమచేయవలెను.
7. ప్రతిపాదిత ట్రాక్‌నకు ఇరువైపుల వివిధ లొకేషన్‌లలో వన్యప్రాణులకు నీటితొట్టిలను వినియోగ ఏజెన్సీ ఖర్చుతో DFO తో సంప్రదించి ఏర్పాటు చేయవలెను. తద్వారా వన్యప్రాణులు నీటి కొరకు రైల్వే ట్రాక్లు దాటుట నుండి కాపాడుట కొరకు. ఈ విషయమై వినియోగ ఏజెన్సీ ఒక అండర్ టేకింగ్ ఇవ్వవలెను.
8. రైల్వే వారిచే నాటబోవు మొక్కలు పర్యవేక్షణ నిమిత్తం వినియోగ ఏజెన్సీ అర్హత కలిగిన అటవీ / వ్యవసాయ / ఉద్యాన గ్రాడ్యుయేట్లను కలిగి ఉండవలెను.
9. ప్రాజెక్టు వ్యయములో ప్రతిపాదిత కేటాయింపు 1 శాతం సొమ్ము ద్వారా హరిత కార్యక్రమములు నిర్వహించుటకు గాను రాష్ట్ర ప్రభుత్వము ఒక కమిటీని అటవీ శాఖ సభ్యులతో ఏర్పాటు చేయవలెను.
10. వన్యప్రాణులు క్షేమముగా సంచరించుటకు గాను ప్రాజెక్టు అంచనాలలో పొందుపరచిన విధముగా ROB లు మరియు అండర్ పాస్‌లను నిర్మించవలయును.
11. ఇనిమెర్ల RF నందు నీటి రంధ్రాలు మరియు సోలార్ శక్తి బోర్‌వెల్ నిర్మాణములు ఏర్పాటు చేయవలెను. అదేవిధముగా పునుగోడు RF నందు కూడా APCCF (సెంట్రల్) వారు క్షేత్రస్థాయి తనిఖీ సమయంలో సూచించిన విధముగా యూసర్ ఏజెన్సీ ఖర్చుతో సోలార్ శక్తి బోర్‌వెల్ నిర్మాణములు ఏర్పాటు చేయవలెను.
12. రాష్ట్ర అటవీ శాఖ వారు సాధ్యమైన మేరకు ప్రతిపాదిత ఏరియా నందలి చెట్లను వినియోగ ఏజెన్సీ వారి ఖర్చుతో ఇతర ప్రదేశములలో ఏర్పాటుకు ప్రయత్నించు చర్యలు చేపట్టవలెను.
13. కేంద్ర ప్రభుత్వము వారి ముందస్తు అనుమతి లేకుండా ప్రతిపాదిత లేఅవుట్ నందు ఎట్టి మార్పులు చేయరాదు.
14. అటవీ ప్రాంతంలో ఎటువంటి స్టేషన్ / హాల్ట్ ఉండకూడదు, ప్రారంభించబడదు. రైల్వేలు ప్రత్యామ్నాయ సాంకేతిక ఆప్షన్లను అనుసరించవలెను.
15. ఆవాస స్థలములో అసౌకర్యాన్ని తగ్గించుటకు వీలైనంత మేర ప్రీ-ఫాబ్రికేటెడ్, ఎకో-ఫ్రెండ్లీ స్ట్రక్చర్లు వినియోగించాలి.
16. ట్రాక్ వేయు పని సమయములో తవ్విన మట్టి/ గుట్టలను సహజమైన నీటి పారుదలకు అతరాయం లేకుండా తగిన విధముగా తిరిగి ఉపయోగించాలి. కొత్త ట్రాక్‌ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను అటవీ ప్రాంతం బయట నుండి తీసుకొని రావలెను.
17. సాధ్యమైనంత తక్కువ అసౌకర్యము ఉండే విధముగా లేబర్ క్యాంపులను అటవీ ప్రాంతం బయట ఏర్పాటు చేయవలసి ఉంటుంది.
18. తొలగించవలసిన అవసరం వస్తే తప్ప చెట్లను తొలగించుట నిరోధము. దీన్నికై వినియోగ ఏజెన్సీ తగు అండర్‌టేకింగ్ ఇవ్వవలసి ఉంటుంది.
19. రాత్రిపూట ట్రాక్‌ను వినియోగించుటకు అనుమతించబడదు. పగటి వేళలలో మాత్రమే పని నిర్వహించవలెను.
20. అలైన్‌మెంట్ పొడవునా ఏదైనా లోతైన వాలు ఉంటే, నెమ్మదిగా సంచరించు ముఖ్యముగా భారీ శరీరములు గల వన్యప్రాణులు రాకపోకలకు వీలుగా సదరు వాలును తగ్గించవలెను.
21. నీటి వనరులపై వ్యతిరేఖ ప్రభావాన్ని నిరోధించుటకు రన్ ఆఫ్‌లో సిల్ట్ లోడ్‌ను తగ్గించుటకు తగిన మట్టి పరిరక్షణ విధానాలని తీసుకోవాలి. వాలులను స్థిరముగా ఉంచుటకుగాను వినియోగ ఏజెన్సీ రిటైనింగ్ వాల్స్ బ్రెస్ట్ వాల్స్ మరియు డ్రైనేజీలను అవసరాన్ని బట్టి ఏర్పాటు చేయవలెను.
22. వన్యప్రాణి మరణాలను తగ్గించుటకు ప్రతిపాదిత ట్రాక్‌పై రద్దీని నియంత్రించాలి.
23. వన్యప్రాణి జీవనము మరియు భూభాగముల ప్రకారం రైల్వే వారు CWLW వారితో సంప్రదించి రైలుయొక్క వేగపరిమితిని నిర్ణయించవలెను. అదేవిధముగా గౌరవ భారత ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం ప్రతిపాదిత వేగంపై CWLW వారి షరతులకు రైల్వే అథారిటి కట్టుబడి ఉండాలి.
24. రైల్వే లైన్ ప్రాజెక్ట్‌లకు వర్తించు, ప్రస్తుత సమయానికి అమలులో ఉన్న మంత్రిత్వ శాఖ అన్ని చట్టాలు, నిబంధనలు, రెగ్యులేషన్ మరియు మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగ ఏజెన్సీ మరియు రాష్ట్ర ప్రభుత్వము సహకరించాలి.
25. అటవీ భూమిని ప్రతిపాదిత ప్రయోజనములకు మినహా ఇతర ప్రయోజనములకు ఉపయోగించరాదు. ప్రాజెక్టునకు వినియోగించు అటవీ భూమి విస్తీర్ణం 118.725 హే. మించరాదు. దీన్నికై వినియోగ ఏజెన్సీ అండర్ టేకింగ్ ఇవ్వవలెను.
26. కేంద్ర ప్రభుత్వము వారి ముందస్తు ఆమోదం లేకుండా ఎట్టి పరిస్థితులలో సదరు ప్రతిపాదిత అటవీ భూమి ఇతర ఏజెన్సీ లేక డిపార్ట్‌మెంట్ లేక వ్యక్తినకు బదలాయింపు చేయరాదు.
27. వినియోగ ఏజెన్సీ వారు పై షరతుల తాలూకు 'వార్షిక స్వీయ సమ్మతి' నివేదికను సంబంధిత మంత్రిత్వ శాఖ నందలి ప్రాంతీయ కార్యాలయము మరియు రాష్ట్ర ప్రభుత్వము వారికి సమర్పించవలెను.
28. కేంద్ర ప్రభుత్వము వారికి ప్రతిపాదనను సమర్పించు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వారు సూచించిన ఇతరత్ర షరతులను సదరు వినియోగ ఏజెన్సీ పాటించవలయును.
29. సదరు ప్రాంతంలోని వృక్షజాలం, జంతుజాలం నిర్వహణ అటవీకరణ, పరిరక్షణ విషయమై ఆయా సమయములయందు అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సెంట్రల్), ప్రాంతీయ కార్యాలయం, చెన్నై వారిచే విధించబడు ఏదైనా ఇతర నిబంధనలకు వినియోగ ఏజెన్సీ కట్టుబడి ఉండాలి.
30. సదరు వినియోగ ఏజెన్సీ వారు పై తెల్పిన షరతులను ఉల్లంఘించిన యెడల అదనపు PCCF (సెంట్రల్) ప్రాంతీయ కార్యాలయము, చెన్నై వారిచే నిర్ణయించబడిన విధముగా తగు శిక్ష, చర్యలకు బాధ్యులని గ్రహించేది.

పైన పేర్కొన్న నిబంధనలను అనుసరించి రిపోర్ట్‌ను స్వీకరించిన అనంతరం అంతిమ అనుమతి కొరకు సదరు ప్రతిపాదనను అనుమతించబడును. అంతిమ అనుమతికి ముందుగా అటవీ భూమిని వినియోగ ఏజెన్సీ బదిలీకి ప్రభావితం కాదు. ఈ ముఖ్య అనుమతి 5 సం॥ల కాలానికి చెల్లుబాటులో ఉండాలి. పై నిబంధనలను అనుసరించనిచో సదరు ఆమోదిత ముఖ్య అనుమతి 5 సం॥ పిదప స్వయంచాలకంగా రద్దు చేయబడుతుంది

సం/– డా. కె గణేష్‌కుమార్
డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సెంట్రల్),

నడికుడి - శ్రీకాళహస్తి స్టేషన్ల మధ్య కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ యొక్క నిర్మాణం కొరకు గుంటూరు జిల్లాలో సేకరించిన అటవీ భూముల వివరముల జాబితా

| మండలం పేరు | అటవీ బ్లాక్ పేరు | విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|
| నకరికల్లు | గుత్తికొండ Ex4 | 7.48 |

# తప్పు చేయనివ్వండి!

**చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమశిక్షణ నేర్పే క్రమంలో అరవడం, భయపెట్టడం, కొట్టడం లేదా డబ్బో, మరేదో వస్తువు ఇస్తామని ప్రలోభపెట్టడం చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల వారిలో క్రమశిక్షణ పెరగక పోగా, మరింత పెంకిగా తయారయ్యే ప్రమాదం ఉంది. అసలు పిల్లలకు క్రమశిక్షణ అవసరమా... దాన్ని ఎలా నేర్పాలి... ఇది చదవండి.**

పిల్లలు పొరపాట్లు చేసినప్పుడు చాలామంది తల్లిదండ్రులు ఆ తప్పును మళ్లీ మళ్లీ ఎత్తిచూపుతారు. అలా కాకుండా చేసిన తప్పును ఎలా సరిదిద్దుకోవాలో వారికి నేర్పండి. ఉదాహరణకు మీ అబ్బాయి వేరే అబ్బాయి కొడితే 'స్నేహితుడిని అలా కొట్టొద్దు' అని చెప్పే బదులు 'మీ స్నేహితుడికి క్షమాపణ చెప్పు.. ఎందుకంటే నువ్వు అతడిని కొట్టావు. అది తప్పు. నువ్వే ఆలోచించు..' అని నిదానంగా చెప్పి చూడండి.

ప్రతి ఒక్కరికి అనుభవమే పెద్ద గురువు. ఇది పిల్లలకూ వర్తిస్తుంది. కాబట్టి వారు చేస్తున్న పనులు మరీ సమస్య కానంతవరకూ అడ్డు చెప్పే ప్రయత్నం వద్దు. చేయనివ్వండి. తప్పయితే అలా చేయకూడదని అనుభవం ద్వారా వారే స్వయంగా తెలుసుకుంటారు. అప్పుడు అలాంటివి పునరావృతం చేయకూడదని వివరించండి.

సాధారణంగా చాలామంది తల్లిదండ్రులు పిల్లలు చేసిన మంచి పనుల కంటే వారు చేసిన చిన్న చిన్న తప్పులపైనే ఎక్కువగా దృష్టి పెడతారు. అది పొరపాటు. వారు చేసే ప్రతి పనిని గమనించండి. మంచి పనిని మెచ్చుకోవాలి. ఎక్కడ నిస్తేజంగా ఉన్నారో, ఏ విషయాల్లో చాలా ఉత్సాహంగా పనిచేస్తున్నారో చూడండి. వారి వెన్నంటే ఉండి అన్ని విషయాలూ నేర్చుకునేలా తోడ్పడండి.

పిల్లలకు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో నేర్పే సమయంలో మరీ మందలించకండి. అలా చేయడం వల్ల మొదటికే మోసం వస్తుంది. వారు అసలు మాట వినరు. క్రమశిక్షణ అనేది ఒక్కరోజులో వచ్చేయదు. దానికీ సమయం పడుతుంది. తల్లిదండ్రులుగా మీకు ఓపిక అవసరం.



# వసుంధర



**వాహనాల రంగం అనగానే అది అబ్బాయిలకు సంబంధించింది కదా అనుకుంటాం. కానీ ఆ అభిప్రాయాన్ని లీలాకృష్ణ తిరగరాస్తున్నారు. పల్సర్, రాయల్‌ఎన్‌ఫీల్డ్ వంటి వాహనాల విడిభాగాలని తయారు చేస్తూ.. ఆ రంగంలో తనదైన ముద్ర వేస్తున్నారు. సాధారణ ఉద్యోగి నుంచి.. ఓ వ్యాపారవేత్తగా ఎదిగిన ఆమె.. ఇప్పుడు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నారు. అదెలాగో లీలాకృష్ణ మాటల్లోనే తెలుసుకుందాం...**

## ఆ రోజు... ఫ్యాక్టరీ అంతా తేళ్లూ.. పాములే!

చేతిలో నాలుగు డబ్బులుంటే ఎవరైనా ఏ వ్యాపారమైనా చేయొచ్చు అని మనలో చాలామంది అనుకుంటారు. కానీ నేనుమాత్రం ఈ రంగంలోకి అలా రాలేదు. భగభగ మండే కొలిమి దగ్గర కూర్చుని శరీరంలో నీరు మొత్తం ఆవిరైపోతున్నా నట్లూ, బోల్టులూ తయారుచేసే పని నేర్చుకున్నా. ఓ కార్మికుడు చేయాల్సిన పనిని నేనెందుకు చేయాల్సి వచ్చిందని మీరు అనుకోవచ్చు. అది తెలియాలంటే.. నేనెక్కడి నుంచి వచ్చానో ముందు చెప్పాలి. మాది నెల్లూరు. నాన్న విద్యుత్తుశాఖలో లైన్‌మ్యాన్‌గా పనిచేసేవారు. కానీ అనారోగ్య కారణాలతో నేను పదోతరగతి చదివేటప్పుడే చనిపోయారు. మా జీవితాల్లో అదో పెద్ద కుదుపు. కానీ అప్పటికే అన్నయ్య ఉద్యోగం చేస్తుండటంతో నేను చదువు ఆపేయాల్సిన పరిస్థితి రాలేదు. అప్పుడే అనిపించింది.. ఒకరిపై ఆధారపడకుండా ఉండాలంటే సొంతకాళ్లపైన నిలబడటం చాలా అవసరం అని. అందుకే డిగ్రీ చదువుతున్నప్పుడే నేను వివిధ రకాల కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తీసుకున్నా. ఖాళీ సమయంలో ఆంధ్రా బ్యాంకు, వైశ్య బ్యాంకు ఉద్యోగులకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాను. వాళ్లకు కంప్యూటర్ కోర్సులు నేర్పడం వల్ల నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. సొంతంగా నేనేదయినా చేయాలనే తపనా అప్పుడే పెరిగింది. అందుకే ఎంబీఏ చేశా. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా హైదరాబాద్ బాలానగర్‌లో ఓ ఆటోమొబైల్ పరిశ్రమలో చేరా. ఆ పరిశ్రమ మా అన్నయ్య స్నేహితుడిదే కావడంతో ఇంటర్న్‌షిప్‌ని ఏదో మమ అనిపించేయడం కాకుండా ప్రతి పనినీ దగ్గరుండి నేర్చుకున్నా. రోజురోజుకీ ఆ పనిలో నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది. ఏదో కొన్ని నెలల ఇంటర్న్‌షిప్ అనుకున్నది కాస్తా అదే నా కెరీర్ అయితే బాగుండును అనిపించే స్థాయికి వెళ్లింది. దాంతో ఆ పరిశ్రమలోనే నా కెరీర్‌ని కొనసాగించాను. ఆటోమొబైల్ విడిభాగాలు తెప్పించడం, వాటితో ఉత్పత్తులు తయారుచేయడం, వాటి పనితీరుని పరీక్షించడంతో మొదలైన నా పాత్ర చివరకు అమ్మకాలూ, లాభాల్లో కూడా కీలకంగా మారింది. ఐదేళ్లు అదే పరిశ్రమలో పనిచేశా. అప్పటికి సొంతంగా ఓ పరిశ్రమను పెట్టే ధైర్యం కూడా వచ్చేసింది.

**అనుకున్నట్టుగానే...** హైదరాబాద్ నుంచి నెల్లూరు వచ్చేశాను. సొంతంగా ఫ్యాక్టరీ పెట్టేయడం తేలికే అనుకున్నా. కానీ అప్పుడే అర్థమైంది. ఎవరో పెట్టిన పరిశ్రమలో పనిచేయడం వేరు... సొంతంగా ఏర్పాటు చేయడం వేరు అని. ఎందుకంటే అసలు ఎక్కడ నుంచి మొదలుపెట్టాలో అర్థం కాలేదు. దరఖాస్తు ఎలా పెట్టుకోవాలి... పెట్టుబడి ఎక్కడ నుంచి తీసుకురావాలి వంటి ప్రశ్నలు మొదలయ్యాయి. మొదట్లో కాస్త తడబడినా గతంలో పరిశ్రమ అమ్మకాల విభాగంలో పనిచేశాను కాబట్టి.. ముందుగా ప్రాజెక్టు వర్క్‌ని పక్కాగా తయారుచేసి పెట్టుకున్నాను. నేనాశిస్తున్న లాభాలని పకడ్బందీగా రాసిపెట్టాను. కానీ... పెట్టుబడుల కోసం బ్యాంకుల చుట్టూ మూడు నెలల పాటూ తిరిగినా ఫలితం లేకపోయింది. కారణం... 'అమ్మాయివి ఈ రంగం నీకు సూట్ కాదేమో' అని కొందరంటే, 'అబ్బే! ఇప్పుడు ఇలానే అంటారు.. రేప్పొద్దున పెళ్లయితే మావారు ఎక్కడుంటే నేనూ అక్కడే అంటూ పరిశ్రమను మూసేస్తారు. అప్పుడు రుణం ఎలా తీరుస్తావు' అంటూ నా ఎదురుగానే ఎగతాళి చేశారు మరికొందరు. అలాంటి పెదవి విరుపులూ, ఎగతాళి మాటలు చాలానే చూశాను. ఓ దశలో చాలా నిరాశ వచ్చేసింది కానీ నా ప్రయత్నం ఆపుకోలేదు. చివరకు ధైర్యం చేసి ఓ రోజు ఓ బ్యాంకు ఉన్నతాధికారిని కలిసి ఆయన సాయంతో పైఅధికారులకి నా ప్రాజెక్టు రిపోర్ట్‌ని ఇచ్చా. అది చూసి యాభైలక్షల రూపాయల రుణం అందించారు. అది నా తొలి విజయం. ఆ రుణంతో నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో నాలుగేళ్ల క్రితం వెంకటరమణ క్యాస్టింగ్స్ పేరుతో ఆటోమొబైల్ విడిభాగాల తయారీని మొదలుపెట్టాను.

**400 డిగ్రీల వేడిలో...** ఎండాకాలం ఎండకే అమ్మో అనుకుంటాం కదా! నేను మాత్రం 400 డిగ్రీల ఉష్ణోగ్రతలో కొలిమి భగభగమండుతుంటే ఆ వేడిసెగలో నట్లూ, బోల్టులూ తయారు చేయడం మొదలుపెట్టా. ఆ వేడికి చెప్పలేనంత నీరసం వచ్చేసేది. అయినా పట్టుదలగా చిన్న చిన్న పనులు కూడా నేనే స్వయంగా చూసుకునేదాన్ని. అంత చిన్న పనులు కూడా నువ్వే ఎందుకు చూడాలి అంటారా? ఆడపిల్లలు పరిశ్రమలు నడపలేరు అన్న బ్యాంకు అధికారుల మాటలు నిజం చేయకూడదనే! కొత్తగా వచ్చేవారికి ఆ పనులు ఎలా చేయాలో నేర్పించేదాన్ని. పుణె నుంచి వచ్చిన ముడిసరకుతో ఇక్కడ విడిభాగాలు చేసేదాన్ని. నెమ్మదిగా సంస్థ సామర్థ్యాన్ని పెంచుతూ మా పరిశ్రమలో ఏసీ ఉపయోగించే ఎంటెన్ నట్లూ, ఫ్యాన్లూ, మోటార్లూ, భారీ నౌకలకు అవసరం అయిన విడిభాగాలూ తయారుచేసి అందించడం మొదలుపెట్టాను. మా పరిశ్రమ ఊరికి దూరంగా ఉండటంతో అంతగా జన సంచారం ఉండేది కాదు. దాంతో బిక్కుబిక్కుమంటూ ఒక్కదాన్నే పనిచేసుకుంటూ ఉండిపోయిన సందర్భాలు ఎన్నో. పరిశ్రమ పెట్టిన ఏడాదికి అనుకుంటా. పెద్ద తుఫాను. దాంతో ఫ్యాక్టరీలోకి నీళ్లు వచ్చేసాయి. ఇంకేముంది మోటార్లూ, పరికరాలు అన్నీ నీటిలో మునిగిపోయాయి. యంత్రాల్లోకి నీరుచేరిపోయింది. ఎక్కడ చూసినా పాములూ, తేళ్లూ, జెర్రులూ! అడుగు తీసి అడుగు వేయాలంటే భయం వేసేది. దానికి తోడు పరికరాలు నీటిలో నాని పనిచేయకుండా మొరాయించాయి. భారీ నష్టం తప్పలేదు. ఆ సమయంలో బీమా సదుపాయం లేకపోతే ఏమయ్యేదాన్నో అనిపిస్తుంది ఇప్పటికీ!



**పల్సర్‌కి మా విడిభాగాలే...** మా ఉత్పత్తుల నాణ్యత చూసి ద్విచక్ర వాహనాలు తయారుచేసే సంస్థలూ, ఫ్యాన్ల తయారీదారులు మమ్మల్ని సంప్రదించడం మొదలుపెట్టారు. ప్రస్తుతం రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్ వంటి వాహనాలకు విడిభాగాలు చేస్తున్నాం. గ్యాస్ రెగ్యులేటర్లూ, నాబ్స్, బ్లేడ్లూ, వాహనాల్లోని పెట్రోల్ ట్యాంకులకు సంబంధించిన విడిభాగాలు చేస్తున్నా. అవి కాకుండా రోజుకి వెయ్యి ఫ్యాన్లు తయారుచేస్తున్నాం. ప్రస్తుతం బజాజ్, క్రాంప్టన్ వంటి సంస్థలకు ఫ్యాన్లు తయారుచేసిస్తున్నాం. మా సంస్థలో పదిహేను మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఏడాదికి కోటిన్నరవరకూ టర్నోవర్ సాధిస్తున్నా. ఇంకా విస్తరించే ఆలోచనలో ఉన్నా.

– ఓసూరి మురళీకృష్ణ, ఈనాడు, నెల్లూరు

# రెండు జళ్ల సొగసిది!

**సిగ సింగారం**

**చిన్నప్పుడు రెండు జడలు వేసుకోవడం అంటే భలే సరదా! కానీ పెద్దయ్యాకా కాలేజీకీ, వేడుకలకూ అలా వేసుకెళ్లాలనుకుంటాం కానీ... చిన్న బెరుకు. అయితే ఈసారి ఇలా ప్రయత్నించి చూద్దాం.**





1. ముందుగా జుట్టుని చిక్కుల్లేకుండా వెనక్కి దువ్వుకుని... చెరోవైపు నుంచి రెండు పాయలని తీసుకుని పోనీ మాదిరిగా రబ్బరు బ్యాండు పెట్టుకోవాలి.



2. కుడివైపు రబ్బరు బ్యాండు పెట్టగా మిగిలిన జుట్టుతో చెంప పక్క నుంచి ఒక జడ వేసుకుంటూ రావాలి. చిత్రంలో చూపించినట్టుగా ఒక పాయని రబ్బరు బ్యాండు పక్కనున్న జుట్టు నుంచి తీసుకుని కలుపుతూ అల్లుకోవాలి.



3. ఇలా కొంతవరకూ వచ్చిన తర్వాత తల్లోంచి పాయ తీయడానికి సాధ్యం కాదు. అప్పుడు మిగిలిన జడ చివరి వరకూ అల్లుకుని రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి.



4. ఇలానే ఎడమవైపు కూడా ఒక జడ వేసుకుంటూ వచ్చి రబ్బరు బ్యాండు పెట్టుకోవాలి.

5. చివరగా రెండు జడలని కలిపి ఒక రబ్బరు బ్యాండు పెట్టుకోవాలి.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.

# గురిచూసి కొట్టండి...

**చిన్నవో, పెద్దవో లక్ష్యాలు అందరికీ ఉంటాయి. అది చదువు, ఉద్యోగం ఏదయినా కావచ్చు. వాటిని చేరుకోవడంలో ఎదురయ్యే సవాళ్లను అందిపుచ్చుకుంటూనే లక్ష్యాన్ని చేరుకోవాలి. దానికేం చేయాలంటే..**

లక్ష్యం ఎప్పుడూ వాస్తవికంగా ఉండాలి. అలా కాకుండా ఆకాశానికి నిచ్చెనలు వేయడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. అప్పుడే మీరు మీ లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. అలా కాకుండా అవాస్తవిక అంచనాలతో మిమ్మల్ని మీరు మోసం చేసుకునే ప్రయత్నం చేయడం వల్ల ఆచరణలో వెనక ఉండిపోతారు. నిరాశ మిమ్మల్ని చుట్టుముట్టే ప్రమాదం ఉంటుందని మరవకూడదు.



విజయం మిమ్మల్ని వందశాతం వరించాలంటే వందశాతం కష్టపడటం అలవాటుగా మార్చుకోవాలి. ప్రతి పరాజయం మీకో అనుభవం కావాలి తప్ప నిరాశకు, నిస్పృహకూ కారణం కాకూడదు. అప్పుడే మీరు అనుకున్నది సాధించగలుగుతారు.

పొరపాటు జరిగిన ప్రతిసారీ అయ్యో అనుకోవడమే కాదు దాన్ని సరిదిద్దుకోవడానికి ఏం చేయాలో ఆలోచించాలి. ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు సమీక్షించుకోవాలి. అవసరాన్ని బట్టి అదనంగా మీకు కావలసిన నైపుణ్యాలనూ సానబెట్టుకోవాలి. అప్పుడే సరైన మార్గంలో అడుగులేస్తూ లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలుగుతారు.

# పెదాలకు లేత రంగులు...

**మన సహజ అందానికి నిండుదనం తేవాలంటే.. కాస్తయినా అలంకరణ చేసుకుంటాం. కానీ అలంకరణలో చేయకూడని కొన్ని పొరపాట్ల గురించి మనకు కాస్త అవగాహన ఉండాలి. లేదంటే పెద్దవారిలా కనిపిస్తాం.**

చర్మ రంగుకి తగిన ఫౌండేషన్‌ని మాత్రమే ఉపయోగించాలి. లేత రంగు చర్మం ఉన్నవారు ముదురు రంగు ఫౌండేషన్‌ని అసలు వాడకూడదు. లేదంటే ముఖంలో సహజ అందం పోయి పెద్దవారిలా కనిపించే ప్రమాదం ఉంటుంది.

అలంకరణ చేసుకునే ముందు ప్రైమర్‌ని తప్పనిసరిగా వినియోగించాలి. దాన్ని నిర్లక్ష్యం చేస్తే గనుక ఫౌండేషన్ త్వరగా చెదిరిపోతుంది.

కళ్ల కింద చారలూ, మచ్చలూ కనిపించకుండా కన్సీలర్ వేసుకుంటాం కదా.. దాన్ని అధికంగా వాడటం వల్ల ఆ చారలు మరింతగా కనిపిస్తాయి. అందుకే దాన్ని చాలా పరిమితంగానే వేసుకోవాలి.

వయసు పైబడుతున్న కొద్దీ పెదాల ఆకారం మారుతుంది. అలాంటప్పుడు ముదురు రంగు లిప్‌స్టిక్ వేసుకుంటే గనుక.. ఆ సమస్య ఇంకాస్త ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి వీలైనంతవరకూ లేత రంగుల్ని ఎంచుకోవాలి.



కళ్లకు మందంగా ఐలైనర్ వాడితే కనురెప్పలు బరువుగా అనిపించడంతో పాటు వయసు పెరిగినట్లు కనిపిస్తుంది. దీనికి బదులుగా ఒక కోటింగ్ మాత్రమే వేసుకుంటే చాలు. మస్కారా విషయంలోనూ ఇదే జాగ్రత్త తీసుకోవాలి.

కనుబొమ్మల్ని కూడా మరీ గీసినట్టుగా కాకుండా.. సహజంగా ఉండేలా చూసుకోవాలి. కనుబొమల ఆకృతిని దృష్టిలో పెట్టుకునే.. వాటిని పెన్సిల్‌తో గీసుకోవాలి తప్ప అతిగా కాదు.

# రోగనిరోధకశక్తికి మొక్కజొన్న

**చల్లటి గాలి... సన్నటి జల్లులు పడుతుంటే ఎంత హాయిగా అనిపిస్తుందో కదా.. ఇలాంటప్పుడు ఏదైనా వేడివేడిగా తింటే ఆ మజాయే వేరు. ఈసారి ఉప్పూ, కారం, నిమ్మరసం పట్టించిన మొక్కజొన్న తిని చూడండి. దీనివల్ల ఎన్నో లాభాలు కూడా ఉన్నాయి.**

మొక్కజొన్నలో పిండిపదార్థాలతోపాటూ పోషకాలూ ఎక్కువే. దీనిలో ఎ, బి విటమిన్లూ, మెగ్నీషియం, పొటాషియం, జింక్, ఇనుము ఖనిజాలు కూడా ఉంటాయి. చక్కెర శాతం తక్కువ కాబట్టి నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.

పీచుశాతం కూడా మొక్కజొన్నలో ఎక్కువే. ఈ పొత్తును మీ రోజువారీ ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం వల్ల జీర్ణక్రియ పనితీరు సాఫీగా సాగుతుంది. దాంతో పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది.

మొక్కజొన్నలో గ్లూటెన్ ఉండదు. కాబట్టి గోధుమల స్థానంలో దీని పిండిగా కూడా వాడుకోవచ్చు. ఇది మన ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.



ఇది ఎముకలకు బలాన్నిచ్చి అవి గట్టిగా అయ్యేలా తోడ్పడుతుంది. ఫలితంగా భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి.

రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు దీన్ని తీసుకోవడం వల్ల సమస్య తగ్గుతుంది. పైగా రక్తహీనత సమస్య కూడా అదుపులో ఉంటుంది.

బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఆహారం. దీనివల్ల చర్మ సమస్యలు కూడా అదుపులో ఉంటాయి.

ఇది మధుమేహాన్నే కాదు.. అధిక రక్తపోటును కూడా అదుపులో ఉంచుతుంది.

## నజరానా

ఎండిన కమలాఫలం తొక్కల్ని కుండీల్లో వేయండి. వీటిలోని మెగ్నీషియం, సల్ఫర్ పోషకాలు కీటకనాశినిగా పనిచేస్తాయి.




2న ముగింపు-క్రితం

| | హైదరాబాద్ | | విజయవాడ | |
|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | ------- | ------- | 29,600 | 29,700 |
| ఆర్నమెంట్ | ------- | ------- | 27,500 | 27,500 |
| వెండి (కిలో) | ------- | ------- | 39,500 | 39,600 |
| | ప్రొద్దుటూరు | | రాజమండ్రి | |
| బంగారం(24క్యా) | 29,600 | 29,600 | 29,170 | 29,260 |
| ఆర్నమెంట్ | 27,410 | 27,470 | 27,270 | 27,360 |
| వెండి (కిలో) | 39,700 | 39,700 | 38,250 | 39,000 |
| | విశాఖపట్నం | | తమిళనాడు | |
| బంగారం(24క్యా) | 29,730 | 29,780 | ------- | ------- |
| ఆర్నమెంట్ | 27,350 | 27,400 | 2,727 | 2,736 గ్రా |
| వెండి (కిలో) | 39,900 | 39,900 | 40.90 | 41.70 గ్రా |

# అన్నదమ్ములతో సమానంగా ఆస్తి రాదా?

**మాది ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొర్రూరు. 1995లో నాకు అబ్బాయి పుట్టగానే ఆయన నాకు విడాకులిచ్చారు. అప్పటి నుంచి నేను అమ్మానాన్నల దగ్గరే ఉంటూ కూలీ పనిచేస్తూ బాబుని చదివించుకుంటున్నాను. నాకు ముగ్గురు అన్నదమ్ములు. అమ్మానాన్న బతికున్నప్పుడే ఆ ముగ్గురూ తలో ఎకరం ఆస్తి పంచుకుని ఇరవై ఏళ్లుగా అనుభవిస్తూ వస్తున్నారు. నాకు రెండుగుంటలు మాత్రం ఇచ్చారు. ఇప్పుడు మా వాడు కాస్త పెద్దవాడవుతున్నాడు. 'అమ్మా! ఆస్తి విషయంలో నీకు అన్యాయం జరిగింది. నీకు వాళ్లతో పాటు సమానంగా భూమి రావాల్సింది. అనవసరంగా వదులుకున్నావు. ఇప్పటికన్నా మనం న్యాయస్థానానికి వెళదాం!' అంటున్నాడు. వాడి మాటలు నిజమేనా? నాకు మా అమ్మానాన్నల ఆస్తి నుంచి మా అన్నదమ్ములతో సమానంగా ఆస్తి వస్తుందా? ఇంతకాలమయ్యాక మేం న్యాయస్థానానికి వెళ్లొచ్చా? - ఓ సోదరి**

**డియర్ వసుంధర**



జి. వరలక్ష్మి
న్యాయవాది

ఆస్తిలో మీ వాటాకి సంబంధించి ఎప్పుడైనా న్యాయస్థానానికి వెళ్లొచ్చు. కాలపరిమితంటూ ఏదీ లేదు. కాకపోతే మీ కేసు విషయంలో ఓ కీలక అంశంపై స్పష్టత రావాలి. అది.. ఆ ఆస్తి మీ నాన్నకి పిత్రార్జితంగా వచ్చిందా, స్వార్జితమా అన్నది. పిత్రార్జిత ఆస్తిలోనూ మరికొన్ని విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి. మీ నాన్నగారికి ఈ ఆస్తి మీ తాతయ్య వీలునామా ద్వారా వచ్చిందా? ఒకవేళ ఆయన వీలునామా రాయకుండా చనిపోయి, మీ నాన్నకి ఇంకెవ్వరూ అన్నదమ్ములూ లేని పరిస్థితుల్లో ఆయన చేతికి వచ్చిందనుకుందాం. అప్పుడది పిత్రార్జితం అవుతుంది. అలా కాకుండా ఆయన తన అన్నదమ్ముల దగ్గర్నుంచి పంచుకుని ఉంటే దాన్ని 'సెల్ఫ్ అక్వయిర్డ్ ప్రాపర్టీ' అని అంటారు. మీ తాతగారి ద్వారా కాకుండా వేరే ఇంకెవరైనా ఆయనకి రాసి పెడితే దాన్ని 'సెపరేట్ ప్రాపర్టీ' అని అంటారు. ఈ మూడు సందర్భాల్లోనూ మీకు ఆస్తి హక్కుంటుంది. మీ లేఖని బట్టి మీ నాన్నగారు ఉండగానే మీ సోదరులకీ, మీకూ పంచినట్టు తెలుస్తోంది. ఆయన అప్పుడే మీకు అందులో సమాన వాటా ఇచ్చి ఉండాలి. అలా చేయలేదు. దాన్ని కారణంగా చూపి ఇప్పుడు మీరు దావా వేయొచ్చు. హిందూ వారసత్వ చట్టం 1956కి చేసిన సవరణ(సెక్షన్ 29ఎ) ప్రకారం కూతుళ్లకీ కొడుకులతో సమానంగా ఆస్తి హక్కుంటుంది. కాకపోతే వాళ్లకి 1985 తర్వాత పెళ్లై ఉండాలి. మీ పెళ్లి ఆ తర్వాతే జరిగి ఉంటే మీరు న్యాయస్థానానికెళ్లొచ్చు. ఒకవేళ మీ నాన్నగారు పంచిన ఆస్తి స్వార్జితమైతే.. దాన్ని ఆయన ఎవరికైనా పంచొచ్చు. దాన్ని మీరు ప్రశ్నించడానికి లేదు. కానీ ఆయన తన పిత్రార్జిత ఆస్తిని అమ్మి కొత్తగా ఈ ఆస్తిని కొన్నాడనుకుందాం! అప్పుడు.. అది కూడా పిత్రార్జితంగా పరిగణించి మీకూ హక్కు కల్పిస్తారు. ఇవన్నీ ఆ ఆస్తి పత్రాలు చూస్తే కానీ తేలవు. కాబట్టి, ఓ మంచి న్యాయవాదిని చూసి వివరాలు చెప్పండి. పిత్రార్జిత ఆస్తే అయితే మీ సోదరులకి నోటీసులు పంపి భాగం అడగండి. దానికి వాళ్లిచ్చే సమాధానాన్ని బట్టి ముందుకెళ్లాలి. వాళ్లు కుదర్దు అంటే మధ్యవర్తుల ద్వారా మాట్లాడించండి. దానికీ దిగిరాకపోతే.. అప్పుడు వాటా కోరుతూ దావా వేయొచ్చు. ఏదేమైనా న్యాయవాదిని చూశాకే నిర్ణయం తీసుకోండి.

| సెన్సెక్స్ ▼ 98 | నిఫ్టీ ▼ 33 | రూపాయి 63.70 ▲ | బంగారం 28,580 ▼ | వెండి 37,910 ▼ | ముడి చమురు 52.13 ▲ |
|---|---|---|---|---|---|
| 32477 | 10081 | (ఒక అమెరికా డాలరుకు) 37 పైసలు | (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 65 | ముంబయిలో కిలో రూ.లలో 350 | (బ్రెంట్ ధర డాలర్లలో) |




**ప్రధాన ప్రపంచ మార్కెట్లు**

| సూచీ | ముగింపు | లాభం/నష్టం |
|---|---|---|
| డోజోన్స్ | 22,007 | +43 |
| నాస్‌డాక్ | 6,355 | −08 |
| నిక్కీ 225 (జపాన్) | 20,080 | +94 |
| స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్) | 3,349 | +11 |
| షాంఘై(చైనా) | 3,286 | −06 |
| ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్) | 7,411 | −12 |
| డాక్స్ (జర్మనీ) | 12,181 | −70 |

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


**విదేశీ మారకపు రేట్లు**

(థామస్ కుక్) (రూ.లలో)



| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలరు | 58.35 | 67.66 |
| పౌండ్ స్టెర్లింగ్ | 76.98 | 89.32 |
| యూరో | 68.89 | 79.88 |
| జపనీస్ యెన్/100 | 52.78 | 61.20 |
| ఆస్ట్రేలియా డాలరు | 46.40 | 53.67 |
| సింగపూర్ డాలరు | 42.88 | 50.80 |
| థాయ్ బాత్/100 | 175.09 | 209.39 |
| బహ్రెయిన్ దీనార్ | 158.11 | 181.08 |
| కువైట్ దీనార్ | 175.29 | 218.85 |
| సౌదీ రియాల్ | 15.52 | 18.39 |
| యూఏఈ దిర్హమ్ | 15.88 | 18.56 |
| మలేషియా రింగిట్ | 13.32 | 16.38 |

**బుధవారం నిఫ్టీ కదలికలు**




# జిగ్నేశ్ బృందంపై సెబీ కొరడా

● ఎన్ఎస్ఈఎల్ కుంభకోణం కేసులో 13 మందిపై కఠిన చర్యలు ● నష్టం రూ.125 కోట్లుగా నిర్ధారణ

**ముంబయి:** ఎన్ఎస్ఈఎల్ (నేషనల్ స్పాట్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్) కుంభకోణం కేసులో కఠిన చర్యలకు సెబీ ఉపక్రమించింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)తో పాటు ఈ సంస్థకు గతంలో ప్రమోటర్ అయిన ఫైనాన్షియల్ టెక్నాలజీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఎల్) షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు 13 మంది పాల్పడ్డారని నిర్ధారించింది. ఆ సమయంలో ఎఫ్‌టీఐఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అయిన జిగ్నేశ్ షాపై నేరుగా ఆదేశాలివ్వకపోయినా, ఆయన సన్నిహిత బంధువులపై కఠిన చర్యలకు సెబీ పూర్తికాల సభ్యుడు ఎస్.రామన్ ఆదేశాలిచ్చారు. ఎన్ఎస్ఈఎల్‌కు కూడా ఎఫ్‌టీఐఎల్ ప్రమోటరే. అందువల్ల ఎన్ఎస్ఈఎల్ కేసుకు సంబంధించి, తమకు ఉన్న ముందస్తు సమాచారంతో ఈ 13 మంది ఎంసీఎక్స్, ఎఫ్‌టీఐఎల్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిర్వహించారని, ఫలితంగా రూ.125 కోట్ల నష్టాలు తలెత్తాయని పేర్కొంది. ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలని సెబీ బుధవారం ఆదేశాలు ఇచ్చింది. ఎఫ్‌టీఐఎల్ పేరును ఇప్పుడు 63మూన్స్ టెక్నాలజీస్ లిమిటెడ్‌గా



మార్చారు. సెబీ ఆదేశాలను పరిశీలించాక, స్పందిస్తామని 63 మూన్స్ తెలిపింది. సెబీ ఆదేశాలు కొంతమంది వ్యక్తులకే కానీ, సంస్థకు కాదని పేర్కొంది. చెల్లింపుల సంక్షోభం తలెత్తడంతో, ఎఫ్‌టీఐఎల్ ప్రమోట్ చేసిన ఎన్ఎస్ఈఎల్ 2013 జులై 31న ట్రేడింగ్‌ను నిలిపి వేయాల్సి వచ్చింది. దీనిపై నియంత్రణ సంస్థలతో పాటు విచారణ సంస్థలు కూడా పరిశీలన జరిపాయి. ఎంసీఎక్స్, ఎఫ్‌టీఐఎల్ షేర్ల లావాదేవీలను క్షుణ్నంగా పరిశీలించి, సెబీ ఇచ్చిన తాజా ఆదేశాల ప్రకారం..

✦ ఎఫ్‌టీఐఎల్‌కు సంబంధించి ఎంసీఎక్స్ మాజీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) శ్రీకాంత్ జవల్‌గేకర్, ఆయన భార్య ఆశా, జిగ్నేశ్ షా సోదరుడు మనీశ్ షా, ఆయన తండ్రి ప్రకాశ్ షా, ఎఫ్‌టీఐఎల్ ఉద్యోగి, ఎన్ఎస్ఈఎల్ మాజీ డైరెక్టర్ హరిహరన్ వైద్యలింగం, ఎఫ్‌టీఐఎల్ ఉద్యోగి వి.అరవింద్‌కుమార్ అయ్యంగార్, ఆయన భార్య ధనశ్రీ, ఎఫ్‌టీఐఎల్ డైరెక్టర్ రవి శేథ్ సోదరుడు కనైలాలలపై ఆదేశాలిచ్చింది.

✦ ఎంసీఎక్స్‌కు సంబంధించి ఆదేశాల్లోనూ జవల్‌గేకర్ ఆయన భార్య ఆశా, హరిహరన్ వైద్యలింగం కూడా ఉన్నారు. వీరితో పాటు ఎంపీఎక్స్ మాజీ అధిపతి జోసెఫ్ మాసే, ఎంసీఎక్స్ మాజీ డైరెక్టర్ పరాస్ అజ్మేరా, ఎన్ఎస్ఈఎల్ మాజీ సీఈఓ అంజని సిన్హా, జిగ్నేశ్ షా సోదరుడు, ఎఫ్‌టీఐఎల్ డైరెక్టర్ అయిన మంజయ్ షా భార్య తేజాల్ షా, ఎఫ్‌టీఐఎల్ సీనియర్ ఉపాధ్యక్షుడు మహమూద్ వైద్ ఉన్నారు.

## వసూలుకు ఇవీ చర్యలు

✦ రూ.125 కోట్ల జమకు ప్రత్యేక ఎస్క్రో ఖాతా నిర్వహించాలి. అందులో మొత్తం జమ చేసే వరకు, ఈ 13 మంది తమ ఆస్తులు, నగదు, సెక్యూరిటీలను విక్రయించకూడదు, ఎవరికీ బదలాయించకూడదు. 7 రోజుల్లోగా తమ ఆస్తులు, నగదు, బ్యాంక్ ఖాతా వివరాలు, డీమ్యాట్ ఖాతాలు, షేర్లు, సెక్యూరిటీల వివరాలు, కంపెనీలలో వాటాల వివరాలను కూడా అందివ్వాలి.

✦ తన అనుమతి లేకుండా వీరి ఖాతాల నుంచి నిధుల ఉపసంహరణకు అనుమతి ఇవ్వవద్దని బ్యాంకులను సెబీ ఆదేశించింది. ఒక్క ఎస్క్రో ఖాతాకు మాత్రమే నిధులు బదలాయించేందుకు మాత్రం అనుమతించాలని పేర్కొంది.

✦ డీమ్యాట్ ఖాతాల నుంచి కూడా విక్రయాలకు, ఉపసంహరణకు తన అనుమతి లేకుండా అనుమతించవద్దని డిపాజిటర్లకు సెబీ దిశానిర్దేశం చేసింది. అయితే వీరి ఖాతాల్లోకి నిధులు జమచేయడాన్ని మాత్రం అనుమతించాలని సూచించింది.

✦ తమ ఆదేశాలకు 21 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని కూడా సదరు 13 మందినీ సెబీ ఆదేశించింది.

# పావు సరిపోలే

● మార్కెట్లను మెప్పించని ఆర్‌బీఐ సమీక్ష

● సూచీలకు నష్టాలు

**సమీక్ష**

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష రోజున మార్కెట్లు ఒడుదొడుకులు ఎదుర్కోవడం సాధారణం. అయితే ఈ సారి ప్రకటనకు మార్కెట్లు పెద్దగా స్పందించలేదనే చెప్పుకోవాలి. పావు శాతం రేట్ల కోత మదుపర్లను మెప్పించడంలో విఫలమైంది. నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)లో మార్పులు చేయకపోవడం సైతం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా ప్రారంభ ట్రేడింగ్‌లో రికార్డు గరిష్ఠాలకు చేరిన సూచీలు.. చివరకు నష్టాలతో ముగిశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటంతో ఐటీ షేర్లు కళతప్పాయి..

సెన్సెక్స్ ఉదయం 32,641.58 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. అనంతరం నష్టాల్లోకి జారిపోయిన సూచీ.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఇంట్రాడేలో 32,394.89 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. చివరకు 98.43 పాయింట్ల నష్టంతో 32,476.74 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 33.15 పాయింట్లు కోల్పోయి 10,081.50 దగ్గర ముగిసింది.

**హీరో అదుర్స్:** జులై విక్రయాల్లో 17% వృద్ధి కారణంగా హీరో మోటోకార్ప్ షేర్లు దూసుకెళ్లాయి. 2.12% లాభంతో రూ.3,800.35 వద్ద ముగిసింది.

✦ ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో కోటక్ మహీంద్రా 1.39%, ఇండస్ఇండ్ బ్యాంక్ 0.9%, ఎస్‌బీఐ 0.37%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.20%, ఫెడరల్ బ్యాంక్ 0.13%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.04% మేర తగ్గాయి.

✦ వాహన షేర్లలో అశోక్ లేలాండ్ 1.71%, టాటా మోటార్స్ 1.66%, టీవీఎస్ మోటార్ 1%, ఐషర్ మోటార్స్ 0.84%, ఎం అండ్ ఎం 0.82%, బజాజ్ ఆటో 0.74% చొప్పున నష్టపోయాయి.

✦ స్థిరాస్తి షేర్లకు సైతం అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. యునిటెక్ 4.31%, శోభా 2.28%, గోద్రేజ్ ప్రోపర్టీస్ 1.74%, ఒబెరాయ్ రియాల్టీ 1.04%, ఒమాక్సే 0.64%, డీఎల్ఎఫ్ 0.23% మేర డీలాపడ్డాయి.

## నేటి మార్కెట్

సూచీల నష్టాలు కొనసాగొచ్చు. ద్రవ్య పరపతి విధానంపై తటస్థ వైఖరి పాటించాలని ఆర్‌బీఐ నిర్ణయించడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాదిలో సెన్సెక్స్, నిఫ్టీలు ఇప్పటివరకు 21 శాతం లాభాలు నమోదు చేశాయి. ఈ నేపథ్యంలో మదుపర్లు కొంత అప్రమత్తత పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. మదుపర్లు కంపెనీల త్రైమాసిక ఫలితాలపై దృష్టి పెట్టొచ్చని అంటున్నారు. నేడు ఐటీసీ, సియట్, టైటన్ వంటి కంపెనీలు త్రైమాసిక ఫలితాలు వెలువరించనున్నాయి. ఈ ప్రభావం వాటి షేర్లపై పడే అవకాశం ఉంది. టవర్ల వ్యాపారాన్ని బ్రూక్‌ఫీల్డ్ అసెట్‌కు విక్రయించేందుకు, ఎయిర్‌సెల్‌తో విలీనం పూర్తిచేసేందుకు కంపెనీ రుణదాతలు ఆమోదం తెలపడంతో రిలయన్స్ కమ్యూనికేషన్స్ షేర్లు వెలుగులోకి రావొచ్చు.

## ఖాతాదారులకు నార్డ్ ప్రత్యేక సేవలు

**ఈనాడు, హైదరాబాద్:** విమానాశ్రయాల్లో బ్యాగుల తరలింపునకు వినియోగించే కన్వేయర్ బెల్టులు మొదలైన వాటిలో వినియోగించే గేరు మోటార్లు, తదితర ఉత్పత్తులను అందిస్తున్న జర్మనీ కంపెనీ నార్డ్ డ్రైవ్‌సిస్టమ్స్ తన ఖాతాదారులకు సర్వీసింగ్ సేవలందించడానికి హైదరాబాద్‌లో తొలిసారిగా 'ఎక్స్ట్రామైల్ సర్వీస్' వాహనాన్ని ప్రవేశపెట్టింది. తమ ఉత్పత్తులను వినియోగిస్తున్న ఖాతాదారులు మరమ్మతు పరమైన ఇబ్బందులు తలెత్తినప్పుడు ఖాతాదారు వద్దకే వచ్చి నార్డ్ సేవలు అందిస్తుంది. భారత్‌లో జీఎస్‌టీ అమలులోకి వచ్చిన నేపథ్యంలో గోదాముల కార్యకలాపాలు బాగా పెరుగుతాయని, దీని వల్ల తమ కంపెనీ వ్యాపారం వృద్ధి చెందుతుందని నార్డ్ జీఎంబీహెచ్ ఎగ్జిక్యూటివ్ భాగస్వామి, గ్లోబల్ ఎండీ ఉల్‌రిచ్ కుచిమిస్టర్ తెలిపారు. కంపెనీ మొత్తం ఆదాయంలో భారత్ వాటా 5 శాతం ఉందని నార్డ్ డ్రైవ్‌సిస్టమ్స్ ఇండియా ఎండీ పి.ఎల్.ముత్తుశేఖర్ చెప్పారు. భారత్‌లో గేర్‌మోటార్ల మార్కెట్ రూ.900 కోట్లు ఉందని, ఇందులో తమ విక్రయాలు రూ.135 కోట్లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పరిశ్రమల ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్, ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ (పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్) ఎ.ఆర్.సుకుమార్ తదితరులు హాజరయ్యారు.

## మిస్త్రీ ఆరోపణలు నిరాధారం

### టాటా గ్రూప్ కంపెనీలు

**దిల్లీ:** టాటా గ్రూప్ సంస్థలు కార్పొరేట్ పరిపాలనా నిబంధనలను ఉల్లంఘించాయని మాజీ ఛైర్మన్ సైరస్ మిస్త్రీ చేసిన ఆరోపణలను టాటా సన్స్ మరోసారి ఖండించింది. నష్టాల్లో ఉన్న టాటా నానో ప్రాజెక్టును మూసివేయకుండా నడుపుతున్నారని పేర్కొనడంతో పాటు టాటా గ్రూప్ కంపెనీల పరిపాలనా అంశాలపైనా మిస్త్రీ పలు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా తప్పని, ఎటువంటి ఆధారాలు లేకుండా చేశారని టాటా మోటార్స్ 2016-17 నివేదికలో పేర్కొంది. కోరస్ కొనుగోలుకు అధిక మొత్తం వెచ్చించారన్న ఆరోపణలను టాటా స్టీల్ ఖండించింది. దీర్ఘకాల వ్యూహంలో భాగంగా ఆ నిర్ణయం తీసుకున్నట్లు వార్షిక నివేదికలో వెల్లడించింది. తాజ్ బ్రాండ్‌ను ప్రమోట్ చేయడంతో కార్యకలాపాలు విస్తరించేందుకే పలు కొనుగోళ్లు, విక్రయాలు జరిపామని ఇండియన్ హోటల్స్ తెలిపింది.

# రాణించిన పీఎన్‌బీ

● లాభంలో 12 శాతం వృద్ధి

● తగ్గిన నిరర్థక ఆస్తులు

**దిల్లీ:** ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) నికర లాభం 12% పెరిగి రూ.343.30 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో పీఎన్‌బీ రూ.306.36 కోట్ల లాభాన్ని ఆర్జించింది. రిటైల్ రుణాల ఆదాయంలో వృద్ధి, వ్యయ నియంత్రణ చర్యలు, మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక పర్యవేక్షణ లాంటివి ఇందుకు తోడ్పడ్డాయని పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి సునీల్ మెహతా తెలిపారు. మరో వైపు మొత్తం ఆదాయం కూడా పెరిగి రూ.13,475.41 కోట్ల నుంచి రూ.14,468.14 కోట్లకు చేరింది. ఆస్తుల నాణ్యతను కూడా కంపెనీ మెరుగుపర్చుకుంది. 2017 జూన్ 30 నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 13.66 శాతానికి తగ్గింది. ఈ




ఏడాది మార్చి 31 నాటికి స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 12.53 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి కూడా 8.67 శాతానికి తగ్గింది. మొండి బకాయిలు తగ్గడంతో కేటాయింపులు కూడా తగ్గి రూ.3,165.67 కోట్ల నుంచి రూ.2,559.71 కోట్లకు పరిమితమయ్యాయి.

**12 ఖాతాల నుంచిరూ.11,000 కోట్లు రావాలి..:** ఆర్‌బీఐ గుర్తించిన 12 పెద్ద మొండి బకాయిలు ఖాతాలకు సంబంధించి రూ.11,000 కోట్లు పీఎన్‌బీకి రావాల్సి ఉందని మెహతా చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ ఖాతాలకు అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. సమీక్ష త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం రూ.3,855 కోట్లుగా నమోదుకాగా.. వడ్డీయేతర ఆదాయం కింద రూ.2,332 కోట్లు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6,000 కోట్లు సమీకరించాలని భావిస్తుంది.

# లుపిన్ నిరాశాజనకం

**దిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో లుపిన్ ఏకీకృత నికర లాభం 59% క్షీణించి రూ.358.06 కోట్లకు పరిమితమైంది. కిందటేడాది ఇదే సమయంలో కంపెనీ నికర లాభం రూ.881.95 కోట్లుగా నమోదైంది. నికర విక్రయాలు కూడా రూ.4,341.80 కోట్ల నుంచి రూ.3,806.83 కోట్లకు తగ్గాయి. 'ఫలితాలు మేం వేసిన అంచనాలకు తగ్గట్లుగా లేవు. గ్లుమెట్జా లాంటి కొన్ని ఉత్పత్తుల ధరల్లో తగ్గదల, జీఎస్‌టీ అమలుతో అంతరాయాలు, రూపాయి బలోపేతం తదితరాలు మా పనితీరుపై ప్రభావం చూపాయ'ని లుపిన్ మేనేజింగ్ డైరెక్టరు నీలేశ్ గుప్తా అన్నారు. మరిన్ని జెనరిక్ ఔషధ ఉత్పత్తుల అభివృద్ధి చేయడంపై దృష్టి కొనసాగిస్తున్నామని చెప్పారు. నిర్వహణ సామర్థ్యం మెరుగుపర్చుకోవడం, ప్రమాణాల పాటింపు, వైవిధ్యభరిత వ్యాపార అభివృద్ధికి కూడా ప్రాధాన్యమిస్తున్నామని ఆయన అన్నారు. ఉత్తర అమెరికాలో కంపెనీ అమ్మకాలు రూ.1,601.8 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో అమ్మకాలు రూ.2,188.6 కోట్లుగా ఉన్నాయి. కంపెనీకి అంతర్జాతీయ విపణుల ద్వారా వచ్చే ఆదాయంలో 42 శాతం ఉత్తర అమెరికా నుంచే వస్తుంది. అంతర్జాతీయ విక్రయాల్లో 25 శాతం వాటా ఉన్న ఫార్ములేషన్ విక్రయాలు రూ.932.4 కోట్లుగా నమోదయ్యాయి. సమీక్ష త్రైమాసికంలో ఒక కొత్త ఔషధం కోసం (అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్) కంపెనీ దరఖాస్తు దాఖలు చేసింది. అదే సమయంలో మూడింటికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అనుమతులు పొందింది.

# రిలయన్స్ ఇన్‌ఫ్రా లాభంలో 24% క్షీణత

**ముంబయి:** ఏప్రిల్- జూన్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రా ఏకీకృత నికర లాభం 23.91% క్షీణించి రూ.334 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో కంపెనీ లాభం రూ.439 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం 4.11 శాతం పెరిగి రూ.7,538 కోట్ల నుంచి రూ.7,848 కోట్లకు చేరింది. 'మొత్తం మీద త్రైమాసిక పనితీరు సంతృప్తినిచ్చింది. ఏడాది క్రితంతో పోలిస్తే ఈపీసీ వ్యాపార ఆదాయం తగ్గింది. అయితే రానున్న త్రైమాసికంలో ఈ విభాగ ఆదాయం కూడా క్రమక్రమంగా పెరుగుతుందని ఆశిస్తున్నాం. వివిధ రంగాల ప్రాజెక్టుల నుంచి లభిస్తోన్న అవకాశాలు ఇందుకు ఉపకరిస్తాయ'ని కంపెనీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లలిత్ జలాన్ తెలిపారు. ప్రస్తుతం రిలయన్స్ ఇన్‌ఫ్రా ఆర్డర్ల పద్దు రూ.5,721 కోట్లుగా నమోదైంది. ముమ్ముందు మరో రూ.1,200 కోట్ల విలువైన ఆర్డర్లు లభించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. తమిళనాడులో 66 కి.మీల రహదారి నిర్మాణ నిమిత్తం జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి రూ.711 కోట్ల విలువైన ఆర్డరు లభించింది. మరో రెండు ప్రాజెక్టులకు విజయవంత బిడ్డర్లుగా నిలిచాం. ఆ వివరాలు త్వరలోనే వెల్లడవుతాయ'ని చెప్పారు.

## మార్జిన్ నిధుల సమీకరణ మరిన్ని మార్గాల్లో

### బ్రోకర్లకు సెబీ అనుమతి

**దిల్లీ:** బ్రోకర్లు మరిన్ని మార్గాల ద్వారా మార్జిన్ ట్రేడింగ్ నిధులను పొందేందుకు సెబీ వీలు కల్పించింది. క్లయింట్లకు మార్జిన్ ట్రేడింగ్ సదుపాయాన్ని కల్పించేందుకు ఈ నిధులను బ్రోకర్లు ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం సొంత నిధులు లేదంటే బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థల నుంచి పొందిన నిధులను మాత్రమే బ్రోకర్లు ఉపయోగించేందుకు అవకాశం ఉంది. అయితే ఇక నుంచి డైరెక్టరు, ప్రమోటర్ల నుంచి కమర్షియల్ పేపర్ జారీ చేయడం ద్వారా పొందిన నిధులను బ్రోకర్లు ఉపయోగించొచ్చు. అదే విధంగా అన్‌సెక్యూర్డ్ రుణాల రూపేణా కూడా నిధులు పొందొచ్చు. బ్యాంకులు, బ్యాంకింగేతర సంస్థల నుంచే కాకుండా ఇతర రూపేణా కూడా నిధుల వినియోగానికి అనుమతినివ్వాలని బ్రోకర్లు, బ్రోకర్ల సంఘాలు పెట్టుకున్న ప్రతిపాదన మేరకు సెబీ ఈ నిర్ణయం తీసుకుంది.

## మధుకాన్ ప్రాజెక్ట్స్ డివిడెండు!

**ఈనాడు, హైదరాబాద్:** గత ఆర్థిక సంవత్సరానికి డివిడెండును ప్రకటించే అంశాన్ని మధుకాన్ ప్రాజెక్ట్స్ పరిశీలించనుంది. ఈనెల 11న జరిగే బోర్డు సమావేశంలో 2016-17కు డివిడెండును చెల్లించే అంశంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక ఫలితాల వెల్లడి, వార్షిక సర్వసభ్య సమావేశం తేదీపై బోర్డు నిర్ణయం తీసుకోనుందని కంపెనీ తెలిపింది.

# డేటావిండ్ యూనిట్ ఉత్పత్తిలో 50% కోత

● ఉద్యోగాలకు గండి!

● పిటిషన్ దాఖలు చేసిన బాధితులు

**హైదరాబాద్:** అమ్మకాలు తగ్గాయన్న కారణంతో తక్కువ ధరకు టాబ్లెట్లను విక్రయిస్తున్న డేటావిండ్ కంపెనీ హైదరాబాద్‌లోని తన తయారీ యూనిట్‌లో ఉత్పత్తిని సగానికి సగం తగ్గించింది. దీంతో పదుల సంఖ్యలో ఈ యూనిట్‌లో పని చేస్తున్న వారు ఉద్యోగాలు కోల్పోయారని తెలుస్తోంది. తమకు న్యాయం చేయాలని కోరుతూ వీరందరూ పిటిషన్ దాఖలు చేశారని తెలంగాణ సంయుక్త కమిషనర్ (లేబర్) ఆర్.చంద్రశేఖరం తెలిపారు. ఇంత వరకూ కంపెనీ వైపు వాదన వినలేదని, కంపెనీ ప్రతినిధులను త్వరలో పిలిచి వివరాలను తెలుసుకుంటామని ఆయన చెప్పారు. కంపెనీని సంప్రదించగా.. హైదరాబాద్ యూనిట్‌లో ఉత్పత్తి 50 శాతం తగ్గిందని, అమృత్‌సర్‌లోని యూనిట్‌లో ఉత్పత్తి కొనసాగుతోందని వెల్లడించింది. డేటావిండ్‌కు అమృత్‌సర్, హైదరాబాద్‌లలో రెండు అసెంబ్లింగ్ యూనిట్లు ఉన్నాయి. 'ప్రస్తుతమున్న తయారీ యూనిట్ జీఎంఆర్‌కు సంబంధించిన స్థలంలో ఉంది. విమానాశ్రయాన్ని విస్తరించనున్నందున స్థలాన్ని ఖాళీ చేయాలని జీఎంఆర్ కోరింది. కొత్త తయారీ యూనిట్‌ను సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం పని చేస్తున్నవారిలో అధిక శాతం మంది శంషాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన వారే. వీరు కొత్త యూనిట్ వద్దకు రావడానికి ఇష్టపడడం లేదని' డేటావిండ్ ప్రతినిధి తెలిపారు. వారే కంపెనీకి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశారని తెలిపింది. ఎంత మంది ఉద్యోగాలు కోల్పోయింది కచ్చితంగా తెలియడం లేదు. హైదరాబాద్‌లోని తయారీ యూనిట్‌లో ఒక షిఫ్ట్‌కు 500 మంది ఉన్నారని కంపెనీ చెబుతోంది. అయితే. . ప్రస్తుతం పదుల సంఖ్యలోనే పని చేస్తున్నట్లు తెలుస్తోంది. పిటిషన్‌పై దాదాపు 200 మంది సంతకాలు చేసినట్లు లేబర్ కమిషనర్ తెలిపారు. హైదరాబాద్‌లోని యూనిట్‌ను మూసివేయడంలేదని కంపెనీ పేర్కొంది.

## ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

| కంపెనీ | నికర లాభం/(నష్టం) 2017-18 | నికర లాభం/(నష్టం) 2016-17 | మొత్తం ఆదాయం 2017-18 | మొత్తం ఆదాయం 2016-17 |
|---|---|---|---|---|
| శ్రీరామ్ సిటీ యూనియన్ | 193.86 | 181.79 | 1,055.00 | 1,219.21 |
| బాటా ఇండియా | 60.4 | 50.5 | 743.1 | 674.7 |
| మహీంద్రా హాలీడేస్ | 32.33 | 30.24 | 276.71 | 253.94 |
| వోల్టాస్ (కన్సా) | 187.91 | 159.67 | 1,962.37 | 1,844.81 |
| గోద్రేజ్ ప్రోపర్టీస్ | 23.37 | 43.47 | 345 | 333 |
| వోకార్డ్ (కన్సా) | (409.66) | 15.89 | 891.06 | 1,090.83 |
| ఇమామీ (కన్సా) | 1.04 | 56.65 | 541.1 | 645.43 |
| ఎడెల్‌వైజ్ ఫైనాన్షియల్(కన్సా) | 196.3 | 139.68 | 1,887.87 | 1,465.40 |
| సుందరం ఫాజనర్స్ | 90.17 | 75.55 | 850.56 | 772.61 |

## నేటి బోర్డు సమావేశాలు

★ ఐటీసీ ★ కోల్గేట్ పామోలివ్ ★ టైటన్ ★ బీఎస్ఈ ★ వెల్‌స్పన్ కార్పొరేషన్ ★ స్టార్ సిమెంట్స్ ★ ఉజ్జీవన్ ఫైనాన్షియల్ ★ పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ★ రామ్‌కో సిస్టమ్స్ ★ రామ్‌కో ఇండస్ట్రీస్ ★ జ్యోతీ ల్యాబ్స్ ★ మెజెస్కో ★ హెచ్‌సీసీ ★ ఇక్రా ★ ఎక్సెల్ ఇండస్ట్రీస్ ★ కమిన్స్ ఇండియా ★ బజాజ్ ఎలక్ట్రికల్స్ ★ సియట్ ★ వీఐపీ

## ఘనం (+)

| నిఫ్టీ | 2న | మార్పు % |
|---|---|---|
| NTPC | 171.85 | 4.03 |
| AMBUJA CEM | 266.60 | 2.22 |
| HERO MOTOCORP | 3802.60 | 2.01 |
| ACC | 1772.10 | 1.98 |
| ADANI PORT | 411.25 | 1.79 |

## గ్రహణం (-)

| నిఫ్టీ | 2న | మార్పు % |
|---|---|---|
| DR. REDDYS LAB | 2378.55 | -2.18 |
| SUN PHARMA | 523.55 | -1.92 |
| TATA MOTORS | 440.35 | -1.47 |
| BHARTI INFRATEL | 397.85 | -1.45 |
| INFOSYS | 993.35 | -1.21 |

## 2వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 310 | వరంగల్ | 312 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 3.70 | విశాఖపట్నం | 318 |
| బెంగళూరు | 360 | చెన్నై | 372 |
| 3న | | చిత్తూరు | 365 |
| విజయవాడ/గోదావరి | 308 | నమక్కల్ | 360 |

## ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

### నిఫ్టీ 50

ACC 1772.10 (1737.75) 750288
ADANI PORT & 411.25 (404.00) 2997197
AMBUJA CEMEN 266.60 (260.80) 2324968
ASIAN PAINTS 1144.50 (1148.20) 848781
AUROBIND PHA 731.05 (734.45) 1399075
AXIS BANK LT 516.90 (516.55) 4079631
BAJAJ AUTO L 2802.90 (2823.40) 298840
BANK OFBAROD 163.40 (163.50) 6526280
BHARTI AIRTE 415.85 (417.05) 1978308
BHARTI INFRA 397.85 (403.70) 2252956
BOSCH LTD 25029.75 (24666.50) 19080
BPCL 486.30 (485.60) 3574128
CIPLA 568.55 (562.45) 664681
COAL INDIA L 250.85 (251.45) 3701093
DR. REDDYS 2378.55 (2431.55) 570459
EICHER MOTOR 31153.80 (31504.80) 42381
GAIL 369.90 (373.85) 927308
HCL TECH 882.00 (884.20) 829090
HDFC 1766.40 (1779.10) 1960377
HDFC BANK 1791.65 (1797.20) 1849479
HERO MOTOCOR 3802.60 (3727.85) 828588
HINDALCO IND 228.20 (225.75) 6397948
HINDUSTAN UN 1168.75 (1173.95) 587711
ICICI BANK 301.85 (302.60) 8348096
INDIABULLS H 1195.75 (1225.20) 993610
INDIAN OIL 370.10 (370.35) 4288360
INDUSINDBANK 1658.75 (1665.70) 509282
INFOSYS LTD 993.35 (1005.55) 2128792
ITC 285.45 (287.85) 9867353
KOTAK MAHIND 1010.90 (1015.30) 1119072
LARSEN & TOU 1176.80 (1190.05) 2154488
LUPIN 1034.95 (1017.90) 7625546
M&M 1414.60 (1429.25) 476469
MARUTI SUZIK 7795.50 (7856.10) 414448
NTPC LTD 171.85 (165.20) 18560053
ONGC 165.40 (167.40) 7743355
POWER GRID C 221.80 (224.40) 6758151
RELIANCE IND 1629.20 (1603.60) 4751385
SBI 307.70 (309.00) 17005571
SUN PHARMA 523.55 (533.80) 3483902
TATA CONSULT 2473.80 (2501.65) 625512
TATA MOT DVR 260.45 (262.60) 1416514
TATA MOTORS 440.35 (446.90) 4045533
TATA POWER 82.60 (82.80) 867025
TATA STEEL L 569.25 (572.40) 2987644
TECH MAHINDR 402.05 (402.45) 4071990
ULTRATECH 4087.45 (4067.85) 132722
VEDANTA LIMI 280.95 (282.05) 5422178
WIPRO 293.80 (294.80) 2426114
YES BANK LTD 1829.00 (1827.25) 2013175
ZEE ENTERTAI 540.30 (543.60) 818289

### నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1414.65 (1426.80) 26267
ASHOK LEYLAN 109.35 (111.05) 7178227
BAJAJ FINANC 1707.20 (1716.25) 396171
BAJAJ FINSER 5002.35 (5067.25) 142369
BEL 182.05 (180.95) 4336030
BHEL 141.20 (144.60) 3864248
BRITANNIA 3864.10 (3907.50) 160769
CADILA HEALT 540.80 (540.65) 338367
COLGATE PALM 1039.25 (1069.75) 421149
CONTAINER 1172.50 (1175.70) 245106
CUMMINS INDI 992.75 (970.60) 876782
DABUR INDIA 300.70 (301.70) 748776
DIVIS LAB 669.05 (667.75) 346352
DLF LIMITED 193.10 (193.55) 5609354
EMAMI LIMITE 1105.05 (1072.00) 1512225
GLAXOSMI CON 5440.60 (5467.70) 2904
GLAXOSMI PHA 2367.65 (2385.65) 7369
GLENMARK PHA 703.30 (699.85) 388339
GODREJ CONSU 920.25 (964.40) 3175540
HAVELLS INDI 472.80 (467.60) 953913
HINDUSTAN ZI 283.80 (282.25) 1676861
HPCL 385.00 (386.75) 2347427
ICICI PRU LI 443.50 (443.95) 1083062
IDEA CELLULR 92.35 (92.55) 8289275
INTERGLOBE A 1281.40 (1290.25) 385323
JSW STEEL LT 219.75 (223.15) 7699742
LIC HOUS.FIN 693.15 (690.95) 1958294
MARICO LIMIT 326.10 (326.35) 2181797
MCDOWELL 2598.30 (2643.55) 491049
MOTHERSON 333.15 (329.50) 2050676
NHPC LTD 30.10 (30.00) 3834483
NMDC LTD 124.05 (125.95) 2292197
OIL INDIA 282.05 (286.15) 247226
ORACLE FIN S 3639.00 (3615.10) 19005
P&G HYG&HEAL 8015.10 (8119.50) 786
PETRONET LNG 212.95 (211.65) 4822522
PIDILITE IND 800.00 (795.95) 320358
PIRAMAL ENTE 2912.05 (2957.90) 198335
PNB 158.95 (157.50) 31565886
POWER FIN CO 122.20 (122.25) 2734227
RURAL ELEC C 172.20 (174.85) 3328395
SAIL 63.20 (63.10) 3088278
SHREE CEMENT 18426.55 (18631.70) 6951
SHRIRAM TRAN 1018.30 (1033.80) 531323
SIEMENS 1368.45 (1396.85) 114212
SUN TV LTD 798.50 (782.45) 608808
TITAN IND 552.80 (539.35) 1469268
TORRENT PHAR 1274.80 (1292.15) 105767
UNITED BREWE 809.50 (816.70) 152739
UPL LIMITED 889.00 (894.10) 951400

## బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 869.90 (855.45) 2354
AMAR RAJA BA 840.45 (848.60) 11291
ANDHRA BANK 56.35 (56.65) 145027
ANDHRA CEMEN 9.80 (9.80) 32994
ANDHRA PAPER 315.10 (317.60) 7535
ANDHRA PETRO 26.05 (26.30) 22477
ANDHRA SUGAR 340.35 (339.20) 5571
ASTRA MICROW 134.15 (133.90) 45344
AUROBINDO PH 730.85 (734.50) 198703
AVANTEL SOFT 229.35 (231) 3327
AVANTI FEEDS 1726.40 (1706.15) 17543
BALAJI AMIN 325.05 (331.75) 1569
BARTRONICS 15.25 (15.35) 19426
BHAGIRA CHEM 178.60 (185.25) 471
BHAGYA NAG 24.20 (24.45) 6840
BN RATHI SEC 36.50 (36.25) 8332
BRILLIANT SE 7.89 (8.24) 2085613
CAMBRIDGE TE 74.85 (76.25) 4433
CONT COFFEE 289.15 (282.85) 3790
COROMAN FERT 450.75 (446.45) 29143
CYBERMATE 3.31 (3.48) 83195
CYIENT LIMIT 525.75 (525.05) 452
DECCAN CEMEN 1142.40 (1144) 1188
DIVI'S LAB 668.55 (668.35) 113232
DIVYA GRANIT 104.05 (106.30) 5619
DR REDDY 2379.85 (2426.75) 60877
GATI CORPN 118.05 (119.40) 45147
GAYATRI PROJ 168.65 (168.75) 2266
GMR INFRASTR 18.45 (18.70) 1841723
GOLDST INFRA 75.20 (71.65) 149404
GRANULES (I) 136.55 (137.80) 78621
GVK POWER 12.52 (12.93) 2188346
HBL NIFE POW 48.05 (47.45) 66716
HERITAGE FOO 1252.05 (1255.30) 3036
HYD INDUS 1133.05 (1136.80) 3089
IDL INDUSTRS 494.50 (492.95) 9042
INNAREDY COM 3.13 (3.20) 12781
IVRCL INFRAS 6.27 (6.47) 333880
KAKATIYA CEM 379.10 (381.65) 8787
KALLAM SPG 27.60 (27.50) 28255
KAVERI SEED 689.70 (682.20) 64809
LANCO INDUS 372.80 (370.05) 9630
LANCO INFRAT 1.32 (1.27) 35837485
LOKESH MACH 86.90 (79.55) 139934
MADHUCON PRO 32.25 (31.75) 11873
MIC ELECTRON 8.22 (8.53) 88579
MOLD-TEK.TEC 50 (50) 1612
MOLDTK PLA 279.95 (278.80) 2779
NAGARJAGRICH 37.05 (37.45) 23395
NATCO PHARMA 961.70 (967) 18590
NAVA BH VENT 133.55 (135.40) 31533
NCC 90.25 (88.90) 479480
NCL IND 204.95 (209.55) 14674
NETTLINX 104.90 (98.50) 7068
NEULAND LAB 1449.80 (1440.40) 2570
NIHAR INFO 16 (16.05) 371
NILE 613.20 (617.50) 6943
PANYAM CEMEN 64.65 (66.25) 2877
PENNER IND 55.10 (55.30) 72808
PIONEER DIST 225.90 (220.05) 3338
POKARNA 1290.55 (1356.30) 2098
PRAJAY ENGS 9.19 (9.38) 11156
PREMIER EXPL 471 (481.70) 1703
PRISM CEMENT 119.40 (121.40) 12740
PRUDENTL PHA 4.64 (4.56) 119411
RAIN INDUSTR 128.60 (128.45) 87026
SAMKRG PIST 295.45 (298.60) 4853
SATVAH. ISPA 44.40 (44) 109415
SPHERE GLOBA 50.85 (50.70) 68104
SREE RAYAL A 31.55 (32.05) 212567
STEEL EXCHAN 90.55 (92) 224640
SUJANA METAL 2.05 (1.99) 39149
SUJANA TOWER 4.52 (4.82) 18487
SUJANA UNIVE 1.20 (1.20) 27338
SURYALAKSH.C 108.05 (109.70) 1901
SUVEN PHARMA 170.15 (170.10) 35990
TAJ GVK HOTE 167.40 (166.40) 11993
TANLA 36.50 (37.45) 50913
TERA SOFTWAR 73.30 (73.30) 1490
VAMSHI RUBB 69.45 (71.20) 2059
VICEROY HOTE 19 (19.15) 15181
VIJAY TEXTIL 61.15 (61.45) 33095
VIMTA LABS 142 (146.65) 6992
VISAKA IND 485.90 (469.60) 12724
VIVIMED LABS 119.80 (121.75) 159617
YBRANT DIGIT 6.96 (6.94) 198841
ZENTECH 56 (56.25) 10220

CA

ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష

రెపో రేటు పావు శాతం తగ్గింపు. అంతక్రితం 6.25 శాతం. తాజాగా 6 శాతానికి.
6 శాతం

రివర్స్ రెపో రేటు సైతం 0.25% తగ్గింపు. అంతక్రితం 6 శాతం. తాజాగా 5.75 శాతానికి.
5.75 శాతం

టోకు ధరల ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి చేరువలో ఉంచడంపై దృష్టి
4 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనా 7.3 శాతం. అంతక్రితం అంచనాలే కొనసాగింపు.
7.3 శాతం

పరపతి విధాన కమిటీలోని ఆరుగురిలో నలుగురు సభ్యులు పావు శాతం కోతకు సానుకూలం.
4

జులై 28 నాటికి మన విదేశీ మారక నిల్వలు
393 బిలియన్ డాలర్లు

విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు ఇంటరెస్ట్ రేట్ ఫ్యూచర్‌లలో పెట్టే పెట్టుబడులపై పరిమితి
5,000 కోట్లు

తదుపరి పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) సమావేశం
అక్టోబరు 3-4

బిజినెస్

‘కీలక రేట్లలో పావు శాతం కోత వల్ల ప్రైవేటు పెట్టుబడులకు ఊతం లభిస్తుంది. అదే సమయంలో కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్ల బలహీనతల మధ్య పెచ్చుమీరిపోతున్న మొండి బకాయిల సమస్యకు పరిష్కారం లభించవచ్చు. ప్రస్తుత కనిష్ఠ స్థాయి(1.54%) నుంచి ద్రవ్యోల్బణం ఈ ఏడాదంతా పెరుగుతూ పోతుందని అంచనా వేస్తున్నాం. అందుకే ఎమ్‌పీసీ తన తటస్థ వైఖరిని కొనసాగిస్తోంది. ఒక్కసారి గిరాకీ తిరిగి పుంజుకుంటే.. ఉత్పాదక రంగాలకు రుణాలు పెరుగుతాయి.’

-ఉర్జిత్ పటేల్, ఆర్‌బీఐ గవర్నర్

# కోత.. కొంతే

- కీలక రేట్ల తగ్గింపు పావు శాతమే
- ఆరున్నరేళ్ల కనిష్ఠానికి రెపో రేటు
- గృహ, వాహన రుణాలు తగ్గే అవకాశం
- నెల వారీ వాయిదాలపై భారం కూడా
- రైతు రుణ మాఫీలతో ఒత్తిడి: ఆర్‌బీఐ

**గృహ, వాహన రుణాలు తీసుకున్న వారికి ఆర్‌బీఐ తీపి కబురు పంపింది. ఆర్‌బీఐ ప్రకటించిన పావు శాతం రెపో రేటు కోతను బ్యాంకులు ఖాతాదార్లకు బదలాయిస్తే పండుగే. వాయిదాల భారాన్ని కొంత తగ్గించుకోవచ్చు. అదీ కాక ప్రస్తుత కోత.. రానున్న పండుగల సీజనులో బ్యాంకులు ఆఫర్లతో ముందుకు రావడానికి దోహదం చేస్తుందని విశ్లేషకులు గట్టిగా చెబుతున్నారు. మనం కూడా గట్టిగా అనుకుందాం.. జరిగితే అందరికీ మంచిదేగా!!!**

ముంబయి

దాదాపు పది నెలల విరామం అనంతరం రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు(బ్యాంకులకు ఆర్‌బీఐ ఇచ్చే రుణాలకు వర్తించే రేటు)ను పావు శాతం మేర తగ్గించింది. దీంతో ఆరున్నరేళ్ల కనిష్ఠ స్థాయి అయిన 6 శాతానికి అది చేరింది. మరో పక్క, రివర్స్ రెపో రేటు(బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ తీసుకునే రుణాలకు వర్తించే రేటు)ను సైతం 0.25 శాతాన్ని తగ్గించి 5.75 శాతానికి పరిమితం చేస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) బుధవారం ప్రకటించింది. అదే సమయంలో మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటి(ఎమ్ఎస్ఎఫ్) రేటు, బ్యాంక్ రేటును సైతం 6.25 శాతానికి తగ్గించారు.

### ఆ తర్వాత ఇపుడే..

అక్టోబరు 2016లో జరిగిన పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ పావు శాతం మేర తగ్గించింది. ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేపట్టిన తొలి సమీక్ష అది కావడం గమనార్హం. అదీకాక పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) నిర్ణయించిన తొలి పరపతి సమీక్ష కూడా అదే కావడం గమనార్హం.

### అందుకే తగ్గింపు

ద్రవ్యోల్బణం చరిత్రాత్మక కనిష్ఠాలకు చేరిందని ఎమ్‌పీసీ గమనించింది. (జూన్‌లో 1.54 శాతంగా నమోదైంది.) అందుకే రేట్లను తగ్గించిందని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ పేర్కొన్నారు. అయితే విధాన వైఖరిని తటస్థంగానే కొనసాగించి.. రాబోయే గణాంకాల కోసం ఎదురు చూస్తామని చెప్పారు. మరో పక్క, ప్రైవేటు పెట్టుబడులు పెరగాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. మౌలిక ప్రాజెక్టులకు ఎదురయ్యే సమస్యలను తొలగించాల్సి ఉందని.. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజనకు గట్టి మద్దతునివ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు.

### ఆయనొక్కడే.. అటు వైపు

ఎమ్‌పీసీ సభ్యుల్లో నలుగురు(ఆర్‌బీఐ గవర్నర్, డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్య, చేతన్ ఘటే, పామి దువా) పావు శాతం కోతకు ఓటు వేయగా.. మరో సభ్యుడు అర శాతం కోత వేయాలని ప్రతిపాదించారు. ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ దేవవ్రత పాత్ర మాత్రం యథాతథ స్థితి వైపు మొగ్గుచూపారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు పెంచిన భత్యాల ప్రభావం వల్ల ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందన్నది ఆయన అభిప్రాయంగా ఉంది. మరో పక్క వ్యవసాయ వేతనాలు, వ్యవసాయ వ్యయాలు, వ్యవసాయానికి బ్యాంకు రుణాలు అన్నీ పెరుగుతున్న నేపథ్యంలో ఆహార ద్రవ్యోల్బణం ఎలా ఉంటుందోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### 4 శాతమే లక్ష్యం

రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దరిదాపుల్లో ఉంచడమే తమ లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. వేతన సంఘం సిఫారసులు, జీఎస్‌టీ అనంతర సర్దుబాట్ల నేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరగవచ్చన్న అంచనాలున్నాయి. ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఎలా కదలాడుతుందన్నది ఏడో వేతన సంఘం ఇంటి అద్దె భత్యం(హెచ్ఆర్ఏ) అమలుపై ఆధారపడి ఉందని ఉర్జిత్ పటేల్ అన్నారు. ‘హెచ్ఆర్ఏ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకపోతే.. నాలుగో త్రైమాసికం కల్లా ద్రవ్యోల్బణం 4 శాతం కంటే పైకి చేరొచ్చు. ఒక వేళ కలిపితే 4.5 శాతం పైకే చేరొచ్చ’ని అన్నారు.

### ఏక గవాక్ష అనుమతులు

అందుబాటు గృహ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం కోసం ఏక గవాక్ష అనుమతులు వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను ఆర్‌బీఐ కోరింది. అందుబాటు గృహ ప్రాజెక్టుల వల్ల ప్రైవేటు పెట్టుబడులకు ఊతం లభిస్తుందని.. తద్వారా వృద్ధికి ఊతం లభిస్తుందని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అంటున్నారు. ఎమ్‌పీసీ ఉద్దేశం ప్రకారం.. ప్రైవేటు పెట్టుబడులకు తక్షణం ఊతం ఇవ్వాల్సిన అవసరం ఉంది. మౌలిక పెట్టుబడులకున్న సమస్యలను తొలగించాల్సిన అవసరం ఉంది.



### రుణ మాఫీలతో ఇబ్బంది

కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న రుణ మాఫీల వల్ల ఒత్తిడిలో ఉన్న ఆస్తుల పరిమాణం పెరుగుతుందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటకలు రైతుల కోసం రుణ మాఫీలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కేంద్రం మాత్రం రైతు రుణ మాఫీలకు రాష్ట్రాలే సొంతంగా నిధులు సమకూర్చుకోవాలని తేల్చిచెప్పింది. ‘రైతు రుణ మాఫీల అమలు వల్ల ప్రజా వ్యయాల నాణ్యత తగ్గడంతో పాటు ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

### రుతు పవనాలపై ఆశావహం

వర్షాలు బాగా కురుస్తాయన్న అంచనాల మధ్య 2017-18లో పంట దిగుబడి పెరుగుతుందని ఆర్‌బీఐ ఆశిస్తోంది. అంతక్రితం ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి లక్ష్యాలను చేరడానికి వర్షాలు ఊతమిస్తాయని అంటోంది. ఆగస్టు 1 నాటికి దీర్ఘకాల సగటుతో పోలిస్తే 1 శాతం అధికంగా కురిసింది. దేశంలోని 84 శాతం ప్రాంతం సాధారణం కంటే అధిక శాతం వర్షపాతాన్నే నమోదు చేసింది.

## పావు శాతం సరిపోదు

వృద్ధికి ఊతమిస్తుంది. ప్రైవేటు పెట్టుబడులు తగ్గిన ఈ తరుణంలో ఈ నిర్ణయం వెలువడడం సెంటిమెంటును మెరుగుపరుస్తుంది. అయితే మరింత ఎక్కువ కోత ఉండినట్లయితే ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనువుగా ఉండేది.

**- సీఐఐ**

ప్రస్తుత పరిస్థితుల్లో అర శాతం అయినా కోత వేసి ఉండాల్సింది. పావు శాతం కోత అనేది కొంతైనా విశ్వాసాన్ని పెంచుతుందనే భావిస్తున్నాం.

**- ఫిక్కీ**

పావు శాతం కోత వల్ల రుణ స్వీకర్తలకు.. ముఖ్యంగా ఎక్కువ రుణాలు తీసుకున్న కార్పొరేట్లకు పెద్దగా లాభం ఉండదు. అయితే కొంత ఊరటనిచ్చిందని చెప్పాలి.

**- అసోచామ్**

## మాకు మేలే: స్థిరాస్తి వర్గాలు

పండుగల సీజనుకు ముందు రేట్ల కోత వల్ల విక్రయాలు పెరుగుతాయి. బ్యాంకులు వినియోగదార్లకు ప్రయోజనాలను బదిలీ చేయాలి. ఆ విధంగా ఆర్‌బీఐ బ్యాంకులపై ఒత్తిడి తీసుకురావాలి.

**- క్రెడాయ్ అధ్యక్షుడు జాక్సే షా**

రేట్ల కోత వల్ల అందుబాటు గృహాలకు గిరాకీ పెరుగుతుంది. అయితే రుతుపవనాలు, సంస్కరణలు, అంతర్జాతీయ వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని అర శాతం తగ్గించినట్లయితే బాగుండేది. స్థిరాస్తి రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తేనే.. 2022 కల్లా అందరికీ గృహాల కల నెరవేరుతుంది.

**- హౌస్ ఆఫ్ హీరానందాని ఛైర్మన్ సురేంద్ర హీరానందాని**

రేట్ల కోతను అంచనా వేశాం. గృహ రుణ రేట్లపై ఇది ప్రభావం చూపుతుంది. వినియోగదారు సెంటిమెంటును పెంచుతుంది. గృహ కొనుగోలుదార్లు పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. ప్రస్తుత రుణ స్వీకర్తలకూ ప్రయోజనం కలుగుతుంది.

**- టాటా హౌసింగ్ ఎండీ బ్రోటిన్ బెనర్జీ**

## రుణ గిరాకీకి ఊతం: బ్యాంకర్లు

ఆర్‌బీఐ రేట్ల కోత వల్ల రుణాలకు గిరాకీ పెరుగుతుందని బ్యాంకర్లు అంచనా కట్టారు. అదే సమయంలో మదుపర్ల సెంటిమెంటు మెరుగుపడి.. వృద్ధికి ఊతమిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ చర్య వల్ల రుణాలకు క్రమంగా గిరాకీ పెంచుతుందని ఎస్‌బీఐ ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య పేర్కొనగా.. అంతర్జాతీయ మదుపర్లలో ఆర్‌బీఐ నిర్ణయంతో తిరిగి విశ్వాసం ప్రోది అవుతుందని ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓ చందా కొచ్చర్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో 0.50-0.75 శాతం వరకూ కోతలుంటాయని మేం అంచనా వేస్తున్నామని యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ రాణా కపూర్ అన్నారు.

# బ్యాంకులు తగ్గిస్తే ఎంత లాభం!

ఈనాడు - హైదరాబాద్

రిజర్వు బ్యాంకు రెపో రేటు తగ్గించదనగానే చాలామంది గృహరుణ గ్రహీతలకు తమకేమన్నా లాభమా అని ఆలోచిస్తుంటారు. తగ్గిన వడ్డీ రేటును బ్యాంకులు ఎప్పుడెప్పుడు తమకు వర్తింపజేస్తాయా అని ఎదురు చూస్తుంటారు. తమపై ఎంతోకొంత భారం తగ్గుతుంది కదా అనేదే వారికి ఆనందాన్నిచ్చే విషయం. చాలా రోజుల తర్వాత ఆర్‌బీఐ తీపి కబురు వినిపిస్తూ రెపో రేటు 0.25శాతం తగ్గించింది. మరి, దీన్ని నిజంగా బ్యాంకులు తమ రుణగ్రహీతలకు బదిలీ చేస్తాయా? చేస్తే ఎలాంటి లాభాలు వస్తాయి?

రెపో రేటు తగ్గగానే బ్యాంకులు సాధారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గించేందుకు తొందరపడుతుంటాయి. కానీ, రుణాలపై వడ్డీ రేట్ల విషయానికి వచ్చేసరికి కొంచెం వేచి చూసే ధోరణిని అవలంబిస్తుంటాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక రుణాలైన గృహరుణ వడ్డీ రేట్ల విషయంలో. రిజర్వు బ్యాంకులకిచ్చే రుణాలపై వడ్డీ రేటును 0.25శాతం తగ్గించి, 6శాతానికి పరిమితం చేసింది. దీనివల్ల బ్యాంకులకు తక్కువ వడ్డీకే ద్రవ్య లభ్యత అనేది సాధ్యమవుతోంది. కాబట్టి, గృహరుణం తీసుకునే వారికి ఈ ప్రయోజనాన్ని తప్పనిసరిగా బ్యాంకులు బదిలీ చేయాలి. కానీ, వాస్తవంలో గృహరుణ గ్రహీతలకు ఇది లభిస్తుందా అన్నది ప్రశ్నార్థకమే?

గృహరుణాల వడ్డీ రేట్లను నిర్ణయించేందుకు బ్యాంకులు ఇప్పుడు ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెడింగ్ రేట్)ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. కొన్ని పెద్ద బ్యాంకుల ఎంసీఎల్ఆర్‌ను పరిశీలిస్తే.. 8%-8.4% మధ్య ఉంది. అదే సమయంలో ఈ బ్యాంకులు 8.4%-8.6% వరకూ గృహరుణ వడ్డీ రేటును వసూలు చేస్తున్నాయి. ఉదాహరణకు అతి పెద్ద బ్యాంకు ఎస్‌బీఐనే పరిగణనలోనికి తీసుకుంటే.. ఏడాది ఎంసీఎల్ఆర్ 8%ఉండగా.. దీనిపై అదనంగా 40బేసిస్ పాయింట్లను అదనంగా వసూలు చేస్తోంది. (రూ.30లక్షలలోపు గృహరుణాలపై, చలన వడ్డీ). అంటే చలన వడ్డీ రేటుకు తీసుకున్న గృహరుణాలపై వడ్డీ రేటు 8.4శాతం (మహిళలకు 8.35%)ని విధిస్తోంది.

### బ్యాంకులు ఏం చేస్తాయి?

ఏప్రిల్ 1, 2016 నుంచి బ్యాంకులు ఎంసీఎల్ఆర్ విధానంలోనే గృహరుణాలను మంజూరు చేస్తున్నాయి. అంతకుముందు ఇది బేస్ రేటులో రుణం తీసుకున్న వారు ఈ విధానంలోకి మారేందుకు కొంత రుసుము వసూలు చేసి, ఎంసీఎల్ఆర్‌లోకి మార్చేశాయి. గతంలో బేస్ రేటులో ఉన్నప్పుడు అది మారినప్పుడల్లా రుణగ్రహీతలు ఉన్న అప్పుపై 0.5శాతం వరకూ చెల్లించి, తగ్గిన వడ్డీ రేటులోకి మారాల్సి వచ్చేది. ఎంసీఎల్ఆర్ ఈ కష్టాన్ని తప్పించింది. అయితే, ఇక్కడే ఒక చిక్కుంది. బేస్‌రేటులాగా.. ఎంసీఎల్ఆర్‌లో వెంటనే గృహరుణ వడ్డీ రేటు తగ్గదు. దీనికి కారణం.. చాలా వరకూ గృహరుణాలు బ్యాంకుల ఏడాది ఎంసీఎల్ఆర్‌తో ముడిపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో తగ్గిన వడ్డీ రేటు ప్రయోజనాలు అందాలంటే.. బ్యాంకుల ఎంసీఎల్ఆర్ సవరణ జరగాల్సిందే. అంటే, ఎవరైనా ఏప్రిల్-జూన్ 2017 మధ్యకాలంలో ఎంసీఎల్ఆర్ ఆధారిత గృహరుణాన్ని తీసుకుంటే... తగ్గిన వడ్డీ రేట్ల ప్రయోజనం అందాలంటే.. ఏప్రిల్-జూన్ 2018కు ఆగాల్సిందే. కాబట్టి, ఇటీవలే గృహరుణాలు తీసుకున్న వారికి ఈ వడ్డీ తగ్గింపు ప్రయోజనం ఇప్పుడిప్పుడే అందదన్నమాట.

### మనమేం చేయాలి?

ఇప్పటికే గృహరుణం తీసుకున్న వారు... ప్రస్తుతం తమ బ్యాంకుల ఎంసీఎల్ఆర్ ఎంతన్నది ఒకసారి చూసుకోవాలి. దానిపై అదనంగా ఎంత శాతం వసూలు చేస్తున్నారో తెలుసుకోవాలి. ఒకవేళ బ్యాంకు తన ఎంసీఎల్ఆర్‌ను తగ్గిస్తే.. ఆ ప్రయోజనాన్ని మీకూ వర్తించే అవకాశం ఉందా అనేది అడిగి చూడండి. మీరు రుణం తీసుకున్న బ్యాంకుకన్నా.. వేరే బ్యాంకు తక్కువ శాతం వడ్డీ వసూలు చేస్తుంటే ఆ బ్యాంకుకు మారేందుకు పరిశీలించవచ్చు. ఇక్కడ రుసుములను కూడా చూసుకోవాలి. ఎంసీఎల్ఆర్ విధానంలో రుణం తీసుకున్నప్పుడు ఆర్‌బీఐ వడ్డీ రేటు తగ్గించినప్పుడల్లా గృహరుణ వడ్డీ రేట్లు కూడా తగ్గుతాయని ఆలోచించడం మానేయాలి. దీనికన్నా.. మీకు వీలున్నప్పుడల్లా. . అసలు మొత్తంలో కొంతకొంత చెల్లిస్తూ.. రుణ భారం తగ్గించుకోవడం ఎంతో ఉత్తమం.

### వడ్డీ రేటు తగ్గితే..

ప్రస్తుత వడ్డీ రేటు 8.40శాతం అనుకుందాం. 0.25శాతం తగ్గిస్తే 8.15శాతానికి చేరుకుంటుందని భావిస్తే దాని ప్రయోజనాలు ఎలా ఉంటాయంటే...

**రూ.లక్ష రుణానికి, పదేళ్ల వ్యవధి..**

| | వడ్డీ రేటు ప్రస్తుతం 8.40% | వడ్డీ రేటు 8.15% |
|---|---|---|
| ఈఎంఐ | రూ.1,235 | రూ.1,221 |
| మొత్తం వడ్డీ | రూ.48,142 | రూ.46,546 |
| మిగిలే వడ్డీ మొత్తం | రూ.1,596 | |

**రూ.25లక్షల గృహరుణానికి.. 20ఏళ్ల వ్యవధికి**

| | వడ్డీ రేటు ప్రస్తుతం 8.40% | వడ్డీ రేటు 8.15% |
|---|---|---|
| ఈఎంఐ | రూ. 21,538 | రూ. 21,145 |
| మొత్తం వడ్డీ | రూ. 26,69,026 | రూ. 25,74,798 |
| మిగిలే వడ్డీ మొత్తం | రూ. 94,228 | |

(రూపాయలు దగ్గరి విలువకు సర్దుబాటు)

# 2020కి అగ్రస్థానం!

## ద్విచక్ర వాహనాల్లో ఇదే మా లక్ష్యం: హోండా

**బెంగళూరు:** జపాన్ వాహన దిగ్గజం హోండా ద్విచక్ర వాహనాల తయారీకి భారత్ ప్రధాన కేంద్రంగా అవతరించింది. 2020 నాటికి దేశీయంగా అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థగా ఎదగడమే తమ లక్ష్యమని సంస్థ ప్రకటించింది. తమ ద్విచక్ర వాహనాల తయారీకి ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రం భారత్ అని హోండా మోటార్ కంపెనీ వెల్లడించింది. కర్ణాటకలోని నర్సాపుర ప్లాంటులో ద్విచక్ర వాహన తయారీ కోసం నాలుగో అసెంబ్లీ లైనును హోండా దేశీయ అనుబంధ సంస్థ హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) ప్రారంభించింది. 2013లో ప్రారంభమైన ఈ ప్లాంటులో ఇప్పటివరకు ఏడాదికి 18 లక్షల వాహనాలను తయారు చేయగా, నాలుగోలైను వల్ల తయారీ సామర్థ్యం మరో 6 లక్షల మేర పెరిగింది. ఇకపై ఈ ప్లాంటులో ఏడాదికి 24 లక్షల ద్విచక్ర వాహనాలు తయారు చేయొచ్చు. హోండాకు సంబంధించి ఏడాదిలో ఇంత భారీమొత్తంలో ద్విచక్ర వాహనాలు తయారు చేసే ప్లాంటు కూడా ఇదే. దీనితో కలిపి దేశీయంగా హెచ్ఎంఎస్ఐ వార్షిక తయారీ సామర్థ్యం 64 లక్షల వాహనాలకు పెరిగింది. హరియాణాలోని మనేసర్, రాజస్థాన్‌లోని తపుకర, గుజరాత్‌లోని విఠల్‌పుర్‌లోనూ హోండాకు తయారీ ప్లాంట్లున్నాయి.

- ఇప్పటివరకు హోండా ద్విచక్ర వాహనాల తయారీకి ఇండొనేసియా అతిపెద్ద కేంద్రంగా ఉండేది. అక్కడ ఏడాదికి 58 లక్షల వాహనాలను తయారు చేస్తున్నారు. ఇప్పుడు భారత్ దీన్ని అధిగమించింది.
- ఇండొనేసియాలోని బెకసి ప్లాంటులో ఏడాదికి 22 లక్షల ద్విచక్ర వాహనాలు తయారవుతూ, హోండాకు అతిపెద్ద కేంద్రంగా ఉండేది. ఈ స్థానాన్ని నర్సాపుర ప్లాంటు చేజిక్కించుకుంది.

**ఇప్పటివరకు రూ.2,600 కోట్ల పెట్టుబడులు:** కొత్త లైన్ స్థాపనకు వెచ్చించిన రూ.606.5 కోట్లతో కలిపి దేశీయంగా హెచ్ఎంఎస్ఐ ఇప్పటివరకు రూ.2,600 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు హోండా మోటార్ కంపెనీ ప్రాంతీయ కార్యకలాపాల చీఫ్ ఆఫీసర్ షింజి ఆయామా తెలిపారు. నర్సాపుర ప్లాంటులో 7,000 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

హోండా ద్విచక్ర వాహన వ్యాపారం 120కి పైగా దేశాల్లో సాగుతున్నా, భారత్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. దేశీయ స్కూటర్ విపణిలో 59 శాతం వాటాతో పాటు మొత్తం ద్విచక్ర వాహనాల్లో రెండో స్థానంలో ఉన్నామని, 2020కి మొదటిస్థానానికి వస్తామనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బీఎస్ 4 ప్రమాణాల్లో ముందుండటమే ఇందుకు కారణమని వివరించారు. బీఎస్ 4 ప్రమాణాల అమలు వల్ల ధరలు పెరిగి, వాహనాల అమ్మకాల్లో వృద్ధి తగ్గే అవకాశమూ ఉందన్నారు. 2016-17లో హోండా ద్విచక్ర వాహన విక్రయాల్లో భారత్ వాటా 28 శాతమని, ఇదే అత్యధికమని పేర్కొన్నారు. హోండాకు ఎగుమతి కేంద్రంగా భారత్ మారేందుకు తాజా విస్తరణ ఉపకరిస్తుందని ఎంఎంఎస్ఐ అధ్యక్షుడు, ముఖ్య కార్య నిర్వహణాధికారి మినోరు కతో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈ ఏడాది కొత్తగా 10 లక్షల మంది కొనుగోలుదార్లను పొందాలన్నది తమ లక్ష్యమన్నారు.

# భారత్‌లో అభివృద్ధి కేంద్రం!


## పరిశీలిస్తున్న గోడాడీ

**ఈనాడు, హైదరాబాద్:** భారత్‌లో అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని గోడాడీ పరిశీలిస్తోంది. ఆన్‌లైన్‌లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడానికి చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు గోడాడీ వెబ్‌సైట్లను రూపొందించడం, ఇతర సేవలను అందిస్తోంది. అమెరికా తర్వాత భారత్ తమకు కీలకమైన మార్కెట్ అని, హైదరాబాద్, గురుగావ్‌లలో కంపెనీ కోసం 700 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని గోడాడీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (అంతర్జాతీయ) ఆండ్రూ లో హా కీ తెలిపారు. భవిష్యత్తులో భారత్‌లోని వ్యాపార అవకాశాలను బట్టి అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. 2012లో గోడాడీ భారత్‌లో కార్యకలాపాలను ప్రారంభించింది. అయిదు సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా కంపెనీ ఖాతాదారులకు ప్రత్యేక పథకాలను ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు ఆండ్రూ విచ్చేశారు. ఇప్పటి వరకూ దేశంలో 7.5 లక్షల చిన్న వ్యాపార సంస్థలు ఆన్‌లైన్ కార్యకలాపాలు ప్రారంభించడానికి వెబ్‌సైట్లను ప్రారంభించడంతోపాటు ఇతర ఆన్‌లైన్ వెంచర్ సేవలను అందించినట్లు గోడాడీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నిఖిల్ అరోరా తెలిపారు. గోడాడీ ఖాతాదారుల్లో అమెరికాకు వెలుపల 40 శాతం మంది ఖాతాదారులు ఉండగా.. ఇందులో భారత్ వాటా అత్యధికంగా ఉంది. అమెరికా తర్వాత భారత్‌లోనే తమకు అత్యధిక ఖాతాదారులు ఉన్నారని ఆండ్రూ చెప్పారు.

షారుఖ్ ఖాన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'జబ్ హ్యారీ మెట్ సెజల్'. షారుఖ్ సరసన అనుష్క శర్మ కథానాయికగా నటించింది. ఇది వీరిద్దరి కలయికలో వస్తున్న మూడో చిత్రం కావడం గమనార్హం. 'జబ్ వి మెట్', 'లవ్ ఆజ్‌కల్' లాంటి నవతరం ప్రేమకథా చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఇంతియాజ్ అలీ దీన్ని తెరకెక్కించారు. షారుఖ్ సతీమణి గౌరీ ఖాన్ నిర్మాతగా వ్యవహరించారు. 'ఫ్యాన్'లో షారుఖ్‌తో కలసి నటించిన సయానీ గుప్తాతో పాటు ఎవ్లిన్ శర్మ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.



# ఉంగరం పోయింది... ప్రేమ దొరికింది!


'జబ్ హ్యారీ మెట్ సెజల్'లో అనుష్క శర్మ, షారుఖ్ ఖాన్

ఈ ఏడాది జనవరిలో 'రయీస్'తో ప్రేక్షకులను పలకరించారు షారుఖ్ ఖాన్. అందులో డాన్ తరహా పాత్రలో సీరియస్‌గా కనిపించి ఆకట్టుకున్నాడు. ఇప్పుడు 'జబ్ హ్యారీ మెట్ సెజల్'తో మరోసారి బాక్సాఫీసు వద్ద సందడి చేయనున్నాడు. సరదాగా సాగిపోయే ఈ రొమాంటిక్ కామెడీ చిత్రంలో టూరిస్ట్ గైడ్‌గా కనిపించబోతున్నాడు షారుఖ్. ఆయనకు జోడీగా అనుష్క శర్మ అందాలతో కనువిందు చేయనుంది. 'రబ్‌నే బనాది జోడీ', 'జబ్ తక్ హై జాన్' తర్వాత షారుఖ్, అనుష్క జంటగా నటించిన మూడో చిత్రమిది. ఆ చిత్రాల్లాగే ఇప్పుడూ అభిమానులను అలరించి హ్యాట్రిక్ విజయాన్ని అందుకోవడానికి సిద్ధమయ్యారు షారుఖ్, అనుష్క. వినూత్న ప్రేమకథా చిత్రాలు తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన ఇంతియాజ్ అలీ తొలిసారిగా షారుఖ్‌తో తెరకెక్కించిన చిత్రం కావడంతో దీనిపై మంచి అంచనాలున్నాయి.

## కథేంటి

హరీందర్ సింగ్ నెహ్రా అలియాస్ హ్యారీ(షారుఖ్) విదేశాల్లో గైడ్‌గా పని చేస్తుంటాడు. సెజల్ జవేరి(అనుష్క శర్మ) విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు ఆమెకు హ్యారీ గైడ్‌గా వ్యవహరిస్తుంటాడు. సెజల్‌కు వేరే వ్యక్తితో నిశ్చితార్థం జరిగుంటుంది. అయితే ఆమె నిశ్చితార్థపుంగరం పోగొట్టుకుంటుంది. అది లేకుండా వెనక్కి వెళ్లలేని పరిస్థితి. అందుకే హ్యారీతో కలసి ఉంగరం కోసం వెతకడం మొదలుపెడుతుంది. వారి ప్రయాణం బోలెడు అబద్ధాలు, అందమైన ఫాంటసీలతో మలుపులు తిరుగుతూ థ్రిల్లింగ్‌గా సాగుతుంది. చివరకు ఆ అన్వేషణలో ఉంగరం సంగతేమో కానీ... హ్యారీ వల్ల అసలైన స్వేచ్ఛ, అనురాగం అంటే ఏంటో సెజల్‌కు తెలిసొస్తుంది. తెగిన గాలిపటంలా తిరిగే హ్యారీకీ ప్రేమ, అనుబంధాల్లోని రుచి అర్థమవుతుంది. అప్పుడు హ్యారీ, సెజల్‌ల కథ ఏమైందన్నది తెరపై చూడాలి.



## గ్రామీ విజేతతో పాట

ప్రతిష్ఠాత్మక గ్రామీ పురస్కార విజేత, అమెరికన్ గాయకుడు డిప్లో ఈ చిత్రానికి పనిచేయడం విశేషం. ఇందులోని 'ఫుర్...' అంటూ సాగే ఓ పాటను సంగీత దర్శకుడు ప్రీతమ్‌తో కలసి స్వరపరిచారు డిప్లో. దానికి సంబంధించి విడుదల చేసిన వీడియో గీతంలో షారుఖ్‌తో కలసి తళుక్కున మెరిశాడు డిప్లో. ఆ గీతానికి ఆన్‌లైన్‌లో మంచి స్పందన వస్తోంది.

## ప్రచారంలో పదనిసలు

ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించారు. ప్రధాన నగరాల్లో సెజల్ పేరు పెట్టుకున్న వందల మంది అమ్మాయిలను ఆహ్వానించి వారితో షారుఖ్ ముచ్చటించారు. దీంతోపాటు సెజల్ పేరున్న నాలుగు వందల మందికి పైగా అమ్మాయిలు షారుఖ్‌ను కలవడానికి ముంబయిలోని ఆయన స్వగృహం మన్నత్‌కు చేరుకోవడం విశేషం. ఆన్‌లైన్‌లోనూ విభిన్నంగా ప్రచారం చేశారు. ఈ చిత్రంలో షారుఖ్, అనుష్క మధ్య వచ్చే సంభాషణలను పరిచయం చేస్తూ ఒక్కో పాట విడుదల చేశారు.

# ఈనాడు సినిమా


అల్లు అర్జున్

## రంగంలోకి దిగిన సూర్య

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. అను ఇమ్మానియేల్ కథానాయిక. వక్కంతం వంశీ దర్శకుడు. లగడపాటి శ్రీధర్ నిర్మాత. అర్జున్, శరత్‌కుమార్ కీలక పాత్రధారులు. బుధవారం నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ మొదలైంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "భారతదేశం గర్వించదగిన నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. తొలిసారి మెగాఫోన్‌పట్టిన వక్కంతం వంశీ ఈ చిత్రాన్ని బాగా తెరకెక్కిస్తున్నారు. టైటిల్‌కి మంచి స్పందన వస్తోంది. 2018 ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. విశాల్ - శేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రాజీవ్ రవి, పాటలు: రామజోగయ్య శాస్త్రి, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, సహ నిర్మాత: బన్నీ వాసు, సమర్పణ: కె.నాగబాబు

## గీతోపదేశం

ఛల్ ఛలో ఛలో చలించు దారిలో
ప్రతీ ఒక్క ఛాలెంజ్ ఫేస్ చెయ్యరో
తీపితో పాటుగా ఓ కొంత చేదు
అందించడం జిందగీకి అలవాటే
కష్టమే రాదనే గ్యారెంటీ లేదు
పడేసి పరుగు నేర్పే ఆటే బ్రతుకంటే
అందుకో హత్తుకో ముందరున్న ఈ క్షణాన్ని

గీతం: ఛల్ ఛలో ఛలో...
చిత్రం: సన్నాఫ్ సత్యమూర్తి
రచన: రామజోగయ్య శాస్త్రి
- పంపినవారు: నామా రాజేశ్వర్రావు, రాచకొండ

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net



కథానాయికలకు అందం ఉంటే చాలదు. అభినయం తోడవ్వాలి. అదృష్టం కలసి రావాలి. వీటన్నింటితో పాటు తెలివితేటలూ ఉండాలి. కెరీర్‌ని ఎప్పుడెలా మలుచుకోవాలి? ఏ సందర్భంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనేదానిపై అవగాహన ఉండాలి. రకుల్‌ప్రీత్ సింగ్ ఈ విషయంలో ఆరితేరింది. పెద్ద సినిమానా, చిన్న సినిమానా? అనే తేడాలు రకుల్‌కి లేవు. తనకు కలిసొస్తుందంటే.. ఏ సినిమా అయినా ఒప్పుకొంటుంది. అందుకే ఏడాదికి అయిదు సినిమాలకు తగ్గకుండా తన చేతిలో ఉంచుకొంటోంది. ఇప్పుడు తమిళ, హిందీ చిత్ర సీమలపైనా దృష్టి పెట్టింది. ఇంత బిజీగా ఉన్నా తన అభిరుచికి తగ్గట్టుగా వ్యాపార కార్యక్రమాల్లోనూ మునిగి తేలుతోంది. రకుల్ నటించిన 'జయ జానకి నాయక' ఈ నెల 11న విడుదల అవుతోంది. ఈ చిత్ర విశేషాల గురించీ, తన కెరీర్ గురించీ రకుల్ చెప్పిన కబుర్లు ఇవీ.

# అదే జరిగితే అందరి సినిమాల్లోనూ నేనే

**'జయ జానకి నాయక', 'స్పైడర్'.. ఇలా మీ సినిమాలు వరుసగా రాబోతున్నాయి. మీ కెరీర్‌లో ఇది కీలక తరుణమని భావిస్తున్నారా?**

ప్రతి సినిమా కీలకమే. రెండు మూడు విజయాలు చేతిలో ఉన్నాయి కదా అని రిలాక్స్ అయిపోకూడదు. సినిమాలు బాగుంటే, హిట్ అయితే... 'రకుల్ టైమ్ బాగుంది' అంటారు. అదే సినిమాలు ఆడకపోతే - 'ఐరెన్ లెగ్ అయిపోయింది.. పోటీ తట్టుకోలేకపోతోంది' అనడానికీ సిద్ధపడతారు. అందుకే ప్రతి సినిమా కీలకమే.

**జయాపజయాల ప్రభావం నాయికలపై ఉండదంటారు..?**

ఎందుకు ఉండదు. తప్పకుండా ఉంటుంది. హీరోలతో సమానంగా కాకపోయినా, ఒకట్రెండు పరాజయాలు తగిలితే తిరోగమనం మొదలైపోయినట్టే. అదే సినిమా హిట్టయితే.. అందరితో పాటు నేనూ సంతోషంగా ఉంటాను.

**కెరీర్‌లో ఎప్పుడైనా 'నా పని అయిపోయింది' అనిపించిందా?**

మీడియాలో వార్తలు రావడం మినహా..ఎప్పుడూ అలాంటి భావన రాలేదు.

**కథానాయకులంతా 'మా సినిమాలో కథానాయికగా రకుల్ కావాలి' అంటున్నారట..**

నిజమా.. అలా అంటే మంచిదే కదా? అదే జరిగితే అందరి సినిమాల్లోనూ నేనే కనిపిస్తా. ఒకేసారి నాలుగు సినిమాలు ఒప్పుకోమన్నా నిరభ్యంతరంగా ఒప్పుకొంటాను. సినిమాలతో తీరిక లేకుండా బిజీగా ఉండడమే నాకిష్టం.

**పెద్ద సినిమాలు, చిన్న సినిమాలూ అన్న తేడా ఉండదా?**

నాకైతే లేదు. సినిమా బాగోలేకపోతే రూ.వంద కోట్ల బడ్జెట్‌తో తీసినా లాభం ఏముంది? తక్కువ బడ్జెట్‌లో తీసిన సినిమా బాగా ఆడిందంటే... నాకు ప్లస్ అవుతుంది. బడ్జెట్ ఎక్కువ అని ఎక్కువ పనిచేయం. తక్కువలో తీస్తున్న సినిమా కదా అని చిన్న చూపు చూడం. దేన్నికైనా ఒకేలా కష్టపడతాం.

**మీతో పోలిస్తే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ జూనియర్ అనుకోవాలి. ఆయనకు ఏమైనా సలహాలు ఇచ్చారా?**

సలహాలు ఇవ్వడానికి నేనెవర్ని? నేనేం కోచింగ్ సెంటర్ పెట్టలేదు కదా..! బోయపాటి శ్రీనుగారు సెట్లో ఉంటే ఆ అవసరమే ఉండదు. ఆయన మంచి నటుడు. తనకు ఎలా కావాలో నటించి చూపిస్తారు. బెల్లంకొండ శ్రీను బాగా నటించారు. ఆయన గత సినిమాల్ని నేను చూడలేదు. కానీ సెట్లో అడుగుపెట్టిన తొలి రోజుకీ చివరి రోజుకీ తనలో చాలా మార్పు కనిపించింది.

**ఇంతకీ 'జయ జానకి నాయక' ఎలా ఉండబోతోంది?**

బోయపాటిగారి సినిమాలు చాలా చూశాం. వాటిలో ఇది భిన్నంగా ఉండబోతుంది. ఇదో ప్రేమకథ. శ్రీనివాస్ పాత్ర చూసి 'ఇలాంటి ప్రేమికుడు ఉంటే బాగుంటుంద'ని ప్రతి అమ్మాయి అనుకొంటుంది. ప్రేమలో ఇంత నిజాయతీ సినిమాల్లోనే కనిపిస్తుందనుకొంటా.

**మీ పాత్రలో మీకు నచ్చిన అంశాలేంటి?**

ఇందులో జానకిగా కనిపిస్తా. రెండు పార్శ్వాలుంటాయి. ఇప్పటి వరకూ ఏ సినిమాకీ వాడనంత గ్లిజరిన్ ఈ సినిమాకి వాడాను. ఏడుస్తూ ఉండడం వల్ల సాయంత్రానికి కళ్లు ఉబ్బిపోయేవి. కన్నీళ్లతో చెంపల మీద మచ్చలు పడిపోయేవి. ఈ సినిమా పూర్తయ్యేలోగా ముసలమ్మలా ముడతలు పడిపోతాయేమో అని భయపడేదాన్ని (నవ్వుతూ). అయితే ఈ తరహా పాత్ర దక్కడం ఓ గొప్ప అవకాశం. నాలో ఈ కోణమూ ఉందా? అని ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు.

**సినిమా చూసి ఎప్పుడైనా ఏడ్చిన సందర్భాలున్నాయా?**

ఈ మధ్య 'నిన్ను కోరి' సినిమా చూశా. సినిమా చూస్తూ చూస్తూ చాలాసార్లు ఏడ్చేశా. 'ఇంతలా ఏడిపిస్తావ్ అనుకోలేదు' అని నానికి ఫోన్ చేసి చెప్పా. నివేదా చాలా బాగా నటించింది.

**నివేదా, సాయిపల్లవి.. ఇలా మీకు పోటీ పెరిగిపోతోంది కదా?**

పెరగనివ్వండి. మంచిదే కదా? ఎంతమంది మంచి కథానాయికలుంటే.. అన్ని మంచి పాత్రలు రాస్తుంటారు దర్శకులు. అందులో నాకూ ఒకట్రెండు పాత్రలు దక్కుతాయి కదా?

**ఈమధ్య తమిళ, హిందీ చిత్రాలపై దృష్టి మళ్లినట్టుంది?**

అదేం కాదు. అక్కడి నుంచీ నాకు మంచి సినిమాలొస్తున్నాయి. బాలీవుడ్ సెట్లోనూ 'మా హైదరాబాద్‌లో షూటింగ్ ఎలా ఉంటుందో తెలుసా?' అంటూ ఇక్కడి కబుర్లే చెబుతుంటా. బాలీవుడ్‌లో మన సినిమాల గురించి మాట్లాడుకొంటూనే ఉంటారు. 'స్పైడర్' సంగతుల్ని అక్కడి వాళ్లు అడిగి తెలుసుకొన్నారు.

## పంచ్ డైలాగ్

జీతం ఇచ్చేవాడి దగ్గర నాలుగు గంటలు ఎక్కువ పని చేయడానికి టైమ్ ఉంది. జీవితం ఇచ్చిన మా కోసం నాలుగు రోజులు వెచ్చించడానికి లేదా!

చిత్రం: శతమానం భవతి

- పంపినవారు: పరశురాం, రానాపూర్, పెద్దపల్లి

# తొలి టికెట్ చిరు కోసం


సుకుమార్, చిరంజీవి, హరిప్రసాద్ జక్కా

"ఓ దర్శకుడిగా సుకుమార్ ఉన్నత స్థానంలో ఉన్నాడు. దర్శకత్వం చేస్తూ, నిర్మాతగా తన అభిరుచికి తగ్గట్టుగా సినిమాలు రూపొందిస్తూ ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడం ఆనందంగా ఉంద"న్నారు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి. సుకుమార్ నిర్మించిన చిత్రం 'దర్శకుడు'. హరిప్రసాద్ జక్కా దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమా తొలి టికెట్‌ని బుధవారం హైదరాబాద్‌లో చిరంజీవి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "ఈ పరిశ్రమలో నేనేంటి? అని కాకుండా, ఈ పరిశ్రమకు నేనేంటి? అనే కోణంలో ఆలోచించి నిర్మాతగా మారిన సుకుమార్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. సుకుమార్ స్థాపించిన 'సుకుమార్ రైటింగ్స్' నుంచి 'కుమారి 21 ఎఫ్' వచ్చింది. మంచి విజయాన్ని అందుకొంది. దర్శకుడి పేరుని తెరపై చూస్తాం. కానీ ఓ దర్శకుడి భావోద్వేగాలు ఎలా ఉంటాయి? తెర వెనుక ఏం చేస్తాడు? అనే మంచి కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. 'దర్శకుడు' మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకొంటున్నా" అన్నారు.

# మనసుల్ని గెలుచుకొంటారు


దుల్కర్ సల్మాన్, సాయిపల్లవి

దుల్కర్ సల్మాన్, సాయిపల్లవి జంటగా నటించిన మలయాళ చిత్రం 'కలి'. సమీర్ తాహీర్ దర్శకుడు. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. డి.వి.కృష్ణస్వామి నిర్మాత. వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. నిర్మాత మాట్లాడుతూ "దుల్కర్, సాయిపల్లవికి తెలుగులోనూ అభిమానులున్నారు. గోపీసుందర్ చక్కటి బాణీల్ని అందించారు. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తామ"న్నారు.

# ఈ 'లచ్చి' కథేంటి?


జయతి

బుల్లి తెర వ్యాఖ్యాత జయతి కథానాయికగా మారింది. ఆమె నటించిన చిత్రం 'లచ్చి'. తనే నిర్మాత. ఈశ్వర్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. సెప్టెంబరు మొదటి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సందర్భంగా జయతి మాట్లాడుతూ "కథ బాగా నచ్చింది. అందుకే నిర్మాతగానూ మారాను. హారర్ చిత్రాల్లో 'లచ్చి' భిన్నంగా కనిపిస్తుంది. యంవీ రఘు లాంటి గొప్ప కెమెరామెన్‌తో కలసి పనిచేశా. మరుధూరి రాజా మాటలు అలరిస్తాయ"న్నారు. తేజస్విని, దిలిప్, చంద్రమోహన్, శివ ప్రసాద్, రఘుబాబు, తాగుబోతు రమేష్, ధనరాజ్ తదితరులు నటించారు. సంగీతం: సురేష్ యువన్, పాల్ పవన్

# సందేశం ఉండాల్సిందే


నరసింహ నంది

'1947లో ఓ గ్రామం' చిత్రంతో ఆకట్టుకొన్నారు నరసింహ నంది. ఇప్పుడు 'బుడ్డారెడ్డిపల్లి బ్రేకింగ్ న్యూస్' చిత్రాన్ని రూపొందించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా నరసింహ నంది హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. "మూగజీవుల సంరక్షణ చట్టం ఉన్నప్పటికీ అది సక్రమంగా పనిచేయడం లేదు. ఆ మధ్య ఓ రోడ్డు ప్రమాదంలో గేదె చనిపోయింది. ఆ ఘటన స్ఫూర్తితో తెరకెక్కించిన చిత్రమిది. నా ప్రతి చిత్రం ద్వారా మంచి చెప్పే ప్రయత్నం చేస్తుంటాను. తెలుగు భాష మాధుర్యాన్ని చెప్పే కథతో 'ఉత్పలమాల ఉత్తరం రాసింది' చిత్రాన్ని తీస్తున్నాను. మయూఖ ఆదిత్య రాసిన కథ ఇది. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసి, చైతన్యవంతుల్ని చేస్తుంది. మూడొంతులు చిత్రీకరణ పూర్తయింది. సెప్టెంబర్ నాటికి పూర్తవుతుంది. ఆ తర్వాత 'వ్యవసాయం దండగ కాదు పండగ' అని చెప్పే ఇతివృత్తంతో నూతన చిత్రాన్ని ఆరంభించనున్నాను. నేటి యువతరం దేశానికి వెన్నెముక అయిన వ్యవసాయం పట్ల శ్రద్ధ చూపాలనే సందేశంతో ఆ చిత్రాన్ని రూపొందిస్తున్నా" అన్నారు.

# ఐఫోన్‌లో 'లవర్స్ క్లబ్'


పావని, అనిష్ చంద్ర

అనిష్ చంద్ర, పావని, ఆర్యన్, పూర్ణి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'లవర్స్ క్లబ్'. ధ్రువ శేఖర్ దర్శకుడు. భరత్ అవ్వారి నిర్మాత. ఈనెల 25న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఐ ఫోన్ టెక్నాలజీతో తెరకెక్కించిన చిత్రమిది. ఈ సాంకేతికతతో మున్ముందు మరిన్ని అద్భుతాలు సృష్టించొచ్చు. ప్రేమికులకు అండగా నిలబడే ఓ యువకుడి కథ ఇద"న్నారు.

# బాలరాజు ప్రేమ కథ


దేవుడి పటాలపై క్లాప్‌నిస్తున్న సాగర్

నూతన నటీనటులతో నంది క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోన్న చిత్రం 'బంగారి బాలరాజు'. కోటేంద్ర దర్శకుడు. ఎం.డి.రఫీ నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. దర్శకుడు సాగర్ క్లాప్‌నిచ్చారు. నాగ అన్వేష్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "శతాబ్దాలు మారినా ప్రేమ మారదు. కేవలం ప్రేమికులే మారతారు. సలీమ్ - అనార్కలీ, రోమియో - జూలియట్‌లా చరిత్రలో నిలిచిపోయే ఓ ప్రేమ జంట కథని 'బంగారి బాలరాజు'లో చూపిస్తున్నాం. కథానాయకుడు, నాయిక ఇద్దరూ కొత్తవాళ్లే. వారిని త్వరలో పరిచయం చేస్తామ"న్నారు. "దర్శకుడు చెప్పిన కథాంశం బాగా నచ్చింది. ప్రేమ కథల్లో ప్రత్యేకంగా నిలిచిపోతుంద"న్నారు నిర్మాత. రోహిణి, అజయ్ ఘోష్, అప్పారావు, లేఖన, మహేంద్రనాథ్ తదితరులు నటిస్తున్నారు. సంగీతం: చిన్నికృష్ణ

# అదో కొత్త దెయ్యం


సాక్షి కక్కర్

శ్రీనాథ్ మాగంటి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ఇదేం దెయ్యం'. సాక్షి కక్కర్, రచన స్మిత్, రుచి పాండే కథానాయికలు. వి.రవివర్మ దర్శకుడు. బాలుస్వామి స్వరకర్త. ఈ నెల 4న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. కథానాయకుడు మాట్లాడుతూ "హాస్యానికి పెద్దపీట వేస్తూ తెరకెక్కించిన చిత్రమిది. భయపెట్టే అంశాలుంటాయి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "దెయ్యం చుట్టూ సాగే కథ ఇది. కానీ ఇందులో ఆ దెయ్యమే కొత్తగా ఉంటుంది" అన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, ఆర్.పి, రచనస్మిత్ తదితరులు పాల్గొన్నారు.

# పాత బొగ్గు విద్యుత్ కేంద్రాలకు మంగళం

- వీటీపీఎస్‌లో దశలవారీగా ఆరు యూనిట్ల తొలగింపు!
- డిసెంబరుకు తొలి యూనిట్ మూత



**ఈనాడు, అమరావతి:** విజయవాడలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం (వీటీపీఎస్)లో 25 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నుంచి సేవలు అందిస్తూ వచ్చిన పాత బొగ్గు విద్యుత్ కేంద్రాలను దశలవారీగా తొలగించనున్నారు. 25 సంవత్సరాలు అంత కంటే ఎక్కువ కాలం నుంచి పనిచేస్తున్న థర్మల్(బొగ్గు) కేంద్రాలను తొలగించి వాటి స్థానంలో సూపర్‌క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త కేంద్రాలను నిర్మించడం ఉపయుక్తం అనే అభిప్రాయాన్ని కేంద్ర విద్యుత్ అథారిటీ(సీఈఏ) వ్యక్తం చేస్తోంది. దేశవ్యాప్తంగా 9 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను తొలగించాల్సిన అవసరం ఉందని గత ఏడాదే సీఈఏ గుర్తించింది. ఇందులో వీటీపీఎస్‌లోని కేంద్రాలు కూడా ఉన్నాయి. సీఈఏ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం వీటీపీఎస్‌లోని తొలి యూనిట్‌ను వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తిగా నిలిపివేయాలి. ఆ తరువాత ప్రతి ఆరు నెలలకు ఒకటి చొప్పున మరో అయిదు యూనిట్లలోనూ విద్యుత్ ఉత్పత్తిని ఆపేయాలి. వాటిని తొలగించాలి.

**500 మెగావాట్ల యూనిట్ తప్ప..:** వీటీపీఎస్ స్థాపక సామర్థ్యం 1,760 మెగావాట్లు. 210 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు యూనిట్లు ఉన్నాయి. ఇందులో తొలి యూనిట్ 1979 నవంబరులో వినియోగంలోకి వచ్చింది. మరో పది నెలలకు రెండో యూనిట్ అందుబాటులోకి వచ్చింది. 1995 నాటికి ఈ ఆరు యూనిట్ల నిర్మాణమూ పూర్తి అయింది. 2009లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో యూనిట్‌ను నెలకొల్పారు. దీనిని మినహా మిగిలిన ఆరింటిని కూడా దశలవారీగా తొలగించాలన్నది ప్రణాళిక.

**సానుకూలంగానే జెన్‌కో:** సామర్థ్య వినియోగంలో వీటీపీఎస్‌కు ఘనమైన చరిత్ర ఉంది. ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధనలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఈ నేపథ్యంలోనే ప్లాంటులు పాతవి అయినా వాటిని తొలగించాల్సిన అవసరం లేదని ఏపీజెన్‌కో వాదిస్తూ వచ్చింది. అయితే తాజాగా పల్లవి మార్చింది. కొత్తగా 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం చేపట్టదలచినందున కాలం చెల్లిన పాత ప్లాంట్లను తొలగించాలని పేర్కొంటోంది. రాష్ట్రంలో విద్యుత్ మిగులు ఉన్న దృష్ట్యా వీటీపీఎస్‌లో కొత్తగా చేపట్టిన 800 మెగావాట్ల యూనిట్‌తోపాటు దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం (కృష్ణపట్నం)లో 800 మెగావాట్ల యూనిట్ అవసరం ఇప్పట్లో ఉండకపోవచ్చనే విషయమై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. సీఈఏ ప్రకారం వీటీపీఎస్‌లోని ఆరు యూనిట్లను 2021నాటికి పూర్తిగా తొలగించాల్సి ఉన్నందున కొత్తగా నిర్మాణం మొదలుపెట్టిన ప్లాంట్ల అవసరం ఉందని ఏపీజెన్‌కో ఆ సమావేశంలో వాదించింది. రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రంలో కూడా రెండు యూనిట్లను తొలగించాల్సి వస్తుందని, వాటి స్థానంలో ఇవి ఉపయోగపడతాయని జెన్‌కో చెబుతోంది.

**నివేదికపై త్రిసభ్య కమిటీ:** పాత విద్యుత్ కేంద్రాల తొలగింపు విషయమై నివేదిక ఇచ్చేందుకు ముగ్గురు సభ్యులతో ఏపీజెన్‌కో తాజాగా కమిటీని నియమించింది. వారం రోజుల్లో వీరు తమ నివేదికను సమర్పించాల్సి ఉంది.

## ప్రధానితో గవర్నర్ నరసింహన్ భేటీ

**ఈనాడు, దిల్లీ:** ప్రధాని మోదీతో తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ బుధవారమిక్కడ భేటీ అయ్యారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, సిబ్బంది వ్యవహారాల మంత్రి జితేంద్రసింగ్‌నూ గవర్నర్ కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన భేటీకి ప్రత్యేక కారణాలు ఏమీ లేవన్నారు. రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించానన్నారు. తెలుగు రాష్ట్రాల గురించి ప్రధాని, జితేంద్రసింగ్‌లతో చర్చించిన అంశాలు వెల్లడించడానికి నిరాకరించారు. జాతీయ భద్రత సలహాదారుగా నియమితులు కానున్నారా అనిప్రశ్నించగా తనకెలాంటి సమాచారం లేదన్నారు.

## దిల్లీ ఆకాశవాణి కేంద్రం డైరెక్టర్‌గా తొలిసారి తెలుగు మహిళ



**ఈనాడు, దిల్లీ:** దేశ రాజధాని ఆకాశవాణి కేంద్రం సంచాలకురాలుగా తొలిసారి తెలుగు మహిళ నియమితులయ్యారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లో మూడు దశాబ్దాలకు పైగా మార్కెటింగ్ విభాగంలో సేవలందించిన మల్లాది శైలజా సుమన్ దిల్లీ ఆకాశవాణి కేంద్రం సంచాలకురాలిగా నియమితులయ్యారు. శైలజాసుమన్ ఆధ్వర్యంలో రూపొందించిన అనేక కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ, రజత నందులు గెలుచుకున్నాయి. విజయవాడలో దూరదర్శన్ సప్తగిరి కేంద్రం పూర్తిస్థాయిలో ఏర్పడానికి శైలజాసుమన్ విశేష కృషి చేశారు.

## మిర్చి, పసుపుపై జీఎస్టీ మినహాయించాలి

### లోక్‌సభలో ఎంపీ జయదేవ్ డిమాండ్

**ఈనాడు, దిల్లీ:** ఎండు మిర్చి, పసుపుపై జీఎస్టీ మినహాయించాలని తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ డిమాండు చేశారు. బుధవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ విషయంలో కేంద్రం కొన్ని అంశాలు నిశితంగా పరిశీలించాల్సి ఉందని అన్నారు. ప్రకృతి సహజంగా ప్రాసెస్ అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ పన్ను తొలగించాలని కోరారు. పచ్చిమిర్చి, ఆరబెట్టని పసుపులను మినహాయించినట్లే ఎండుమిర్చి, పసుపులపై జీఎస్టీ మినహాయించాలన్నారు. ముడి పొగాకుపై 5శాతం, పొగాకు ఉత్పత్తులపై 28శాతం పన్ను వేయడంతో రైతులు, ఎగుమతిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీఎస్టీ చట్టంలో కూడా రాష్ట్రానికి ప్రోత్సాహకాలు కొనసాగించాలని కోరారు.

## ఏపీలో 272 మానవ రహిత రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో 272 మానవరహిత రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు ఉన్నట్లు రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గొహైన్ తెలిపారు. తెదేపా ఎంపీ మురళీమోహన్ అడిగిన ప్రశ్నకు ఆయన లోక్‌సభలో ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

## నేడు వెంకయ్యనాయుడితో తెలుగు రాష్ట్రాల ఎంపీలు భేటీ

**ఈనాడు, దిల్లీ :** ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి వెంకయ్యనాయుడుతో గురువారం ఆయన నివాసంలో తెలుగు రాష్ట్రాల ఎంపీలు భేటీ కానున్నారు. ఈ నెల 5న ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో తెదేపా, భాజపా, వైకాపా, తెరాస ఎంపీలు వెంకయ్యనాయుడిని కలిసి అభినందనలు తెలపనున్నారు.

## జంతర్‌మంతర్ వద్ద ఎమ్మార్పీఎస్ నేతల ధర్నా

**ఈనాడు, దిల్లీ:** పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని తెలుగు రాష్ట్రాల ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండు చేశారు. బుధవారమిక్కడ తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తదితరుల నేతృత్వంలో జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్‌పై స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని నినదించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని భాజపా చెప్పి ఇప్పుడు నిర్లక్ష్యం చేయడం తగదని ఆరోపించారు.

## ప్రవీణ్ ప్రకాశ్ బాధ్యతల స్వీకరణ

దేశరాజధానిలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన కేంద్ర పట్టణాభివృద్ధిశాఖలోని స్వచ్ఛభారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి, మిషన్ డైరక్టర్‌గా వ్యవహరించారు.

## లాంఫాంకి మారిన రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

**ఈనాడు, అమరావతి:** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అధికారులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాం ఫాంలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవనంలోకి మారారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ నుంచి తొలిసారిగా విశ్వవిద్యాలయ అధికారులు గుంటూరుకు వచ్చారు. స్థానికంగా అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఈలోపు లాం ఫాంలో రూ.5 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించారు. బుధవారం విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టరు వి.దామోదరనాయుడు శాస్త్రోక్తంగా పూజలు చేసి పరిపాలన భవనం లోపలికి ప్రవేశించారు. వర్శిటీకి చెందిన పది విభాగాల అధికారులు, వారి సిబ్బంది ఇక్కడ నుంచే విధులు నిర్వహిస్తారు.

## గుంటూరులో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల ముద్రణాలయం

**గుంటూరు, న్యూస్‌టుడే:** ఏపీ ప్రభుత్వ శాఖల తరలింపులో భాగంగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక విద్యాశాఖ పరిధిలోని పాఠ్యపుస్తకాల ముద్రణాలయాన్ని గుంటూరుకు తరలించారు. బుధవారం గుంటూరులోని రామన్నపేటలో పాఠ్యపుస్తకాల ముద్రణాలయ ప్రధాన కార్యాలయాన్ని సంచాలకుడు వై.పీరయ్య పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠ్యపుస్తకాల ముద్రణాలయ సహాయ సంచాలకులు రవికుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## విశాఖపట్నంలో టెక్నాలజీ డిమానిస్ట్రేషన్ సెంటర్

**ఈనాడు, అమరావతి:** విశాఖకు టెక్నాలజీ డిమానిస్ట్రేషన్ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. పంజాబ్, గుజరాత్, కర్ణాటకల్లో మాత్రమే ఈ తరహా కేంద్రాలున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుందని పేర్కొన్నారు. త్వరలో సవివర ప్రాజెక్టు నివేదికను కేంద్రానికి పంపుతామని తెలిపారు. ఇందుకు కావాల్సిన పూర్తి నిధులను కేంద్రమే చెల్లిస్తుందని, తొలి విడతలో రూ.25 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు.

## జూనియర్ కళాశాలల అనుబంధ రుసుములు తగ్గింపు

**ఈనాడు, అమరావతి:** ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుబంధ(అఫిలియేషన్), తనిఖీ (ఇన్‌స్పెక్షన్) రుసుములు తగ్గిస్తున్నట్లు మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. 2016-17లో ఒక్కో గ్రూపునకు రూ.5వేలు చొప్పున రుసుములు ఉండగా.. ఇటీవల వీటిని రూ.15వేలకు పెంచారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు మంత్రిని కలిశాయి. కళాశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపిన మంత్రి 50శాతానికి తగ్గిస్తూ నిర్ణయం వెల్లడించారు.

## పూర్తయిన భవనాలకు వ్యాట్ లేదు

**ఈనాడు, అమరావతి:** బిల్డర్లు నిర్మించే బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల్ని కొనుగోలు చేసినప్పుడు 1.25 శాతం విలువ ఆధారిత పన్ను(వ్యాట్)ను రిజిస్ట్రేషన్ సమయంలో వసూలు చేస్తున్నారు. ఇందులో కొంత వెసులుబాటు కల్పిస్తూ వాణిజ్యపన్నుల శాఖ నిర్ణయం తీసుకొంది. నిర్మాణం పూర్తయ్యాక స్థానిక సంస్థల నుంచి సంబంధిత ధ్రువపత్రం ఇస్తారు. దాన్ని జతచేసి రిజిస్ట్రేషన్ చేయించుకొంటే వ్యాట్‌ను వసూలు చేయాల్సిన అవసరం లేదని ఆ శాఖ కమిషనర్ జె.శ్యామలరావు స్పష్టత ఇస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి లేఖ రాశారు. భవనాలు అసంపూర్తిగా, నిర్మాణ దశలో ఉండగానే కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొనేటప్పుడు మాత్రం ఈ మినహాయింపు వర్తించదు. 1.25శాతం వ్యాట్ చెల్లించాల్సి ఉంటుంది.

---

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**Ref. C1/639/16 dt. 02-08-2017**

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

### ఫారమ్ నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్ (1)ననుసరించి)

### రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము పశ్చిమగోదావరి జిల్లా, **కామవరపుకోట** మండలం **కామవరపుకోట** గ్రామంకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2017-18నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

### రూఢి ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 24.78 సెంట్లులను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

మండలం: కామవరపుకోట గ్రామం: కామవరపుకోట

| క్ర. సం. | సర్వే నెం. | మొత్తం విస్తీర్ణం | భూసేకరణ సందు విస్తీర్ణం | తరగతి | భూ ఆసామి పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు, కట్టడములు మరియు ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 179/6B | 4.02 | 0.82 | పుంజ | పోలుబోయిన నాగేశ్వరరావు | 179/6A | 183 179/6C | 182 | 179/6A | సాగుభూమి, తాడి-1, వేప-7 |
| | | | | | పోలుబోయిన పైడియ్య | | | | | ఊడిగ-1, వేప-1, సాగుభూమి |
| 2 | 180/11B | 0.50 | 0.08 | పుంజ | పోలుబోయిన సంతోషరావు | 180/11A | 180/13B | 181 | 180/11A | సాగుభూమి, పైప్‌లైన్, డ్రిప్ |
| 3 | 180/12B | 0.97 | 0.32 | పుంజ | చంద్రు శివన్నారాయణ | 180/12A | 182 | 180/13B | 180/12A | జీడి, తాడి-2 |
| 4 | 180/13B | 1.23 | 0.75 | పుంజ | పోలుబోయిన మహాలక్ష్ముడు | 180/13A 11B | 180/13C 182 | 181 | 180/12B | సాగుభూమి, టేకు-8, పైప్‌లైన్, డ్రిప్, తాడి చెట్లు, కుంకుడు-1 |
| 5 | 181/1B | 5.72 | 1.58 | పుంజ | గంటా హారిక | 414 | 181/1C | 413 | 180 | నిమ్మ, పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 6 | 182/1A | 2.63 | 0.44 | పుంజ | బొప్పన సత్యనారాయణ | 180 | 182/1B | 182/1B | 179 | పామాయిల్, డ్రిప్, పైప్ లైన్, వేప-2, తాడి-2 |
| 7 | 183/3A | 0.27 | 0.01 | పుంజ | చంద్రు శివన్నారాయణ | 186 | 183/3B | 183/4 | 185 | సాగుభూమి |
| 8 | 183/5A | 1.71 | 0.33 | పుంజ | చంద్రు దుర్గారావు | 179 | 183/5B | 183/6A | 183/4 | పామాయిల్, తాడి-1, వేప-7, డ్రిప్, పైప్‌లైన్ |
| 9 | 183/6A | 1.61 | 0.01 | పుంజ | పోలుబోయిన పైడియ్య | 179 | 183/6B | 179 183/6B | 183/5A | సాగుభూమి |
| 10 | 185/1B | 2.35 | 0.18 | పుంజ | శాయన కృష్ణారావు | 185/1A | 185/2B | 185/4B | 185/1A | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్, తాడి-1, పనస-1, ఊడిగ-2 |
| 11 | 185/2B | 3.84 | 1.14 | పుంజ | శాయన నాగేశ్వరరావు | 185/1B, 2A | 185/2C | 185/1B, 4B | 184 | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్, తాడి-1, పనస-3, కొబ్బరి-7, సీతాఫలం-2, ఊడిగ-2, టేకు-16 |
| 12 | 185/4B | 3.27 | 0.95 | పుంజ | పోలుబోయిన కొండలరావు (0.45) | 185/4A | 185/4C | 185/5B | 185/1B,2B | నిమ్మ, డ్రిప్, పైప్‌లైన్, తాడి-1 |
| | | | | | పోలుబోయిన వెంకటేశ్వరరావు (0.50) | | | | | తాడి-1, జీడి |
| 13 | 185/5B | 3.27 | 0.52 | పుంజ | చంద్రు శివన్నారాయణమూర్తి (0.52) | 185/5A | 185/5C | 186 | 185/4B | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 14 | | | 0.20 | పుంజ | చంద్రు శ్రీదేవి (0.20) | 185/5A | 185/5C | 186 | 185/4B | నిమ్మ, డ్రిప్, పైప్‌లైన్, తాడి-3 |
| 15 | 186/7B | 1.95 | 0.21 | పుంజ | కొమ్మిన రామచంద్రరావు | 186/7A | 185 | 183 | 186/7A | జీడి, తాడి-3 |
| 16 | 209/4B | 3.66 | 0.13 | పుంజ | చిలుకూరి దొరారెడ్డి చిలుకూరి రుక్మీలక్ష్మిబాయి | 209/4A 247 | 247 | 247 | 209/4A | పామాయిల్, జీడి, డ్రిప్, పైప్‌లైన్ |
| 17 | 216/2B | 19 | 0.50 | పుంజ | ఘంటా నేతాజీ (0.50) | 216/2A | 216/2C | 184 | 217 | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 18 | | | 1.40 | పుంజ | ఘంటా మురళీ రామకృష్ణ (1.40) | | | | | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 19 | 217/2 | 12.50 | 1.05 | పుంజ | ఘంటా నేతాజీ | 217/1 | 217/3 | 216 | 247 | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 20 | 245/1B | 2.87 | 0.01 | పుంజ | నిజపురపు రాములు | 248 | 245/3A | 245/1B | 248 | నిమ్మ, డ్రిప్, పైప్‌లైన్ |
| 21 | 245/3A | 1.48 | 0.05 | పుంజ | నెక్కలపూడి రాజేంద్ర | 245/1A | 249 | 245/3B | 248 | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 22 | 248/4B | 1.80 | 1.06 | పుంజ | మల్లాది తులసమ్మ | 247 | 249 | 245 | 248/4A | నిమ్మ, బోరు, ట్రాన్స్‌ఫార్మర్, పైప్‌లైన్-6, డ్రిప్ |
| 23 | 249/3B | 3.51 | 027 | పుంజ | నీరుకొండ రమాదేవి | 248 | 249/3A | 249/4B | 249/3A | నిమ్మ, డ్రిప్, పైప్‌లైన్-2, బోరు, ట్రాన్స్‌ఫారం, వేప-2, సింధుగ-2 |
| 24 | 249/4B | 1.82 | 0.69 | పుంజ | నెక్కలపూడి రాజేంద్ర | 249/4C | 254 | 254, 249/4C | 249/3B, 3A | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 25 | 253/1B | 1.48 | 0.05 | పుంజ | నెక్కలపూడి బాస్కరరావు | 253/1A | 254 | 253/1A | 254 | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 26 | 254/1B | 5.71 | 1.70 | పుంజ | నెక్కలపు భాస్కరరావు (1.42) | 249 | 254/2B | 254/1C, 1D, 253 | 254/1A | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ తాడి-7, టేకు |
| 27 | | | | పుంజ | నెక్కలపు రాంబాబు (0.28) | 249 | 254/2B | 254/1C, 1D, 253 | 254/1A | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ కొబ్బరి-13 |
| 28 | 254/2B | 3.21 | 0.38 | పుంజ | నెక్కలపు రాంబాబు | 254/1B | 256 | 254/1C, 1D, 253 | 254/2A | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 29 | 256/2 | 4.20 | 0.47 | పుంజ | నెక్కలపు రాంబాబు | 254 | 257 | 256/3 | 256/1 | పామాయిల్, డ్రిప్, పైప్‌లైన్ |
| 30 | 257/1B | 3.05 | 0.96 | పుంజ | నెక్కలపు రాంబాబు | 257/1A | 257/1C | 257/2B | 259 | పామాయిల్, కొబ్బరి, బోరు, టేకు-15. పైప్ లైన్-2, ఎర్రచందనం-2 |
| 31 | 257/2B | 2.63 | 0.64 | పుంజ | తక్కెళ్ళపల్లి బేబి సరోజిని (0.37) నెక్కలపు బాస్కరరావు (0.27) | 256 | 257/2C | 257/2C | 257/1B | పామాయిల్, డ్రిప్, పైప్ లైన్, సాగుభూమి, పైప్‌లైన్-4 |
| 32 | 413/1A | 3.70 | 0.12 | పుంజ | ఉప్పలపాటి సత్యనారాయణ తండ్రి సోమయ్య | 414 | 413/1B | 413/1B | 181 | సాగుభూమి |
| 33 | 417/1 | 4.85 | 0.11 | పుంజ | కొండ్రు రత్నమాణిక్యం | 418 | 417/2 | 417/2 | 418 | పామాయిల్, తాడి-3 |
| 34 | 418/3B | 1.95 | 0.39 | పుంజ | గంట సత్యనారాయణ | 421 | 418/4B | 422 | 418/3A | కోకో, కొబ్బరి, డ్రిప్, పైప్‌లైన్ |
| 35 | 418/4B | 2.32 | 0.97 | పుంజ | పోలుబోయిన సత్యనారాయణ | 418/3B | 418/5A | 422 | 418/4A | జీడి, తాడి-5, వేప-1 |
| 36 | 418/5A | 2.73 | 1.62 | పుంజ | ఉయ్యూరు బ్రహ్మయ్య | 418/4B | 418/6B | 418/5B | 418/6A | జీడి, తాడి-8, వేప-4, పైపులైను-2 |
| 37 | 418/6B | 4.72 | 2.23 | పుంజ | బాల రామయ్య | 418/5A | 414 | 418/6C | 418/6A | బీరతోట, పైపులైను, తాడి-3, వేప-5, మామిడి-2, కంపోస్టు తొట్టి-1 |
| 38 | 419/11B | 4.42 | 0.32 | పుంజ | దుగ్గిరాల సీతారత్నం | 419/11A | 414 | 418 | 419/1A | పామాయిల్, డ్రిప్, పైపులైను-2, మామిడి-4, టేకు-2, తాడి-3, వెదురు-2 |
| 39 | 423/4B | 0.68 | 0.05 | పుంజ | గంట వెంకటరావు | 423/4A | 423/7A | 423/9B | 422 | పామాయిల్, డ్రిప్, పైపులైన్ |
| 40 | 423/7A | 1.49 | 0.78 | పుంజ | కొండుబోయిన దుర్గారావు (0.78) | 423/4B | 423/8A | 423/7B | 422 | సాగుభూమి, టేకు-5, కొబ్బరి-1 |
| 41 | | | 0.57 | పుంజ | పాకలపాటి సుబ్బారావు (0.57) | 423/4B | 423/8A | 423/7B | 422 | సాగుభూమి, ఊడిగ-21, వేప-20, కొబ్బరి చెట్లు, పనస-1 |
| 42 | 423/8A | 1.90 | 0.71 | పుంజ | పాకలపాటి సుబ్బారావు | 423/7A | 422 | 423/8B | 422 | వేప-6, టేకు-1, గేదెల పాక, మామిడి-1, జాయింటు |
| 43 | 423/9A | 5.34 | 0.01 | పుంజ | ఉప్పలపాటి సత్యనారాయణ తండ్రి సోమయ్య | 423/9B | 423/9B | 423/9B | 423/7A | సాగుభూమి |
| | | | 24.78 | | | | | | | |

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

---

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**Ref. C1/503/17 dt. 02-08-2017**

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

### ఫారమ్ నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్ (1)ననుసరించి)

### రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము పశ్చిమగోదావరి జిల్లా, **పెదవేగి** మండలం **ముత్తనవీడు** గ్రామంకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2016-17నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

### రూఢి ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 1.80 సెంట్లులను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

మండలం: పెదవేగి గ్రామం: ముత్తనవీడు

| క్రమ సంఖ్య | సర్వే నెం. | మొత్తం విస్తీర్ణం | భూసేకరణ సందు విస్తీర్ణం | తరగతి | భూ ఆసామి పేరు | సరిహద్దులు ఉత్తరం | తూర్పు | దక్షిణం | పడమర | చెట్లు, కట్టడములు మరియు ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 72/1B | 10.17 | 0.35 | పుంజ | చలసాని సత్యవతి భర్త నరసింహారావు | 72/1A | 72/2B | 73 | 72/1A | నిమ్మతోట, డ్రిప్ + పైప్‌లైన్ మెయిన్ పైప్‌లైన్, వేప-8 |
| 2 | 72/2B | 13.44 | 0.96 | పుంజ | వంగా వెంకటరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి (0.12) | 72/2A | 72/3A | 72/2C | 72/1A | మామిడి చెట్లు-3, జామాయిల్-1, వేప-2 |
| 3 | | | | పుంజ | వెంపా మాణిక్యం భర్త వెంకటేశ్వరరావు (0.84) | | | | | మామిడి చెట్లు-3, పైప్‌లైన్ సీతాఫలం-1, కరివేపాకు-1, టేకు-1, Asbestos షీట్‌తో చేసిన ఇల్లు, బాత్‌రూమ్ రేకుల షెడ్ |
| 4 | 72/3A | 12.11 | 0.13 | పుంజ | వెంపా సూర్యప్రకాశరావు తండ్రి వెంకటేశ్వరరావు | 69 | 72/3B | 72/3B | 72/2A | మొక్కజొన్న, పైప్‌లైన్ |
| 5 | 73/2 | 18.42 | 0.36 | పుంజ | కాకర్ల రంగయ్య తండ్రి రోసన్న | 72 | 73/3 | 37 | 37 | బీస్నీ గడ్డి, పచ్చారి మొక్కలు-3 వేప-1, బర్బడ్ వైర్‌తో చేసిన ఫెన్సింగ్ పోల్స్ |
| | | | 1.80 | | | | | | | |

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

---

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**Ref. C1/641/16 dt. 02-08-2017**

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

### ఫారమ్ నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్ (1)ననుసరించి)

### రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము పశ్చిమగోదావరి జిల్లా, **కామవరపుకోట** మండలం **తడికలపూడి** గ్రామంకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2016-17నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

### రూఢి ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 2.72 సెంట్లులను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

మండలం: కామవరపుకోట గ్రామం: తడికలపూడి

| క్ర. సం. | సర్వే నెం. | మొత్తం విస్తీర్ణం | భూసేకరణ సేయుటకు తీసుకున్న విస్తీర్ణం | భూమి తరగతి | భూమికి సంబంధించిన ఆసామి పేరు | సరిహద్దులు తూర్పు | దక్షిణం | పడమర | ఉత్తరం | చెట్లు, కట్టడములు మరియు ఇతర వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 155/2 | 20.85 | 2.28 | పుంజ | వేముల శివాజీ తండ్రి సూర్యనారాయణ (0.67) | 162 | 162/2 | 154 | 162/1 | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్ కొబ్బరి-5, తాడి-12, వేప-3 |
| 2 | | | | | జుజ్జూరి మోహనరావు తండ్రి సోమేశ్వరరావు (1.61) | | | | | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్ టేకు, సింధుగ-6, ముష్టి-1, తాడి-12, కుంకుడు-4, పచ్చ ఆరి-1, నెమలుడుగు-1 పనస-1, వేప-9 |
| 3 | 381/1 | 12.70 | 0.06 | పుంజ | కాసరనేని శేషగిరిరావు తండ్రి గోపాలం | 381/2 | 381/2 | 382 | 381/2 | పామాయిల్, పైప్‌లైన్, సింధుగ-1, కుంకుడు-2 వేప-1, నిద్రమామిడి-1 |
| 4 | 847/1 | 4.56 | 0.05 | పుంజ | జాదం నాగుబాయి భర్త సత్యన్నారాయణ | 847/2 | 847/2 | 851 | 851 | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్ వేప-6, సీతాఫలం |
| 5 | 849/1 | 2.46 | 0.10 | పుంజ | కూరాకుల గడ్డియ్య తండ్రి వెంకయ్య | 849/2 | 849/2 | 850 | 851 | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్ వేప-2, నిమ్మ, సీతాఫలం, ముష్టి-4, సింధుగ-3 |
| 6 | 850/1A | 6.19 | 0.23 | పుంజ | మోటేపల్లి సత్యన్నారాయణ తండ్రి రాములు | 849 | 850/1B | 850/1B | 851 | పుట్టపాల, పామాయిల్, ముష్టి-10 |
| | మొత్తం | | 2.72 | | | | | | | |

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

---

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

**Ref. C1/521/16 dt. 02-08-2017**

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

### ఫారమ్ నెం. VII

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 125, సబ్ రూల్ (1)ననుసరించి)

### రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము పశ్చిమగోదావరి జిల్లా, **టి.నరసాపురం** మండలం **కృష్ణారావుపాలెం** గ్రామంకు సంబంధించిన భూములు అవసరమైనవని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2016-17నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

### రూఢి ప్రకటన

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య. 4.90 సెంట్లులను ప్రజా ప్రయోజనమున్నకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకము కొరకు అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

మండలం: టి.నరసాపురం గ్రామం: కృష్ణారావుపాలెం

| క్ర. సం. | సర్వే నెం. | మొత్తం విస్తీర్ణం | భూసేకరణ సందు విస్తీర్ణం | తరగతి | భూ ఆసామి పేరు | సరిహద్దులు ఉత్తరం | తూర్పు | దక్షిణం | పడమర | చెట్లు, కట్టడములు మరియు ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2/2 | 71.02 | 0.34 | స.పుంజ | యలమంచి రామ్మోహనరావు తండ్రి వెంకటేశ్వరరావు | 1 | 2/7 | 2/3 | 2/1 | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్ తాడి, టేకు, వేప |
| 2 | 2/3 | | 0.25 | స.పుంజ | యలమంచి శ్రీనివాసరావు తండ్రి గంగాధరరావు | 2/2 | 2/7 | 2/4 | 2/1 | ఖాళీ |
| 3 | 2/4 | | 0.29 | స.పుంజ | జగ్గవరపు సోమశేఖరరెడ్డి తండ్రి వెంకటప్పరెడ్డి | 2/3 | 2/7 | 2/5 | 2/1 | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్, వేప |
| 4 | 2/5 | | 0.32 | స.పుంజ | యర్రం మాధురి భర్త రాజశేఖరరెడ్డి | 2/4 | 2/7 | 2/6 | 2/1 | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్ |
| 5 | 2/6 | | 0.05 | స.పుంజ | మొగల్ల స్వరూపరాణి భర్త సాయికృష్ణ | 2/5 | 2/7 | 3 | 2/1 | పామాయిల్, పైప్‌లైన్, డ్రిప్ |
| 6 | 3/2 | 98.00 | 1.05 | స.పుంజ | మొగల్ల సాయికృష్ణ తండ్రి ధర్మయ్య | 2 | 3/4 | 3/3 | 3/1 | పామాయిల్, నిమ్మతోట, మామిడితోట, పైప్‌లైన్ డ్రిప్, కొబ్బరి మొక్క, వేప |
| 7 | 3/3 | | 0.11 | స.పుంజ | బట్టు రాంబాబు తండ్రి సూరారెడ్డి | 3/2 | 3/4 | 4 | 3/1 | జామాయిల్, వేప, తాడి, తుమ్మ |
| 8 | 4/2 | 122.30 | 0.16 | స.పుంజ | ఉక్కుర్తి సత్యనారాయణ తండ్రి సూరిబాబు | 3 | 4/5 | 4/3 | 4/1 | తాడి, తుమ్మ, టేకు, కొబ్బరి వేప, మామిడి |
| 9 | 4/3 | | 0.21 | స.పుంజ | బాల త్రిపుర సుందరి భర్త కోటేశ్వరరావు | 4/2 | 4/5 | 4/4 | 4/1 | మామిడి, కొబ్బరి |
| 10 | 4/4 | | 0.16 | స.పుంజ | నరహరిశెట్టి చిట్టిబాబు తండ్రి నారాయణ అప్పారావు | 4/3 | 4/5 | 5 | 4/1 | మామిడి |
| 11 | 5/2 | 148.94 | 0.10 | స.పుంజ | నరహరిశెట్టి చిట్టిబాబు తండ్రి నారాయణ అప్పారావు | 5/1 | 5/3 | 5/8 | 4 | మామిడి, టేకు, తాడి, వేప |
| 12 | 5/3 | | 0.52 | స.పుంజ | చలసాని రాజేశ్వరి భర్త సత్యసాయిబాబు | 5/1 | 5/4 | 5/8 | 5/2 | టేకు, వేప, తాడి, పామాయిల్ పైప్‌లైన్, డ్రిప్ |
| 13 | 5/4 | | 0.34 | స.పుంజ | మండోటి పెద వెంకటేశ్వరరావు తండ్రి వీరయ్య (0.31) | 5/1 | 5/5 | 5/8 | 5/3 | జామాయిల్ |
| 14 | | | | | మండోటి వెంకట రమణమ్మ భర్త వీరయ్య (0.03) | 5/1 | 5/5 | 5/8 | 5/3 | జామాయిల్ |
| 15 | 5/5 | | 0.26 | స.పుంజ | బండే సాయిచరిత తండ్రి రమేష్ | 5/1 | 5/6 | 5/8 | 5/4 | జామాయిల్, కొబ్బరి, పైప్‌లైన్ |
| 16 | 5/6 | | 0.33 | స.పుంజ | మండా లక్ష్మీపతి తండ్రి బసవయ్య | 5/1 | 5/7 | 5/8 | 5/5 | జామాయిల్ |
| 17 | 5/7 | | 0.41 | స.పుంజ | బండే రమేష్‌బాబు తండ్రి రామయ్య | 5/1 | కె.గోకవరం | 5/8 | 5/6 | జామాయిల్, కొబ్బరి, పైప్‌లైన్, తాడి |
| | | | 4.90 | | | | | | | |

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఈనాడు

# విండోస్‌లో మ్యాక్... ఫీచర్లు రాక్!

**ఆపిల్ కంప్యూటర్లలో ఉండే కొన్ని ఆప్షన్లు ఆసక్తికరంగా ఉన్నాయి. విండోస్ సిస్టమ్స్‌లో లేని ఉపయుక్తమైన సదుపాయాల్ని అందిస్తున్నాయి. మీ ల్యాపీ/కంప్యూటర్‌కు ఈ సాఫ్ట్‌వేర్లను జోడిస్తే విండోస్‌లో రాకింగ్ మ్యాక్ ఫీచర్లను పొందొచ్చు.**

### పేరు మార్చేద్దాం



విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ ఉన్న కంప్యూటర్లలో ఫోల్డర్ లేదా ఫైల్ పేరు మార్చాలంటే దాని మీద మౌస్‌తో రైట్ క్లిక్ చేసి... రీనేమ్ ఆప్షన్‌లోకి వెళ్లి కావల్సిన పేరు ఇవ్వొచ్చు. అదే మ్యాక్ సిస్టమ్‌లో అయితే చాలా సులభంగా ఆ ఫోల్డర్/ఫైల్‌ను ఎంచుకొని ఎంటర్ బటన్‌ను క్లిక్ చేసి మార్చుకోవచ్చు. విండోస్ ఆధారిత కంప్యూటర్ లోనూ ఇలాంటి సౌకర్యం ఉంది. రీనేమ్ చేయాలనుకుంటున్న ఫైల్ లేదా ఫోల్డర్‌ను సెలెక్ట్ చేసి కీబోర్డు పైన ఉన్న F2 బటన్‌ను క్లిక్ చేయండి. ఆ తర్వాత మీకు కావల్సిన పేరు ఇచ్చుకోవచ్చు.

### ఏమున్నాయో చెప్పండి



సెర్చ్ చేసేటప్పుడు మ్యాక్‌లో ఫోల్డర్లు వేగంగా లోడ్ అవుతాయి. విండోస్‌లో ఈ ప్రోసెస్ ఆలస్యంగా ఉంటుంది. ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవడానికి సిస్టమ్ సెట్టింగ్స్‌లో చిన్న మార్పు చేసుకుంటే సరి. ఫోల్డర్‌పై మౌస్‌తో రైట్ క్లిక్ చేసి 'కస్టమైజ్' ఆప్షన్‌లోకి వెళ్లండి. ఆ ఫోల్డర్‌లో ఏముంచుతారు అని అడుగుతుంది. అక్కడ ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు, మ్యూజిక్ అనే ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో మీకు కావల్సిన దాన్ని ఎంచుకోవాలి. ఆ తర్వాత సెర్చ్ చేసినప్పుడు ఫలితాల్ని వీలైనంత త్వరగా పొందొచ్చు.

### పరిమాణం తగ్గించి





ఓ ఫొటో సైజు, రిజెల్యూషన్‌ను తగ్గించాలి అంటే... దాన్ని ఫొటోషాప్ లాంటి సాఫ్ట్‌వేర్‌లో ఓపెన్ చేసి మార్చాలి. అదే ఓ 50 ఫొటోలంటే చాలా సమయం తీసుకుంటుంది. మ్యాక్‌లో అయితే ఆటోమేటెడ్ సౌకర్యం ఉంటుంది. దీంతో మొత్తం ఫొటోల సైజ్ ఒకేసారి మార్చుకోవచ్చు. అన్నింటిని సెలెక్ట్ చేసుకొని ఆప్షన్స్‌లో మీకు కావల్సిన సైజు, రిజెల్యూషన్, ఫార్మేట్ ఇచ్చి ప్రోసెస్ చేస్తే ఫొటోస్ మారిపోతాయి. ఇలాంటి ఫీచర్‌ను విండోస్ కంప్యూటర్‌లో వాడాలంటే అందులో Image Resizerను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

### స్క్రీన్ షాట్ కోసం



విండోస్ సిస్టమ్‌లో స్క్రీన్ షాట్ తీయాలంటే... కీబోర్డులోని ప్రింట్ స్క్రీన్ బటన్‌ను క్లిక్ చేయాలి. ఆ తర్వాత దాన్ని ఫొటో షాప్ లేదా పెయింట్‌లోకి వెళ్లి పేస్ట్ చేసుకొని క్రాప్ చేసుకోవాలి. అదే మ్యాక్‌లో అయితే మనకు కావల్సిన భాగం వరకు స్క్రీన్ షాట్ తీసుకోవచ్చు. విండోస్‌లో Lightshot సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని మ్యాక్ తరహా స్క్రీన్ షాట్‌ను తీసుకోవచ్చు. ఈ ఆప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత ఎప్పటిలాగే ప్రింట్ స్క్రీన్ బటన్‌ను క్లిక్ చేయాలి. అప్పుడు స్క్రీన్ లేత నలుపు రంగులోకి మారుతుంది. అందులో కావల్సిన భాగాన్ని సెలెక్ట్ చేసుకొని స్క్రీన్ షాట్ తీసుకోవచ్చు. ఆప్షన్స్‌లోకి వెళ్లి ప్రింట్ స్క్రీన్ బటన్‌కు బదులు కంట్రోల్, ఆల్ట్ లాంటి ఇతర బటన్స్ ఎంచుకోవచ్చు.



విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ తొలి లోగో

**విండోస్ కంప్యూటర్లలో టాస్క్‌బార్, స్టార్ట్ మెనూ ఆప్షన్లు, మినిమైజ్, మ్యాగ్జిమైజ్, క్లోజ్ బటన్లు విండోస్ 95 ఆపరేటింగ్ సిస్టమ్‌తో వచ్చాయి.**

**ఆపిల్ మ్యాక్‌బుక్ బ్యాటరీ బులెట్ ప్రూఫ్ కావడం విశేషం.**

**ఆపిల్ కంప్యూటర్ల దగ్గర పొగ తాగకూడదట. దాని వల్ల వాటి వారంటీ సమస్యలు వస్తాయి.**

ఆపిల్ కంప్యూటర్స్ తొలి లోగో

### ఎక్కడైనా రాసేలా...



బస్సులో ఆఫీసుకు వస్తూ... ఏదో విషయానికి సంబంధించి మొబైల్‌లోని నోట్స్ ఆప్‌లో రాసుకున్నారు. ఆఫీసుకు వచ్చాక ఐప్యాడ్ తీసుకొని అందులో ముందు రాసిన దాన్ని కొనసాగించారు. ఆపిల్ మొబైల్స్‌లో నోట్స్ సింక్ ఆప్షన్ ఉండటం వల్ల ఎక్కడైనా వాడుకునే వీలుంటుంది. విండోస్‌లోనూ ఈ తరహా సౌకర్యాన్ని పొందడానికి కొన్ని థర్డ్ పార్టీ ఆప్స్ ఉన్నాయి. గూగుల్ కీప్, ఎవర్ నోట్ లాంటి ఆప్స్‌ను మొబైల్‌లో ఓపెన్ చేసి సమాచారం రాసుకోవచ్చు. తర్వాత సిస్టమ్‌లో ఆయా వెబ్‌సైట్లను ఓపెన్ చేసి మీ రాతను ఆపిన దగ్గరి నుంచి కొనసాగించొచ్చు.

### ఎక్కడున్నా కదులుతుంది



కంప్యూటర్‌లో ఒకేసారి బ్రౌజర్, వర్డ్ డాక్యుమెంట్‌ను వాడుతున్నారు. మౌస్ బాల్‌ను స్క్రోల్ చేసినప్పుడు యాక్టివ్‌గా ఉన్న (పైన ఉన్న) సాఫ్ట్‌వేర్ స్క్రోల్ అవుతుంది. అంటే రెండింటిలో పైకి ఉన్న సాఫ్ట్‌వేర్ యాక్సెస్ అవుతుంది. ఉదాహరణకు పైకి బ్రౌజర్ ఉండి, వెనుక వర్డ్ డాక్యుమెంట్ ఉంటే పైన ఉన్న బ్రౌజర్ పేజీ స్క్రోల్ అవుతుంది. వర్డ్ డాక్యుమెంట్‌ను యాక్సెస్ చేయాలంటే దాన్ని మౌస్‌తో క్లిక్ చేయాల్సిందే. అదే ఆపిల్ సిస్టమ్స్‌లో అయితే క్లిక్ చేయకుండా, కేవలం దాని మీద మౌస్ హోవర్ (ఆ సాఫ్ట్‌వేర్‌పై కర్సర్ ఉంచితే) చేసి స్క్రోల్ చేయొచ్చు. విండోస్‌లో ఇలాంటి ఆప్షన్ కావాలంటే KatMouse సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

### అంచులు తాకితే...



ఆపిల్ కంప్యూటర్లలో కర్సర్‌ను స్క్రీన్‌లో ఓ మూలకు క్లిక్ చేస్తే అప్పటివరకు ఓపెన్ చేసిన అప్లికేషన్ విండోస్ అన్నీ మినిమైజ్ అయిపోతాయి. మరో మూలకు క్లిక్ చేస్తే సిస్టమ్ స్టాండ్ బై మోడ్‌లోకి వెళ్లిపోతుంది. కార్నర్స్ ఆప్షన్ ద్వారా ఇది వీలవుతుంది. విండోస్ సిస్టమ్‌లో ఒక్కో విండోను మినిమైజ్ చేయాలంటే చాలా సమయం తీసుకుంటుంది. maComfot సాఫ్ట్‌వేర్‌ను సిస్టమ్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే మ్యాక్ తరహాలో 'కార్నర్స్' ఆప్షన్‌ను విండోస్‌లోకి తీసుకురావొచ్చు.

### అన్నీ వెతుక్కోవచ్చు




ఆపిల్ కంప్యూటర్లలో ఉండే ఫైళ్లు, సాఫ్ట్‌వేర్లను వెతుక్కోవడానికి స్పాట్ లైట్ ఆప్షన్ ఉంటుంది. ఈ ట్యాబ్‌లోకి వెళ్లి సిస్టమ్ సెర్చ్‌తోపాటు, అంతర్జాల శోధన కూడా చేసుకోవచ్చు. విండోస్ 8, 10 ఓఎస్ ఆధారిత కంప్యూటర్లలో కొర్టానాతో ఈ సౌకర్యం వచ్చింది. విండోస్ 7 ఆధారిత కంప్యూటర్లలోనూ ఈ తరహా సౌకర్యాన్ని పొందొచ్చు. దీనికి చేయాల్సిందల్లా సిస్టమ్‌లో Wox సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడమే. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఓపెన్ చేస్తే స్క్రీన్ మీద సెర్చ్ బార్ వస్తుంది. దాన్ని స్పాట్‌లైట్ మాదిరి వినియోగించుకోవచ్చు.

### టాస్క్ బార్... డాక్



విండోస్ కంప్యూటర్లలో మినిమైజ్ చేసిన అప్లికేషన్లు, సాఫ్ట్‌వేర్లు దిగువన టాస్క్ బార్‌లో వచ్చి చేరుతాయి. అదే మ్యాక్ కంప్యూటర్లలో అయితే డాక్ అనే ట్రేలోకి వచ్చి చేరుతాయి. ఆ డాక్ కనిపించే విధానం, పని చేసే శైలి వైవిధ్యంగా ఉంటుంది. విండోస్ కంప్యూటర్లలో డాక్ ఆప్షన్‌ను పొందాలంటే RocketDock సాఫ్ట్‌వేర్‌ను మీ సిస్టమ్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దీన్ని ఓపెన్ చేశాక... ఏయే సాఫ్ట్‌వేర్లు, ఫోల్డర్లు అందులో కనిపించాలనేది మీరే ఎంచుకోవచ్చు. అది కనిపించే శైలిని కూడా మార్చుకోవచ్చు.

### ఒక సిస్టమ్... రెండు డెస్క్‌టాప్‌లు



విండోస్ కంప్యూటర్లలో ఒకటికి మించి యూజర్ అకౌంట్స్ క్రియేట్ చేసుకోవచ్చు. అదే మ్యాక్ కంప్యూటర్లలో అయితే ఒకటికి మించి డెస్క్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీని వల్ల ఎంచక్కా ఒక కంప్యూటర్‌ను రెండు, మూడు కంప్యూటర్లగా వాడుకోవచ్చు. ఇలాంటి ఆప్షన్స్‌ను విండోస్ కంప్యూటర్‌లోనూ పొందాలంటే Dexpot సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. దీన్ని సిస్టమ్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాక స్క్రీన్ నాలుగు స్క్రీన్‌లుగా విడిపోతుంది. అంటే ఒక్కో స్క్రీన్ ఒక్కో కంప్యూటర్ డెస్క్‌టాప్ అన్నమాట. ఒక్కోదానికి ఒక్కో స్క్రీన్ సేవర్, ఒక్కో దాంట్లో ఒక్కో సాఫ్ట్‌వేర్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు.

### అంకెల్లో...

**70 కోట్లు** - ఇన్‌స్టాగ్రామ్ వినియోగదారులు

**50 కోట్లు** - ప్రపంచవ్యాప్తంగా లింక్డ్‌ఇన్ వినియోగదారులు

**1,00,000** - ఫేస్‌బుక్ మెసెంజర్‌లో డెవలపర్లు రూపొందించిన ఛాట్‌బోట్స్

## త్రికోణంతో ఆదా



స్మార్ట్‌ఫోన్లలో మొబైల్ డేటా వినియోగంపై ఓ కన్నేసే థర్డ్ పార్టీ ఆప్‌లు చాలా ఉన్నాయి. ఏ ఆప్ ఎంత డేటాను వాడుతోంది, దేన్ని నిలువరిస్తే డేటా వృథాను అడ్డుకోవచ్చు అంటూ కొన్ని సూచనలు కూడా ఇస్తుంటాయి. ఇలాంటి అంశాలతో గూగుల్ ట్రయాంగిల్ అనే కొత్త ఆప్‌ను రూపొందించింది. ఇటీవల ఈ ఆప్‌ను ఫిలిప్పీన్స్‌లో లాంచ్ చేసింది. దీన్ని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే మీ మొబైల్ డేటా వినియోగాన్ని లెక్క కట్టి చూపిస్తుంది. మీ ఫోన్‌లోని ఏవైనా కొన్ని ఆప్స్ నెట్ యాక్సెస్ చేయక్కర్లేదు అని మీకనిపిస్తే దాన్ని ట్రయాంగిల్ ఆప్ ద్వారా చేయొచ్చు. త్వరలో మన దేశంలోనూ ఈ ఆప్‌ను ప్రవేశపెట్టనున్నారు.

## సెన్సర్ ఉంటుందట



త్వరలో లాంచ్ అవ్వనున్న ఐఫోన్ 8లో ఫింగర్ సెన్సర్ ఉండదంటూ గత కొన్ని రోజులుగా వార్తలొచ్చాయి. దాని స్థానంలో ఫేస్ రికగ్నిషన్ సౌకర్యం ఉంటుందని తెలిసింది. దీంతో ఎప్పుడైనా ఫేస్ రికగ్నిషన్ పని చేయకపోతే మొబైల్‌ను అన్‌లాక్ చేయడమెలా అంటూ కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే ఫేస్ రికగ్నిషన్‌తోపాటు ఫింగర్ సెన్సర్‌ను కూడా అందిస్తున్నారనేది తాజా సమాచారం. మొబైల్ పవర్ బటన్‌లో ఫింగర్ సెన్సర్‌ను జోడించి ఇస్తున్నారట. ఫేస్ రికగ్నిషన్ ఆప్షన్ పని చేయని పక్షంలో ఫింగర్ సెన్సర్ ద్వారా అన్‌లాక్ చేసుకోవచ్చు.

## మరమనిషి ఇస్త్రీ చేస్తే!



రోబో బట్టలు ఇస్త్రీ చేస్తే చూడాలని ఉందా? అయితే కొద్ది రోజులాగండి... మీ ముచ్చట తీరిపోతుంది. స్పెయిన్‌లోని యూనివర్సిడాడ్ కార్లోస్ III డి మాడ్రిడ్స్ రోబోటిక్స్ ల్యాబ్ శాస్త్రవేత్తలు ప్రస్తుతం ఈ పని మీదే ఉన్నారు. నలిగిన దుస్తుల్ని చక్కగా మడతపెట్టి ఇస్త్రీ చేసే రోబోను రూపొందిస్తున్నారు. దీని పేరు TOE. ఈ రోబో తన కెమెరా ద్వారా దుస్తుల ముడతల్ని గుర్తుపట్టి ఇస్త్రీ చేస్తుంది. ప్రస్తుతం ప్రయోగ దశలో ఉన్న దీనికి మరిన్ని ప్రత్యేకతలు జోడించి త్వరలో అధికారికంగా ఆవిష్కరించనున్నారు.

## మీటల్లేవ్.. మాటలే



జోరు వర్షంలో బ్లూటూత్ స్పీకర్‌లో పాటలు వింటూ డ్యాన్స్ చేస్తే బాగుంటుంది కదా! ఎలా కుదురుతుంది.. నీళ్లు పడి స్పీకర్ పాడైపోతుంది కదా అంటారా? మామూలు స్పీకర్లు అయితే మీరన్నది కరక్టే. అదే 'బియోప్లే పీ2' బ్లూటూత్ స్పీకర్ వాడితే ఆ ఇబ్బందే ఉండదు. అల్యూమినియం, లెదర్‌తో తయారు చేసిన ఈ స్పీకర్ వాటర్ రెసిస్టెంట్. అంతే కాదు దీనికి బటన్‌లు కూడా ఉండవు. పాటలు ప్లే అవ్వాలన్నా, ఆగాలన్నా స్పీకర్‌పై ఒకసారి తడితే సరి. పాటల్ని మార్చాలనుకుంటే షేక్ చేస్తే సరి. దీని అనుబంధ ఆప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని దాంతో యాక్సెస్ చేయొచ్చు. ఒకసారి ఫుల్ ఛార్జ్ చేసుకుంటే పది గంటలపాటు దీన్ని వాడుకోవచ్చు.

## మీ పేజీ వేరుగా

గూగుల్‌లో ఏదైనా అంశం గురించి సెర్చ్ చేస్తే దాని వివరాలు రావడం కామన్. దాంతోపాటు ఆ అంశానికి సంబంధించి గతంలో మీరు రాసుకున్న విషయాలు, చర్చించిన అంశాలు లాంటివి వేరుగా కనిపిస్తే బాగుంటుంది కదా. త్వరలో గూగుల్ ఈ ఆప్షన్‌ను తీసుకురాబోతోంది. ఉదాహరణకు విశాఖపట్నం ప్రాంతానికి సంబంధించిన సమాచారం కోసం



గూగుల్‌లో వెతికారనుకోండి. దాని సమాచారం, ఫొటోలు, వీడియోలు, వార్తలు కనిపిస్తాయి. పక్కన పర్సనల్ ట్యాబ్‌లో ఆ ప్రాంతానికి సంబంధించి గతంలో మీరు సెర్చ్ చేసినప్పుడు వచ్చిన ఫలితాలు, అక్కడికి మీరు వెళ్లినప్పుడు తీసుకున్న ఫొటోలు లాంటివి కనిపిస్తాయి. అలా గూగుల్‌లో మీ పేజీని మీరు వేరుగా చూసుకోవచ్చు. అయితే ఆ బ్రౌజర్‌లో మీ జీమెయిల్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.




## మొబైలే... కంప్యూటర్‌లా

స్మార్ట్‌ఫోన్ తెర, ఆప్ ఐకాన్లు లాంటివాటిలో మార్పులు తీసుకొచ్చే లాంచర్లు చాలా ఉన్నాయి. అయితే మొబైల్‌ను ఏకంగా కంప్యూటర్‌లా మార్చేవి మాత్రం కొన్నే ఉన్నాయి. వాటిలో Leena Desktop UI ఒకటి. దీన్ని మీ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే స్క్రీన్ కంప్యూటర్ తరహాలో కనిపిస్తుంది. మెనూ బార్ కనిపించే విధానం నుంచి, ఆప్ ఐకాన్‌లు వరకు అన్నీ మారిపోతాయి. ఒకేసారి స్క్రీన్ మీద ఒకటికిమించి ఆప్‌లు ఓపెన్ చేసుకోవచ్చు.

https://goo.gl/ BF3xyk

*- కె.ప్రవల్లిక, విశాఖపట్నం*



## వినండి... పంపించుకోండి




మొబైల్‌లో ఓ పాట విన్నారు... దాన్ని స్నేహితునికి పంపిద్దామంటే అది మొబైల్‌లో ఏ ఫోల్డర్‌లో ఉందో వెతుక్కోవాలి. అలాకాకుండా పాట వింటున్నప్పుడే దాన్ని మెసెంజర్, వాట్సాప్ ద్వారా స్నేహితునికి పంపుకోగలిగితే బాగుంటుంది కదా. S8 Edge Music Player ఆప్‌తో ఈ పని చేయొచ్చు. ఆ పాటల లిరిక్స్‌ను కూడా ఈ ఆప్‌లో పొందొచ్చు. దీంతోపాటు శాంసంగ్ ఎస్ 8 లాంటి ఎడ్జ్ ఫోన్లలో ఉండే ఎడ్జ్ కంట్రోల్ ఆప్షన్‌ను కూడా పొందొచ్చు. ఇందులో ప్లే లిస్ట్‌ను క్రియేట్ చేసి స్నేహితులతో పంచుకోవచ్చు. అయితే అవతలి వ్యక్తి కూడా ఈ ఆప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంటుంది. https://goo.gl/ww2GX3

*- వెంకట సాయికిరణ్ మతుకుమల్లి, ఏలూరు*

## వెనక్కి తీసుకురావాలా?




మొబైల్‌లో ఎంతో ఇష్టంగా తీసుకున్న ఫొటో పొరపాటున డిలీట్ అయిపోయిందా? దాన్ని మళ్లీ వెనక్కి తీసుకురావొచ్చు. దీని కోసం ప్లే స్టోర్‌లో కొన్ని ఆప్స్ ఉన్నాయి. వాటిలో DiskDigger photo recovery ఆప్ ఒకటి. దీన్ని మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని స్కాన్ చేస్తే... ఇటీవల కాలంలో మీ మొబైల్‌లో డిలీట్ చేసిన ఫొటోలు కనిపిస్తాయి. వాటిని మీరు మళ్లీ మీ మొబైల్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదంటే అక్కడి నుంచే క్లౌడ్ సర్వీసుల్లోకి అప్‌లోడ్ చేసుకోవచ్చు.

https://goo.gl/mKf6QK

*- ప్రణయ్‌ప్రణీత్, కాశీబుగ్గ*

## ఈ-టూన్




## గీతలు... అడ్డగీతలు



వాట్సాప్‌లో ప్రతి పదం ముందు, వెనుక '*' ను ఉపయోగించి బోల్డ్ లెటర్స్, '-'ను ఉపయోగించి అండర్ లైన్, '~' ను ఉపయోగించి స్ట్రైక్ థ్రూ ఎఫెక్ట్స్ పొందొచ్చు. ఇంత జంఝాటం లేకుండా ఆయా ఎఫెక్ట్స్ పొందేలా వాట్సాప్‌లో మార్పులు తీసుకొస్తున్నారు. ఓ పదం లేదా వాక్యాన్ని టైప్ చేసిన తర్వాత, దాని మీద లాంగ్ ప్రెస్ చేస్తే ప్రస్తుతం కాపీ, కట్ ఆప్షన్లు వస్తున్నాయి. త్వరలో వాటితోపాటు మోర్ అనే ఆప్షన్ కూడా కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే బోల్డ్, అండర్‌లైన్ లాంటి ఆప్షన్లు ఉంటాయి. వాటిని క్లిక్ చేసి ఆ ఎఫెక్ట్స్ పొందొచ్చు.

## నలుపులో యూట్యూబ్



తెల్లని కాగితం మీద బొమ్మలు అతికించినట్లుగా వెలిగిపోతుంటుంది యూట్యూబ్. దీని వల్ల రాత్రి సమయంలో కళ్ల మీద ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఈ ఇబ్బంది తప్పించడానికి యూట్యూబ్ డార్క్ థీమ్ మోడ్‌ను తీసుకొచ్చింది. దీన్ని యాక్టివేట్ చేసుకోవాలంటే... యూట్యూబ్ వెబ్‌సైట్‌లో కుడివైపున ఉండే ప్రొఫైల్ ఐకాన్‌ను క్లిక్ చేయండి. అందులో దిగువన ఉన్న డార్క్ థీమ్ ఆప్షన్‌ను ఎనేబుల్ చేసుకోండి.

## గ్రూప్స్‌లో వీడియో కాల్



ప్రస్తుతం ఫేస్‌బుక్ మెసెంజర్ ద్వారా స్నేహితులకు మాత్రమే వీడియో కాల్ చేసుకునే సౌకర్యం ఉంది. త్వరలో ఫేస్‌బుక్ గ్రూపులోనూ వీడియో కాల్ ఆప్షన్‌ను వినియోగించుకోవచ్చు. ఒక గ్రూపులో ఉన్న వ్యక్తులందరూ ఎఫ్‌బీలో స్నేహితులై ఉండాలని లేదు. కాబట్టి వాళ్లు వీడియో కాల్స్‌లో మాట్లాడటం సాధ్యంకాదు. అందుకే 'బోన్‌ఫైర్' పేరుతో ఎఫ్‌బీ ఓ వీడియో కాల్ ఆప్‌ను రూపొందిస్తోంది. దీని ఆధారంగా ఓ గ్రూపులోని వ్యక్తులందరూ వీడియో కాల్స్ మాట్లాడుకోవచ్చు.

## మరింత రక్షణతో...



ట్విట్టర్‌లో మీ ట్వీట్లకు అభ్యంతరకరమైన కామెంట్లు, పోస్టులు పెట్టేవాళ్లను మీరు బ్లాక్ చేసే సౌకర్యం ఉంది. పూర్తి వివరాలు ఇవ్వకుండా క్రియేట్ చేసిన ట్విట్టర్ ఖాతాలు, మీ ట్విట్టర్‌ను అనుసరించని వారి నుంచి పోస్టులు, కామెంట్లు, నోటిఫికేషన్లను ఈ ఆప్షన్ ద్వారా బ్లాక్ చేయొచ్చు. ఇప్పుడు దీన్ని మరింత పరిపుష్టం చేస్తూ ట్విట్టర్ కొత్త ఆప్షన్లు జోడించింది. అభ్యంతరకరమైన పదాలు వాడి ట్వీట్లు చేసేవాళ్లను ఈ ఆప్షన్ సాయంతో బ్లాక్ చేయొచ్చు. దీన్ని ఎనేబుల్ చేసుకోవడానికి సెట్టింగ్స్‌లోని నోటిఫికేషన్స్ ట్యాబ్‌లోకి వెళ్లండి. ఆ తర్వాత అడ్వాన్స్‌డ్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి బ్లాక్ చేయాలనుకునే అభ్యంతరకరమైన పదాల్ని నమోదు చేసుకోండి.

## ఇదో రకం వాచీ



'కు కు కు...', 'టింగ్ టింగ్...' లాంటి అలారమ్ శబ్దాలన్నీ ఇప్పుడు మొబైల్ ఫోన్లలోనే. ఉదయాన్నే నిద్రలేపే అలారం వాచీల స్థానంలో ఎప్పుడో మొబైళ్లు వచ్చేశాయి. అయినా పాత తరం అలారం వాచీని వాడాలనుకుంటున్నారా? అయితే కాస్త స్మార్ట్‌గా పని చేసే Lexonís In-Out clock ని వాడి చూడండి. రెండు భాగాలుగా కనిపించే ఈ వాచీలో కింది భాగంలో సాధారణ సమయం కనిపిస్తే, పైన ఉండే రెండో భాగంలో అలారం సెట్ చేసుకున్న సమయం కనిపిస్తుంది. మొబైల్‌లో అయితే అలారమ్ పెట్టుకుంటే పైన ఐకాన్ కనిపిస్తుంది. మరి ఇందులో ఎలా అంటారా? దానికీ ఓ ఆప్షన్ ఉంది. ఈ వాచీపైన ఉన్న చిన్న ముక్క లాంటి బాక్స్ పైకి కనిపిస్తుంటే అలారం సెట్ చేసుకున్నట్లు. అదే లోపలకు వెళ్లిపోయుంటే అలారం ఆన్‌లో లేనట్లు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని ధర సుమారు రూ. 3050.

# జోగుతున్న భారతావని

- వరల్డ్ డ్రగ్ మాఫియాల దృష్టి ఇక్కడే
- ప్రపంచంలోని అనేక దేశాలనుంచి సరఫరా
- వాయు, సముద్ర మార్గాల్లో చొరబాటు
- అనేక విమానాశ్రయాల్లో నిఘా లోపం
- చాలాచోట్ల పసిగట్టే యంత్రాంగమే లేదు
- రూ.వందల కోట్లలో గుట్టుగా మత్తు వ్యాపారం


ఐ. ఆర్. శ్రీనివాసరావు
ఈనాడు, హైదరాబాద్

భారతావనిని మత్తు మాఫియా చుట్టుముడుతోంది. ప్రపంచంలోని పలు దేశాల నుంచి.. రకరకాల మార్గాల్లో మత్తుమందులను దేశంలోకి చొప్పిస్తోంది. పేదరికంలో మగ్గుతున్న ఆఫ్రికన్లు, నైజీరియన్లను పావులుగా చేసుకుని రూ. వందల కోట్ల విలువ చేసే మత్తుమందులను ఈ మాఫియా మన దేశంలోకి చేరవేస్తూ ఇక్కడి యువత జీవితాలతో చెలగాటమాడుతోంది. వీటిని పసిగట్టే యంత్రాంగం.. రవాణాను నియంత్రించేందుకు పూర్తి స్థాయిలో నిఘా వ్యవస్థ లేకపోవడం ఈ వ్యాపార విస్తరణకు కీలకంగా మారుతోంది. దీంతో మత్తు మాఫియా ఇక్కడ రూ. వందల కోట్ల వ్యాపారాన్ని గుట్టుగా సాగిస్తోంది. ప్రపంచంలోని డ్రగ్ మాఫియాల దృష్టి ఇప్పుడు ఇక్కడే కేంద్రీకృతమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్‌లో డ్రగ్స్ వినియోగం కొద్దిరోజులుగా కలకలం రేపుతుండటంతో దేశవ్యాప్తంగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దీంతో కళ్లు చెదిరే వాస్తవాలు బయటపడుతున్నాయి. దేశంలోనే భారీ స్థాయిలో రూ. 3,500 కోట్ల విలువైన హెరాయిన్‌ను ఇటీవలే గుజరాత్‌తో పట్టుకోవడం తెలిసిందే. ఇక పొరుగు దేశం నుంచి వచ్చి పడుతున్న మత్తుమందులతో పంజాబ్ యువత చిత్తవుతోంది. కచ్చితంగా చెప్పాలంటే ఇప్పుడు మత్తు మందుల విక్రయానికి ప్రపంచంలోని పలు దేశాలకు భారతదేశమే కేంద్రంగా తయారైంది. నిఘా లేకపోవడం.. వినియోగం పెరుగుతుండడంతో మత్తు మాఫియాకు కాసుల వర్షం కురుస్తోంది. లాటిన్ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, దుబాయ్, అఫ్గనిస్థాన్, పాకిస్థాన్, ఆసియా ఖండంలోని ఆగ్నేయ, నైరుతి ప్రాంతాల నుంచి మత్తుమందులు విచ్చలవిడిగా మనదేశంలోని వస్తున్నాయి. దేశ యువతను నిర్వీర్యం చేయడానికి ఇదోరకం కుట్ర కావచ్చని ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. లాటిన్ అమెరికా, ఇటలీ, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో మత్తుమందుల మాఫియా అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తుంటుంది. వీటి నియంత్రణకు సిద్ధపడితే దేశాధ్యక్షులను, నేతలను కూడా లేపేసే స్థాయిలో ఈ మాఫియా అక్కడ వేళ్లూనుకుంది. అదే పరిస్థితి ఇక్కడ కూడా తయారైతే...? ఇది ఊహించడానికే భీతిగొల్పుతుంది.

## దమ్ మారో దమ్..

ఏ మత్తుమందైనా.. ప్రపంచంలోని ఏ మూల నుంచి భారతదేశంలోకి వచ్చినా అది హైదరాబాద్ నేలను తాకాల్సిందే. ఇక్కడి వినియోగం కొంతైతే.. ఇక్కడి నుంచి రవాణా అయ్యేది మరింతగా ఉందని నిఘావర్గాలు గుర్తించాయి. మనదేశంలో తయారయ్యే నల్లమందు లాంటి కొన్ని రకాల మత్తుమందులు ఇతర దేశాలకూ అక్రమ మార్గంలో వెళుతున్నాయనేది మరో చేదు వాస్తవం. అయితే ఇటు నుంచి వెళ్లే వాటితో పోలిస్తే ఇక్కడికి వచ్చేవే అధికంగా ఉన్నట్లు అంచనా.




## పంజాబ్, గోవా.. హైదరాబాద్

- మనదేశంలో రూ. వందల కోట్ల మత్తుమందులు వ్యాపారం జరుగుతున్నట్లు ఎక్సైజ్, నిఘా వర్గాల అంచనా.
- ఈ వ్యాపారంలో పంజాబ్, గోవా తర్వాత హైదరాబాద్ అగ్రస్థానంలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక్కడ వినియోగం ఎంత? ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా అయ్యేది ఎంత అన్నది చెప్పటం సాధ్యం కాదని ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు.
- ఇటీవల వరకు పాక్షిక కృత్రిమ (సెమీ సింథటిక్) మత్తుమందులైన హెరాయిన్, కొకైన్ అధిక మొత్తంలో చలామణి అయ్యేవి. ప్రస్తుతం అధిక మత్తును ఇచ్చే కృత్రిమ మత్తు మందులు (సింథటిక్ డ్రగ్స్) రవాణా, వినియోగం కూడా భారీగా పెరిగినట్లుగా అధికారులు గుర్తించారు.
- అత్యంత ఖరీదైన కొకైన్ లాటిన్ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, దుబాయ్‌ల నుంచి ఇక్కడికి వస్తున్నాయి. అధికశాతం కొరియర్ వ్యవస్థ ద్వారా వస్తున్నట్లు అంచనా. కొన్ని సందర్భాల్లో సముద్రమార్గాల్లో గోవా, ముంబయి, చెన్నై, కోల్‌కతా, విశాఖల్లోకి ప్రవేశిస్తున్నట్లు అనుమానిస్తున్నారు.



## ఆఫ్రికన్లు, నైజీరియన్లు..

హైదరాబాద్‌లో మత్తు మాఫియాకు నైజీరియన్లు, ఆఫ్రికన్లు కీలక ప్రతినిధులుగా ఉన్నట్లు నిఘా వర్గాలు నిర్ధారిస్తున్నాయి. మనవాళ్లు కూడా రవాణా చేస్తున్నప్పటికీ వారి శాతం తక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారికి సూత్రధారులెవరో తేల్చడానికి ఎక్సైజ్ శాఖ దృష్టిసారిస్తోంది. పర్యాటక వీసాపై మన దేశానికి వచ్చిన నైజీరియన్లల్లో చాలామంది వీసా కాలం తీరినా తిరిగి వెళ్లటం లేదని అధికారులు గుర్తించారు. మత్తుమందుల కేసుల్లో గత కొన్నేళ్లుగా పట్టుబడిన నైజీరియన్లు ఆఫ్రికాదేశ పౌరులే. అత్యధికులు వీసాల కాలం తీరినా ఇక్కడే ఉంటున్నారని పోలీసులు తెలిపారు. వారిని గుర్తించటం కూడా కష్టంగానే ఉందని వారు చెబుతున్నారు.

## నిఘా లోపం...

మత్తు మందుల రవాణాను గుర్తించడానికి పూర్తి స్థాయిలో తగిన వ్యవస్థ లేకపోవటం వీటి విస్తృతి పెరగానికి ప్రధాన కారణం. దేశంలోని కొన్ని విమానాశ్రయాలు మినహా మిగిలిన వాటిల్లో ఆ లోపం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అధునాత స్కానర్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి లోహాలను గుర్తించడానికే ఉపయోగపడుతున్నాయి. దేశంలోని ఏ విమానాశ్రయంలోని స్కానర్లలోనూ పొడుల (పౌడర్ లేదా చూర్ణం) రూపంలో వచ్చే మత్తుమందులను గుర్తించే ఏర్పాట్లు లేవు. దిల్లీ, ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాల్లో మత్తుమందులను గుర్తించేందుకు శిక్షణ పొందిన కుక్కలును వినియోగిస్తున్నారు. మిగిలిన విమానాశ్రయాల్లో శునకాలను భద్రతాపరమైన తనిఖీలకు మాత్రమే వినియోగిస్తున్నారు. మత్తుమందులను రవాణా చేసే వారు తనిఖీలు విస్తృతంగా ఉండని విమానాశ్రయాలను ఎంచుకుని అక్కడి చేరుకుంటారు. ఆయా ప్రాంతాల నుంచి రోడ్డు, రైలు మార్గాల్లో నిర్ధారిత ప్రాంతాలకు మత్తుమందులను రవాణా చేస్తుంటారని కస్టమ్స్ విశ్రాంత ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'తో చెప్పారు.

## పాత పద్ధతే దిక్కు...

విమానాశ్రయాల్లో బంగారాన్ని పట్టుకున్నంత సులువుగా మత్తుమందులు పట్టుకున్న సందర్భాలు ఉండవు. చాలా అరుదుగా.. అదీ ఎయిర్ ఇంటెలిజెన్స్‌కు ముందస్తు సమాచారం ఉన్న సందర్భాల్లోనే వీటిని పట్టుకుంటున్నారు. లేదంటే ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే విమానాలు, ఆయా దేశస్థులు వస్తున్నప్పుడు వారి పాస్‌పోర్టులపై కొంత నిఘా పెడుతున్నారు. వారు ఎక్కడి నుంచి వస్తున్నారు? ఏ పని మీద వస్తున్నారు? ఒకవేళ తరచూ వస్తుంటే, ఎంత వ్యవధిలో రాకపోకలు సాగిస్తున్నారు? అనే అంశాలపై దృష్టి పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నా.. వారి నడకలో తేడా ఉన్నట్లు గుర్తించినా వారిని విడిగా ప్రశ్నించి, ప్రత్యేకంగా తనిఖీలు చేస్తుంటారు. ఆలాంటి సందర్భాల్లో దొరికితే అక్రమ రవాణాదారులు దొరికినట్లు. లేదంటే అంతే సంగతులు!

## ఎక్కడెక్కడి నుంచి ఏ మత్తు?



- **కొకైన్:** లాటిన్ అమెరికా, పశ్చిమ ఆఫ్రికా, దుబాయ్‌ల నుంచి... ముంబయి కేంద్రంగా దిల్లీ, కర్ణాటక, తమిళనాడులకు వస్తుంది. అక్కడి నుంచి వివిధ రూపాల్లో హైదరాబాద్‌కు చేరుతోంది.
- **వ్యాపారం:** మత్తుమందుల వ్యాపారంలో సింహభాగం దీనిదే. గ్రాము కనీసం రూ. మూడు నుంచి రూ. అయిదు వేలు పలుకుతుంది.



- **హెరాయిన్:** అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, మయన్మార్, లావోస్, థాయ్‌లాండ్‌ల నుంచి వస్తుంది. దిల్లీ, మధ్యప్రదేశ్, హైదరాబాద్, విశాఖపట్నం, ముంబయి, కోల్‌కతా, చెన్నైలకు వస్తుంది. కొన్ని సందర్భాల్లో చెన్నై నుంచి శ్రీలంక దేశానికి పెద్ద మొత్తంలో హెరాయిన్ ఎగుమతి అవుతోంది.
- **వ్యాపారం:** కొకైన్‌తో పోలిస్తే హెరాయిన్ ధర కొంత తక్కువ. వినియోగించేవారి సంఖ్య ఎక్కువే. గోవాలో వినియోగం విస్తృతమన్నది అంచనా. అధిక వ్యాపారం అక్కడ జరుగుతుంది.



- **ఎల్ఎస్‌డీ:** రష్యా, యూరప్, దుబాయ్‌ల నుంచి గోవాకు వస్తుంది. అక్కడి నుంచి మంగుళూరు, బెంగళూరు, కోల్‌కత్తా ప్రధాన కేంద్రాలుగా వచ్చి అక్కడి నుంచి హైదరాబాద్‌లో చెలామణి అవుతోంది.
- **వ్యాపారం:** ఈ మధ్యనే ఇది హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. రేవ్ పార్టీలల్లో విస్తృతంగా వినియోగమవుతోంది. ఇటీవల కాలంలో వినియోగం పెరుగుతోంది.



- **నల్లమందు:** ఇరాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్ దేశాల నుంచి భారీగా రవాణా అవుతోంది. దీనిని మనదేశంలోని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో కూడా పండిస్తారు. కర్ణాటక, పశ్చిమబెంగాల్, నీలగిరి ప్రాంతాల్లో అక్కడక్కడ పండిస్తారు. మధ్యప్రదేశ్ నుంచి అమెరికా, యూరప్ దేశాలతోపాటు మాల్దీవులు శ్రీలంక, సింగపూర్‌లకు ఎగుమతి అవుతోంది.
- **వ్యాపారం:** భారీ మొత్తంలో సాగుతోంది. ఇతర మత్తుమందులతోపోలిస్తే ధర ఒకింత తక్కువ. వినియోగం కూడా అధికంగా ఉంటుంది. వ్యాపారం ఎంత మొత్తంలో అన్నది అంచనాలేదు.

# కర్ణాటక మంత్రిపై ఐటీ వల

- కీలక నేతల ఇళ్లలో సోదాలు
- రూ.10 కోట్లకు పైబడి నగదు, పత్రాలు స్వాధీనం
- ఇది రాజకీయ దాడి: కాంగ్రెస్

ఈనాడు – బెంగళూరు



ఆదాయపన్ను శాఖ అధికారులతో కలసి బెంగళూరులోని తన నివాసంలోకి ప్రవేశిస్తున్న శివకుమార్

కర్ణాటక ప్రభుత్వంలో అత్యంత ప్రభావశీలుడిగా పేరు గాంచిన ఇంధన మంత్రి డి.కె.శివకుమార్‌కు చెందిన నివాసాలు, కార్యాలయాలపై ఆదాయపుపన్ను శాఖ దాడులు నిర్వహించింది. ఉదయం ఆరు గంటలకు మొదలైన సోదాలు రాత్రి పొద్దు పోయేంత వరకూ సాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర పోలీసులకు బదులుగా సి.ఆర్.పి.ఎఫ్. బలగాల సాయంతో 120 మంది ఆదాయపు పన్ను శాఖ అధికారులు బృందాలుగా విడిపోయి మొత్తం 39 చోట్ల ఏక కాలంలో దాడులు జరిపారు. దేశ రాజధాని దిల్లీ, బెంగళూరులో శివకుమార్ నివాసాలు, కార్యాలయాలు, ఆయన ఆధ్వర్యంలోని కళాశాల, నగర శివార్లలో గుజరాత్ కాంగ్రెస్ విధానసభ సభ్యులు బస చేసిన ఈగల్టన్ రిసార్ట్స్, రామనగర, యలహంక, ఆనేకల్లు తదితర ప్రాంతాల్లో శివకుమార్ బంధువులు, ఆత్మీయులు, మిత్రులు, బినామీ వ్యక్తులుగా అనుమానిస్తున్న వారి నివాసాలు, కార్యాలయాలపై దాడులు జరిపారు. వీటిలో స్థిరాస్తి వ్యాపారాలు, బంగారం, నగల దుకాణాలూ ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం రూ.10 కోట్లకు పైగా నగదు, పెద్దమొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.7.9 కోట్ల నగదును దిల్లీలో, మిగిలిన మొత్తాన్ని ఈగల్టన్ రిసార్ట్స్, నివాసాల్లో గుర్తించారు. భారీగా డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు. పన్ను ఎగవేత, దేశంలోని పలు ప్రాంతాలతోపాటు సింగపూర్‌తో సహా పలుదేశాల్లోని కొన్ని సంస్థల్లో అనధికార పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు గుర్తించి ఈ దాడులు నిర్వహించినట్లు వెల్లడవుతోంది.

★ గుజరాత్ విధానసభ నుంచి రాజ్యసభకు జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్‌ను గెలిపించి తీరాలనే ఉద్దేశంతో ఇక్కడి ఈగల్టన్ రెసార్టులో 45 మంది గుజరాత్ కాంగ్రెస్ విధానసభ సభ్యులు బస చేశారు. వారి బాగోగుల పర్యవేక్షణకు అక్కడే మకాం చేసిన శివకుమార్‌ను ఉదయం ఏడు గంటలకే ఆదాయపు పన్ను శాఖ అధికారులు పలకరించారు. అక్కడ విచారణ జరుగుతున్న దశలోనూ సదాశివ నగర్‌లో ఉన్న సొంత నివాసంలోని లాకర్‌ను తెరిచేందుకు ఆదాయపు పన్ను సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. శివకుమార్‌ను ఈగల్టన్ విడిది నుంచి సొంత నివాసానికి తరలించారు. ఆయన లాకర్‌ను తెరిచాక దస్త్రాల పరిశీలన కొనసాగించారు. శివకుమార్, ఈగల్టన్ విడిది మేనేజర్ మాథ్యూ, శివకుమార్ ఆప్తుడు, ప్రదేశ్ కాంగ్రెస్ సమితి ప్రధాన కార్యదర్శి వినయ్, మైసూరులో శివకుమార్ మామ తిమ్మయ్యను ప్రశ్నించారు. శివకుమార్ సన్నిహితులైన విధానపరిషత్తు సభ్యుడు రవి, యలహంకలోని మరో విశ్వాసపాత్రుడు బాలాజి.. ఇలా సన్నిహిత వలయంలోని వారందరినీ ప్రశ్నించారు. వారి నివాసాలు, కార్యాలయాలను సోదా చేశారు. రిసార్ట్‌లోని మంత్రి గదిని మాత్రమే తనిఖీ చేశామని అక్కడున్న గుజరాత్ ఎమ్మెల్యేల గదులను పరిశీలించలేదని ఐటీ అధికారులు పేర్కొన్నారు. ఆదాయపుపన్ను శాఖ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగనుందని సమాచారం. స్వాధీనం చేసుకున్న నగదు గురించి ప్రశ్నించేందుకు వీలుగా ఆయన్ను అరెస్టు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

★ శివకుమార్‌పై ఐటీశాఖ దాడులు విషయం పార్లమెంటులోనూ ప్రతిధ్వనించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ప్రదర్శన జరిపారు.

★ గుజరాత్ విధానసభ నుంచి రాజ్యసభకు జరుగనున్న ఎన్నికలో అదనంగా మరో స్థానాన్ని గెలుచుకునేందుకు భాజపా అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసిందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ పటేల్ ట్వీట్ చేశారు. ఒక రాజ్యసభ స్థానాన్ని సొంతం చేసుకునేందుకు పడరానిపాట్లు పడుతోందని వ్యాఖ్యానించారు. ఇవన్నీ రాజకీయ ప్రేరేపితమని కర్ణాటక ముఖ్యమంత్రి విమర్శించారు.

★ ఐటీ దాడులపై స్పందించేందుకు మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ నిరాకరించారు. 'ఎవ్వరి గురించీ ఏమీ మాట్లాడను. అన్ని రకాల దాడులూ జరుగుతాయి. నా కుమారుడి ఆస్తులపై పదకొండుమార్లు దాడులు జరిగాయి. వాళ్లు అధికారాన్ని చలాయిస్తున్నారు. పరస్పర ఆరోపణలు సహజం. ఇదంతా అందరికీ తెలిసిన విషయమే' అంటూ వ్యాఖ్యానించారు.

## ఐ.టి. దాడులపై కాంగ్రెస్ నిరసన

- స్తంభించిన రాజ్యసభ
- లోక్‌సభ నుంచి వాకౌట్

**దిల్లీ:** కర్ణాటక మంత్రి డి.కె.శివకుమార్ నివాసాలపై ఆదాయపు పన్ను (ఐ.టి.) శాఖ అధికారులు సోదాలు చేయడం బుధవారం పార్లమెంటులో ప్రతిధ్వనించింది. రాజ్యసభ కార్యకలాపాలు ప్రారంభంకాగానే కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రాజ్యసభ ఎన్నికలను గాడితప్పించడానికే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ రాజ్యసభ ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా జరపాల్సి ఉండగా గుజరాత్‌లో వాటిని పాటించడం లేదని విమర్శించారు. కర్ణాటక మంత్రిపై ఇప్పుడే ఎందుకు దాడులుజరుగుతున్నాయని ప్రశ్నించారు. ఇందుకు జైట్లీ సమాధానం చెబుతూ రిసార్టులో ఉన్న ఎమ్మెల్యేలు ఎవరినీ సోదా చేయలేదని తెలిపారు. రిసార్టులో బసచేసిన మంత్రిని ఇంటికి తీసుకెళ్లి మరింతగా ప్రశ్నించడానికే అధికారులు అక్కడికి వెళ్లారని అన్నారు. సంతృప్తి చెందని కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేయటంతో సభను పది నిమిషాలపాటు వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశమయినప్పుడు కాంగ్రెస్ సభ్యుడు కపిల్ సిబల్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం అరాచకానికి పాల్పడుతోందని విమర్శించారు. గొడవ సద్దుమణగకపోవడంతో సభను రెండింటి వరకు వాయిదా వేశారు. అప్పటికీ పరిస్థితి మారకపోవడంతో అధ్యక్షస్థానంలో ఉన్న డిప్యూటీ ఛైర్మన్ కురియన్ సభను వాయిదా వేశారు. లోక్‌సభలో కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే ఈ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. గుజరాత్ ఎమ్మెల్యేలు ఉన్న ఆ రిసార్టుకు రూ.942 కోట్లు జరిమానా వేయాలని అంతకుముందే ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అరుణ్ జైట్లీ మాట్లాడుతూ కర్ణాటక మంత్రికి చెందిన 39 భవనాల్లో సోదాలు జరిగాయని, అందులో రిసార్టు ఒకటని చెప్పారు సమాధానంపై సంతృప్తి చెందని కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు.

## ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు: నారాయణ

**విజయవాడ, న్యూస్‌టుడే:** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందని ఈమేరకు ప్రధాని నరేంద్ర మోదీపై ఛీటింగ్ కేసు నమోదు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విజయవాడలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం వంట గ్యాస్ రాయితీని ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రతి నెలా రూ.4 పెంచుతూ ప్రపంచ బ్యాంకు విధానాలు అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జీఎస్టీ పరిధిలో నుంచి పెట్రోలియం వస్తువులు మినహాయిస్తే గ్యాస్‌ను రాయితీపై ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వానికి వచ్చే నష్టం పూడ్చవచ్చని సూచించారు. గ్యాస్ రాయితీల ఎత్తివేత, పశువధ నిషేధం తదితర అంశాలు ఎన్నికల హామీల్లో లేవన్నారు. హిందుత్వాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు మోదీ తెరతీశారని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్, ఏపీలో ప్రతిపక్ష నాయకుడు జగన్‌లు నరేంద్ర మోదీ విధానాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యామ్నాయ రాజకీయ విధానం కోసం ప్రయత్నిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఎమ్మార్పీకి మించి అమ్మకాలు

- గుంటూరు రైల్వేస్టేషన్‌లో మంత్రి ప్రత్తిపాటి ఆకస్మిక తనిఖీ



గుంటూరు రైల్వేస్టేషన్‌లో నీళ్ల సీసాను చూపుతూ ధర అడుగుతున్న మంత్రి ప్రత్తిపాటి

**గుంటూరు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని అన్ని రైల్వేస్టేషన్లలో దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకే ఆహార పదార్థాలు, శీతల పానీయాలు, తినుబండారాలు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించే హక్కు దుకాణదారునికి లేదని రాష్ట్ర మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం గుంటూరు రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై దుకాణాల్లో బుధవారం ఆయన గంటపాటు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రైల్వేస్టేషన్లలో తినుబండారాలు, తాగునీరు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్లాట్‌ఫాంపై వేచి ఉన్న ప్రయాణికులతో మాట్లాడారు. ఇక్కడి దుకాణాల్లో ఏవైనా కొనుగోలు చేశారా? ఎమ్మార్పీ ధరలకే అమ్ముతున్నారా? ఆహార పదార్థాలు నాణ్యతగా ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో రూ.8ల లూజు తాగునీరు సీసా రూ.10కి, బాదం పాలు సీసా రూ.20 అయితే రూ.25కు, విజయ మజ్జిగ ప్యాకెట్ రూ.8 ఉండగా రూ.10కి అమ్ముతున్నట్టు గుర్తించామన్నారు. ప్రతి సీసాపై రూ.2 నుంచి రూ.5 వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇలాంటి దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. మార్పు రాకపోతే లైసెన్స్‌ల రద్దుకు రైల్వే శాఖకు సిఫార్సు చేస్తామని చెప్పారు. ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని అడిగే హక్కు ప్రయాణికులకు ఉందన్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, బయట దుకాణాల్లో అదనపు ధరలకు విక్రయించే వారిపై టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫిర్యాదు చేయాలన్నారు.

## రూ.500 కోట్ల పనులను రూ.2432.77 కోట్లకు అప్పగింత

లాంకో ఇన్‌ఫ్రాటెక్ పూర్వ ఉపాధ్యక్షుడు జుడీష్‌రాజ్ ఆరోపణ

**ఈనాడు, అమరావతి:** విశాఖలో మెడిటెక్ జోన్ అభివృద్ధికి సంబంధించి 500 కోట్ల రూపాయల పనులను ప్రభుత్వం 387శాతం అధికంగా రూ.2432.77 కోట్లకు ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్‌కు అప్పగించిందని ఈ సంస్థ పూర్వ ఉపాధ్యక్షుడు జుడీష్‌రాజ్ బుధవారం ఇక్కడ ఆరోపించారు. ప్రజాధనం వృథా గురించి ప్రశ్నించినందుకు తనతో పాటు మరో ఏడుగురిని ఉద్యోగాల నుంచి తీసేశారన్నారు. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ మెడిటెక్ జోన్ నిర్మాణ పనుల అప్పగింత పారదర్శకంగా జరిగిందని నిబంధనల ఉల్లంఘన, అవినీతి జరిగినట్లు ఆధారాలతో ఫిర్యాదులుచేస్తే ఉన్నత స్థాయిలో విచారణ జరిపించి కఠిన చర్యల్ని తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. ఈ పరిణామాలపై అధికారిక వర్గాలు స్పందిస్తూ... "తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తూ సంస్థ నుంచి బయటకు వెళ్లిన వారు చెప్పేదానికి విశ్వసనీయతలేదు. మంచి పనులు చేస్తుంటే ఇలాంటివి వస్తుంటాయి. వీటిని పట్టించుకోకూడదు" అని కొట్టిపారేశాయి.

# స్వాతంత్ర్య సమరయోధుల కలలు నిజం చేయాలి

- ప్రజలకు ప్రధానమంత్రి మోదీ వినతి
- వాస్వానీ జన్మదిన వేడుకలో వీడియో ప్రసంగం

**దిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం తన 'నవ భారత' నిర్మాణ ఆకాంక్షను వెలిబుచ్చారు. మనదేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనే 2022 నాటికి దీన్ని సాధిస్తామనే లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని ప్రజలను కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల కలలు కొన్ని ఇంకా నెరవేరలేదని, వీటిని సాధించటం మనందరి కర్తవ్యమని ఉద్బోధించారు. ఆయన పుణేలోని ధార్మిక సంస్థ సాధు వాస్వానీ మిషన్ అధిపతి, ఆధ్యాత్మిక గురువు దాదా జె.పి.వాస్వానీ 99వ జన్మదిన వేడుకల సందర్భంగా వీడియో సమావేశం ద్వారా ప్రసంగించారు. నవ భారత లక్ష్యాలను సాధించటానికి వాస్వానీ ఆశీస్సులు తోడ్పడగలవని ఆకాంక్షించారు. "స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రత్యక్షంగా చూసిన వాస్వానీ 99వ పుట్టినరోజు వేడుకలను జరుపుకొంటున్న తరుణంలో అసంపూర్ణంగా మిగిలిన స్వాతంత్ర్య సమరయోధుల కలలను నిజం చేయటానికి మనం కంకణం కట్టుకోవాలి" అని సూచించారు. స్వచ్ఛభారత్, సౌరశక్తి, వ్యర్థం నుంచి ఇంధన ఉత్పత్తి వంటి కార్యక్రమాలతో ఇంతమందిని జోడిస్తాను.. ఇంతమంది గ్రామీణులకు చదువు చెబుతాను అనేటువంటి లక్ష్యాలను పెట్టుకోవాలన్నారు.

## చక్కని చేతి గడియారం... ఆకుపచ్చని రాతిపూసల హారం!

- మోదీకి అందిన బహుమతుల శ్రేణి

**దిల్లీ:** బ్రిటిష్ కంపెనీ సెకొండా తయారు చేసిన 'హౌస్ ఆఫ్ కామన్స్' చేతి గడియారం...ఆకుపచ్చని రాతి పూసలున్న ఓ దండ... తదితరాలెన్నో ప్రధాని నరేంద్రమోదీకి బహుమతిగా అందాయి. వాటన్నిటినీ కూడా భారత విదేశీ వ్యవహారాల శాఖ నిర్వహించే 'తోష్‌ఖానా'కు అందచేశారు. ఇవన్నీ ఆయనకు ఈ ఏడాది జనవరి నుంచీ మార్చినెలలోగా అందినవేనని అధికారిక వివరాలను బట్టి తెలుస్తోంది. వీటితో పాటూ ఎమిరేట్స్ నేషనల్ హౌస్ నమూనా కూడా మోదీకి బహుమతిగా లభించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ...రూ.5వేల ఖరీదు కంటే తక్కువైన బహుమతులను వాటి గ్రహీత లెవరైనా సరే తమ వద్దే అట్టిపెట్టుకోవచ్చు. అంతకంటే ఎక్కువ ధరపలికే వస్తువులను తోష్‌ఖానాకు అందచేయాల్సి ఉంటుంది. ఒకవేళ రూ.5 వేల కంటే ఎక్కువ ఖరీదైన ఏ బహుమతినైనా సరే ...గ్రహీత తనకోసమే అట్టిపెట్టుకోవాలనుకుంటే మాత్రం ఆ మేరకు డబ్బును సొంతంగా చెల్లించి తీసుకునే వెసులుబాటు ఉంది.

## మాదకద్రవ్యాల కేసు దర్యాప్తునకు సహకరిస్తాం

- తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున సీఎం కేసీఆర్‌కు లేఖ

**ఈనాడు, హైదరాబాద్:** మాదకద్రవ్యాలు సేవించేవారు ఎప్పటికీ కథానాయకులు కాబోరని, అతి కొద్దిమంది చేసిన పొరపాట్లకు పరిశ్రమ మొత్తం తలదించుకోవాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరమని తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఒక లేఖ రాశారు. ఇందులో అనేక విషయాలను ప్రస్తావించారు. తెలుగు సినిమా వసూళ్లు రూ.2వేల కోట్లు దాటడం, తెలుగు దర్శకుడికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చిన సంతోషంలో ఉన్న పరిశ్రమపై మాదకద్రవ్యాల కేసు రూపంలో తమను గ్రహణం కమ్మిందన్నారు. చెడు అలవాట్లకు బానిసైన వారు వాళ్లంతట వారే తెరమరుగై పోతారన్నారు. అటువంటివారిపై తామే చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వానికి, పోలీసులకు సహకరిస్తామన్నారు. వివిధ రంగాల్లోని వారిని పెడతోవ పట్టిస్తున్న ఈ భూతాన్ని తరిమికొట్టేందుకు ముఖ్యమంత్రి చూపిస్తున్న తెగువను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని, ఈ బృహత్ కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు.. అంతా కలిసి ముఖ్యమంత్రికి ఈ లేఖ రాశారు.

## సురేష్‌బాబుకు వచ్చిన పార్శిల్‌పై ఆరా

**హైదరాబాద్ న్యూస్‌టుడే:** రామానాయుడు స్టూడియోకు బుధవారం ఆబ్కారీ అధికారులురావడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు తెలిపిన ప్రకారం.. కొంత కాలంగా ఆబ్కారీ శాఖ విదేశాల నుంచి వస్తున్న పార్శిళ్లపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో బుధవారం సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు పేరు మీద ఆయన ఇంటికి విదేశాల నుంచి ఒక పార్శిల్ వచ్చింది. దీంతో అధికారులు పార్శిల్ గురించి ఆరా తీసేందుకు సురేష్‌బాబు ఇంటికి వెళ్లారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో రామానాయుడు స్టూడియోలో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లారు. పార్శిల్ విషయమై సురేష్‌బాబును అడగ్గా.. 'తన కుమారుడు, నటుడు రాణా నడుం నొప్పికి సంబంధించి విదేశాల నుంచి ఒక పరికరం తెప్పించుకున్నట్లు' అధికారులకు చెప్పారు. పార్శిల్‌పై వివరణ తీసుకుని అధికారులు వెళ్లిపోయారు.




ర్యాంకులు సాధించిన విద్యార్థులతో మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్ మోహన్

## ఐపీసీసీ ఫలితాల్లో సత్తాచాటిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు

**గుంటూరు, న్యూస్‌టుడే:** సీఏ-ఐపీసీసీ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ర్యాంకులు సాధించారని సంస్థ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. బుధవారం గుంటూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన ర్యాంకుల వివరాలను వెల్లడించారు. ఆల్ ఇండియా స్థాయిలో 50 లోపు 9 ర్యాంకులను మాస్టర్‌మైండ్స్ సొంతం చేసుకుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని తమ సంస్థ విద్యార్థులు అత్యధిక ర్యాంకులను సాధించారని వివరించారు. ఈ సందర్భంగా అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

## పిల్లల వయసు ధ్రువీకరణ చూపించాలి

- టిక్కెట్ రాయితీపై ఆర్టీసీ నిర్ణయం

**ఈనాడు, అమరావతి:** ఇకపై ఆర్టీసీ బస్సెక్కి మా పిల్లాడికి సగం టిక్కెట్ అని అడిగితే... కండక్టర్ నోటిమాటగా వయసెంత అని అడిగి టిక్కెట్ ఇచ్చేయరు. ఆధార్ కార్డు చూపించమని కండక్టర్ అడిగితే చూపించక తప్పదు. చిన్నారులకు ఆర్టీసీలో సగం టిక్కెట్, ఉచితం లాంటి రాయితీ వినియోగించుకొనేవాళ్లు తప్పనిసరిగా వయసు ధ్రువీకరణకు సంబంధించిన ఏదో ఒక పత్రం చూపించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆర్టీసీ కార్యనిర్వాహక సంచాలకులు అంతర్గత ఉత్తర్వులిచ్చారు. ఏసీ బస్సుల్లో 5 సంవత్సరాల నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలకు టిక్కెట్ ధరలో 75శాతం, ఇతర బస్సుల్లో 50 శాతం ఛార్జి వసూలు చేస్తారు. అయిదేళ్లలోపు చిన్నారులకు ఉచిత ప్రయాణం ఉంటుంది. ప్రయాణ సమయంలో కండక్టర్‌కు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ, రేషన్‌కార్డు లాంటివి ఏదో ఒకటి చూపించాలి.

## ఉద్యాన సాగుకు ఎన్టీఆర్ జలసిరి

**ఈనాడుఅమరావతి:** ఉద్యాన పంటల సాగుకు ఎన్టీఆర్ జలసిరి పథకాన్ని అనుసంధానించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ సూచించారు. ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖలపై సమీక్షించిన ఆయన మార్కెటింగ్, ఎగుమతులపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు నిల్వ అవకాశాలను పెంచాలని చెప్పారు. రాజమహేంద్రవరంలో అన్ని వసతులతో కూడిన మార్కెట్ యార్డు త్వరలోనే అందుబాటులోకి రానుందని ఉద్యాన కమిషనర్ చిరంజీవి చౌదరి వివరించారు. త్వరలో రైల్వేకోడూరులోనూ మరోటి ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## 'కరవు రహిత రాష్ట్రమే లక్ష్యం'

**ఈనాడు–అమరావతి:** కరవును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గనులు, భూగర్భ వనరులశాఖ మంత్రి సుజయ కృష్ణ రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి శాశ్వత నివారణ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలవరం ఎక్కడ పూర్తవుతుందో అని భయపడుతున్న ప్రతిపక్షం అడ్డంకులు సృష్టిస్తోందని ధ్వజమెత్తారు.

# జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణకు అవకాశం

- పార్లమెంటులో జైట్లీ సంకేతాలు
- చెప్పుల్నీ, ఖరీదైన కార్లనూ ఒకే గాటన కట్టలేం



**దిల్లీ:** వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) అమలులో ముందుకు వెళ్తున్నకొద్దీ రేట్లను హేతుబద్ధీకరించే అవకాశాలున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సంకేతాలిచ్చారు. జమ్ము కశ్మీర్‌కూ జీఎస్టీని విస్తరించడానికి ఉద్దేశించిన రెండు బిల్లులపై చర్చకు బుధవారం లోక్‌సభలో ఆయన సమాధానమిచ్చారు. ఈ బిల్లుల్ని దిగువసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. జీఎస్టీ నెట్‌వర్క్‌ను మార్చాల్సిందిగా తనపై ఒత్తిడి ఉందనీ, నిజానికి ఇది లోపభూయిష్టంగా ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నా ఆ వ్యవస్థ మాత్రం సరైనదేనని జైట్లీ చెప్పారు. భారతదేశంలో అనేకమంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారు. అందువల్ల అన్నింటికీ ఒకే పన్ను శ్లాబును నిర్ణయించలేం. సాధారణ చెప్పులనూ, బీఎండబ్ల్యూ కార్లను ఒకే గాటన కట్టలేం...' అని ఆయన వివరించారు.

### పన్ను వేయకపోతే చక్రాల కుర్చీలు ఖరీదవుతాయి

దివ్యాంగులు వాడే పరికరాలు జీఎస్టీ తర్వాత ఖరీదయ్యాయన్న విమర్శల్ని జైట్లీ ప్రస్తావిస్తూ- చక్రాల కుర్చీ తయారీలో వాడే కొన్ని వస్తువులకు ఎక్కువ పన్ను రేట్లు వర్తించినా తయారీదారులు మాత్రం తుది ఉత్పత్తిపై పన్ను రాయితీని పొందవచ్చని చెప్పారు. తుది ఉత్పత్తికి పన్ను 5 శాతమేనన్నారు. ఒకవేళ చక్రాల కుర్చీని సున్నా శాతం పన్ను కిందికి తీసుకువస్తే, తయారీదారులకు పన్ను రాయితీ రాదనీ, తద్వారా చక్రాల కుర్చీ ఖరీదయిపోతుందనీ వివరించారు.

**ఎన్నికల కమిషనర్ల నియామకానికి కొలీజియం ప్రతిపాదనేదీ లేదు:** ఎన్నికల కమిషనర్ల నియామకానికి కొలీజియం విధానాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్రం బుధవారం స్పష్టం చేసింది. సీఈసీ సహా ఎన్నికల కమిషనర్లను ఎంపికకు ఇలాంటి విధానం ఏర్పాటు చేసేలా చట్టం ముసాయిదాను రూపొందించే యోచన లేదన్నారు.

### ఆర్‌బీఐ నిష్ప్రయోజనకరం

పెద్దనోట్ల రద్దుపై విపక్షం మరోసారి గళమెత్తింది. మంగళవారం ఈ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సమాధానమిస్తూ... లెక్కలు తేలడానికి కచ్చితంగా కొంత సమయం పడుతుందని చెప్పడంపై బుధవారం లోక్‌సభలో ప్రతిపక్షాలు పెదవి విరిచాయి. భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) నిష్ప్రయోజనకరమని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌లు వ్యాఖ్యానించాయి. రఘురాం రాజన్ ఆర్‌బీఐ గవర్నర్‌గా రాజీనామా చేసిన అనంతరం ఆ సంస్థపైనే నమ్మకం కోల్పోయామని తృణమూల్ ఎంపీలు అన్నారు. లెక్కలు బయటకు వచ్చాక 'నోట్ల రద్దు బుడగ' పేలిపోవడం ఖాయమని చెప్పారు. 'బ్యాంకింగ్ నియంత్రణ (సవరణ) బిల్లు-2017'పై చర్చ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ- రద్దయిన నోట్ల లెక్కలూ చెప్పలేకపోతున్న ఆర్‌బీఐపై ఎలా విశ్వాసం కనపరచగలమని ప్రశ్నించారు.

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతివ్వండి

- పార్టీలకు అతీతంగా ఎంపీలందరికీ వెంకయ్యనాయుడు లేఖ

**ఈనాడు, దిల్లీ:** ఈనెల 5వ తేదీన జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తనకు ఓటేయాలని కోరుతూ ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడు పార్లమెంటు సభ్యులందరికీ లేఖరాశారు. 'పార్లమెంటు సహచరులుగా నాతో మీకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా పరిచయం ఉంది. భారత ఉప రాష్ట్రపతి పదవికి పోటీచేస్తున్న నా అభ్యర్థిత్వానికి మీరు మద్దతు పలకాలని కోరుతున్నా. అత్యున్నతమైన రాజ్యాంగబద్ధ పదవికున్న గౌరవాన్ని కాపాడుతూ పెద్దలు మనకు ఇచ్చి వెళ్లిన రాజ్యాంగ విలువలను రక్షించడానికి శక్తివంచన లేకుండా నావంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇస్తున్నా. రాజ్యసభను సక్రమంగా నిర్వహించి గౌరవ సభ్యులంతా నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావడానికి నావంతు సహకారం అందిస్తాను. 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ- భిన్నత్వంలో ఏకత్వమే భారతీయతకు అసలైన పునాది అని చెప్పారు. సామాజిక, ఆర్థిక సమానత్వం స్థాపించాలని 1949 నవంబర్ 25న జరిగిన చివరి రాజ్యాంగ నిర్మాణ సభలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. ఈ లక్ష్యాలను సాధించేలా రాష్ట్రపతి చేతులను బలోపేతం చేయడానికి నావంతు ప్రయత్నం చేస్తా'నని వెంకయ్య తన లేఖలో పేర్కొన్నారు.



బుధవారం పార్లమెంటు వద్ద ముచ్చటించుకుంటున్న వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

# 'ఆధార్' ఆనందాలివి...

- తప్పిపోయిన చిన్నారులను అమ్మఒడి చేరుస్తున్న తీరు...

**దిల్లీ:** ఎప్పుడో తప్పిపోయిన కన్నబిడ్డ 'ఆధార్' మూలంగా తిరిగి తన తలిదండ్రులను కలుసుకున్న మరో సంఘటన ఇది. తాజాగా..., తొమ్మిదేళ్ల గౌరవ్ 'ఆధార్' వల్ల హరియాణాలోని పానిపట్‌లో ఉన్న తన తలిదండ్రులను కలుసుకున్నాడు. 2015లో ఇంటి ముందు ఆడుకుంటూ ఎటో దిక్కుతెలియకుండా వెళ్లిపోయి...చివరకు దిల్లీలోని 'పాల్నా' అనే స్వచ్ఛంద సంస్థకు చేరి ఆశ్రయం పొందుతున్న గౌరవ్‌కు 'ఆధార్' ఇప్పించడానికి అక్కడి సిబ్బంది ప్రయత్నించారు. మానసికవైకల్యం, మతిమరుపుతో బాధపడుతున్న గౌరవ్‌కు తన పేరు, అమ్మానాన్నల పేర్లు తప్ప మరేమీ గుర్తులేవు. ఆ కొద్ది వివరాలతోనే 'ఆధార్' కోసం నమోదు చేద్దామని బయోమెట్రిక్ నమూనాలు తీసుకోగానే...అప్పటికే గౌరవ్ పేరు, వివరాలు నమోదై ఉన్న విషయం వెలుగుచూసింది. గౌరవ్ వాళ్లమ్మానాన్నలు పానిపట్‌లో ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఆ తలిదండ్రులు పరుగున దిల్లీ వచ్చేశారు. దాదాపు రెండేళ్ల తర్వాత కన్న కుమారుడిని కళ్లారా చూసుకుని కన్నీరుమున్నీరైనారు. గౌరవ్ తండ్రి వికాస్ అయితే...నోటమాట రానంతగా ఆనందాశ్చర్యాల్లో మునిగిపోయాడు. 'ఆధార్'కు శతకోటి వందనాలంటూ పదేపదే ఆ తలిదండ్రులు ఉద్వేగంగా చెప్పారు. కన్న కుమారుడిని అక్కున చేర్చుకుని ఆనందంగా తమ ఊరికి తిరిగి వెళ్లిపోయారు.

ఇటీవల ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ మూగ, బధిర బాలుడు ఎంతో కాలం తర్వాత 'ఆధార్' ద్వారానే అమ్మానాన్నలను తిరిగి చేరుకోగలిగాడు. 2013లో ఆరేళ్ల వయసున్నప్పుడు తప్పిపోయిన అతడు మధ్యప్రదేశ్‌లోని అనుప్పూర్ రైల్వేస్టేషన్‌లో దిక్కుతెలియకుండా తిరుగుతుంటే పోలీసులు బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ మధ్యనే ఆధార్ నమోదుకు ప్రయత్నిస్తుంటే... వివరాలు తెలిశాయి. ఛత్తీస్‌గఢ్‌లోని రాయగఢ నుంచి తండ్రి పరిగెత్తుకొచ్చాడు. ఇన్నేళ్ల తర్వాత కనిపించిన కుమారుడిని ఆత్రంగా అక్కునచేర్చుకుని ....ఆనందంగా ఇంటికి తీసుకెళ్లిపోయాడు. మొత్తం మీద 'ఆధార్' ఆనందాధారమైంది.

# కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు నెంబర్ వన్ విలన్

- రాష్ట్రమంతటా పర్యటించి విపక్షాల బండారం బయటపెడతా
- విలేకర్ల సమావేశంలో తెలంగాణ సీఎం కేసీఆర్

**ఈనాడు, హైదరాబాద్:** కాంగ్రెస్ ఓ పిశాచి అని.. తెలంగాణ పాలిట నెంబర్ వన్ విలన్ అని ముఖ్యమంత్రి కేసీఆర్ నిప్పులు చెరిగారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు తీరని ద్రోహం చేసిన ఆ పార్టీ ఇప్పుడు ప్రత్యేక రాష్ట్రంలోనూ అదే వైఖరిని అవలంబిస్తోందని, అభివృద్ధిని అడ్డుకునేందుకు అడ్డదారులు తొక్కుతోందని ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు, ఉద్యోగ నోటిఫికేషన్లు, క్రమబద్ధీకరణ, విలీనం.. ఇలా తెలంగాణ ప్రజల అభ్యున్నతికి చేపట్టిన అన్ని నిర్ణయాలను అడ్డుకునేందుకు కోర్టులకు వెళ్లి 196 కేసులు వేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ వల్ల లక్షల మంది ఉద్యోగులు, కార్మికులు, కార్మిక కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని.. ఎంతగా మంచి చేసినా హర్షించే విజ్ఞత లేని పార్టీలుండటం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ఎన్ని కేసులు పెట్టినా సమర్థంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఆ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణను అభ్యుదయ రాష్ట్రంగా మార్చే దృష్టి నుంచి తమను మరల్చలేదని కేసీఆర్ పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రమంతా పర్యటించి విపక్షాల బండారం బయటపెడతామని కేసీఆర్ ప్రకటించారు. విద్యుత్ పొరుగు సేవల ఉద్యోగుల విషయంలో హైకోర్టు తీర్పు మేరకు చర్యలు చేపడతామన్నారు. కేసీఆర్ బుధవారం ప్రగతిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం ఏమన్నారో ఆయన మాటల్లోనే..

**దేశంలో ఎక్కడా లేదు..:** దేశంలో ఎక్కడా లేని విచిత్రమైన పరిస్థితిని ఇక్కడ చూస్తున్నాం. ఏ నోటిఫికేషన్ వచ్చినా కాంగ్రెస్ పనికిమాలిన కేసులు పెడుతోంది. విద్యుత్ ఉద్యోగుల విలీనాన్ని అడ్డుకొని వారి పొట్టగొట్టేందుకు పూనుకుంది. మేం చేపడుతున్న పటిష్ఠమైన పథకాలు, ప్రజానుకూల పాత్ర (ప్రొయాక్టివ్ రోల్)ను చూసి తమకిక పుట్టగతులుండవని కేసుల పురాణం మొదలుపెట్టిన కాంగ్రెస్.. తెలంగాణ ప్రజల పాలిట పిశాచిలా తయారైంది. కాంగ్రెస్ చేస్తున్న దుష్ట రాజకీయాలతో ప్రజాప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. కోర్టులు చీవాట్లు పెడుతున్నా ఆ పార్టీ నేతలకు బుద్ధి రావడం లేదు.

**మాదక ద్రవ్యాల జాబితాలో తెలంగాణ లేదు:** మాదక ద్రవ్యాల వినియోగం అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేదు. కల్తీల గురించి సమీక్షిస్తున్నప్పుడు కొందరు అధికారులు మాదక ద్రవ్యాల విషయం చెప్పారు.

**జైరాం రమేశ్ వల్లే..:** శాసనసభ సీట్ల పెంపు అంశంపై ఆసక్తి లేదు. పెరిగినా ఒకటే.. పెరగకున్నా ఒకటే. సీట్లు పెరగకపోవడానికి ప్రధాన కారణం జైరాం రమేశే. రాజ్యాంగ సవరణ అవసరం లేకుండా అని పెట్టాల్సింది రాజ్యాంగ సవరణతో అని పెట్టారు. పెంచుతే పెంచండి లేకపోతే లేదు, ఏదో ఒకటి ముగించేయమని ప్రధానికి చెప్పా. ఆయన మాట్లాడిన దాన్ని బట్టి పెంచకపోవచ్చనే భావిస్తున్నా.

## 'మీరు కన్యా/బ్రహ్మచారా?'

- బిహార్ ఆసుపత్రి ఉద్యోగ దరఖాస్తులో వివాదాస్పద ప్రశ్నలు

**పట్నా:** ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల నుంచి బిహార్‌లోని ఓ ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రి కోరిన సమాచారం వివాదాస్పదమైంది. పట్నాలోని ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రూపొందించిన దరఖాస్తులో వివాహ సంబంధిత సమాచారం వెల్లడించాల్సిన భాగంలో.. 'వితంతువు, బ్రహ్మచారి, కన్య (వర్జిన్)' ఆప్షన్ల నుంచి తామేంటో ఎంచుకోవాలని అభ్యర్థులను కోరారు. ఇటు వివాహితులకు.. 'నాకు జీవిస్తున్న ఒకే భార్య ఉంది; నా భర్తకు నేనొక్కరినే భార్యను; ఇంకో భార్య ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకున్నాను' అని ఆప్షన్లు ఇచ్చారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే కేంద్ర ప్రభుత్వం సూచనల ప్రకారమే దరఖాస్తును రూపొందించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ మనీశ్ మండల్ తెలిపారు. అలాంటి వ్యక్తిగత వివరాలను తెలపాలనడం అభ్యర్థికి ఇబ్బందికరంగానే ఉంటుందని వ్యాఖ్యానించిన ఆయన.. భవిష్యత్తులో ఉద్యోగులు అత్యాచారానికి గురైతే ఈ సమాచారం ఉపయోగపడుతుందని మరో వివాదస్పద వ్యాఖ్య చేశారు. వివాద పరిష్కరణ విషయమై ఆసుపత్రికి ఆదేశాలు జారీ చేసినట్లు బిహార్ ఆరోగ్యశాఖ మంత్రి తెలిపారు.

## అత్యాచారానికి పోతే నాలుక తెగింది!

- పక్కింటి వ్యక్తి నాలుకను కొరికేసిన కేరళ మహిళ

**కోచి:** తనపై అత్యాచారం చేయబోయిన వ్యక్తి నాలుకను ఒక మహిళ కొరికేసిన ఘటన కేరళలోని కోచిలో వెలుగుచూసింది. తెగిపడిన నాలుక ముక్కను ఆమె పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి, ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చినపుడు పక్కింటి వ్యక్తి తనపై దూకి, ముద్దుపెట్టుకోవటానికి ప్రయత్నించాడని.. దీంతో అతడి నాలుకను కొరికేశానని ఆమె చెప్పిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణంలోని అన్ని ఆసుపత్రులను అప్రమత్తం చేశామని వెల్లడించారు. ప్రమాదంలో గాయపడటం వల్ల నాలుక తెగిందని అతడు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నాడని, అనంతరం అతడిని అరెస్ట్ చేశామని తెలిపారు. అతడిపై ఐపీసీ 447, 354, 367 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. అతడిపై గతంలోనూ ఇలాంటి అభియోగాలు ఉన్నాయని, కోర్టు అతడిని వారం వరకు జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించిందన్నారు.

## తరగతి గదిలోనే బాలికల దుస్తులు విప్పించి..!

- ఉత్తరాఖండ్‌లో ఓ ఉపాధ్యాయురాలి 'శిక్ష'

**హరిద్వార్:** పరీక్ష సరిగా రాయలేదని.. తరగతి గదిలో అందరి ముందే ఓ ఉపాధ్యాయురాలు ఇద్దరు బాలికలకు దుస్తులు విప్పించి 'శిక్ష' విధించిన ఘటన ఉత్తరాఖండ్‌లో చోటు చేసుకుంది. హరిద్వార్ జిల్లా లాందౌరా గ్రామీణ ప్రాంతంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఇద్దరు దళిత బాలికల పట్ల ఇలా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. బాలికలు ఇంటికి వెళ్లిన అనంతరం తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు స్థానికులతో కలిసి ఆందోళనకు దిగారు. పోలీసు ఠాణా వద్ద నిరసన చేపట్టి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్పీ తెలిపారు. పాఠశాల యాజమాన్యం మాత్రం అవన్నీ నిరాధార ఆరోపణలంటూ ఖండించింది. ఈ వ్యవహారాన్ని జిల్లా విద్యాధికారి బ్రహ్మపాల్ సైనీ తీవ్రంగా పరిగణిస్తూ.. సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఉప విద్యాధికారిని ఆదేశించారు.

# గోప్యత పరిరక్షణ ఓడిపోయే యుద్ధంలాంటిది

- సుప్రీంకోర్టు వ్యాఖ్య

**దిల్లీ:** అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే ప్రస్తుత సాంకేతిక యుగంలో వ్యక్తిగత గోప్యత హక్కును రక్షించుకోవాలన్న ఆలోచన 'ఓడిపోయే యుద్ధం'లాంటిదని పేర్కొంది. వ్యక్తిగత గోప్యతలోని కీలకాంశాలను పరిరక్షించాల్సి ఉందని, వాటిని వదులుకోకూడదని చెప్పారు.

వ్యక్తిగత గోప్యత హక్కు ప్రాథమిక హక్కా కాదా అన్న విషయమై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్. ఖేహర్‌లతో కూడిన తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం బుధవారం విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్య చేసింది. 'వ్యక్తిగత గోపత్యతపై ఓడిపోయే యుద్ధాన్ని చేస్తున్నాం. సమాచారాన్ని ఎందుకు ఉపయోగిస్తారో తెలియదు. ఇదే ఆందోళన కలిగిస్తున్న విషయం' అని పేర్కొంది.

గుజరాత్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదనలు వినిపిస్తూ వ్యక్తిగత గోప్యత హక్కును ఇతర ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగంగా పరిగణిస్తే ఫరవాలేదని, అంతేతప్ప దానికి ప్రాథమిక హక్కు హోదా ఇవ్వకూడదని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ గోప్యత హక్కుకు వివిధ కోణాలు ఉన్నాయని చెబుతూ అమెరికాలోని జార్జియా కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించింది. అశ్లీల చిత్రాలు వ్యాప్తి చేయడం నేరం కింద పరిగణిస్తారని, అదే వాటిని ఇంట్లో చూడడం గోప్యత హక్కు కిందకు వస్తుందని తెలిపింది.



హరియాణ ప్రభుత్వం, ట్రాయ్, స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ తరఫున వాదనలు వినిపించిన అర్ఘ్య సేన్‌గుప్త, గోపాల్ శంకర నారాయణన్ వాదనలు వినిపిస్తూ గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తించకూడదని కోరారు. కొన్ని దేశాల్లో గర్భస్థ శిశువు ఆడా, మగా అని నిర్ధరించడం తప్పు కాదని, దీన్ని వ్యక్తిగత విషయంగా పరిగణించి ప్రభుత్వాలు జోక్యం చేసుకోవని తెలిపారు. ఇక్కడ మాత్రం అలా చేయడం నేరమవుతుందని అన్నారు.

### 27లోగా తీర్పు

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్ ఈ నెల 27న పదవీ విరమణ చేయనుండడంతో ఆలోగానే తీర్పు వస్తుందని భావిస్తున్నారు.

### నోటాపై సుప్రీంకోర్టులో విచారణ నేడు

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల బ్యాలెట్ పత్రాల్లో నోటా (పై అభ్యర్థులెవరూ నచ్చలేదనే అభిమతం తెలిపే) ఐచ్ఛికాన్ని కల్పించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గుజరాత్ కాంగ్రెస్ ఛీఫ్‌విప్ శైలేష్ మనుభాయ్ పర్మార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ అమితవరాయ్, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. దీనిపై గురువారం విచారణ జరిపేందుకు ధర్మాసనం అంగీకరించింది.

# 250% పెరిగిన భూసేకరణ వ్యయం

- పార్లమెంటు స్థాయీ సంఘం నివేదిక

**ఈనాడు–దిల్లీ:** కొత్త భూసేకరణ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారుల కోసం చేపట్టే భూసేకరణ వ్యయం 250% పెరిగినట్లు పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది. 2014-15లో రూ.9,097 కోట్లున్న భూసేకరణ వ్యయం 2015-16 నాటికి రూ.21,993 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. దీనివల్ల పాత చట్టం కింద భూములు ఇచ్చిన వారు కూడా తమకు కొత్త చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలంటూ కోర్టులకు వెళ్లడం వల్ల వివాదాలు అధికమవుతున్నట్లు తెలిపింది. ఈ సమస్యను అధిగమించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సమన్వయంతో పనిచేయాలని సిఫార్సు చేసింది. కొన్ని రాష్ట్రాలు భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసినప్పటికీ బాధితులకు పరిహారం పంపిణీలో జాప్యం చేస్తున్నట్లు తమ పరిశీలనలో తేలినట్లు తెలిపింది. ముఖ్యంగా జిల్లా స్థాయి అధికార యంత్రాంగాలు సరిగ్గా పనిచేయడంలేదని ఆక్షేపించింది. భూసేకరణకు అయ్యే మొత్తంలో పది శాతాన్ని పరిపాలన ఖర్చుల కింద ఎన్‌హెచ్ఏఐ జిల్లాస్థాయి యంత్రాగాలకు ఇస్తున్నా బాధితులకు పరిహారం పంపిణీలో మాత్రం అవి సరిగా వ్యవహరించడంలేదని పేర్కొంది. భూ సేకరణ విభాగాలకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని అధికారాలు ఇచ్చి బలోపేతం చేయాలని సూచించింది. జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వాలను క్రియాశీలక భాగస్వామిగా చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొంది.

**సిమెంట్ రోడ్ల నిర్మాణం మేలు:** జాతీయ రహదారులను కాంక్రీట్ సిమెంట్ పద్ధతిలో నిర్మించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని స్థాయీ సంఘం పేర్కొంది. దీని వల్ల రోడ్లు దీర్ఘకాలం మనుగడలో ఉంటాయని, వాహనాల ఇంధన వినియోగం తగ్గుతుందని తెలిపింది. సిమెంటు రోడ్లు 25-30 ఏళ్ల పనికొస్తాయి కాబట్టి వీటిపై పెట్టే ఖర్చుకు తగ్గ ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడింది.

## ఆరు పార్టీలపై విచారణకు విస్తృత ధర్మాసనం: సీఐసీ

**దిల్లీ:** సమాచార హక్కు చట్టం పరిధిలోకి వస్తాయని గతంలో ఆదేశాలు ఇచ్చినా వాటిని అమలు చేయని ఆరు జాతీయ పార్టీలపై వచ్చిన ఫిర్యాదులను విచారించడానికి ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) ఆర్.కె.మాథుర్ విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయమై గతంలో సమాచార కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్మాసనాన్ని రద్దు చేసి, దీన్ని నియమించారు. నూతన ధర్మాసనంలో ప్రధాన కమిషనర్ మాథుర్‌తో పాటు, కమిషనర్లు శరత్ సభర్వాల్, మంజుల ప్రాషేర్, ప్రకాశ్‌సిన్హాలు సభ్యులుగా ఉన్నారు. ఆగస్టు 16 నుంచి విచారణ ప్రారంభమవుతుంది. కాంగ్రెస్, భాజపా, బీఎస్పీ, ఎన్‌సీపీ, సీపీఐ, సీపీఎంలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తుంది. ఈ పార్టీలు సమాచార హక్కు పరిధిలోకి వస్తాయని 2013 జూన్ 3న తీర్పు ఇచ్చినా, అందుకు తగిన సమాచారం ఇవ్వలేదంటూ పలువురు ఫిర్యాదు చేశారు.

# మహిళల శిరోజాలు కత్తిరిస్తున్న అజ్ఞాత వ్యక్తి ఎవరు!

- రోజు రోజుకు పెరుగుతున్న బాధితులు
- వీడని మిస్టరీ, విచారణ చేపట్టిన పోలీసులు

**దిల్లీ:** దిల్లీ సహా సమీప రాష్ట్రాల పరిధిలో మహిళల విషయంలో ఓ మిస్టరీ కలకలం సృష్టిస్తోంది. ఎవరో అజ్ఞాత వ్యక్తి తమను స్పృహ కోల్పోయేలా చేసి తమ శిరోజాలు ముక్కలు ముక్కలుగా కత్తిరించి వేస్తున్నారని మహిళలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మంగళవారం నాటికి వివిధ ప్రాంతాల్లో కలిపి 15 ఘటనలు నమోదయ్యాయి. తమ శిరోజాలు ఎలా కోల్పోతున్నారో వారికి కూడా అంతుపట్టడం లేదు. వారి దగ్గర ఎలాంటి ఆధారాలూ లేవు. అయితే మథుర జిల్లాలో నమోదైన ఒక కేసులో మాత్రం తను స్పృహ కోల్పోయే ముందు పెద్ద పళ్లు కలిగిన ఒక మహిళను చూశానని ఓ బాధితురాలు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దిల్లీలో ఓ మహిళ తలనొప్పిగా ఉందని విశ్రాంతికి ఉపక్రమించింది. కొంతసేపటికి అక్కడికి వచ్చిన ఆమె కోడలు శిరోజాలు నేలమీద ముక్కలు ముక్కలుగా పడిఉండటంతో ఆందోళనకు గురై పోలీసులకు సమాచారమిచ్చింది. ఈ మేరకు పోలీసులు ఐపీసీ 323, 354 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మథుర జిల్లాలో సైతం ఇలాంటివే నాలుగు సంఘటనలు జరిగాయి. అయితే ఇప్పటి వరకు అలాంటి ఫిర్యాదులేమీ రాలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

గుర్‌గావ్ సమీప ప్రాంతాల్లో ఇప్పటి వరకు పది మంది మహిళలు తీవ్ర భయాందోళనలకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. దీన్ని మరింత పెద్దది చేసి భయభ్రాంతులకు గురికావద్దని, విచారణ చేపడుతున్నామని గుర్‌గావ్ డీసీపీ సుమిత్ కుహర్ ప్రజలను కోరారు. పాఠశాలకు వెళ్లే నేహా అనే బాలిక, విశ్వకర్మ కాలనీలో ఓ గృహిణి, జోనియవాస్ అనే గ్రామంలో కమలేశ్ దేవి, బిమ్లా అనే మహిళ, విద్యాదేవి అనే గృహిణి ఇలా చాలా మంది మహిళలు తమ శిరోజాలు ఎవరో అజ్ఞాత వ్యక్తి ముక్కలుముక్కలుగా కత్తిరించి పడేసినట్లు తెలిపారు. మరోవైపు..ముగ్గురు పురుషులు మహిళా వేషంలో నైరుతి దిల్లీలో ఇంట్లో చొరబడే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

## తక్షణమే బలగాలను ఉపసంహరించుకోండి

- డోక్లాం ప్రతిష్టంభనపై భారత్‌కు స్పష్టంచేశామని చైనా వ్యాఖ్యలు

**బీజింగ్:** తక్షణమే బేషరతుగా డోక్లాం నుంచి బలగాలను ఉపసంహరించుకోవాలని భారత్‌కు తేల్చిచెప్పామంటూ చైనా బుధవారం వ్యాఖ్యానించింది. ప్రస్తుత ప్రతిష్టంభన తొలగాలంటే కచ్చితమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసినట్లు పేర్కొంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా (బ్రిక్స్) దేశాల జాతీయ భద్రతా సలహాదారుల (ఎన్ఎస్ఏల) సమావేశానికి హాజరయ్యేందుకు భారత్ ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్ చైనా వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన గత శుక్రవారం చైనా ప్రతినిధి యాంగ్ జీచితో భేటీఅయ్యారు. వీరి చర్చలకు సంబంధించి చైనా విదేశాంగ శాఖ స్పందించింది. ఇద్దరు నేతలూ బ్రిక్స్ సహకారం, ద్వైపాక్షిక సంబంధాలు సహా పలు కీలక అంశాలపై చర్చలు జరిపినట్లు పేర్కొంది. ఈ విషయంపై 15 పేజీల నిడివితో ఓ వివరణ పత్రాన్ని రూపొందించి విదేశాంగ శాఖ వెబ్‌సైట్‌లో ఉంచింది. డోక్లాంను భూటాన్ ప్రాంతంగా భారత్ గుర్తిస్తోంది. ఇక్కడ చైనా రహదారి నిర్మాణాన్ని భూటాన్ సైతం తీవ్రంగా తప్పుపట్టింది. ఈ ప్రాంతంపై చైనా పట్టు సాధిస్తే ఈశాన్య రాష్ట్రాలను భారత్ ప్రధాన భూభాగంతో కలిపే సిక్కిం సెక్టార్‌ను నియంత్రణలోకి తీసుకునే ముప్పుందని ఆందోళన వ్యక్తంచేస్తోంది.

**బలగాలను తగ్గించలేదు.. భారత్:** డోక్లాంలో భారత సైనికుల సంఖ్యను 400 నుంచి 40కి తగ్గించారన్న చైనా వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. గత ఆరు వారాల్లో అక్కడి పరిస్థితుల్లో ఎలాంటి మార్పులేదని సీనియర్ ప్రభుత్వ అధికారులు స్పష్టంచేశారు.

## 'భారతీయ మహిళా ఉత్సవం' చిహ్నం రూపకల్పనకు పోటీ!

**దిల్లీ:** అక్టోబరులో ఇక్కడ జరగనున్న ప్రతిష్ఠాత్మక "భారతీయ మహిళా ఉత్సవం' కోసం చిహ్నం (లోగో) రూపకల్పనకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధిశాఖ ఒక పోటీని నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో తమ సృజనాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శించుకునేందుకు డిజైనర్లకు ఈ పోటీ ఓ చక్కటి అవకాశం కల్పిస్తోంది. 'లోగో' రూపకల్పన పోటీలో పాల్గొనాలని అభిలషించే వారు వివరాల కోసం కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఫేస్‌బుక్, లేదంటే ట్విటర్ అకౌంట్లను చూడాలి. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 21వ తేదీని గడువుగా నిర్ణయించినట్లు ఇక్కడ విడుదలైన అధికారిక ప్రకటన తెలిపింది. ఇక్కడి 'దిల్లీ హాత్' ప్రాంగణంలో అక్టోబరులో భారతీయ మహిళా ఉత్సవ్ జరుగుతుంది. ఇందులో మహిళలు పండించిన, వారి ఆధ్వర్యంలో తయారైన సేంద్రియ ఉత్పత్తులను భారీ స్థాయిలో ప్రదర్శిస్తారు. కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరగనుంది. మహిళలకు ఆర్థిక సాధికారత సాధన లక్ష్యంలో భాగంగా కేంద్రం ఈ చర్య చేపడుతోంది.

## కొత్తపార్టీ యోచనలో శరద్‌యాదవ్!!

**దిల్లీ/పట్నా:** జేడీ(యు) అగ్రనేత శరద్‌యాదవ్ బుధవారం నాడిక్కడ పార్టీ కార్యకర్తలు కొందరితో సమావేశమైనారు. ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. ఈ సమావేశానికి కొందరు ప్రధాన కార్యదర్శులు కూడా హాజరైనారు. భవిష్యత్ కార్యక్రమంపై త్వరలోనే ఆయన చర్చించవచ్చని అభిజ్ఞవర్గాలు వెల్లడించాయి. ఈ నెల 19న పట్నాలో జరిగే జేడీ(యు)జాతీయ కార్యనిర్వాహక వర్గ సమావేశం సమయంలో ఆయన ఈ అంశాన్ని పరిశీలించవచ్చని పేర్కొన్నాయి. ఈలోగా...అంటే ఆగస్టు 17న ఆయన 'సాజీ విరాసత్'(ఉమ్మడి సంస్కృతి) పేరుతో శరద్‌యాదవ్ ఓ సమావేశాన్ని నిర్వహించనున్నారు. వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆహ్వానించనున్నట్లు ఆ వర్గాలు తెలిపారు.

## గిన్నిస్‌లోకి 130 కిలోల స్ఫటిక విగ్రహం!

**సాగర్(మధ్యప్రదేశ్):** సుమారు 130 కిలోల బరువున్న 32.5 అంగుళాల పొడవు...24 అంగుళాల వెడల్పు ఉన్న స్ఫటిక సిద్ధభగవానుడి (జైన మతస్థుల ఆరాధ్యనీయుడు) విగ్రహం గిన్నిస్ ప్రపంచ రికార్డులకెక్కింది. ప్రపంచంలోనే ఓ ఏకశిలా స్ఫటికం నుంచి చెక్కిన ఏకైక విగ్రహంగా ప్రత్యేకత సాధించింది. ఇక్కడి జిల్లా ప్రధానకేంద్రంలో ఉన్న సిద్ధాయతన్ ఆశ్రమంలో దీనిని చూడవచ్చు. ఏకంగా 51 అంగుళాల పొడవు...2.5 మీటర్ల వ్యాసార్థంతో ఉన్న ఏకశిలా స్ఫటికం నుంచి ఈ విగ్రహాన్ని మలిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో ఈ భారీ స్ఫటికం లభించింది. ఈ ఏకశిలా స్ఫటికం నుంచి 18 నెలల కాలంలో సిద్ధభగవానుడి మూర్తిని మలిచారు.

## రాజధానిలో భద్రతకు ఈశాన్య మహిళా కమాండోలు

**దిల్లీ:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈసారి దేశ రాజధానికి.. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన మహిళా కమాండోలూ భద్రత కల్పించనున్నారు. మహిళా ఉగ్రవాదులు రాజధానిని లక్ష్యంగా చేసుకోవచ్చని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఎర్రకోట, ఇండియాగేట్‌ల వద్ద చేపట్టే భద్రత చర్యల్లో.. దిల్లీ పోలీసు శాఖకు చెందిన ఈ కమాండోలు కూడా పాలుపంచుకోనున్నారు. ఇందుకోసం 41 మంది పూర్తిగా సన్నద్ధమయ్యారు.

## 'హెచ్-1బీ' దుర్వినియోగాన్ని అడ్డుకోండి

**వాషింగ్టన్:** ఔట్‌సోర్సింగ్ సంస్థలు హెచ్-1బీ, ఎల్-1 వీసాలను దుర్వినియోగం చేస్తూ అమెరికన్ల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకొంటున్నాయని అమెరికాలోని పలువురు ప్రభావవంతమైన శాసనకర్తలతో కూడిన బృందం పేర్కొంది. ఈ వీసాల దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని కోరుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు జులై 27న లేఖ రాసింది. లేఖ మంగళవారం విడుదలైంది. బృందంలో రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలకు చెందిన ప్రతినిధుల సభ సభ్యులు, సెనేటర్లు ఉన్నారు.

## కిషన్‌గంగ, రాట్లే ప్రాజెక్టులను నిర్మించుకోవచ్చు

- ప్రపంచ బ్యాంకు స్పష్టీకరణ

**వాషింగ్టన్:** కిషన్‌గంగ, రాట్లే జల విద్యుత్కేంద్రాల నిర్మాణానికి సంబంధించి ప్రపంచబ్యాంకు మనదేశం వైపే నిలిచింది. కొన్ని పరిమితులతో జీలం, చీనాబ్ నదులపై ఈ రెండు ప్రాజెక్టులను భారత్ నిరభ్యంతరంగా నిర్మించుకోవచ్చునని స్పష్టం చేసింది. 1960 నాటి సింధూ జలాల ఒప్పందం(ఐడబ్ల్యూటీ) ఇందుకు అనుమతిస్తుందని తెలిపింది. ఈ మేరకు మంగళవారం వాస్తవపత్రాన్ని విడుదల చేసింది. జమ్ముకశ్మీర్‌లో భారత్ నిర్మించ తలపెట్టిన కిషన్‌గంగ (330 మెగావాట్ల సామర్థ్యం), రాట్లే (850 మెగావాట్ల సామర్థ్యం) జల విద్యుత్కేంద్రాలను పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచబ్యాంకు సాయంతో భారత్, పాక్‌ల మధ్య 1960లో ఐడబ్ల్యూటీ కుదిరిన సంగతి గమనార్హం.

## సమయాన్ని మీరెలా వెచ్చిస్తారు?

- పౌరులతో కేంద్రం దేశవ్యాప్త అధ్యయనం

**ఈనాడు, దిల్లీ:** ప్రజలు సమయాన్ని ఎలా వినియోగిస్తున్నారో తెలుసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒక అధ్యయనం చేపట్టనుంది. పనిదినాలు, వారాంతాలు, సెలవుల్లో సమయాన్ని ఎలా వెచ్చిస్తారు, విధులు, పనులు ముగించుకున్న తర్వాత చేయాలనుకునే ఇష్టమైన పనులేమిటి లాంటి అంశాలపై పౌరులను ప్రశ్నించి వివరాలు సేకరించనుంది. అధ్యయన ప్రక్రియను త్వరలోనే మొదలుపెట్టనుంది. 'జాతీయ సమయ వినియోగ సర్వే' పేరుతో జాతీయ నమూనా సర్వే సంస్థ(ఎన్ఎస్ఎస్ఓ) మూడేళ్లకోసారి దీనిని నిర్వహించనుంది. పౌరులను సర్వే సిబ్బంది నేరుగా కలుసుకొని వివరాలు సేకరిస్తారని, ఇంటర్నెట్, ఫోన్, ట్యాబ్లెట్ సాధనాలతోనూ సమాచార సేకరణ ఉంటుందని 'నీతి ఆయోగ్' అధికారి ఒకరు తెలిపారు. ఈ తరహా సర్వేను బ్రిటన్ 2000-01, 2014-15లలో నిర్వహించింది. అమెరికా 2003 నుంచి క్రమం తప్పకుండా చేపడుతోంది.

## గూగుల్ సాథీ... లక్ష గ్రామాలకు చేరి

**న్యూదిల్లీ:** మహిళా సాధికారత సాధించడానికి చేపట్టిన గూగుల్ సాథీ కార్యక్రమం బుధవారంతో దేశవ్యాప్తంగా లక్ష గ్రామాలకు చేరిందని, దీనిని మూడు లక్షల గ్రామాలకు విస్తరించనున్నామని ఆ సంస్థ తెలిపింది. టాటా ట్రస్టులతో కలిసి గూగుల్ జులై 2015లో రాజస్థాన్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రస్తుతం పది రాష్ట్రాల్లో ఇది అమలవుతోంది. డిజిటల్ అక్షరాస్యతలో భాగంగా గ్రామాల్లోని మహిళలు, పిల్లలకు అంతర్జాలం గురించి శిక్షణ ఇవ్వడానికి ప్రతి రోజు 25,000 మంది అంతర్జాల సాథీలు (శిక్షకులు) పనిచేస్తున్నారని ఆ సంస్థ దక్షిణాసియా, భారతదేశ మార్కెటింగ్ సంచాలకురాలు సప్న చద్దా తెలిపారు.

## ఉద్యోగులకు రక్షాబంధన్ తప్పనిసరి

- ఆదేశాలు జారీ చేసిన దమణ్ దీవ్ పాలనా యంత్రాంగం

**దమణ్ దీవ్:** ఉద్యోగుల్లో సోదర, సోదరీ భావం నెలకొల్పేందుకు రాఖీ కట్టడం తప్పనిసరి చేయాలని కేంద్రప్రాంత పాలిత రాష్ట్రమైన దమణ్ దీవ్ పాలనా యంత్రాంగం నిర్ణయించింది. ఆగస్టు 7న కార్యాలయాలు తెరచి ఉంచాలని, మహిళా ఉద్యోగులు తమతోపాటు పనిచేసే పురుష ఉద్యోగులకు తప్పనిసరిగా రాఖీ కట్టి సంబరాలు జరుపుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సెక్రటరి గుర్‌ప్రీత్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. పాలనా యంత్రాంగం తీసుకున్న ఈ నిర్ణయంపై చాలా మంది ఉద్యోగులు మండిపడుతున్నారు. మేము ఎవరికి రాఖీ కట్టాలనేది ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తుంది అని ప్రశ్నించారు.



# మిథాలీ ఖేల్‌రత్నం కాదా!

మొన్నటి మహిళల వన్డే ప్రపంచకప్‌ను కోట్లాది మంది ఆసక్తిగా చూశారు. మన అమ్మాయిల జట్టుకు దేశమంతా మద్దతుగా నిలిచింది. ఫైనల్లో ఓడినా.. మిథాలీ సేనపై ప్రశంసల జల్లు కురిపించింది. ఈ టోర్నీలో భారత జట్టు ప్రదర్శన చూశాక.. వారికి దక్కిన ఆదరణను గమనించాక ఎంతోమంది అమ్మాయిలు క్రికెట్ వైపు అడుగులేస్తారనడంలో సందేహం లేదు!

ఐతే ఒకప్పుడు అమ్మాయిల మ్యాచ్‌లకు ప్రత్యక్ష ప్రసారమే లేదు. వారిని పట్టించుకునే నాథుడు లేడు. మహిళల క్రికెట్ బీసీసీఐ గొడుకు కిందే లేదు. క్రికెట్ ఆడే అమ్మాయిలకు ఆర్థిక ప్రయోజనం అంతంతమాత్రమే! అలాంటి స్థితిలో క్రికెట్లోకి అడుగుపెట్టి.. ఎన్నో అడ్డంకుల్ని దాటి.. లాభనష్టాల గురించి ఆలోచించకుండా.. ఆటనే జీవితంగా మార్చుకుని సాగిపోయిన అమ్మాయి మిథాలీ రాజ్. ఆట కోసం ఆమె చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు. అమ్మాయిల క్రికెట్ ఈ రోజు ఇంత ఆదరణకు నోచుకుంటోందన్నా.. భారత జట్టును ఎందరో అమ్మాయిలు స్ఫూర్తిగా తీసుకుంటున్నారన్నా అందుకు మిథాలీ కూడా ఓ ముఖ్య కారణం! ఇటీవల ప్రపంచకప్‌లో భారత్ రన్నరప్‌గా నిలవడంలోనూ కెప్టెన్‌గా, బ్యాటర్‌గా మిథాలీ పాత్ర ఎంతో కీలకం!

ఐతే ఇంత గొప్ప క్రీడాకారిణికి ఇప్పటిదాకా రాజీవ్ ఖేల్‌రత్న పురస్కారం దక్కకపోవడం ఆశ్చర్యమే. మొన్నటి ప్రపంచకప్ ప్రదర్శనతో సంబంధం లేకుండా మిథాలీకి ఖేల్‌రత్న దక్కాల్సింది. కానీ దక్కలేదు. ఆమె పేరును బీసీసీఐ.. ఖేల్‌రత్న పురస్కారానికి ప్రతిపాదించనే లేదు. ఈ ఏడాది ఖేల్‌రత్నకు పేర్లను ప్రతిపాదించేందుకు ఏప్రిల్ 30 చివరి తేదీ. కానీ అప్పటికి బీసీసీఐ ఆమె పేరును సిఫారసు చేయలేదు. ఐతే కొందరు క్రీడాకారులు గొప్ప ప్రదర్శన చేసినపుడు గడువు తర్వాత కూడా వారి పేర్లను ఖేల్‌రత్నకు ప్రతిపాదించిన సందర్భాలున్నాయి. గత ఏడాది పి.వి.సింధు, సాక్షి మలిక్, దీపా కర్మాకర్, జీతు రాయ్‌ల పేర్లను ఒలింపిక్స్ ప్రదర్శన ఆధారంగా గడువు తర్వాతే ఖేల్‌రత్నకు ప్రతిపాదించారు. ఇటీవలి మహిళల ప్రపంచకప్‌లో మిథాలీ ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఆమె పేరును ఆలస్యంగా అయినా ఖేల్‌రత్నకు పంపాల్సిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ భారత బోర్డులో ఎవరూ చొరవ తీసుకుని ఆ పని చేయలేదు. మరి వచ్చే ఏడాదైనా ఆమె పేరును ఖేల్‌రత్నకు సిఫారసు చేస్తారేమో.. మిథాలీని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం వరిస్తుందేమో చూడాలి.

# డీఎస్పీగా హర్మన్‌ప్రీత్



**చండీగఢ్:** క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ త్వరలోనే ఖాకీ దుస్తులు ధరించనుంది. రాష్ట్ర పోలీస్ విభాగంలో ఆమెను డీఎస్పీగా నియమించాలని పంజాబ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నియామక ప్రక్రియను ఆరంభించింది. కౌర్ బుధవారం పంజాబ్ ముఖ్యమంత్రి అమరిందర్ సింగ్‌ను కలుసుకుంది. పోలీసుగా పని చేయాలన్నది తన చిన్ననాటి కల నిజమైందని హర్మన్‌ప్రీత్ వ్యాఖ్యానించింది. ఆమెను ఉద్యోగంలోకి చేర్చుకున్నాక పోలీస్ శాఖలో మహిళల జట్టును ఏర్పాటు చేస్తామని పంజాబ్ డీజీపీ సురేశ్ అరోరా చెప్పారు. హర్మన్‌ప్రీత్ కళ్లుచెదిరే బ్యాటింగ్‌తో మహిళల ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆమె ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో 115 బంతుల్లోనే 171 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

# ఛాంపియన్

## గంభీర్.. ఒక ఆశ!



**దిల్లీ:** భారత సీనియర్ బ్యాట్స్‌మన్ గౌతమ్ గంభీర్ మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నాడు. కొన్ని నెలల కిందట తీవ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల కుటుంబాల్ని ఆదుకునేందుకు వారి పిల్లల చదువు బాధ్యతలు తీసుకుని ప్రశంసలందుకున్న గంభీర్.. ఇప్పుడు దిల్లీలో పేదల ఆకలి తీర్చేందుకు ఉచిత భోజనశాలను ఏర్పాటు చేశాడు. 'గౌతమ్ గంభీర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 'ఏక్ ఆశ' (ఒక ఆశ) పేరుతో ఈ భోజనశాల ఏర్పాటైంది. ఇది సంవత్సరమంతటా తెరిచే ఉంటుంది. ఆకలితో ఉన్న ఎవ్వరైనా ఇక్కడ భోజనం చేయొచ్చు. "ప్రపంచకప్‌లు గెలిచాం, ఐపీఎల్‌లు గెలిచాం. ప్రత్యర్థుల్ని ఓడించాం. ఇప్పుడు జనాల హృదయాల్ని గెలవాలి. ఆకలిని జయించాలి" అంటూ ట్విట్టర్లో వ్యాఖ్యానించి ఈ భోజనశాల గురించి తెలియజేశాడు. గంభీర్ ఈ సేవా కార్యక్రమం చేపట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. దీనికి తాను ఎలా సాయపడాలో చెప్పమంటూ షారుఖ్ ఖాన్ ట్వీట్ చేశాడు.

## ప్రిక్వార్టర్స్‌లో కశ్యప్, సౌరభ్, సిరిల్




**ఆక్లాండ్:** న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు సత్తా చాటారు. హైదరాబాదీ ఆటగాళ్లు పారుపల్లి కశ్యప్, సౌరభ్ వర్మ, సిరిల్ వర్మలతో పాటు. . ఇటీవలే యుఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన హెచ్.ఎస్.ప్రణయ్ పురుషుల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్ చేరారు. బుధవారం రెండో రౌండ్లో కశ్యప్ 21-9, 21-8తో ఆస్కార్ గువో (న్యూజిలాండ్)ను అలవోకగా ఓడించగా.. సౌరభ్ 21-16, 21-16తో హెన్రికో విబోవో (ఇండొనేసియా)పై విజయం సాధించాడు. సిరిల్ 21-14, 21-16తో సపుత్ర విక్కీ (ఇండొనేసియా)పై, ప్రణయ్ 23-21, 21-8తో ఫిర్మన్ అబ్దుల్ ఖోలిక్ (ఇండొనేసియా)పై నెగ్గారు. సాహిల్ సిపాని, నీరజ్ వశిష్ఠ్, ప్రతుల్ జోషి టోర్నీ నుంచి నిష్క్రమించారు. సాహిల్ 9-21, 8-21తో లిన్ యు (చైనీస్ తైపీ), నీరజ్ 16-21, 13-21తో ఆంటోనీ జో (ఆస్ట్రేలియా), ప్రతుల్ 13-21, 22-24తో వీ వాంగ్ (తైవాన్)ల చేతుల్లో ఓడారు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్లో సాహిల్-జగదీశ్ యాదవ్ 12-21, 16-21తో అజ్రిన్ అయూబ్-జి హెంగ్ (మలేసియా) ద్వయం చేతిలో పరాజయం పాలయ్యారు. ప్రజక్త సావంత్ మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ రెండింట్లోనూ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

## హరికృష్ణ చేజారిన టైటిల్



**దిల్లీ:** బీల్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లో భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణకు నిరాశ ఎదురైంది. చివరిదైన తొమ్మిదో రౌండ్లో ఓటమితో అతడు టైటిల్‌ను చేజార్చుకున్నాడు. ఎనిమిదో రౌండ్ ముగిసేసరికి 5.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంతో ఉన్న హరికృష్ణ.. ఆఖరి రౌండ్లో ఫ్రాన్స్‌కు చెందిన బార్కోట్ ఎతీనె (6) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆఖరి రౌండ్లో నెగ్గిన హు ఇఫాన్ (చైనా) 6.5 పాయింట్లతో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. హరికృష్ణ మూడో స్థానంతో సంతృప్తి చెందాడు.

## జోష్న, దీపిక జోరు



**మాంచెస్టర్:** డబ్ల్యూఎస్ఎఫ్ ప్రపంచ డబుల్స్ స్క్వాష్ టోర్నీలో దీపికా పల్లికల్-జోష్న చిన్నప్ప జోడీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం గ్రూప్ దశ చివరి లీగ్ మ్యాచ్‌లో రెండో సీడ్ భారత జోడీ.. 11-8, 11-7 టెన్నీ ఇవాన్స్-డియాన్ (వేల్స్) జంటపై విజయం సాధించింది. ఈ గెలుపుతో గ్రూప్-బిలో అగ్రస్థానానికి ఎగబాకిన దీపిక-జోష్న జోడీ గురువారం క్వార్టర్ ఫైనల్స్‌లో గ్రూప్-ఎలో రెండో స్థానంలో నిలిచిన సమంత కార్నెట్-నికోలే(కెనడా) జంటతో తలపడనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండో సీడ్ సౌరభ్ ఘోషల్-దీపిక ద్వయం తొలి లీగ్ మ్యాచ్‌లో 11-7, 11-4తో మహ్మద్ షఫిక్, రాచెల్ ఆర్నాల్డ్ (మలేసియా)లపై నెగ్గింది. ఆరో సీడ్ విక్రమ్ మల్హోత్రా-జోష్న జంట మిల్లర్- అమందా (న్యూజిలాండ్)లపై విజయం సాధించింది.

## పుజారా అర్ధసెంచరీ!

అత్యంత ఆధారపడ్డ ఆటగాడిగా తనకంటూ ఓ పేరు తెచ్చుకున్న పుజారా కెరీర్‌లో ఈ మ్యాచ్ ఓ మైలురాయిలా నిలిచిపోనుంది. ఎందుకంటే అతడికిది 50వ టెస్ట్ మ్యాచ్. ప్రస్తుత మ్యాచ్ వేదిక ఎస్.ఎస్.సి సహా శ్రీలంకలో ఆడిన మరో మైదానంలోనూ(గాలే) అతడు సెంచరీలు సాధించాడు. 2015లో ఎస్.ఎస్.సిలో అతడు 145 పరుగులతో అజేయంగా నిలిచాడు. పుజారా కెరీర్‌లో ఇప్పటివరకు 49 టెస్టుల్లో 51.18 సగటుతో 3966 పరుగులు చేశాడు.



# ఈ జోరుకు అడ్డుందా?

**ఉదయం 10 గంటల నుంచి సోనీ సిక్స్, టెన్-3ల్లో**

## ఉత్సాహంతో భారత్ ● శ్రీలంకతో రెండో టెస్టు నేటి నుంచే

**తిరుగులేని బ్యాటింగ్.. పదునైన బౌలింగ్.. వరుస విజయాలు.. రెట్టించిన విశ్వాసంతో టీమ్ఇండియా! బ్యాటింగ్, బౌలింగుల్లో పేలవ ఫామ్.. వెంటాడుతున్న గాయాలు.. వరుస పరాభవాలు.. దెబ్బతిన్న స్థైర్యంతో శ్రీలంక. సన్నద్ధతలో పూర్తి భిన్నంగా ఉన్న రెండు జట్ల మధ్య మరో సమరానికి వేళైంది. నేటి నుంచే రెండో టెస్టు. జోరుమీదున్న కోహ్లీసేనను సమస్యలతో సతమతమవుతున్న శ్రీలంక ఎంత మేర అడ్డుకోగలదన్నది ఆసక్తికరం! మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ నెగ్గాలనే పట్టుదలతో భారత్ ఉంది.**

కొలంబో

సిరీస్‌పై కన్నేసిన టీమ్ఇండియా గురువారం ఆరంభమయ్యే రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంకను ఢీకొంటుంది. అన్ని రంగాల్లోనూ సూపర్ ఫామ్‌లో ఉన్న కోహ్లీసేనను అదుపు చేయడం లంకకు కష్టమైన పనే. గాలెలో జరిగిన తొలి టెస్టులో భారత్ 304 పరుగుల తేడాతో లంకపై ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే.

**రాహుల్ వస్తున్నాడు..:** శ్రీలంక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే భారత్ మాత్రం దాదాపు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మ్యాచ్‌కు సిద్ధమైంది. గాలె టెస్టులో భారత టాప్-5 బ్యాట్స్‌మెన్‌లో ప్రతి ఒక్కరూ ఒక్క అర్ధశతకమైనా సాధించారు. బౌలర్లందరూ వికెట్లు పడగొట్టారు. ఐతే మ్యాచ్‌కు ముందు భారత్‌కు సెలక్షన్ తలనొప్పి పట్టుకుంది. ఐతే ఇది ఇష్టమైన బాధే. జ్వరం నుంచి కోలుకున్న రెగ్యులర్ ఓపెనర్ కేఎల్ రాహుల్ జట్టులోకి రానున్నాడు. తొలి టెస్టులో రాణించినప్పటికీ అభినవ్ ముకుంద్.. రాహుల్‌కు దారివ్వక తప్పదు. "రాహుల్ నిలదొక్కుకున్న ఓపెనర్. ఇద్దరిలో (ధావన్ లేదా ముకుంద్) ఒకరు అతడికి దారివ్వక తప్పదు. రెండేళ్లుగా రాహుల్ అద్భుతంగా రాణిస్తున్నాడు. పునరాగమనానికి అతడు అర్హుడు" అని కెప్టెన్ కోహ్లి తన ఉద్దేశాన్ని స్పష్టంగా చెప్పాడు. కోహ్లి.. ముకుంద్‌ను తప్పిస్తామని చెప్పనప్పటికీ 168 బంతుల్లో 190 పరుగులు చేసిన ధావన్‌ను విస్మరించడం కష్టం. రాహుల్ రాక భారత లైనప్‌ను బలోపేతం చేసేదే.. అతడు మంచి ఫామ్‌లో ఉన్నాడు. చివరి ఏడు టెస్టు ఇన్నింగ్స్‌ల్లో ఆరు అర్ధశతకాలు సాధించాడు. శిఖర్ ధావన్ కూడా సూపర్ ఫామ్‌లో ఉన్న నేపథ్యంలో భారత్ బలమైన ఆరంభాన్ని ఆశిస్తోంది. ఆ తర్వాత పుజారా, కోహ్లి, రహానెలతో లైనప్ దుర్భేద్యంగా కనిపిస్తోంది. పిచ్ స్పిన్‌కు బాగా సహకరిస్తుందని భావిస్తే భారత్.. ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశముంది. అప్పుడు అరంగేట్రంలో ఆకట్టుకున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పెవిలియన్‌కే పరిమితం కావాల్సివుంటుంది. ఇది మినహా జట్టులో ఎలాంటి మార్పులు ఉండే అవకాశం లేదు. మరోవైపు అనారోగ్యం నుంచి కోలుకున్న కెప్టెన్ చండిమాల్ జట్టులోకి రానుండడం శ్రీలంకకు సంతోషాన్నిచ్చేదే. గాలెలో గాయపడ్డ ఎడమచేతి వాటం స్పిన్నర్ రంగన హెరాత్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం కూడా ఆ జట్టుకు ఊరటనిచ్చే విషయమే. ఐతే ఫామ్‌లో ఉన్న గుణరత్నె మొత్తం సిరీస్‌కే దూరం కావడం లంకకు దెబ్బే. అతడి స్థానంలో ధనంజయ డిసిల్వ జట్టులోకి వచ్చే అవకాశముంది. లంక ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఐతే చాలా బలంగా పుంజుకుంటే తప్ప భారత్‌ను కట్టడి చేయడం లంకకు కష్టమే.


**పిచ్.. వాతావరణం:** ఇక్కడి పిచ్ గాలె పిచ్ కన్నా పొడిగా కనిపిస్తోంది. మూడో రోజు ఆఖరి నుంచి పిచ్ స్పిన్నర్లకు సహకరించే అవకాశముంది. ఇక్కడ జరిగిన గత టెస్టులో ఐదు శతకాలు నమోదయ్యాయి. టెస్టు సాంతం అప్పుడప్పుడు జల్లులు కురిసే అవకాశముంది. ఐతే ఆటకు పెద్దగా అంతరాయం ఏర్పడకపోవచ్చు.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రాహుల్, ధావన్, పుజారా, కోహ్లి, రహానె, అశ్విన్, సాహా, జడేజా, కుల్‌దీప్ యాదవ్, ఉమేశ్ యాదవ్, షమి

**శ్రీలంక:** తరంగ, కరుణరత్నె, కుశాల్ మెండిస్, చండిమాల్, మాథ్యూస్, డిక్వెలా, ధనంజయ డిసిల్వ, దిల్రువన్ పెరీరా, హెరాత్, పుష్పకుమార, ప్రదీప్



హరియాణా రైడర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న గుజరాత్ ఆటగాళ్లు

# హరియాణా 23 గుజరాత్ 23

## మళ్లీ ఓడిన టైటాన్స్ ● ప్రొ కబడ్డీ లీగ్

**ఈనాడు, హైదరాబాద్:** ప్రొ కబడ్డీ లీగ్‌లో బుధవారం హరియాణా స్టీలర్స్, గుజరాత్ ఫార్చూన్‌జెయింట్స్ మధ్య మ్యాచ్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. రసవత్తరంగా సాగిన పోరు చివరికి 27-27తో టైగా ముగిసింది. హరియాణా చివరి ఐదు నిమిషాల్లో 13 పాయింట్లు సాధించినా గుజరాత్‌ను దాటలేకపోయింది. హరియాణా జట్టులో వికాస్ ఖండోలా ఏడు పాయింట్లు, సుర్జీత్ సింగ్ ఆరు పాయింట్లు సాధించారు. సురేందర్ నడా ఏడు రైడ్ పాయింట్లు తెచ్చాడు. గుజరాత్ తరఫున మహేందర్ కుమార్ ఐదు పాయింట్లు స్కోర్ చేశాడు.

మ్యాచ్‌లో ఆరంభంలో గుజరాత్‌దే దూకుడు. ఆరో నిమిషంలో తొలి పాయింటు హరియాణా 1-4తో వెనుకంజలో నిలిచింది. రైడర్లు రాణించడంతో క్రమంగా 4-5కు చేరుకుంది. గుజరాత్ రైడర్లపై తమ రక్షణశ్రేణి ఒత్తిడి తేవడంతో 13వ నిమిషంలో హరియాణా 8-8తో స్కోరు సమం చేసింది. రెండు నిమిషాల్లో మూడు పాయింట్లు సంపాదించిన గుజరాత్ తొలి అర్ధభాగం ముగిసేసరికి 11-8తో ఆధిక్యంలో నిలిచింది. 27 నిమిషాలు ముగిసేసరికి 15-13తో ఉంది. తర్వాతి నిమిషంలో హరియాణాను ఆలౌట్ చేసిన ఆ జట్టు ఆధిక్యాన్ని 20-13కు పెంచుకుంది. ఆ తర్వాత 22-15తో గుజరాత్ అలవోకగా గెలిచేలా కనిపించింది. కానీ 40 సెకన్ల లోపు మూడు పాయింట్లు సాధించి, హరియాణా అంతరాన్ని 17-22కి తగ్గించింది. 34వ నిమిషంలో వికాస్ ఖండోలా కళ్లు చెదిరే సూపర్ రైడ్‌తో 20-22కు చేరుకుంది. తర్వాతి నిమిషంలో గుజరాత్‌ను ఆలౌట్ చేసిన హరియాణా.. 23-23తో స్కోరు సమం చేసింది. అక్కడి నుంచి మ్యాచ్ మరింత హోరాహోరీగా సాగి చివరికి టైగా ముగిసింది. మరో 24 సెకన్లలో మ్యాచ్ ముగుస్తుందనగా వికాస్ పాయింటుతో హరియాణా 27-26తో ఆధిక్యంలో నిలవగా.. వెంటనే పాయింటు సాధించి గుజరాత్ స్కోరు సమం చేసింది.



అభిమానుల ఆనందం

### టైటాన్స్‌కు నాలుగో ఓటమి

లీగ్‌లో తెలుగు టైటాన్స్ వరుసగా నాలుగో ఓటమి చవిచూసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 24-30తో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడిపోయింది. మణిందర్ సింగ్ (11 పాయింట్లు), జంగ్ కున్ లీ (8 పాయింట్లు) బెంగాల్ విజయంలో కీలక పాత్ర పోషించారు. తెలుగు జట్టులో అత్యధికంగా వికాస్ ఎనిమిది పాయింట్లు సాధించాడు. రాహుల్ చౌదరి, నీలేష్ చెరో ఐదు పాయింట్లు రాబట్టారు.

**ప్రొ కబడ్డీలో ఈనాడు** | తెలుగు టైటాన్స్ × పట్నా పైరేట్స్ | రాత్రి 8 నుంచి
వేదిక: హైదరాబాద్; ప్రసారం: స్టార్ స్పోర్ట్స్-2లో

# అతడు అవకాశం వదలడు

సౌరభ్ గంగూలీ



శ్రీలంకతో తొలి టెస్టులో భారత్ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొదట బ్యాటింగ్ చేసిన జట్టు 600 పరుగులు చేసిందంటే ఆ జట్టు మ్యాచ్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించడం ఖాయం. భారత్ అదే చేసింది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన శిఖర్ ధావన్‌ను అభినందించాలి. ఇక్కడ ముఖ్యం అతడు చేసిన పరుగులు కాదు.. అవి ఏ పరిస్థితుల్లో చేశాడన్నది. తొలి ప్రాధాన్యంగా ఎంపిక కాని ఆటగాడు అలా కళ్లు చెదిరే ఇన్నింగ్స్ ఆడడం అతడు మానసికంగా ఎంత దృఢంగా ఉన్నాడో చెబుతుంది. ధావన్ అంత బాగా ఆడడానికి ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రదర్శన కూడా ఓ కారణమే. ధావన్ తాజా ప్రదర్శనతో ఓపెనింగ్ స్థానానికి పోటీ ఎక్కువైంది. మురళీ విజయ్, కేఎల్ రాహుల్‌లను విస్మరించడం అంత తేలిక కాదు. కఠిన పరిస్థితుల్లో వాళ్లు ఎన్నో పరుగులు చేశారు. చెతేశ్వర్ పుజారా గురించి కూడా ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించాలి. అతడు అన్ని ఫార్మాట్లలో ఆడడు. కానీ టెస్టుల్లో అంది వచ్చిన అవకాశాల్ని మాత్రం ఎప్పుడూ వదలడు. ఇక భారత్ అన్ని రకాల పరిస్థితుల్లో ఐదుగురు బౌలర్లతో ఆడాలి. సిరీస్‌లో భారత్‌ను అడ్డుకోవాలంటే లంక బలంగా పుంజుకోవాలి.

# తెదేపాను వీడిన ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి

- జగన్‌ను కలిసేందుకు సోదరుడితో కలిసి హైదరాబాద్ పయనం
- నేడు నంద్యాల బహిరంగ సభలో వైకాపాలో చేరిక

కర్నూలు

రెండు రోజులుగా వస్తున్న ఊహాగానాలను నిజం చేస్తూ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి తెదేపాను వీడారు. పార్టీకి రాజీనామా చేసినట్లు బుధవారం ఆయన ప్రకటించారు. సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డితో కలిసి జగన్‌ను కలిసేందుకు సాయంత్రం ఆయన హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. గురువారం నంద్యాలలో జరిగే జగన్ బహిరంగ సభలో శ్రీశైలానికి చెందిన కార్యకర్తలు, నాయకులతో కలిసి వైకాపా తీర్థం పుచ్చుకోనున్నారు. వైకాపా నుంచి 2012లో శిల్పా చక్రపాణిరెడ్డి తెదేపాలో చేరారు. 2014లో శ్రీశైల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడారు. రెండేళ్లపాటు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. మారిన రాజకీయ పరిణామాలతో ఆయన తిరిగి వైకాపా గూటికి చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి ముఖ్యమంత్రికి తన రాజీనామా పత్రాన్ని ఫ్యాక్స్ ద్వారా పంపానని చక్రపాణిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నంద్యాలలోని శిల్పా మోహన్‌రెడ్డి నివాసం వద్ద వైకాపా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం నంద్యాల వచ్చినప్పుడు తనను పూర్తిగా పక్కన పెట్టారన్నారు. జిల్లా నాయకులు అడుగడుగునా అవమానించారని, అవి భరించలేకే పార్టీ మారానన్నారు. పెళ్లాంలా పార్టీని అంటిపెట్టుకున్న వాళ్లు దెయ్యాల్లా.. నిన్నకాక మొన్న వచ్చినవాళ్లు దైవంలా కనిపిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నారా? అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. డబ్బుకు అమ్ముడుబోయిన ఎమ్మెల్యేలు కూడా తమ మీద విమర్శలు చేస్తున్నారన్నారు. "నా రాజీనామా లేఖను జేబులోనే పెట్టుకుని తిరుగుతున్నా.. దమ్ముంటే 22 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి" అని సవాలు విసిరారు. 11 మంది ఎమ్మెల్యేలు, 150 ఓట్లు ఆధిక్యం ఉన్న వైకాపాను అధిగమించి 147 ఓట్లతో అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచానన్నారు. రెండోసారి తెదేపా కొనుక్కున్న ఎమ్మెల్యేలు సహకరించకపోయినా వ్యక్తిగత అభిమానం, అనుభవంతో గెలిచానని తెలిపారు. శిల్పా సోదరులు ఎక్కడ ఉంటే అక్కడ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. నంద్యాల ఉప ఎన్నిక గెలిచి జగన్‌కు బహుమతిగా ఇస్తామని తెలిపారు. రాజకీయం శాశ్వతం కాదని, అన్నదమ్ముల అనుబంధం శాశ్వతమన్నారు. మా అన్నను విమర్శిస్తున్న ఫరూక్ 15 ఏళ్లు అధికారంలో ఉండి ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు రూ.వందకు జనాల్ని అద్దెకు తీసుకొచ్చి దుష్ప్రచారాలు చేయడమే ఫరూక్‌కు తెలుసన్నారు. ఎవరెవరికి ఎన్ని సంచులు ఎక్కడికి వెళ్లాయో తనకు తెలుసని, గుట్టు విప్పుతానని చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బొత్స సత్యన్నారాయణ, శిల్పా మోహన్ రెడ్డి, గౌరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణిరెడ్డి, చిత్రంలో వైకాపా అభ్యర్థి మోహన్‌రెడ్డి తదితరులు

## తెదేపా అభ్యర్థి నామినేషన్ దాఖలు

నంద్యాల, న్యూస్‌టుడే: నంద్యాల ఉప ఎన్నికల నామినేషన్లలో భాగంగా నాలుగో రోజైన బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. నంద్యాల ఆర్డీవో కార్యాలయంలో తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తరఫున మూడు నామినేషన్లు వేశారు. తెదేపా నాయకుడు డా.నౌమన్ ఒకటి, పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఒకటి, భూమా నాగిరెడ్డి కుమార్తె మౌనికారెడ్డి మరొకటి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు కాలవ శ్రీనివాసులు, అఖిలప్రియ, మాజీ మంత్రి ఫరూక్, ఎంపీ ఎస్పీవై రెడ్డి అల్లుడు శ్రీధర్‌రెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి



కాపు సంఘాల నాయకులు, తదితరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం

# పాదయాత్రకు తరలిరండి: ముద్రగడ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి నుంచి గురువారం ఉదయం 9 గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ప్రకటించారు. కాపు సంఘాల నాయకులు పాదయాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన నాయకులు కిర్లంపూడిలో ముద్రగడ నివాసానికి వచ్చి ఆయనతో మంతనాలు సాగించారు. అలాగే కాపు సంఘాల నాయకులు, యువకులు వచ్చి ముద్రగడకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారితో ముద్రగడ మాట్లాడుతూ... మనం చేపట్టింది నిరవధిక పాదయాత్ర అని, ఎన్నిరోజులు ప్రభుత్వం ఆటంకం కలిగించినా తిరిగి ఆ మరుసటి రోజే పాదయాత్ర ప్రారంభించే సౌలభ్యం ఉందని అన్నారు. ఎన్ని అవాంతరాలు కలిగించినా చివరికి కాపులకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చి తీరాల్సిందేనన్నారు.

## మూడు నెలలు ఆగలేరా

- ముద్రగడపై మంత్రి నారాయణ ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా నేత జగన్ ఆడించినట్లు ఆడొద్దని కాపునేత ముద్రగడ పద్మనాభానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ హితవు పలికారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రితో కలిసి ప్రయాణించొద్దని కోరుతూ జనసేన నేత పవన్ కల్యాణ్‌కు ముద్రగడ లేఖ రాయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇలా రాయడం దారుణమన్నారు. ఉద్దానంలో మూత్రపిండ వ్యాధి బాధితుల సమస్యను పవన్ కల్యాణ్ సీఎం దృష్టికి తీసుకొచ్చారని, దాని పరిష్కారానికి ప్రభుత్వం కూడా అంతే స్థాయిలో స్పందించిందని తెలిపారు. మీ లేఖ ఉద్దేశం 'ఉద్దానం బాధితులు అలాగే మరణించాలనా' అంటూ ముద్రగడపై ధ్వజమెత్తారు. 35ఏళ్లుగా రిజర్వేషన్ల కోసం వేచి ఉన్న ముద్రగడ మరో మూడు నెలలు ఆగలేరా అని ప్రశ్నించారు.

## బీసీలకు నష్టం లేకుండా రిజర్వేషన్లు

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

విజయవాడ, న్యూస్‌టుడే: బీసీలకు నష్టం లేకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. బీసీ కార్పొరేషను ఛైర్మన్ రంగనాయకులు, కాపు కార్పొరేషను ఛైర్మన్ రామానుజయతో కలిసి విజయవాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. కొందరు నాయకులు తమ స్వప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబును కాపుల వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనించాలని కోరారు. మంజునాథన్ కమిషన్ నివేదిక సమర్పించిన తరువాత కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చి బీసీలకు అభ్యంతరం లేకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు.

## 'ఓబీసీ బిల్లుతో రాష్ట్రాల అధికారాలకు కోతపడదు'

ఈనాడు, దిల్లీ: ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడానికి ఉద్దేశించిన బిల్లు పాసయితే దేశవ్యాప్తంగా ఉన్న బలహీనవర్గాల హక్కులకు మరింత రక్షణ కలుగుతుందని తెదేపా ఎంపీ, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈ బిల్లు చట్టరూపం సంతరించుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వ అధికారాలకు కత్తెరపడే అవకాశం లేదని బుధవారమిక్కడ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఓబీసీ జాబితాలో కొత్త వర్గాలను జతచేసే, తీసేసే అధికారం పూర్తిగా రాష్ట్రాలకే ఉంటుందన్నారు. బీసీల హక్కులకు రాజ్యాంగబద్ధమైన భద్రత కల్పించే ఈ బిల్లును రాజ్యసభలో కాంగ్రెస్ అడ్డుకోవడం అన్యాయం అన్నారు.

## వృద్ధాశ్రమం మూసివేత ఉత్తర్వులు రద్దు

- 'విశ్వ మానవ వేదిక'కు అనుకూలంగా హైకోర్టు తీర్పు

ఈనాడు, హైదరాబాద్: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో విశ్వమానవ వేదిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి గుర్తింపు నిరాకరిస్తూ, ఆ ఆశ్రమ మూసివేతకు గతనెల 19న అధికారులు జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ, ఆక్వాఫుడ్ పార్క్ ఏర్పాటును ప్రజల పక్షాన వ్యతిరేకిస్తున్నందుకు విశ్వమానవ వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం మూసివేతకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారని ఆ వేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ హైకోర్టును ఆశ్రయించారు. స్థానిక నాయకులు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా వృద్ధాశ్రమ మూసివేతకు అధికారులు ఉత్తర్వులు జారీచేశారన్నారు. తనపై కక్షసాధింపులో భాగంగా ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఆ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి అధికారులు జారీచేసిన ఉత్తర్వులను సస్పెండ్ చేశారు. ప్రతివాదులకు ప్రమాణపత్రం దాఖలు చేయాలని ఆదేశించారు.

## నాగార్జున వర్సిటీ నుంచి జీఎస్టీ ఆన్‌లైన్ కోర్సు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాసీవ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు (మూక్స్) విధానంలో జీఎస్టీ (వస్తు సేవల పన్ను) పరిజ్ఞానంపై కోర్సును ప్రారంభించింది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఉపకులపతి ఆచార్య రాజేంద్రప్రసాద్‌లు కోర్సును బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరంగా ఇది ప్రప్రథమం అని తెలిపారు. బీకాం, ఎంకాం, ఎంబీఏ, టాక్స్ ప్రాక్టీషనర్స్, వ్యాపారులకు ఈ కోర్సు ప్రయోజనకరంగా ఉంటుందని వర్సిటీలోని అంతర్జాతీయ విద్యార్థి విభాగం సంచాలకులు జీవీఎస్ ఆర్ ఆంజనేయులు చెప్పారు. ప్రముఖ టాక్స్ కన్సల్టెంట్ మనీష్ భల్లా జీఎస్టీపై పాఠాలు బోధిస్తారన్నారు. ఈ కోర్సును ఐదు భాగాలుగా విభజించినట్లు చెప్పారు. 120 గంటల నిడివి ఉన్న పాఠాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇంటి నుంచే కోర్సును పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. అయిదు విభాగాలు పూర్తి చేసిన వారికి ఆన్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహించి, కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ కూడా ఇస్తామన్నారు. ఇందుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్కూల్ గురు ఎడ్యుసర్వ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఏఎన్‌యూకు ఈ అవకాశం దక్కిందన్నారు.

# ఆ ఆలోచన ప్రభుత్వానికి లేదు

- ఉద్యోగుల తొలగింపు వదంతులు ఎవరూ నమ్మొద్దు
- కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

ఈనాడు – అమరావతి



ఇసుక అక్రమ రవాణాని అరికట్టాలని తాము నిర్వహించిన సర్వేలో 70శాతం మంది కోరారని, అధికార యంత్రాంగం తక్షణం దీనిపై దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మద్యం బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించాలని పేర్కొన్నారు. చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మద్యం దుకాణాల లైసెన్స్‌లు రద్దుచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారమిక్కడ తన నివాసం నుంచి జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తనిఖీ కేంద్రాల వద్ద నిఘా పెట్టి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలకుండా చూడాలని సూచించారు. కొత్త రీచ్‌లు తెరవడం ద్వారా ఇసుక అందరికీ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ప్రతినెలా జిల్లా కమిటీలు ఇసుక ధరల్ని పరిశీలించి గనుల కార్యదర్శికి నివేదికలు పంపాలని పేర్కొన్నారు. "బాగా పనిచేయాలి. జవాబుదారీతనంతో ఉండాలని చెబితే ఉద్యోగులను తొలగిస్తున్నట్లు దుష్ప్రచారం చేశారు. గతంలో కఠినంగా వ్యవహరిస్తే భయంతో పనితీరు మందగించింది. అందుకే ఉద్యోగులకు నచ్చజెప్పి పనిచేయిస్తున్నా. రాజకీయ లాభం కోసం కొందరు చేస్తున్న ప్రచారాన్ని, సృష్టిస్తున్న వదంతుల్ని ఎవరూ నమ్మొద్దు" అని సీఎం సూచించారు. పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల నుంచి 97శాతం సంతృప్తి వచ్చిందని, దీనిని 100శాతానికి తీసుకెళ్లడం పెద్దకష్టమేమీ కాదని సీఎం అన్నారు. విశాఖపట్నంలో వేల సంఖ్యలో ఇచ్చిన ఇంటి స్థలాల పట్టాల పంపిణీపై 98శాతం సంతృప్తి వ్యక్తమయిందని వివరించారు.

భంగం కలిగించే చర్యలు తీసుకోబోం

30 సంవత్సరాల సర్వీసు నిండిన ఉద్యోగులకు బలవంతపు ఉద్యోగ విరమణ అమలు చేస్తారని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలకు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉదోద్యగుల ఐకాస అధ్యక్షుడు అశోక్‌బాబు నేతృత్వంలో ఉద్యోగ సంఘాల నేతలు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు బలవంతపు ఉద్యోగ విరమణ విధానం అమల్లోకి తేనున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దానిపై చంద్రబాబు స్పందిస్తూ అదంతా ఒట్టి ప్రచారం, వదంతులు మాత్రమేనని, ప్రభుత్వానికి అలాంటి ఆలోచన ఏదీ లేదని తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన కరవు భత్యం బకాయిలు చెల్లిస్తామని సీఎం హామీ ఇచ్చారు. గురువారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో డీఏపై నిర్ణయం ప్రకటిస్తామని ముఖ్యమంత్రి తెలిపారని అశోక్‌బాబు వెల్లడించారు.

### 45 రోజుల్లో కుక్కలు, పందుల నియంత్రణ

పట్టణ పేదల కోసం ఎన్టీఆర్ నగర్-పీఎంఏవైలో నిర్మిస్తున్న ఇళ్ల పురోగతిపై 15 రోజులకోసారి డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి తనకు నివేదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం పురపాలక-పట్టణాభివృద్ధిశాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇక నుంచి రెండు వారాలకోసారి ఇళ్ల నిర్మాణాన్ని గమనిస్తానన్నారు. నంద్యాలలో ఎన్టీఆర్ నగర్ నిర్మాణ బాధ్యత చూస్తున్న షాపూర్‌జీ పల్లంజీ ప్రతినిధులు ప్రతివారం ప్రగతి నివేదికను తనకు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణాల్లో 45 రోజుల్లో వీధి కుక్కలు, పందుల నియంత్రణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పందుల పెంపకంపై ఆధారపడిన 4,752 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపాలని సూచించారు. ప్రకాశం జిల్లా దొనకొండలో కనస్ట్రక్షన్ సిటీని నిర్మిస్తున్నామని, ఇక్కడ నిర్మాణ రంగానికి సంబంధించి అవసరమైన సకల సామగ్రి అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం చేపట్టే గృహ నిర్మాణాల నాణ్యత పరిశీలన, పర్యవేక్షణ కోసం నియమించిన ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ తనకు ప్రతి వారం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పురపాలక పాఠశాలల్లో చేరే వారి సంఖ్య ఈ ఏడాది బాగా పెరిగిందని, గత ఏడాదితో పోల్చిచూస్తే ఆరు నుంచి పదో తరగతి మధ్య విద్యార్థుల సంఖ్య 7.5 శాతం పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పట్టణాల్లో నెలకో ఆదివారమైనా ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశ అనంతరం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం తాజాగా మంజూరు చేసిన మరో 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం కోసం నెలాఖరులోగా టెండర్లు పిలుస్తామన్నారు.

### లీజు అనుమతుల్లో జాప్యం వద్దు

గనుల లీజు అనుమతులను త్వరిగతిన ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం రాత్రి ఆయన గనుల శాఖ పనితీరును సమీక్షించారు.

# మళ్లీ కథ అడ్డం తిరిగింది

- ఈ-పాస్ సర్వర్ డౌన్
- 6.5 శాతం దాటని రేషన్ పంపిణీ
- డీలర్లపై కార్డుదారుల మండిపాటు

ఈనాడు, అమరావతి: సర్వర్ మళ్లీ డౌన్ అయింది. రేషన్ కార్డుదారులను మళ్లీ ఇక్కట్లు మొదలయ్యాయి. సుమారు 1.40 కోట్ల కార్డుల్లో దాదాపు 29వేల చౌకధర దుకాణాల ద్వారా రెండ్రోజుల్లో పంపిణీ చేసిన కార్డుల సంఖ్య 10 లక్షలు దాటలేదు. సాధారణంగా ప్రతినెలా మొదటి 5రోజుల్లో 30శాతం పైగా కార్డులకు సరకులు పంపిణీ చేస్తుంటారు. ఈ రెండ్రోజుల్లో అంటే బుధవారం రాత్రి వరకు కేవలం 6.50 శాతం కార్డులకే సరకులు అందించగలిగారు. నెల్లూరు, కడపలాంటి జిల్లాల్లో అయితే కనీసం 3శాతం కార్డులకు కూడా సరకులు అందించలేని పరిస్థితి. సర్వర్ పనిచేయకపోవడంతో కార్డుదారులు చౌకధర దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. పనులు మానుకుని బియ్యం కోసం వచ్చిన కార్డుదారులకు అవి అందే పరిస్థితి లేకపోవడంతో కొన్నిచోట్ల వారు రేషన్ డీలర్లపై అసహనం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో డీలర్లను, ప్రభుత్వాన్ని కలిపి మరీ తిట్టిపోశారు.

### ఏం జరిగిందంటే...

గత నెల వరకూ నగదు రహిత కార్యకలాపాల ద్వారానే బియ్యం తీసుకోవాలంటూ అధికారులు ఒత్తిడి తీసుకువచ్చి మరీ కార్డుదారులను ఇబ్బందులకు గురి చేశారు. దీనిపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో ప్రజా ప్రతినిధులు కూడా వారి నియోజకవర్గాల్లో కార్డుదారుల నుంచి వస్తున్న వ్యతిరేకతను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నగదుపైనా సరకులు పంపిణీ చేయండి, నగదు రహితంగా ఎవరైనా తీసుకుంటామంటేనే ఆ పద్ధతిలో వారికి బియ్యం పంపిణీ చేయండని ప్రభుత్వం అధికారులకు స్పష్టం చేసింది. దీంతో ఈ నెల నుంచి నగదుపైనా సరకులు పంపిణీకి నిర్ణయించారు. ఈ మేరకు ఈ-పాస్ యంత్రాల్లో వెర్షన్‌ను మార్చారు. అయితే గత నెలకు సంబంధించిన పంపిణీ జులై 15తోనే ముగిసినప్పటికీ, ఈ నెల 1వరకు ఈ-పాస్ యంత్రాల్లో వెర్షన్ మార్చడం వంటి సాంకేతిక పనులను పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. 15 రోజుల సమయం ఉన్నప్పటికీ అధికారులు కనీస కసరత్తు లేకపోవడం వల్లే ఈ పరిస్థితికి దారితీసిందనేది సుస్పష్టం. గురువారం నుంచైనా పరిస్థితిలో మెరుగుదల ఉంటుందా లేదా అనే ఆందోళన కార్డుదారుల్లో నెలకొంది.

# ప్రైవేటు ఇళ్లల్లో ప్రభుత్వ భూ దస్త్రాలు

- స్వాధీనం చేసుకున్న సిట్ అధికారులు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ భూ కుంభకోణంలో కీలక ఆధారాలను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సంపాదించింది. నగరంలోని మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెం గ్రామాల్లో బుధవారం ఏడు బృందాలుగా విడిపోయిన సిట్ అధికారులు కొన్ని ఇళ్లల్లో సోదాలు చేశారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములకు సంబంధించిన దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. కొందరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ గ్రామాల్లో భూములకు సంబంధించిన దస్త్రాలు మాయమయ్యాయని గతంలో జిల్లా యంత్రాంగం ప్రకటించిన సంగతి తెలిసిందే. వీటిని కొందరు రెవెన్యూ అధికారులు మాయం చేసేశారు. భూ అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న సిట్ వాటి గురించి అధికారులను ప్రశ్నించినా సమాధానం దొరకలేదు. అయినా పట్టు విడవని సిట్ అధికారులు దర్యాప్తు కొనసాగించి చివరకు కొందరి ఇళ్లలో ఆ దస్త్రాలున్నట్టు తెలుసుకున్నారు. బుధవారం ఉదయమే ఏడు బృందాలుగా విడిపోయి సోదాలు చేసి పలు భూముల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్.ఎం.బి., సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్, అడంగల్ కాపీలు, కొన్ని పట్టాదారు పాసుపుస్తకాలూ లభ్యమయ్యాయి. ఈ దస్త్రాలు మీవద్ద ఎందుకున్నాయన్న ప్రశ్నలకు సదరు వ్యక్తుల నుంచి తగిన సమాధానం లేదని సమాచారం. అయితే తమ పూర్వీకులు కరణాలుగాచేశారని, అప్పటి నుంచి తమ వద్దే అవి ఉండిపోయాయని కొంతమంది చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

**వాటి ఆధారంగానే నకిలీల రూపకల్పన?:** ఇళ్లల్లో దొరికిన ప్రభుత్వ దస్త్రాల్లోని సమాచారం ఆధారంగా కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములకు దస్తావేజులను సృష్టించి విక్రయించినట్లు తెలుస్తోంది. ఆయా ప్రభుత్వ రికార్డుల్ని వారు ఎందుకు ఉపయోగించారన్న దానిపై సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. విశాఖ జిల్లాలో భూ అక్రమాలు ఎక్కువగా జరిగింది మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెం, కాపులుప్పాడలలోనేనన్న విషయం తెలిసిందే. ఆయా రికార్డులు ప్రభుత్వ కార్యాలయాల్లో లేవన్న ధైర్యంతోనే పెద్దఎత్తున అక్రమాలకు బరితెగించారని తెలుస్తోంది. కాలుష్య రహితంగా ఉన్న ప్రదేశం కావడంతో మధురవాడ, కొమ్మాది,పరదేశిపాలెం ప్రాంతాల్లో భూముల ధరలు చుక్కలనంటుతున్నాయి. ఇంతటి విలువైన భూముల సమాచారం ఉన్న దస్త్రాలు ప్రైవేటు వ్యక్తుల ఇళ్లలోకి ఎలా వెళ్లాయన్నది మిస్టరీగా మారింది. వాటిని వారికి ఎవరిచ్చారు? ఎందుకిచ్చారు? ఎలాంటి ప్రయోజనాలు పొందారు? తదితర వివరాలన్నింటినీ సిట్ అధికారులు ఆరా తీస్తున్నారు.

**మాజీ కార్పొరేటర్ ఇంట్లోనూ తనిఖీ..** తమకు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా సిట్ అధికారులు మొత్తం ఆరు ఇళ్లల్లో దాడులు నిర్వహించారు. నాలుగోవార్డు మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు ఇంట్లో నిర్వహించిన తనిఖీలో రికార్డులు దొరకనప్పటికీ కీలక పత్రాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. వాసు అనే మరో వ్యక్తి ఇంట్లో కొన్ని రికార్డులు దొరికాయి. ఈయన ప్రస్తుతం పోస్ట్‌మాస్టర్‌గా పని చేస్తున్నారు. ఆయన తండ్రి గతంలో కరణంగా పని చేసినట్టు నిర్ధరణ అయ్యింది. తన తండ్రి కరణం కావడంతో ఆయా రికార్డులన్నీ ఇంటి వద్దే ఉన్నాయని వాసు చెబుతున్నారు. రాఘవ అనే మరో వ్యక్తి ఇంట్లో కూడా కొన్ని రికార్డులు లభ్యమయ్యాయని తెలుస్తోంది.

## ఖరీఫ్‌లో అత్యవసర ప్రణాళిక సిద్ధం

ఈనాడు, అమరావతి: ఖరీఫ్‌లో వర్షాభావం, పంటల సాగు తగ్గడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికపై దృష్టి సారించింది. జిల్లాల వారీగా అధికారులతో మాట్లాడిన వ్యవసాయశాఖ ఎక్కడెంత విత్తనం అవసరం, ఎప్పుడేం చేయాలనే వివరాలను తయారు చేసింది. రైతులకు శుక్రవారం నుంచి విత్తనాలను అందిస్తారు. అనంతపురం జిల్లాలో ఉలవలు 13,060, జొన్న 5,579, సజ్జ 638, అలసంద 5,690, పెసర 6,800, కొర్రలు 3,160, కంది 5,600 క్వింటాళ్ల చొప్పున పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. కడపలో జొన్న 150, సజ్జ 150, అలసంద 2,250, ఉలవలు 2,300, కంది 350, గడ్డి విత్తనాలు 200 క్వింటాళ్లు కలిపి మొత్తం 5,400 క్వింటాళ్లు అందించనున్నారు. కర్నూలులో ప్రైవేటు సంస్థలకు చెందిన జొన్న, సజ్జ విత్తనాలు ఇస్తున్నారు. కొర్ర, ఉలవలు, కంది, పొద్దుతిరుగుడు, ఆముదం విత్తనాలు సహా మొత్తం 2,696 క్వింటాళ్లు అందుబాటులో ఉంచుతున్నారు. చిత్తూరులో అందించే 6,412 క్వింటాళ్లలో రాగి, మొక్కజొన్న, మినుము, సామ తదితర తృణధాన్యాలతోపాటు ఉలవలు, పశువుల మేతకు గడ్డి విత్తనాలు ఉన్నాయి. ప్రకాశంలో జొన్న, అలసంద, మినుము విత్తనాలు మొత్తం 6,353 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00